హైందవ స్వరాజ్యము.

(మహాత్మ గాంధి విరచితము)

గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారిచే

నాంగ్లమునుండి యనువాదింపబడినది.

ఉపేంద్ర ప్రచురణాలయము

౧౨, నారాయణ మొదలి వీథి

చెన్నపురి.

మొదటి ముద్రణము జూలై ౧౯౧౯ ప్రతులు ౧౦౦౦.

రెండవ ముద్రణము జూలై ౧౯౨౧ ప్రతులు ౨౦౦౦.

మొదటి మూడు ఫారములు "ప్రిణ్టెర్సు ప్రెస్సు" లోను
౪, ౫, ౬ ఫారములు "వేదాంతా ప్రెస్సు" లోను
౭, ౮, ౯ ఫారములు "చదలవాడ సుందరరామ శాస్త్రులువారి
ప్రెస్సు" లోను ముద్రణముకాబడినది.

పీఠిక.

ఆంధ్రభాషాలతలు దేశమందంతటను నల్లి బిల్లిగ నల్లుకొని యున్నతరి అందు రాజకీయ విషయికసూనంబులు కానరాకుంట శోచనీయము. హైందవ జాతీయత ప్రతిభారతీయుని అంతరాళముల రాణిల్లుచున్నయది. యుగంధరుని యుత్తమ రాజకీయతత్వజ్ఞత, తిమ్మరుసు రాజ్యాంగ నిర్మాణకౌశలము మనవారిరక్తనాళముల ప్రవహించుచున్నయది.

భారతదేశమున మనవారలె మున్ముందు దేశభాషల ప్రాముఖ్యతను కనుంగొనిరి. ముద్దులు మూటగట్టు మన తెలుంగే మనలను ద్భోధమునకు పురికొల్పగలదు. ప్రబోధంపుమొలకలు యిప్పుడిప్పుడే చిగిర్చి వికసించుచున్నవి.

పాశ్చాత్యులెల్లరును ఆధ్యాత్మికధర్మమును తూలనాడి ఇహామే నిశ్చయమని "నాగరికత, నాగరికత" యనిపేరు పెట్టుకొని తుదకు ఐరోపా మహాసంగ్రామమున ఒకరినొకరు చిత్రవధల గావించికొనిరి. ఇప్పుడిప్పుడే వారికి వారి నాగరికత వట్టిమిథ్యయని గోచరమగుచున్నది. హైందవుల జీవనమే యుత్తమమని ఇప్పుడే వారు కన్నులు విప్పిచూచుచున్నారు. మనము భారతసందేశమును లోకమంతటికిని

గొంపోవలసియున్నది. అట్టి సందేశమును గొంపోవ గాంధి మహామహులుద్భవించిరి. వారు అవతారపురుషులు. వారి కీర్తి లోకమున దివ్యకీర్తుల ప్రసరించి భారతసందేశముం గొంపోవును. అట్టితరి వారిచే రచియింపబడిన "హైంరవ స్వారాజ్యము"ను ప్రచురించుటయే యుత్తమమనితలంచి మేమట్లొనరించితిమి.

ఈ మానూతనోద్యమమునకు సుధీ లోకమెల్ల ప్రోత్సాహమొసంగి మమ్ము ఇకముందు నిట్టి యుత్గ్రంధముల ప్రకటించునటుల చేయుదురుగాక యని ప్రార్థించుచు యీ చిన్నపొత్తంబును బంధింపబడిన మనమాతకు నంకితంబుగావించి విరమించుచున్నారము.

చెన్నపురి,
౧-౭-౧౯౧౯.

శ్రీవాసంతగ్రంథనిలయము.

రెండవముద్రణపు పీఠిక.

ఆంధ్రదేశమునం దనేకులకు సులభలభ్యంబగుటకు రెండవ ముద్రణమును వేయించి చాల చౌకధరకిచ్చుచున్నారము. ఆంధ్రలోకము మాయుద్యమమునకు ప్రోత్సాహము నొసంగ కోరుచున్నారము.

ఉపేంద్రప్రచురణాలయము.

హైందవ స్వరాజ్యము.

మొదటి ప్రకరణము.

దేశీయ మహాసభ: తదధికారులు.

చదువరి: నేటిదినము మనభూమిలో ప్రజలు స్వరాజ్యము స్వరాజ్యము అని బహుభంగుల మాట్లాడుకొనుచున్నారు. అందుకై అందరు వాపోవుచున్నట్లున్నది. దక్షిణాఫ్రికాలో మఱి యితర ప్రాంతములలోకూడ ఇదేరీతిని మనవారు ఆశలతోనున్నారు. భారతభూమి స్వాతంత్ర్యములకు ఆతురపడుచున్నది. తమ రీవిషయమున అభిప్రాయమిత్తురా?

సంపాదకుడు: ప్రశ్న చక్కగానడిగితిరి. ప్రత్యుత్తరమిచ్చుటమాత్రమంత సులభముగాదు. పత్రికాధికారులకు మూడు ముఖ్యధర్మములు కలవు. లోకుల అభిప్రాయములను కనిపెట్టి వెలిబుచ్చుట యొకధర్మము; ప్రజలలో సక్రమములు సమంజసములు నగు క్రొత్తయాశయములను జనింపజేయుట మరియొక ధర్మము; ప్రజలకుగల కష్టనిష్ఠూరములను జంకు కళంకు లేక బహిరంగపరచుట మూడవధర్మము. మీ ప్రశ్నకు ప్రత్యుత్తరము చెప్పుటలో ఈ మూడుధర్మములును నేక కాలమున నెరవేర్చవలసివచ్చుచున్నది. కొంతవరకు ప్రజలసంకల్ప

మును బహిరంగపరచవలెను. కొంతవరకు కొన్ని యుద్బోధనలను ప్రకటింపవలెను. కొన్ని కొన్ని కష్టనిష్ఠూరములను విమర్శింపవలెను. మీరు ప్రశ్నయడిగితిరి గావున ప్రత్యుత్తరమిచ్చుట నావిధి.

చదువరి : అట్లయిన మనలో స్వరాజ్యమునకయి అభిలాష జనించిన దనియేకదా మీ యభిప్రాయము.

సంపా: ఆ యభిలాషయే దేశీయమహాసభకు పుట్టువు కల్పించినది. "దేశీయ" మను పదప్రయోగమే దానిని వెలిబుచ్చుచున్నది.

చదువరి : మీరు చెప్పునది సరిగాదు. నవయౌవనభారతభూమి దేశీయమహాసభను అలక్ష్యముతో చూచునట్లున్నది. అది బ్రిటిషు పరిపాలనను అనంతముచేయు సాధనమని ఇప్పటి యౌవనులు తలంచుచున్నట్లున్నారు.

సంపా : ఆయభిప్రాయము న్యాయముకాదు. భారతపితామహుండగు మన దాదాభాయి నౌరోజి శంఖుస్థాపనచేయనిచో నేటిదినము మన యౌవనులు స్వరాజ్యమును గురించి మాటలాడుటకైనను అవకాశముండియుండదు. ఆ హ్యూము మహాశయుడు వ్రాసినది మనము మరువజాలము. ఆతడు మనలను కార్యదీక్షకు బురికొల్పినది స్మరింపక వీలులేదు. దేశీయమహాసభోద్దేశములను సాధించుటకు ఆత డెంతప్రయ

త్నముమీద మనలనుద్బోధించినదియు మనకు సంస్మరణీయమే. అక్లేన్ సర్ విల్లియము వెడ్డరబరనుకూడ తన ధనమానప్రాణములను మనకొరకు వినియోగించినాడు. అతడు వ్రాసినవిషయములు నేటికిని సమాదరణీయములై యున్నవి. గోకలే పండితుడు మన హైందవజాతిని స్వరాజ్యమునకు సిద్ధముచేయుటకయి దారిద్ర్యవ్రతమును పూని ఇరువది సంవత్సరములకాలమును మనకై ధారపోసెను. దేశీయమహాసభ మూలకముగా ఈ భూమిలో స్వరాజ్యబీజములను చల్లినవారిలో కీర్తిశేషులైన న్యాయమూర్తి బద్రుద్దీను తయాబ్జి యొక్కడు. ఇదేవిధముగా బంగాళములో, మద్రాసులో, పంజాబులో మరి యితరప్రాంతములలలో భారత భూమియంతటను హైందవదేశమిత్రులును దేశీయసభాభిమానులునునైన హైందవులును ఆంగ్లేయులును నుందురు.

చదువరి : నిలుడు. నిలుడు. మీరు కడుదూర మరుగుచున్నారు. నాప్రశ్నకును మీరిచ్చునుత్తరమునకును ఎక్కుడెడమేర్పడుచున్నది; నేను మిమ్మునడిగినది స్వరాజ్యమునుగురించి. మీరుప్రత్యుత్తరము చెప్పుచుండునది పరులపరిపాలననుగురించి. ఇంగ్లీషుపేళ్లు నాకు వినవక్కఱలేదు. మీరు వానిని చెప్పుచున్నారు. ఇట్లుండుటచేత మీకు నాకు పొత్తుపొసగునని తోచదు. మీరు దయచేసి స్వరాజ్యము విషయము మాత్రము

మాట్లాడినయెడల సంతోషము. తక్కిన “శిష్ట” సంభాషణయంతయు నానెత్తికెక్కదు.

సంపా: ఈతొందరపాటు వలదు. నేనును మీరీతినుండరాదు. కొంచెము ఓపికపట్టితిరేని మీకు కావలసినదే నేనును చెప్పుట మీరెరుఁగగలరు. చెట్టొక్కనాట పెరుగదు. నన్ను మీరు అభ్యంతరపెట్టుట, హైందవభూమి మిత్రులను గురించి మీరు విననొల్లకుండుట, చూడగా (మీసంగతి తీసికొనునెడల) స్వరాజ్యము కడుంగడుదూరమగునట్లు తోచుచున్నది. మీ వంటివారనేకులుండినయెడల మనమొక అడుగైన ముందుకు పెట్టియుండము. ఈసంగతిమాత్రము జ్ఞాపకము పెట్టుకొనుడు.

చదువరి: మీధోరణి చూడగా లోకాభిరామాయణము మాట్లాడి నాకు జవాబు ఎగగొట్టునట్లున్నది. మీకు ఎవరు దేశమిత్రులుగా దోచుచున్నారో వారు నాఅభిప్రాయము ప్రకారము దేశమిత్రులు గారు. అట్లుండగా వారినిగురించిన మీ ప్రసంగము నేను వినవలసినపని యేమి? మనజాతికంతయు పితామహుడని మీరనునట్టి యతఁడు ఆజాతి కేమిచేసినాడు? అతఁడు చెప్పునదంతయు ఇది: “ఇంగ్లీషుపరిపాలకులు న్యాయముచేయుదురు. వారికి సహాయముకండు”.

సంపా: తిన్నగా చెప్పినను దృఢముగా చెప్పుచున్నాను. అంతటిమహానుభావునిగురించి నీవింత అవకతవకగా సంభా

పించుట వ్రీడాకరము. అతడు చేసినపని స్మరించుకొనుము. తనజీవితమునే అతడు దేశమునకై సమర్పించినాడు. మన కిప్పుడుకల జ్ఞానము అతడు పెట్టినభిక్ష. ఆంగ్లేయులు మన సారమును పీల్చి మనలను పిప్పిచేసిరనుట మనకు దెల్పిన వాడు దాదాభాయియే: కడపటివరకును ఆంగ్లజాతియందు అతనికి నమ్మకమున్నంతమాత్రమున నదియొకదోషమా? మనకు కండకావరముండి ముందు కొకయడు గెక్కువగా పెట్టగల్గినంతనే దాదాభాయి గౌరవమునకు హానిగల్గునా? ఆమాత్రముచేత మన మతనికంటెను వివేకులమా? వివేకులైనవారి కొకటే గుర్తు. వారెక్కివచ్చిన నిచ్చెనను వారెప్పుడును పడదన్నుకొనరు. మెట్లలో నొకమెట్టు నశించినను మెట్లన్నియు విడిపడును. శిశువులుగానుండి పెద్దయయినపిదప మనము శిశుస్థితిని తృణీకరింపము. నాటిసంగతి సందర్భములు స్మరించుకొని ఆనందించుచుందుము. బహుకాలము నేర్చుకొని గురువు మనకు పాఠములు చెప్పును. దానిపై మనము మరికొంతదూరము జ్ఞానమభివృద్ధిచేసికొందుము. ఆయన వేసిన పునాదులపైన నేను కొంతయెక్కువ కట్టుకొనినమాత్రాన నేను ఎక్కువ వివేకి యగుదునా? అతడెప్పుడును నాకు గౌరవనీయుడేకదా! మన భారతపితామహుడగు దాదాభాయిసంగతియు నింతే. అతడు భారతజాతీయ నిర్మాత యని యంగీకరింపక తప్పదు.

చదువరి : మీరు చక్కఁగా చెప్పితిరి. దాదాభాయి గౌరవనీయుడని నాకిప్పుడు అర్థమయినది. అతడును మరియాతనివంటివారును లేనియెడల మన కీనాఁడుగల యుత్సాహము కలిగియుండక పోవచ్చును. అయిన గోకలేనుగురించి ఇట్లు చెప్పను రాదు. అతఁడు ఇంగ్లీషువారికి గొప్పస్నేహితుఁడు. స్వరాజ్యమునుగురించి మాట్లాడుటకు ముందు మనము వారిదగ్గరనుండి ఎంతో నేర్చుకొనవలెననియు వారిరాజకీయ వివేకమును సంపాదింపవలెననియు అతడు చెప్పెను. అతని యుపన్యాసములు చదివిచదివి నాకు వెగటుపుట్టినది.

సంపా : అట్లు వెగటు పుట్టినయెడల అది మీయసహనమునకే ద్యోతకముగా నున్నది. తల్లిదండ్రులు మెత్తగా నాలోచన చేయుదు రనియు వారు తమతో పరుగెత్తిరనియు కోపించుకొనుబిడ్డలు తల్లిదండ్రుల నగౌరవపరచువా రనికదా మనము నమ్ముచున్నాము. గోకలేపండితుఁడు పితృవర్గము లోనివాఁడు. అతఁడు మనతోపరుగు లెత్తలేదని మనమేవగించుకొననగునా? స్వరాజ్యమును కోరునట్టిజాతి పితృవర్గము నెప్పుడును నుల్లంఘింపతగదు. పూర్వికులయెడ మర్యాదలేనినాఁడు మనము వ్యర్థులముగాని మరివేరుగాము. ఆతురపాటుగలవారు ఆత్మసామ్రాజ్యమేలజాలరు. భావపరిపాకముగలవారలకే అయ్యది తగును. మరియొకమాట. గోకలేమహాశయుఁడు తన సర్వస్వమును మన

విద్యకయి ధారపోయునపుడు అట్టివారు ఈదేశమున నెందరుం డిరో వ్రేలుమడిచి చెప్పగలరా ? గోకెలేమహాశయు డేమిచేసి నను సరియే పవిత్రోద్దేశముతోను మాతృసేవాదృష్టితోను చేసి నాడనుట నాదృఢవిశ్వాసము. అతనిమాతృభక్తి యపారము. దేశమాతకు ప్రాణమైనను సమర్పించుట కతడు సంసిద్ధుడు. అత డేమి పల్కినను పరసంతోషమునకయి పలుకువాడు కాడు. తనకు న్యాయమని తోచినదే చెప్పువాడు. కాబట్టి యతని యెడల మనకు సంపూర్ణాదరము అత్యవసరము.

చదువరి: అట్లైన మన మతనిపాదముల బట్టి యన్నివిషయ ములలోను నడువవలసినదేనా ?

సంపా: నే నామాట చెప్పనేలేదు. ఎందులోనైనను మన యాత్మసాక్షి ఆతని పథమునుండి వేరుపడెనా అప్పుడు తదను గుణముగా నడువవలసినదేయని అతడే మనకు బోధించియుం డును. అతడు చేసినపనిని దూరకుండ, ఆతనితో పోల్చుకొను నెడల మనము మిక్కిలి యల్పజ్ఞులమగుటను స్మరించుకొను టయే మనము చేయవలసినది. అనేకులు వ్రాయుసకాండ్రు అత నిని ఉల్లంఘించి వ్రాయుదురు. ఆవ్రాతలకు మనము అసమ్మతి దెల్పుట కరణీయము. గోకెలే మహానుభావునివంటివారలను మనము స్వరాజ్యసౌధముయొక్క ముఖ్యస్తంభములుగా నాలో చింపవలెను. మనమాట బంగారుమాట, ఇతరులమాట వృధ

యగుబూటక మనుకొనుట దురభ్యాసము. అభిప్రాయభేదమాత్రమున ఎదుటివారు దేశద్రోహులనుటయు నిట్టిదియే.

చదువరి: తమయర్థము నాకిప్పుడొకకొంచెము స్ఫురించుచున్నది. నేను ఇంకను ఆలోచించుకొనవలసియున్నది. కాని మీరు హ్యూమునుగురించియు సర్ విల్లియము వెడ్డరబరనును గురించియు చేయుసంభాషణ నాకేమియు గోచరింపలేదు.

సంపా: హిందువుల విషయములో ఏ తత్త్వము పనికివచ్చినదో ఇంగ్లీషువారి విషయములోకూడ ఆతత్త్వమే పనికివచ్చును. ఇంగ్లీషువారందరు చెడ్డవారని నే నెప్పుడు చెప్పనొప్పుకొనను. వారిలో అనేకులు భారతభూమికి స్వరాజ్యము కోరువారున్నారు. ఇతరులకంటె ఇంగ్లీషువారికి కొంచెమెక్కువ స్వార్థపరత్వ మున్నదనుట నిజమే కాని ఆమాత్రముచేత ఇంగ్లీషువారందరు చెడ్డవారు కారు. న్యాయము మనకు చేయమని ఇతరులను కోరునప్పుడు మనమును ఇతరులకు న్యాయము చేయవలెను. సర్ విల్లియము భారతభూమికి చెడుగుకోరడు. అదియే మనకు చాలును. మనము న్యాయముగా నడుచుకొనునెడల మనకు స్వాతంత్ర్యము శీఘ్రతరముగా కలుగును. అది మీకు ముందు తెలియగలదు. ప్రతి ఇంగ్లీషువానిని మనశత్రువుగా దూరముచేయునెడల స్వరాజ్యము దూరము పోవును. అదియు మీకు ముందు తెలియగలదు. కాని మనము వారి

యెడ న్యాయముగా నుండు పట్ల మనఉద్దేశము నెరవేర్చుకొను టలో మనకు వారిసహాయము లభింపగలదు.

చదువరి: ఇప్పుడు ఇదంతయు నాకు వట్టిపిచ్చిగా దోఁచుచున్నది. స్వరాజ్యము ఇంగ్లీషుసహాయము ఇవిరెండు పరస్పర విరోధములు. మనకు స్వరాజ్యమురాగా చూచి ఇంగ్లీషువారెట్లు సహింపగలరు? అయిన ఆవిషయము మీ రిప్పుడు నాకు నిర్ధారణచేసి చెప్ప నక్కరలేదు. దానివిషయమై కాలహరణ మొనర్చుట వ్యర్థము. మనకు స్వరాజ్యము ఎట్లువచ్చునో మీరు చెప్పునప్పటికి నాకది అర్థముకావచ్చును. ఇంగ్లీషు సహాయము సమాచారము మాట్లాడినదానివలన మీయెడల నాకు కొంతవ్యతిరేకభావము కలిగినది. కాబట్టి ఈవిషయమే యెక్కువగా చెప్పుచునుండవలదు.

సంపా: నాకు ఆవిషయమున నింకను ప్రసంగింపవలయు నను ఆశ లేదు. మీకు నాయెడ విరుద్ధభావ మేర్పడినంతట నాకు వ్యసనములేదు. మొట్టమొదటనే తీపిగానిమాటలు చెప్పుట మంచిది. శాంతముగాసహనముతో మీవిరుద్ధభావమును తొలఁగించుట నావిధి.

చదువరి: మీరు కడపట చెప్పినవిషయమునకు సంతోషము. నాకుదోచినట్లుదాపరికము చేయక మాట్లాడుట కది నాకు అవకాశ మొసఁగుచున్నది. ఒక్కవిషయ మింకను నాకర్థము

కాలేదు. దేశీయమహాసభ యెట్లు స్వరాజ్యమునకు బునాది వైచినదో తెల్పుడు.

సంపా: చూతము. దేశీయమహాసభ భారతభూమినాలుగు చెరగులనుండి దేశపుత్రులను నొక్కచోట చేర్చెను. మనయందర యొక్కజాతియను నుత్సాహమును మనకు కలుగజేసెను. ప్రభుత్వమువారికి ఆసభ యెడల అసూయయే. దేశాదాయమును దేశవ్యయమును ప్రజాప్రతినిధులే నిర్ణయింపవలె నని ఎప్పుడును ఆసభ కోరినది. కనడాలోవలె ఇక్కడ స్వపరిపాలన యేర్పడవలెనని యెప్పుడును అడుగుచు వచ్చినది. మనకు అది దొరకునా లేదా, అదేమంచిదా కాదా, దానికంటె మంచిది మరియొకటి కలదా యిత్యాది ప్రశ్నలు ఇట అనవసరము. మనము గమనింపతగినది ఒక్కటేవిషయము. దేశీయమహాసభ మనకు స్వరాజ్యముచవి ఇట్టిదనుటను ప్రకటించినదా? లేదా? ఆకీర్తి తత్సభకు లేక చేయుట న్యాయముకాదు. మనమును ఆప్రయత్నము చేయుదుమేని కృతఘ్నులమగుటయేగాక మనయుద్దేశపరిపూర్తినిగూడ దూరముచేసికొనిన వారమగుదుము. దేశీయమహాసభ మనజాతీయాభివృద్ధికి విరోధియనియెంచుట దానిని మనము వినియోగించుకొనుభాగ్యము పోగొట్టుకొనుటయగును.

రెండవ ప్రకరణము.

బంగాళా విభజనము.

చదువరి: మీరు చెప్పు వైఖరిని ఆలోచించినయెడల దేశీయమహాసభ స్వరాజ్యమునకు పునాదులు వైచినదనుట న్యాయముగానున్నది. అయిన దానివలన నిజమైనప్రబోధము కలిగినదని అనుటకురాదు. మీరును దీనిని అంగీకరింతురనుకొనెదను. ఎప్పుడు ఏవిధముగా ఆ నిజమయిన ప్రబోధము కలిగినదో చెప్పుదురా?

సంపా: విత్తన మెప్పుడును ప్రకటముకాదు. దాని పనియంతయు భూగర్భమున జరుగుచున్నది. తరువాత విత్తనము నాశమందుచున్నది. విత్తనమునుండి బయలుదేరు వృక్షము మాత్రము పైకిసిక్కి కానవచ్చును. దేశీయమహాసభసంగతిలో గూడ ఇట్టి స్థితియే కానగును. అయినప్పటికిని మీరు ఏది నిజమైన ప్రబోధమని అనుకొనుచున్నారో అది బంగాళావిభజనమునకు తరువాత కలిగినది. అందులకుగాను మనము కర్జను ప్రభువునకు కృతజ్ఞులమై యుండవలసియున్నది. విభజనకాలమున బంగాళీలు కర్జనుగారికి సంగతిసందర్భములు విశదీకరించిరి. కాని అతనికి అధికారగర్వమున్నందున వారు చెప్పి

నది వంట బట్టలేదు. వారి ప్రార్థనలు నిరాకృతములయ్యెను. హైందవులు ఊరక వదరకలరుగాని కార్య మేమిః చేయగలరని అతఁడు పరాఙ్ముఖుడయ్యెను. అవమానకరభాషణముచేసి అతఁడు బంగాళమును విభజించెను. నాటిదినమును బ్రిటిషుసామ్రాజ్య విభజన దినమనుకొనవచ్చును. ఈ బంగాళా విభజనమున బ్రిటిషు అధికారమునకు కలిగిననష్టము మరిదేనివలనను కలుగలేదు. హైందవభూమికి జరిగిన ఇతరాన్యాయములు బంగాళా విభజనమునకంటె తక్కువవి యని ఇందువలన తలంపరాదు. ఉప్పుపన్ను చిన్న యన్యాయముకాదు. ముందుకు ఇట్టివింకను ఎన్నియో వివరింతును. ప్రస్తుత మనుసరింతము. బంగాళా విభజనమును ఎదుర్చుటకు ప్రజలు సిద్ధముగానుండిరి. సంవేదనలు తీక్ష్ణ మయ్యెను. బంగాళీ లనేకులు తమ సర్వస్వమును సమర్పింప సిద్ధమైరి. స్వశక్తివిజ్ఞానము కలిగినందున త్రైక్ష్ణ్యము అపారమయ్యెను. ఇప్పుడా త్రైక్ష్ణ్యము అడంపరానిదైనది. అడంప నవసరమునులేదు. బంగాళా విభజనము పోవుట సిద్ధము. బంగాళీలకు పునస్సమాగమము సిద్ధము. కాని ఇంగ్లీషు పరిపాలన నౌకలో ఏర్పడిన రంధ్రముమాత్రము మూతపడదు. అది దినక్రమముగా పెద్దది యగును. ప్రబోధితమైన హైందవ భూమి మరల సుషుప్తి జెందబోదు. బంగాళావిభజనము రద్దు చేయగోరుట స్వరాజ్యమును గోరుటయే. బంగాళనాయకులు

దీని నెఱుంగుదురు. అధికారులు దీనిని గుర్తించినారు. అందు చేతనే బంగాళావిభజనము పోలేదు. కాలక్రమమున హైందవ జాతి బలవత్తరముగ ఏర్పడుచున్నది. రాష్ట్రములొక్కనాట నిర్మితములు కావు. సంవత్సరములు పట్టును.

చదువరి: బంగాళా విభజనఫలములేవి యని మీయభి ప్రాయము.

సంపా : నాటివరకు మనకు తెలిసియుండినదిది. మనకష్ట నిష్ఠూరాలు తీర్చుకొనుటకు మనము చక్రవర్తిగారివరకు అర్జీ చేసుకోవలసినది. ప్రతీకారము లేకపోయినఎడల ఊరక కూర్చొని మరలమరల అర్జీ చేసుకోవలసినది. బంగాళా విభజనకు తరువాత ప్రజలకొకసంగతి తెలిసినది. అర్జీలకు బునాదిగా మనశక్తిఏర్పడవలెను. మనము కష్టపడుటకు వెనుదీయ రాదు. ఈక్రొత్తతేజస్సే విభజనముయొక్క ముఖ్యఫలము. ఈఫలము నిర్భయముగా పత్రికలలో ప్రకటితమైనది. ప్రజలు లోలోన రహస్యము రహస్యముగా గుజగుజలాడుకొనినది బహిరంగముగా నిర్భీతిగా వ్రాయుంబడినది. ప్రకటననందినది. స్వదేశోద్యమము ప్రారంభమయినది. ముందు పిల్లలుపెద్దలుఅం కరు ఇంగ్లీషువారిముఖము చూచిన భయముతో పరుగెత్తుచుం

ఇప్పుడా భయముపోయినది. తగాదావచ్చినను ఇప్పుడు లక్ష్యములేదు. జైలుకుపోవలసినను లక్ష్యములేదు. భారత

భూమి యుత్తమపుత్త్రిలలో కొందరు ఇప్పుడుప్రవాసములలోను న్నారు. వట్టి అర్జీలుపెట్టుకొనుటకును దీనికిని ఎంతో తారతమ్య మున్నది. ప్రజలీవిధముగా మారినారు. బంగాళములోపుట్టిన నవశక్తి ఉత్తరమున పంజాబుకు, దక్షిణమున కన్యాకుమారికి వ్యాపించినది.

చదువరి: మరియేస్ఫుటమైన ఫలమైనను కలిగినదందురా?

సంపా: బంగాళావిభజనము ఇంగ్లీషునౌకలో రంధ్రముతొలచుటే కాక మననౌకలోకూడ రంధ్రమును తొలచినది. మహాసంభవములకు మహాఫలములు దప్పవు. మననాయకులు రెండు కక్షులయినారు—మితవాదులు, జాతీయవాదులు. ఒకటి మందగామి మరియొక్కటి శీఘ్రగామి యనవచ్చును. కొందరమతమున మితవాదులు భయస్థులు, జాతీయవాదులు పోటరులు. ఎవరియెవరి ఆలోచనలుబట్టి వారువారు వీనికర్థముచెప్పుదురు. ఒక్కటిమాత్రము నిజము. ఈరెండు తెగలవారికిని వైరుధ్యము గలిగినది. పరస్పరము అవిశ్వాసపడుచు ఈరెండుకక్షులొండొంటిని దూషించుకొనుచున్నవి. సూరతు దేశీయమహాసభసమయమున రమారమి యుద్ధమేపొసగినది. ఈవిభేదము దేశమునకు మంచిదికాదనియే నాయభిప్రాయముకాని ఇట్టి విభేదములు ఎంతోకాలము నిలుచునవియు గావు.

మూడవ ప్రకరణము.

అసంతృప్తి, అశాంతి.

చదువరి: అట్లైన బంగాళావిభజనము ప్రబోధమునకు కారణమని మీరంగీకరించుచున్నారు. అందువలన కలిగిన అశాంతి మీకు సమ్మతమేనా ?

సంపా: నిద్రనుండి మేల్కాంచువాడు అంగమును విరుచుకొనుచు లేచును. ఆవల ఈవలపొర్లాడును. పూర్తిగా లేచునప్పటికి ఒకకొంతసేపు పట్టుచున్నది. అటులే బంగాళావిభజనము ప్రబోధము కలిగించినను మేల్కొనుటకు సంబంధించిన వికారములు మాత్రము వీడలేదు. ఇంకను మనము అంగములు విరుచుకొనుచు ప్రక్కపై పొరలుచునున్నాము. నిద్రకు జాగ్రత్తకు మధ్యమావస్థ ఎట్లవసరమో అట్లు యీయవస్థయు మన పరిణామమున అవసరము ఉచితము అగుచున్నది. 'అశాంతి కలదు.' అను జ్ఞానమే దానిని తరించుటకు మార్గము కాగలదు. నిద్ర మేల్కాంచుట కారంభించిన పిదప అరగనుమోడ్పుతో నెంతో కాలముండము. త్వరగానో కొంచెమాలస్యముగనో మనమన శక్తికొలది సంపూర్ణజాగ్రదవస్థను పొందుచునే యున్నాము.

అందుచేత, ఎవ్వరును వలెననికోరని యట్టి యీయశాంతస్థితిని మనము తరింపగలము.

చదువరి: మరి యింకొకవిధమైన అశాంతికలదా? దాని స్వరూప మెట్టిది?

సంపా: అశాంతి నిజముగా అసంతృప్తి. అసంతృప్తినే అశాంతి యనుచున్నారు. దేశీయమహాసభయుగమున దీనికి అసంతృప్తియనుపేరు కలిగినది. హ్యూము ఈయసంతృప్తివ్యాపన మత్యవసరమని యెల్లప్పుడును చెప్పుచుండువాడు. ఈ యసంతృప్తి మిక్కిలి యుపయోగకారి. మానవుడు తనప్రస్తుత స్థితికి సంతసించునెడల అతఁని దానినుండి బయటకు లాగుట కష్టము. కాబట్టియే ప్రతిసంస్కారమునకును అసంతృప్తి ప్రథమాధారము. మనకెప్పుడు వస్తువుపై ననిష్టముజనించునో అప్పుడుకాని మనము దానిని పారవేయము. హైందవులలో ఆంగ్లేయులలో ఉద్దండులైనవారు వ్రాసిన దానిని చదివినమీఁదట మనకు అసంతృప్తి జనించినది. అసంతృప్తివలన అశాంతికలిగినది. ఈరెండవది కారణముగ ఎన్నియోమరణములు ఎన్నియో కారాగృహశిక్షలు, ఎన్నియో ప్రవాసములు సిద్ధించినవి. అట్టి స్థితి ఇక ముందును కొంతకాలము తప్పదు. అది సహజము. ఇవన్నియు మంచిసూచనలే యగును కాని వీనివలన దుష్టఫలములు కూడ కలుగవచ్చును.

నాలుగవ ప్రకరణము.

స్వరాజ్యమనగా నేమి?

చదువరి: దేశీయమహాసభ భారతభూమికి జాతీయభావమును కల్గించుటయు బంగాళవిభజనము ప్రబోధమును కల్గించుటయు అసంతృప్తి అశాంతులు దేశమున ప్రబలుటయు అను నీ విషయములనుగురించి నేనిప్పటికి తెలిసికొనినాను. స్వరాజ్యమునుగురించి తమ యభిప్రాయము లేవియో వినగోరుచున్నాను. మన ఇరువుర యభిప్రాయములును ఈవిషయమున నేకములు గావని నాకు దోచుచున్నది.

సంపా: మనమిరువురము ఈ స్వరాజ్య మనుపదమునకొక్కటే యర్థము చెప్పమనుట సంభావ్యము. నేను, మీరు, హైందవులెల్లరు, స్వరాజ్యము సంపాదింపవలయునని ఆతురులమై యున్నారము. కాని స్వరాజ్యమనగా నిదమిద్ధమని యెవ్వరును నిశ్చయించలేదు. ఇంగ్లీషువారిని ఇండియానుండి వెడలగొట్టుట స్వరాజ్యమని అనేకుల ముఖగళితమై యున్నది. కాని వారు అదే స్వరాజ్యమేలకావలయునో చక్కగా నాలోచించినట్లు లేదు. మిమ్ము నొకప్రశ్న యిప్పుడే అడుగవలెను. మనకు

కావలసిన దంతయు వచ్చునెడల ఇంగ్లీషువారిని వెళ్లగొట్టుట మీకు అవసరమని తోచుచున్నదా?

చదువరి: నేను వారికి ఒక్కప్రార్థనయే చేయుదును. "దయచేసి దేశము విడిచి వెళ్లిపొండు" ఈ ప్రార్థన నంగీకరించిన తరువాత వారు వెళ్ళిపోవుట యనిన ఇచ్చటనేయుండుటయని అర్థమగునేని నాకభ్యంతరముండదు. అప్పుడు మన భాషప్రకారము పోవుటయనగా ఉండుటయని యర్థమగునని నాకు తెలిసియుండును.

సంపా: కాని, ఇంగ్లీషువారు వెళ్లిపోయినారని యనుకొందము. తరువాత మీరేమిచేయుదురు.

చదువరి: ఆప్రశ్నకు ఇప్పుడర్థము చెప్పుటకు రాదు. వారి వెళ్లిపోవువిధమునుబట్టి వారు వెళ్లిపోయినమీదట నుండుస్థితి యేర్పడగలదు. మీ రనుకొనురీతిని వారు ఇచ్ఛగా వెళ్లిపోవునెడల వారి రాజకీయసంస్థల నట్లే యుంచుకొందుము. పరిపాలన చేసి కొందుము. మనము అడుగుటతోనే వారు వెడలిపోవునెడల మనకు కావలసిన సైన్యాదికములు చే జిక్కును. పరిపాలనసాగించుట తరువాత మనకు కష్టము కాకూడదు.

సంపా: మీరట్లనుకొనవచ్చును, కాని అది నామనస్సునకు సరిపోలేదు. అయినను ఆవిషయమునుగురించి ఇప్పుడే చర్చ చేయ దలపెట్టలేదు. మీ ప్రశ్నకు నేను ప్రత్యుత్తరము చెప్ప

వలసియున్నది. మిమ్మును ప్రతిప్రశ్నలడుగుటచేతనే ఆపనిని నిర్వహింతును. ఇంగ్లీషువారిని మీరేల వెడలగొట్ట వలెనను చున్నారు.

చదువరి: వారి పరిపాలనవలన భారతభూమి దరిద్ర దేవత పాలైనందుచేతనే. వారు సంవత్సరము సంవత్సరము మన ద్రవ్యము తీసికొనిపోవుచున్నారు. దేశములోని ఉత్తమోద్యోగములు తామే యనుభవించుచున్నారు. మనల బానిసలుగా పెట్టిపెట్టినారు. మనయెడల వారు తృణీకారభావముతో ప్రవర్తింతురు. మనమాట వారికి లక్ష్యమేలేదు.

సంపా: వారు మనద్రవ్యమును తీసికొనిపోక నయముగా ప్రవర్తించుచు మనకు గొప్ప యుద్యోగములిచ్చి పరిపాలన చేయునెడల వారిక్కడనుండుట చెరుపని మీరు తలంచెదరా?

చదువరి: ఈప్రశ్నలకు అర్థములేదు. పులి స్వభావమును మాన్పుకొనునెడల దానితో సహవాసము చేయుటలో దోష ముండునా? అని యడిగినట్లున్నది. ఇది వృథా ప్రశ్న. పులి నైజము మారునట్లైన ఇంగ్లీషువారి నైజమును మారవచ్చును. ఇది సాధ్యముకాజాలదు. సాధ్యమని నమ్ముదుమేని అది యనుభవ వ్యతిరేకము.

సంపా: కనడావారికి దక్షిణాఫ్రికావారికి కలయట్టి స్వరాజ్యపద్ధతి మనకు సిద్ధించునట్లైన చాలునా?

చదువరి: ఈప్రశ్నయు వ్యర్థమే. సంపూర్ణ స్వరాజ్యము నకు కావలసిన శక్తులు మనకున్నప్పుడే ఇది సాధ్యము. అప్పుడు మన పతాకమునే యెత్తవచ్చును. జపాను ఎట్లున్నదో భారతభూమి అట్లుండవలెను. నౌకాసైన్యము భూసైన్యము అన్ని మనవిగానుండవలెను. మన తేజోవికాసము మనకుండి ననే భారతభూమిపేరు లోకమున మ్రోగ గలదు.

సంపా: మీరు విషయము బాగుగనే చిత్రించినారు. మీ యర్థమిది. మనకు ఇంగ్లీషువా రక్కరలేదు. వారి పరిపాలన పద్ధతి కావలెను. వ్యాఘ్రిస్వభావము కావలెను. వ్యాఘ్రి మక్కరలేదు. భారతభూమిని ఇంగ్లీషు చేయుదురు. అప్పుడు ఇది హిందూస్థానము కాదు. ఇంగ్లీషుస్థానమగును. నేను కోరు స్వరాజ్యము అది కానేరదు.

చదువరి: నాయభిప్రాయమున స్వరాజ్య మెట్లుండవలెనో చెప్పినాను. మనము చదివేచదువు ఉపయోగకరమేని, మిల్లు, స్పెన్సరు ఇతర ఇంగ్లీషుగ్రంథకర్తలు అనుకరణీయులేని, ఆంగ్ల రాజ్యాంగసభ అట్టి సభలన్నిటికిని మాతృకయేని, మనము ఇం గ్లీషువారిని బాగా అనుకరింపవలసినదే. వారు తమభూమిలో నెట్లు ఇతరులను కాలూన నీయరో మనము వారినిగాని మరి యితరులనుగాని మనభూమిలో కాలూన నీయరాదు. వారు వారిదేశములో చేసినంత పని ఇతరదేశములలో ఎక్కడను జరు

గలేదు. కాబట్టి వారిసంస్థలు తెచ్చుకొనుట మనకు చేయ తగినపని. మీ యభిప్రాయ మేమి?

సంపా: ఓపిక పట్టియుండవలెను. సంభాషణావృద్ధి కాగా కాగా నా యభిప్రాయములు వెల్లడియగును. స్వరాజ్య మనగా అర్థముచేసికొనుట మీకెంత సులభముగా తోచు చున్నదో నాకంత కష్టముగానున్నది. కాబట్టి ప్రస్తుతము మీరేది స్వరాజ్యమని భ్రమపడుచున్నారో అది నిజముగా స్వరాజ్యముకాదని ఋజువు చేసెదను.

ఐదవ ప్రకరణము.

ఇంగ్లండు స్థితి.

చదువరి : మీమాటలనుబట్టిచూడగా ఇంగ్లండు పరిపాలన పద్ధతి మంచిదికాదనియు కాబట్టి అనుకరణీయము కాదనియు మీయభిప్రాయమైనట్టు తోచుచున్నది.

సంపా : మీయనుమానము సకారణమే. ఇంగ్లండుస్థితి నేడు కరుణాస్పదము. భారతభూమి కట్టిస్థితి యెన్నడురాకుం డును గాకయని నేను ప్రార్థించుచున్నాను. రాజ్యాంగసభలకు మాతృకయని మీరెంచునట్టిది గొడ్డుపోతు, అభిసారిక. ఈ రెండును కఠినోక్తులుగా దోచవచ్చును. కాని యవి మిక్కిలి యుచితములు. ఆరాజ్యాంగసభ స్వేచ్ఛగా ఇదివర కొక్కమంచి పనిచేసి యెరుగదు. కాబట్టి గొడ్డుపోతంటిని. ఆరాజ్యాంగసభ యొక్క స్వభావము చిత్రముగానేర్పడినది. బయటనుండి యొత్తిడిపెట్టక అది ఒక్కపనికూడ చేయదు. అభిసారికయని యేలయంటిననగా దానిని భరించుమంత్రులు నేడొక్కరు, రేపొక్కరు. నేడు ఆస్క్విత్తుగారు, రేపు బాల్ఫరుగారు.

చదువరి: మీరు గొడ్డుపోతని ఛలోక్తిగ చెప్పినారు. అది ఈరాజ్యాంగసభకు అన్వయింపదు. ప్రజలు ఈసభను ఎన్ను

కొనుచున్నారు. ప్రజాభిప్రాయపు ఒత్తిడి కిది లోబడుచున్నది. ఇది దీనిగుణము.

సంపా: మీరు పొరబడుచున్నారు. ఇంక కొంచెము సవిమర్శగా ఆలోచింపుడు. ప్రజలు ఉత్తములను ఏరుకొందురని యనుకొందుము. సభ్యులు ఉచితముగాపనిచేయుదురు. కాబట్టి ప్రజాహితముననే చేయుదురని యెరుంగవలెను. నిర్వాచకులు విద్యగలవారు. కాబట్టి వారు నిర్వచనములో సామాన్యముగా తప్పులు చేయ రనుకొనవలెను. ఇట్టి రాజ్యాంగసభకు అర్జీలు మొదలైన యొత్తిడి యవసరముండరాదు. దాని కార్యసరణి సరళముగా నడిచిపోయి తత్ఫలము దినదినము సువ్యక్తము కావలసినదే. కాని నిజమరయుదము. సాధారణముగా సభ్యులు స్వార్థపరులని కపటభావులని అంగీకృతమయియున్నది. అందులో ప్రతివాడును తన లాభాలాభములే ఆలోచించును. న్యాయముగా ప్రవర్తించుటకు ఉద్దీపకము అట్టివారికి భయము. అందుచేత నేడుచేసినది రేపు మారుచుండును. ఒక్కసంగతిలోనైనను, ఇది దీనికి కడపటి స్వరూపము అని చెప్పుటకు రాదు. అతిముఖ్యములైన విషయములు చర్చలోనున్నప్పుడు కూడ ఈరాజ్యాంగసభసభ్యులు కాళ్లుచాచుకొని నిద్రించుట సహజమైనది. ఒకొక్కప్పుడు వినువారికి విసుగుకలుగునట్లుగా సభ్యులు చేంతాడు ఉపన్యాసములు చేయుటయుకలదు. కా

లను సుప్రసిద్ధాంగ్లేయగ్రంథకారుఁడు ఈ రాజ్యాంగసభను ప్రపంచమున కంతటికిని మాటలమారిదుకాణమని వర్ణించినాఁడు. సభ్యులు సమ్మతి యిచ్చునప్పుడా? ఆలోచన యేమియు చేయరు. తమకక్షువా రెట్లుకోరిన నట్లేయందురు. అది కక్షిశిక్ష ణయట. ఏసభ్యుడైనను కాదని స్వతంత్రముగా తనసమ్మతి నిచ్చెనా అతడు తనవర్గమునకు ద్రోహచింతకుడుగా గణింపబడుచున్నాఁడు. రాజ్యాంగసభలో నష్టమగుకాలమును ద్రవ్యమును ఎవరోకొందరు శిష్టులచేతపెట్టినఎడల ఇంగ్లీషుజాతి యీనాటి కింకను నెంతో ఉచ్చతరస్థితియందుండి యుండును. ఈరాజ్యాంగసభ ఇంగ్లీషుజాతివారు పెట్టికొనిన దండుగవ్యయ పుబొమ్మలాట. ఈయభిప్రాయములు నాయొక్కనివే యనుకోబోకుడు. గొప్పఇంగ్లీషుభావజ్ఞు లీరీతిని నుడివియున్నారు. ఆరాజ్యాంగసభలోని సభ్యుడొక్కఁడు క్రైస్తవుడెవ్వడును ఆసభలో సభ్యుడుకా వీలులేదని ఇటీవలనే వాఁకొనియున్నాఁడు. మరియొకఁడు ఈసభను వట్టిశిశువుగా వర్ణించినాడు. ఏడునూఱేండ్లిది శిశువుగానున్న, దీని కెప్పుడు యౌవనముకలుగునో యెవరు చెప్పగలరు?

చదువరి: మీరాలోచన పురికొల్పినారు. మీరు చెప్పినదంతయు వెంటనే యంగీకరింప మనరుగదా! క్రొత్తక్రొత్త భావ మార్గములను మీరు సూచించుచున్నారు. నాకవి శల్యగతము

కావలసియుండును. "అభిసారిక" యనుటలో మీభావమే మో తెలుపుదురా ?

సంపా : మీరు నాయభిప్రాయములను వెంటనే యంగీక రింపకుండుట న్యాయమే. ఈవిషయమున ప్రకటితమైన వాఙ్మయము మీరు చదివినచో దీనిసంగతి మీకు తెలియును. ఇంగ్లీషు రాజ్యాంగసభకు నాథుడు లేడు. ముఖ్యమంత్రిహయాములో దానిబ్రతుకు తిన్నగా నడువదు. అభిసారికబ్రదుకుబోలె అటునిటు డోలాయిత మగుచుండును. ముఖ్యమంత్రికి ముఖ్యోద్దేశము తనయధికారమే, రాజ్యాంగసభయొక్క మేలుకాదు అతని శక్తియంతయు తనకక్షువారివిజయమును సంపాదించుటకే వ్యయపడుచున్నది. కాబట్టి రాజ్యాంగసభ ధర్మ మొనర్చుచున్నదా యనుట యతని కంతగా నవసరముండదు. కొందరు ముఖ్యమంత్రులు తమకక్షుయొక్క లాభమునుకోరి రాజ్యాంగసభచే ఎట్టికార్యమునేని చేయించిరనుటకు ఆధారము కలదు. ఇదంతయు ఆలోచనీయము.

చదువరి : ఇదివరలో మన మెవరెవరు దేశభక్తులనుకొనుచుంటిమో యెవరెవరు ధర్మపరులనుకొనుచుంటిమో వారినే మీరు తూలనాడుచున్నారు.

సంపా: అవును నిజమే. ముఖ్యమంత్రులపైనాకు ద్వేషమేమి లేదు. కాని నేనుచూచినదానినిపట్టి వారు నిజముగా దేశాభి

మానులుకారని యోచింపవలసివచ్చుచున్నది. సామాన్యముగా లంచము తీసికొననివాడు ఇయ్యనివాడు ధర్మపరు లనుకొందు రేని వీరు ధర్మమార్గానువర్తు లనుకొనవచ్చును. అయినలంచ ములకంటె సూక్ష్మతరమగు ప్రోద్బలములు లేకపోలేదు. తమ కార్యములను సిద్ధింపచేసికొనుటకు వారితరులకు బిరుదములను లంచములిచ్చుట సామాన్యముగానున్నది. వారియందు నిజ మైన ధర్మపరతకాని కళాసహితంబగు అంతరాత్మకాని లేదని నేను స్పష్టముగా చెప్పగలను.

చదువరి: మీరు రాజ్యాంగసభనుగురించి ఇట్టి భావములు చెప్పుచున్నారే. ఇంగ్లీషు ప్రజనుగురించి యేమందురు? అప్పు డు వారి ప్రభుత్వమునుగురించి ఆలోచించుకొందును.

సంపా: ఇంగ్లండులోని నిర్వాచకులకు వారివార్తాపత్రిక లే వేదగ్రంథము. వారు వీని ననుసరించి తమయభిప్రాయము లను తీర్చుకొనుచున్నారు. పలుమారు ఈపత్రికలు అబద్ధములు వ్రాయును. ఒకేవిషయమును ఇవెల్లయు తమతమకక్షియొక్క లాభమునకు అనుకూలించునట్లు వేరువేరురంగులతో చిత్రిం చును. గొప్ప యింగ్లీషునాయకుని నొకపత్రిక మహాసాధువని ఆకసమునకు పొగడును. అతనినే మరియొకపత్రిక అన్యాయము యొక్క అపరావతారముగా నిశ్చయించును. వార్తాపత్రిక లీస్థితియందుండవలెనన్న ప్రజలస్థితి యెట్లుండవలెను?

చదువరి : అది మీరే వర్ణింపుము.

సంపా : ఈప్రజలు అభిప్రాయములను మాటికి మాటికి మార్చుకొందురు. ఏడేండ్లకొకమారు మార్చెదరని ప్రతీతి. గడియారములోని గంటముమాదిరి వీరి యభిప్రాయములు ఎల్లప్పుడు చలించుచుండునే కాని ఒకప్పుడును నిలుకడనందవు. మంచివక్తగాని మంచి విందులిచ్చు గృహస్థుగాని దొరికినచో అతనివెంబడి వీరు పరువులెత్తుదురు. ప్రజలెట్లో పార్లమెంటు (రాజ్యాంగసభ) అట్టులే. అయిన వీరిలో ఒక్క గుణముమాత్రము బహుచక్కగా వృద్ధియయినది. తమదేశముమాత్ర మెప్పుడు పరులపాలు కానీరు. ఎవ్వరైనను దానిపై కన్నులు వేసిరా వెంటనే ఆకండ్లను పెరికి పారవైతురు. అంత మాత్రముచేత ఆజాతికి తక్కిన యన్నిసద్గుణము లున్నవనికాని వారిని మనము అనుకరింపవలెననికాని తలంపరాదు. ఇంగ్లండును భారతభూమి అనుకరించునేని నాశము తప్పదని నా యభిప్రాయము.

చదువరి : ఇంగ్లండుయొక్క ఈస్థితికి ఏమికారణమందురు ?

సంపా : ఇంగ్లీషువారిలో ప్రత్యేకలోపమేమియు లేదు. ఈ స్థితి నవీననాగరకమువలన జనించినది. దానివలన యూరపులోని జాతులు దినదినము అధోగతిపాలయి నశించుచున్నారు.

ఆరవ ప్రకరణము.

నాగరకము.

చదువరి: అయిన నాగరకమన మీయర్థమేమో తెలుప వలసియుందురు.

సంపా: నాయర్థముకాదు. నాగరక మనుపేరిట నేదిప్రబలియున్నదో దానిని నాగరకమనరాదని యెందరో ఆంగ్లేయ గ్రంథకర్తలే వ్రాసియున్నారు. ఎన్నియో గ్రంథములావిషయమున వెలువడియున్నవి. ఆంగ్లజాతిని నాగరకదోషమునుండి యుద్ధరించుటకు సంఘములు సభలు ఏర్పడియున్నవి. గొప్ప ఆంగ్లరచకుడొకడు "నాగరకము—దానికారణము—దానికి ప్రతీకారము" అని యొక యుద్గ్రంథము ప్రకటించినాడు. అందులో నాగరకమొకరోగమని యతడు వర్ణించినాడు.

చదువరి: మనకెందుకిది సామాన్యముగా తెలియరాలేదు?

సంపా: కారణము విదితము. ఎవ్వరును తమకు వ్యతిరేకముగా తాము విమర్శించుకొన నిచ్ఛగింపరు. నవనాగరికమును దిగ ద్రావి గట్టున త్రేపువారు దానిని దూషించుచు వ్రాయజాలరు. దానిని సమర్థించుటకు కావలసిన సంగతులు వ్యాఖ్యలు తమకు తెలియకయే వెతకికొనుచుందురు. వానిని నిజములని యాలో

పూర్వము వారు కప్పుకొనుటకు తోళ్లుపయోగించుచుండిరి. ఈటెలనే ఆయుధములుగా వాడుచుండిరి. నేడో వారు పొడుగాటి షరాయిలుధరించి దేహము నలంకరించుకొనుటకు వివిధవస్త్రములను తొడగుచున్నారు. ఈటెలకు బదులు ఐదు ఆరు గుండ్లు పారురివాల్వరులను పట్టుచున్నారు. ఇదివరకు ఎక్కువగాగుడ్డలు బూట్సు మొదలైనవి వేసుకొననట్టిజాతివారు నేటిదినము యూరోపియను వస్త్రములు మున్నగునవి ధరింతురేని వారు అడవితనమునుండి నాగరకమునకు వచ్చినట్లెన్నబడుచున్నారు. పూర్వము యూరపులో ప్రజ చేతికష్టముచేసిభూములు దున్నుచుండిరి. ఇప్పుడు ఆవిరినాగేళ్లు పెట్టుకొని ఒక్కడే అనేక యకరములుదున్ని ద్రవ్యముసంపాదించి భాగ్యవంతుడగుచున్నాడు. ఇది నాగరకచిహ్నములలో నొక్కటిగా పరిగణింపబడుచున్నది. పూర్వము అతిస్వల్పసంఖ్యాకులు గ్రంథరచన చేయువారు. ఆగ్రంథములు ఉత్తమములుగా ఉండును! నేడు ఎవ్వనికి ఇష్టము వచ్చినది వాడువ్రాసి అచ్చువేసి ప్రజలమానసము మంటగలుపుచున్నాడు. పూర్వము మనుష్యులు బండికుక్కిలోబడి ప్రయాణము చేతురు. ఇప్పుడు మనోవేగముతో బోవువిమానములలోనెక్కి భూమిసోకకుండ గంటకు నాలుగునూర్లమైళ్లు పరుగుచున్నారు. ఇది యంతయు నాగరకశిఖరోత్తుంగముగ నాలోచింపబడుచున్నది. మానవుడభివృద్ధియైనట్లెల్ల విమానమెక్కి అతడు

ప్రపంచములోని యేమూలకైనను గంటల ప్రయాణమున చేరవచ్చునని చెప్పుకొనుచున్నారు. మనుష్యులకు చేతులు కాళ్లు నుపయోగించు పని యుండనే యుండదు. ఒక బొత్తాము నొత్తిన కావలసిన యుడుపులు ప్రక్కకువచ్చి పడియుండును. మరియొక బొత్తాము నొత్తిన వలయు వార్తాపత్రిక ప్రత్యక్షమగును. ఇంకొక్క బొత్తామునొత్తిన మోటారు బండి ముంగిట నిలబడును. ఇట్లే ఆకటి వేళకు అన్నిరుచులయన్నము అట్టెయెదురగును. అన్నిపనులను యంత్రములుచేసి పెట్టును. పూర్వము యుద్ధము చేయునప్పుడు ఒండొరులు బలపరాక్రమముల ప్రకటించుకొనుచుండిరి. ఇప్పుడు ఒక్కడు మరఫిరంగివెనుక దాగినచాలును. వేనవేలను చంపవచ్చును. ఇదినాగరకము. పూర్వము మానవులు బహిరంగణమున తమశక్తికొలది పాటుపడుచుండిరి. ఇప్పుడు వేనవేలు కర్మకరులుచేరి కడుపు కక్కుఱితికై కర్మాగారములలో గనులలో పనిచేయు చున్నారు. వారిస్థితి పశువులస్థితికంటె నన్యాయము. లక్షాధికారుల మేలునకై వీరు మహాపాయకరమగు వృత్తులలో ప్రాణమునకు తెగి పరిశ్రమ చేయవలసియున్నది. పూర్వము భౌతికముగా మనుష్యుని నిర్బంధించి దాసు నొనర్చుచుండిరి. ఇప్పుడు ద్రవ్యముచూపి, ద్రవ్యముచే పొందనగు మోహపాశములనుచూపి, మనుష్యుల దాసుల నొనర్చుచున్నారు. పూర్వమెవ్వరు కలనైన కననియట్టి రోగము లిప్పుడు వేనవేలేర్పడినవి.

లక్షలకొలది వైద్యులువానికి ప్రతీకారములను వెదకుచున్నారు. అందుచేత వైద్యాలయములు పెరిగిపోయినవి. ఇది నాగరకము. పూర్వము ఉత్తరములు తీసికొనిపోవుటకు ప్రత్యేకము దూతలవసరమయి యుండినారు. ఎంతో ద్రవ్యము వ్యయముచేయవలసి యుండినది. నేడో ఎవ్వరిని తిట్టదలచుకొనినప్పటికి కాణి కాగితము వ్రాసి పడవేయ వచ్చును. అంతటితోనే అడకువతో కృతజ్ఞతను కూడ తెలుపవచ్చుననుటయు నిజమే. పూర్వము ఇంటిలో చేసిన బువ్వకూరలతో మూడుపూటల భోజనముండినది. ఇప్పుడో గంట గంటకు ఏదో తిండి కాఫీహొటాలులో తినవలెను. దీసికే సగ మాయువు పట్టుచున్నది. వేరుపనికి వేళయే లేదు. ఇంకను నేను చెప్పవలసిన దేమికలదు? ఇదంతయు ఉత్తమ రచకులే వర్ణించినారు. ఇవియన్నియు నాగరకమునకు చిహ్నములే. ఎవరైనను కాదందురా! వారు శుద్ధమూర్ఖులని తెలియవలసినదే. ఈ నాగరకములో నీతిమతములకు తావు లేదు. తద్భక్తులు మతము నేర్పుట మాపని గాదని ఘంటాపథముగ చెప్పుదురు. అందులో కొందరు మతము మూఢవిశ్వాస మనియు నందురు. మరి ఇతరులో, వేషము వేసికొని శ్రీరంగనీతులు బోధింతురు. అయిన ఇరువదియేండ్ల అనుభవము మీద నాకొక్క నమ్మిక మేర్పడినది. నీతియని నేర్పునది యెక్కువగా అవినీతియే. నేను పైన వర్ణించిన జీవితక్రమములో ఎక్కడను నీతికి

ఉద్దీపకము లేదనుట శిశువునకుగూడ అర్థము కాకపోదు. నాగరకము భౌతిక సౌఖ్యములను పెంచుటకు ప్రయత్నించుచున్నది. ఆ ప్రయత్నమునందును అది యేమాత్రము ఫలసిద్ధి పొందుట లేదు.

ఈనాగరకము దుర్మతము. దీనిప్రభావము వర్ణనాతీతము. యూరపులో దీనికి లోబడినవారనేకులు వెఱ్ఱివారికి తుల్యులుగా నున్నారు. వారికి బుజుబలముకాని సహజధైర్యముకాని లేదు. త్రాగుడువలన వారిశక్తిని నిలువబెట్టుకొనుచున్నారు. ఒంటరిగానుండురేని వారికి జీవనమే దుర్భరమగును. గృహాధిదేవతలుగా నుండదగిన స్త్రీలు వీధులలో నల్లాడుచుందురు. లేదా, కర్మాగారములలో క్రుగ్గుచుందురు. గంజికిగాను ఇంగ్లండులో ఐదులక్షల స్త్రీలు కర్మాగారములలోను మరియితరసంస్థలలోను మహానర్థ పరిస్థితులలో కుండుచు పనిచేయుచున్నారు. స్త్రీస్వాతంత్ర్యవాదముదినదినము బలపడుట కీగొప్పదురావస్థ యొక్క కారణము.

ఈనాగరకము దనంతటతానె నశింపగలదు. మనము ఓపిక మాత్రము పట్టియుండవలెను. మహమ్మదుబోధ ననుసరించిన యెడల ఈనాగరకమును సైతానునాగరకమనవలెను. హిందూమతము దీనిని కలియుగమనుచున్నది. దీని పూర్ణరూపమిట్టిదని మీ కెరిగింపలేను ఇంగ్లీషుజాతి నిదిపట్టి వారి కంఠ

క్రొవ్వనంతయు కాజేయుచున్నది. దీనిని త్యజించికావలెను. రాజ్యాంగసభలు నిజముగా దాసత్వచిహ్నములు. మీరాలు చక్కగా విషయము లాలోచించితిరేని ఈసంగతి మీకు స్పష్టపడి ఆంగ్లేయులను మీరు దూరుట మానివేయుదురు. వారిని మనము నిజముగా కరుణింపవలెను. వారిజాతి యుక్తికలజాతి. తప్పక వారికీడును తొలగించుకొందురని నానమ్మకము. వారు పాటుపడువారు, సాహసులు. వారిభావమార్గము నీతిసహజముగా అవి గలదికాదు. వారిహృదయంబును దోషాకరము కాదు. కాబట్టి నేను వారిని గౌరవించుచున్నాను. నాగరకము ఔషధము లేనిరోగముకాదు. కాని ఇంగ్లీషువారుమాత్రము దానివలన బాధపడుచున్నారనుట మరువరాదు.

ఏడవ ప్రకరణము.

భారతభూమి ఏల నష్టమైనది ?

చదువరి : నాగరకమునుగురించి మీరు పుష్కలముగా వివరించినారు. నేను విమర్శించుకొనుటకు చాలినంత చెప్పినారు. యూరపుజాతులనుండి మనమేమిగ్రహింపవలెనో యేమిత్యజింపవలెనో నేను నిశ్చయముగా తెలిసికొనలేకున్నాను. ఒక్క ప్రశ్నమాత్రము నాపెదవుల నానియున్నది. నాగరికమే రోగమైన, ఇంగ్లండు ఆరోగమునకు లోబడియున్న, భారతభూమి ఇంగ్లండువశ మేల్లైయున్నది. ఇంకను నావశమున నెట్లు నిలచినది ?

సంపా : మీప్రశ్నకు ఉత్తరముచెప్పుట మిక్కిలికష్టము కాదు. త్వరలోనే నిజమైన స్వరాజ్యతత్త్వముకూడ విమర్శింపనగును. ఇది యేల మధ్యమున చొప్పించితిరందురా నే నింకను ఆప్రశ్నకు జవాబియ్యవలసియున్నందుననేయగును. ముందు మీ వెనుకటిప్రశ్నకు ప్రత్యుత్తరమిచ్చెద. ఇంగ్లీషువారు భారతభూమిని తీసికొనలేదు ; మనము వారికిచ్చినాము. వారికి బలము ఉండబట్టి వారిక్కడ లేరు. వారిని మనము నిల్పియున్నాము. కాబట్టి వారిక్కడనున్నారు. ఈవిషయములు

నిజమేమో విచారింతము. మొదట వారు మనదేశమునకు వచ్చినది వ్యాపారముచేసికొనుటకు. తరువాత కంపెనీ బహాదూరేర్పడెను. కంపెనిని బహదూరుచేసినవా రెవరు.? వారు వచ్చినప్పుడు రాజ్యము స్థాపింపవలెనని వారికి కొంచమైనను ఆశ లేనేలేదు. కంపెనీవారి యధికారులకు సాయముచేసిన దెవరు? వారుతెచ్చిన అద్దాలసొబగుచూచి మోహించినదెవరు? వారివస్తువులను కొనినదెవరు? చరిత్రచూచినయెడల ఇవన్నియు మనమేచేసినట్లేర్పడుచున్నది. ఒక్కనాటిలో శ్రీమంతులము కావలెనని కుంపిణీవారియధికారులకు ముకుళితకరకమలములతో స్వాగతమిచ్చితిమి. వారికి సహాయముచేసితిమి, భంగీత్రాగునలవాటు నాకు ఉన్నదనుకొందము దాని నమ్మువాడు నాకమ్ముచున్నాడు. దోషము అతనిదో? నాదో? అతనిని దూరినమాత్రాన నాయభ్యాసము వదలగలనా? ఈవ్యాపారిని తరుమగొట్టినట్లైన ఇతనిస్థానమున ఇంకొకవ్యాపారి రావలసినదే గదా! భారతభూమికి నిజసేవకుడైనవాడు బునాదులతో విషయము పరిశీలింపవలెను. అపరిమితముగా అన్నముదిని యజీర్తిచేసికొని నీటిపైబడి నెత్తిమోదికొనిన నేమిలాభము? మూలకారణము కనిపెట్టినవాడే ముస్తాబువైద్యుడు. భారత భూమి నుద్ధరించు ముస్తాబువైద్యుడను నేను అనువాడు. మూలకారణమరయక తప్పదు.

చదువరి: మీరు చెప్పినది సరే. ఇకముందు మీసిద్ధాంతములు నాకు నచ్చజెప్పుటకు ఎక్కువవాద మవసరముండదు. మీయభిప్రాయము లెక్కువగా వినవలెనని కుతూహలము కలుగుచున్నది. ప్రస్తుతమాలోచించుచుండువిషయము మిక్కిలి చిత్తాకర్షకము. మీరు చెప్పునదంతయు సావధానముగా విందును. అనుమానమంకురించినచోటమాత్రము ప్రశ్నింతును.

సంపా: మీరు ఉత్సాహము పలుకుటదప్ప మున్ముందు ఎక్కువ భేదాభిప్రాయములు కలుగునని నాకుదోచుచున్నది. మీరు ప్రశ్నించునప్పుడు నావాదము చెప్పుకొందునుగాక. మనము ప్రోత్సాహపరచినందువలననే బ్రిటిషువర్తకులు భారతభూమిలో కాలూనగలిగిరని ఇదివరలో చెప్పితిని. మనరాజులు వారిలోవారు పోట్లాడికొనినప్పుడు తమతమబలమును వృద్ధి చేసికొనుటకు వారువారు కుంఫిణీబహదూరుసహాయము కోరిరి. ఆకుంపిణీ వ్యాపారమునందును యుద్ధమునందును సమర్థమయి యుండినది. ధర్మసందేహములు దానికి కలిగినవిగావు. తన వ్యాపార మభివృద్ధిచేసికొనుట, ద్రవ్యముగడించుట, ఇవి రెండే దాని యాలోచనలు. కాబట్టి అదిమనసహాయమును అంగీకరించి తనకుచెందిన వ్యాపారస్థానముల నెక్కువచేసికొనెను. ఈవ్యాపారస్థానములసంరక్షణార్థమై కుంపిణీవారు సైన్యమును పెట్టుకొనిరి. ఆసైన్యమును మనముకూడ వినియోగపరచు

కొంటిమి. అప్పుడు మనముచేసినపనికి ఇంగ్లీషువారిని దూషించుట వ్యర్థముకాదా? హిందువులు మహమ్మదీయులు ఒకరిమీదనొకరు కత్తిదూసి యుండిరి. ఇదియు కుంపిణీవారికి అనుకూలమయ్యెను. ఈరీతిగా కుంపిణీకి భారతభూమిలో అధికారము దొరకు సందర్భములను మనమేర్పరచితిమి. అందువలన భారతభూమి నష్టమైనదనుటకంటె మనము భారతభూమిని ఇంగ్లీషువారికి ఇచ్చినామనుట సమంజసము.

చదువరి: వారు భారతభూమిని నిలుపుకొనగలిగిన ట్లో చెప్పగలరా?

సంపా: ఏకారణములు వారికి భారతభూమిని దానము చేసెనో ఆకారణములే వారు దానిని నిలుపుకొనుటకును తోడ్పడుచున్నవి. కొందరు ఇంగ్లీషువారు కత్తిబట్టి భారతభూమిని జయించినట్లును ఆకత్తిబలముచేతనే ఇప్పుడు నిలుపుకొనుచున్నట్లును చెప్పుదురు. ఈరెండుమాటలును తప్పే. భారతభూమినినిలుపుకొనుటకు కత్తిఏమాత్రమును పనికిరాదు. మనమే ఇంగ్లీషువారిని నిలుపువారము. ఇంగ్లీషువారు దుకాణదారుల జాతియని నెపోలియను వర్ణించినాడట. అది ఉచితవర్ణనయే. వారికిగల సామ్రాజ్యమంతయు వారు వ్యాపారముకొరకే నిలుపుకొనుచున్నారు. వారినౌకాసైన్యము భూసైన్యము అంతయు ఆవ్యాపారమును రక్షించుట కేర్పడినవియే. ట్రాన్సువాలులో

వ్యాపారపాశము పనికిరానందున కీర్తిశేషుడు గ్లాడుస్టను ఇంగ్లీషువారా ప్రాంతమును తమవశమున నుంచుకొనుట సరికాదని నిశ్చయించెను. అయిన అదేప్రాంతము లాభకారి యయినప్పుడు సంఘర్షణకలిగి యుద్ధము పొసగెను. వెంటనే ట్రాన్సువాలుపై ఇంగ్లండుకు సార్వభౌమత్వాధికారము కలదని ఛేంబర్లేనుగారు కనిపెట్టిరి. ఒక చిన్నకథ చెప్పుదురు. అధ్యక్షుడు క్రూజరు బ్రతికియుండగా నెవరో అతనిని 'చంద్రునిలో బంగారమున్నదా' యని అడిగిరట. 'చాలమట్టుకులేదు. ఉన్నయెడల ఇంగ్లీషువారెన్నడో దానిని స్వాధీనపరచుకొనియుందురు' అని అతడు బదులుచెప్పెనట! వారికి ధనము దైవమనుట జ్ఞాపకముంచుకొనునెడల ఎన్నిచిక్కులనో అర్థముచేసికొనవచ్చును. అంతయు చూడగా ఇంగ్లీషువారిని మన స్వోపయోగార్థము మనమిక్కడ ఉంచుకొనుచున్నామనుట తేలుచున్నది. వారివ్యాపారము మనకు కావలెను. వారి చాకచక్యపద్ధతులచేత వారు మనలను తృప్తిపరచుచున్నారు. వారికి కావలసినది అందుమూలకముగా సంపాదించుకొనుచున్నారు. వారిని ఇందుకుగాను దూషించుట వారిశక్తిని ఇనుమడింపజేయుటతప్ప వేరుకాదు. మనలో మనము పోట్లాడుకొని వారి శక్తిని బలవత్తరముచేయుచున్నాము. పైచెప్పినసంగతులన్నియు అంగీకరించునెడల ఇంగ్లీషువారు వ్యాపారమునకై యిక్క

నీకివచ్చినారనుట సిద్ధము. అదేపనికే వారు నిలిచియున్నారు. అందులో మనము వారికి సహాయము చేయుచున్నాము. వారి మందుగుండ్లు నిజముగా ఏమి పనికిరావు. ఈసందర్భములో మీకు నేనింకొక్కటిచెప్పవలెను. జపానులో జపానీయులజండా యెగురుటలేదు. ఇంగ్లీషువారిజండాయే యెగురుచున్నది. జపానులో వ్యాపారముకొరకు ఇంగ్లీషు వారు సంధిచేసికొనియున్నారు. సాధ్యమయినయెడల వారివ్యాపారము జపానులోకూడ వ్యాపింపగలదు. వారులోకమునంతటిని తమవస్తువుల విక్రయమునకుగాను గొప్పవిక్రయాంగణముగా నేర్పరుచుకొననున్నారు. వారికిది సాధ్యముకాదనుట నిజమే. కానిలోపము వారిది కాబోదు. వారు తమయుద్దేశము నెరవేర్చుకొనుటకు సర్వప్రయత్నములుచేసి వదలుదురు.

ఎనిమిదవ ప్రకరణము.

భారతభూమిస్థితి.

చదువరి: ఆంగ్లేయు లేల హైందవభూమిలో నిలచియున్నారో యిప్పుడు నాకర్థమయినది. మనదేశస్థితినిగురించి మీయభిప్రాయములేమియో నేను వినవలతును.

నంపా: ఆస్థితి మిగుల విచారకరమైనది. దానినిగురించి ఆలోచించిననే నాకంట నీరునిండుచున్నది. గొంతు ఎండబారి పోవుచున్నది. నిజముగా నాహృదయమున కలరూపు కలయట్టులు వివరింపగలనా యనుసందేహము పుట్టుచున్నది. ఇంగ్లీషు వారి కాలిక్రిందకాదు మనముపడిమడయుచుండుట. నవనాగరికముయొక్క త్రొక్కుడున మనము నశించుచున్నామనుట నాపూర్ణవిశ్వాసము. ఆరాక్షసుని భరింపలేక దేశమాత సంకటపడిమూల్గుచున్నది. తప్పించుకొనుట కింకను అవకాశ మున్నది. కాని దినములు గడచినకొల్ల నాయవకాశము తగ్గిపోవుచున్నది. మతమునందు నాకభిమానము. నాకు మొదట కాన్పించుగొప్పలోపము భారతభూమి దుర్మతముపాలగుచుండుటయే. నేనుహిందూ, మహమ్మదీయ, పారసి మతములను గురించి యాలోచించుచున్నా ననుకొనవలదు. అన్నిమతములకు మూలాధారమైన ఆధ్యాత్మికమతము సంగతియే నాయాలోచన. మనము దైవమునే దూరముచేసికొనుచున్నాము

చదువరి: అదియెట్లు?

సంపా: మనము సోమరిపోతుల మని యురోపియనులు కష్టించువారని సాహసులని ఒక్క ప్రతీతి యేర్పడినది. ఆప్రతీతిని మన మంగీకరించి మనస్థితిని మార్చుకొననిచ్ఛగించుచున్నాము. హిందూ మహమ్మదీయపారసిక్రైస్తవమతములు బోధచేయున దేమన, భౌతిక సౌఖ్యములయెడల లోలత్వమువలదు. ఆధ్యాత్మిక లోకమునకై సతతపరిశ్రమచేయువలసినది. లోకములో విషయ సంగ్రహమొనర్చుదు ననునాశను త్రుంచవలసినది. ముక్తి మార్గమును తదేకదీక్షతో నరయవలసినది. మనసర్వప్రయత్నముదీనికి వినియోగించవలసినది.

చదువరి: మీరేమి! మతముపిచ్చిపట్టించుప్రయత్నముచేయునట్లున్నారు. ఎందరోదొంగలు ఇదేరీతిని బోధించి లోకులను పెడమార్గముల బట్టించినారు.

సంపా: మతమునుగురించిమీరక్రమదూషణచేయుచున్నారు సుమా! దొంగతనము మతముపేరిట జరుగకపోలేదు. వెలుతు రెక్కడకలదో చీకటియు నుండకపోదు. ఆధిభౌతిక విషయములలోని దొంగలకంటె ఆధ్యాత్మికవిషయములలోని దొంగలు ఎక్కువ దుర్మార్గులుకారని నేను ఋజువు చేయగలను. నాగరకముపేరట జరుగునట్టి దుర్మార్గము మతము పేరట నెప్పుడును జరుగదనుట ఇదె మీరు కనగలరు.

చనువరి: అదెట్లనగలరు? మతముపేరు పెట్టుకొనియే హిందువులు మహమ్మదీయులు యుద్ధములాడుకొనినారు. మతముపేరు పెట్టుకొనియే క్రైస్తవులలో క్రైస్తవులు ఒకరినొకరు సంహారము చేసికొనినారు. వేలకొలది నిరపరాధులు మతముపేరటనే కత్తివాతికి అగ్నిజ్వాలలకు చెప్పరానిహింసలకు పాలయినారు. ఏనాగరకముకంటెనుకూడ ఇది అసహ్యాకరముకాదా.

సంపా: నాగరకము యొక్క కష్టములకంటె పైకష్టములు భరించుట సులభతరమని నాహృదయపూర్వకవిజ్ఞాపనము. మతము పేరుపెట్టిక్రౌర్యములు జరిపియుండుట నిజమేయైనను ఎవ్వరును ఈక్రౌర్యములు మతమునకంగములని యెప్పుడును చెప్పియుండలేదు. కాబట్టి ఈక్రౌర్యములు మనతో సంపూర్తియగుచున్నవేకాని వెనుకటికి బీజములను చల్లిపోవుటలేదు. మూఢవిశ్వాసులును నజ్ఞానులునైన ప్రజలున్నంతకాలము ఇట్టిక్రౌర్యములు జరుగవచ్చును కాని నాగరకజ్వాలలక్రింద లీనమగునట్టి దురదృష్టులసంఖ్యకు మితియనుమాటయే లేదు. నాగరకమున నుండునట్టి పరమనీచగుణమేమందురా? మానవులు దానినే మోమహాప్రసాదమనుకొని ఆకాంక్షించు నురుకుచుండుటయే. అందుపడినవారు దుర్మతముపాలయి లోకఫలమేమాత్రమును అనుభవింపజాలనివారగుచున్నారు. నాగరకము తేనెపూసినకత్తివంటిది. దానిపూర్ణఫలముబయల్పడినప్పుడు నవ

నాగరకమునకంటె మూఢభక్తితోకూడిన మతవిశ్వాసమే వేయిమడుంగులు శ్రేయస్కరమని మనకు నర్థముకాగలదు. ఇట్లనుటచేత నేను మూఢవిశ్వాసములవిజృంభణమునకు తోడ్పడుచున్నానని యనుకొనవలదు. వానిని మనము సర్వవిధముల నెదిర్చి తుదముట్టింపవలసినదే. మతమునే ఉల్లంఘించి ఆపని చేయగలుగుదురనుట కల్ల. మతములోని సారమును గ్రహించి దానిని నిలిపిననే తక్కుంగలకార్యము సాధ్యమగును.

చదువరి. అయిన బ్రిటిషుశాంతి నిరుపయోగకరమనియా తమ యభిప్రాయము.

సంపా : శాంతి మీకు కానవచ్చుచున్నదేమో, నాకుమాత్రము కానరాలేదు.

చదువరి: ఠగ్గులు, పిండారీలు, భీలులు దేశమునకు కలిగించుచుండినయుపద్రవము మీకు లక్ష్యములో నున్నట్లు లేదు.

సంపా : కొంచెము మీరాలోచించినయెడల ఆభయమంతయు నెంతోయెక్కువలోనిది కాదని మీ రెరుంగగలరు. నిజముగా ఆఅల్లరులంత గొప్పవేయైనచో బ్రిటిషువారు రాకముందే ప్రజలందరు నశించియుందురు. అంతే కాక ప్రస్తుతముండు శాంతి నామకార్థమే. దీనివలన మనము ధైర్యస్థైర్యవిహీనులమైనాము. వ్యర్థులమైనాము. బ్రిటిషువారు పిండారీల భీలులస్వభావమును మార్చినారనుకొనుటకు రాదు. పిండారీల భయము

నుండి మనల సంరక్షించి మగతనము లేనివారినిగ చేసిన ఈపా స్థితులకంటె పిండారీలతో పోరాడుచుండుటయే మెరుగుగా నుండియుండును. పౌరుషవిహీనమగు సంరక్షణకంటె భీలుల బాణముల వేటుచే చచ్చుటయే నామట్టుకు నాకు అనుకరణీయము. అట్టిసంరక్షణ లేనికాలమున భారతభూమి శౌర్యసంపన్నమయి యుండినది. హైందవులు పిరికివారని వ్రాసిన మెకాలే అజ్ఞానమును ప్రకటించెనుకాని మరియొకటి కాదు. అట్టిదూషణకు హైందువులు పాత్రులు కారు. మొరటుఅడవిజాతులును వ్యాఘ్రములు తోడేళ్లును నిండినయరణ్యములను కలభూమిలోని మానవులు పిరికివారైనచో ఎన్నడో కలికమునకైన కానరాక పోవుదురు. మీరెప్పుడైనను చేలదగ్గరకు పోయినారా? నేడు కూడ మన రైతులు హాయిగా చేలలో నిర్భయముగా పండుకొందరు. ఇంగ్లీషువారు, మీరు, నేనేమైన వారు నిద్రించు చోటనిద్రింపజాలము. శక్తి భయము లేమిననుకరించును. దేహములోనుండుమాంసము రక్తముల ననుకరింపదు. స్వరాజ్యము కోరునట్టి మీకందరకును నేనొక్క విషయము స్మరింపజేయ వలసియున్నాను. ఈభీలులు, ఈపిండారీలు, ఈధగ్గులు, ఈఅసామీలు, అందరు మన దేశస్థులే వారిని జయించుట మీపని నాపని. మనసోదరులకే మనము భయపడుచుండు నెడల మన యాదర్శము చేరుటకు మనము సమర్థులమే కాము.

తొమ్మిదవ ప్రకరణము.

భారతభూమిస్థితి, రైళ్లు.

చదువరి: భారతభూమిలో శాంతికలదను భావము పెట్టుకొని నేనందుచుండినసంతుష్టిని మీరు పోనాడితిరి.

సంపా: మతవిషయమునమాత్రము నే నిదివరకు మీకు నాయభిప్రాయమును తెలిపినాను. భారతభూమి దారిద్ర్యమును గురించి నా భావములను తమకు తెల్పుచో తమరు నాయెడ సనిష్టముకలవారుకూడ కావచ్చును. ఏలయన, మీరు నేను ఇదివరలో ఏది భారతభూమికి ఉపయోగకరమని యెంచియుంటిమో అదినాకు ఇప్పుడు ఏమాత్రము పనికివచ్చునదిగా తోచదు.

చదువరి: అది యేమది ?

సంపా: రైళ్లు, వకీళ్లు, వైద్యులు దేశమును పేదచేసినారు. త్వరగా మేల్కొనని యెడల మనకు నాశము సిద్ధము.

చదువరి: మనము ఏకీభవింపచాలకపోవచ్చుననుట నాకిప్పుడు స్పష్టమగుచున్నది. ఏసంస్థలు మంచివని ఇంతకాల మనుకొనినామో వానినే మీరిప్పుడు ఖండింపనున్నారు.

సంపా: దయచేసి ఓపికపట్టవలయును. నాగరకమునసంతర్గర్భితమైయుండు కీడులను నిదానముమీదగాని మీరు గ్రహిం

పజాలరు. డాక్టరుల నడగినయెడల క్షయరోగి కొకగుణము సహజమని చెప్పుదురు. చచ్చునప్పుడుకూడ అత డింకను బ్రతికి యున్నట్లే భావించుచుండునట! క్షయ బయట స్ఫుటముగా కాన్పించురోగము కాదు. రోగిముఖమునకు దివ్యమగు కాంతి నిచ్చి ఆరోగ్య మనంతమను మోహమున పడవేయును. నాగరకము ఇట్టిరోగమే. మనము బహుజాగ్రత్తగా నుండవలెను.

చదువరి: మంచిది. రైళ్లనుగురించి సెలవిండు.

సంపా: రైళ్లే లేకపోయినచో భారతభూమిని ఇంగ్లీషువారు ఇంతపూర్ణముగా వశమున నుంచుకొనలేరనుట మీకు విదితమేగదా! రైళ్లవల్లనేకదా బొబ్బులమారి వ్యాపించినది! రైళ్లు లేనియెడల ప్రజ గుంపుగుంపులుగా ప్రయాణములు చేయుటకు వీలులేదు. మహామారి పురుగులను అవి మోసుకొని వచ్చుచున్నవి. పూర్వము సహజముగానే ప్రత్యేకత్వముండినది. రాకపోకలు సులువైనందున ఎక్కడప్రియముగా అమ్మునని అక్కడికి రైతులు ధాన్యము ఎగుమతిచేసివేయుదురు. అందుచేత క్షామములు నిరంతరమయినవి. ఇది రైళ్లవలన కలిగిన స్థితియే. ప్రజలు అజాగరూకులయి క్షామబాధహెచ్చెననగి. రైళ్లు మానవుని దుస్స్వభావమును పెంచినవి.దుష్టులైనవారు శీఘ్రతరముగ తమయుద్దేశములను నెరవేర్చుకొనుటకు అవకాశము కలిగినది. భారతభూమిలోని పవిత్రక్షేత్రములు అపవిత్రములయి

నవి. పూర్వము ఉత్సవములకు ప్రజలు మిక్కిలి కష్టపడిపోవు చుండువారు. కాబట్టినిజముగా భక్తికలవారే సాధారణముగా పోవుచుందురు. నేడో యెందరో దురాత్ములు తమ దుర్మార్గమును సాగించుకొనుటకు అక్కడకు పోయి చేరుచున్నారు.

చదువరి: మీరుమాటలాడునది పక్షపాతముగా నున్నది. క్షేత్రములకు దుర్మార్గులుపోవచ్చును. మంచివారును పోవచ్చును. రైళ్లనేల మీరు వినియోగించుకొనరాదు?

సంపా: మంచితనము నత్తవలె నిదానముగా ప్రయాణము చేయును. కాబట్టి దానికి రైళ్లతో నెక్కువసంబంధ మక్కర లేదు. మంచిచేయదలచువారికి స్వార్థపరత లేదు. వారుతొందర పడ నవసరము లేదు. ప్రజలకు మంచితనముపట్టించుటకు దీర్ఘ కాలము కావలయునని వారెరుగుదురు. చెడుగునకు రెక్కలు కలవు. ఇల్లు కట్టుట కెంతో కావలెను. పడగొట్టుట పరమసులభము. ఈకారణములచేత రైళ్లు చెడుగును వ్యాపింపజేయుటకు సాధనములగుట సంభావ్యము. రైళ్లు క్షామమును వ్యాపింప జేయునా అనుప్రశ్న విమర్శనీయము కావచ్చునుగాని అవి చెడుగును వ్యాపింపజేయు సాధనమనుటకు మాత్రము సందేహము లేదు.

చదువరి: అది యెట్లైననుకాని భారతభూమిలో జాతీయత

యనునవీనతేజమును రైళ్లేకదా వ్యాపింపఁ జేసినవి. అదొక్కమేలు చాలదా అన్ని నష్టములను కప్పుటకు.

సంపా: ఇది తప్పని నాయభిప్రాయము. మనము ముందొక జాతిగా నుండ లేదని, మనమొక్కజాతి యగుటకు యుగములు పట్టునని ఇంగ్లీషువారు మనకు నేర్పినారు. దీనికేమియు ఆధారము లేదు. ఇంగ్లీషువారు భారతభూమికిరాకముందు మనమొక్కజాతిగానే ఉండినాము. మనభావప్రపంచమంతయు నొకటే. మనజీవితమార్గమంతయు నేకమే. మనమందరుఒక్కజాతిగా నుండినందుననే వారు రాజ్యమును నిర్మింపగలిగిరి. తరువాతనే వారు మనలను విభాగించినది.

చదువరి: ఇది వివరించి చెప్పవలెను.

సంపా: మనము ఒకజాతిగా నున్నందువలన మనలో విభేదములే ఉండలేదని నేను చెప్పరాలేదు. చెప్పదలఁచిన దిది. మననాయకులు భారతభూమియంతటను బండ్లమీఁదనో నడచియో సంచారము చేయుచుండువారు. ఒండొరులభాష నేర్చుకొనువారు. ప్రత్యేకత్వము పాటించువారుగారు. దక్షిణమున సేతుబంధరామేశ్వరము ఈశాన్యమునజగన్నాథము ఉత్తరమున హరిద్వారము పుణ్యక్షేత్రములుగా నియమించినమనపూర్వికులయుద్దేశ మేమయియుండునో చెప్పగలరా? వారు వెఱ్ఱివారుకారుకదా! క్షేత్రములలోవలె దేవతారాధన ఇంటిలోనే

చేసుకొనవచ్చునని వారెఱుగుదురు. భక్తిప్రపూర్ణములైన హృదయములే గంగాప్రవాహములని వారు మన కుబోధచేయ నేచేసిరి. కాని వారు భారతభూమి దైవనిర్మితమైన ఏకప్రదేశ మనుటను గురుతించిరి. అందుచేత అది ఏకజాతిగా నుండవలసిన దని తీర్మానించిరి. తదనుగుణముగా భారతభూమి పదిచెరగు లను పవిత్రక్షేత్రములను స్థాపించి మఱిభూలోకమున నెచ్చటను ప్రయత్నింపని భావోద్రేక పద్ధతిని అనుసరించి భారతజాతీయ తను స్థిరపరచిరి. ఇరువురాంగ్లేయులు తామొక్కటియనుకొ నుటకంటె ఇరువురు భారతపుత్రులు తామొక్కటియనుకొను టలో గాఢతరసంవేదనకలదు. మీరు, నేను—నాగరికులమను కొనువారము—ఏదో ఆకసమునుండి ఉట్టిపడిన గౌరవ పదస్థు లమనుకొనువారము—వేరువేరుజాతులకుచేరినవారమనుకొను చున్నాము. రైళ్లువచ్చిన తరువాతనేమనము విభేదములమాట మాట్లాడుకొన నారంభించినది. రైళ్లమూలకముగానే ఈవిభే దములను పోగొట్టుచున్నామందురేని మీరట్లే యనుకొన వచ్చును. నల్లమందు తినువాడు నల్లమందు తినుటకు నేర్చిన పిదపతనకుచెరుపు తెలిసినదికాబట్టితానునల్లమందు అభ్యాసము చేయుట మంచిదేయనుకొని నట్లుండును. నేను రైళ్లనుగురించి చెప్పినదంతయుమీరు జాగరూకులై ఆలోచింతురుగాక.

చదువరి: సంతసముతో నాలోచింతును. కాని నాకొకప్ర శ్న పొడకట్టుచున్నది. మీరు చెప్పినదంతయు మహమ్మదీయు

లకు పూర్వమునాటి భారతభూమికి అన్వయించుచున్నది. ఇప్ప
టి మన భారతభూమిలో మహమ్మదీయులు, పారసీలు, క్రైస్త
వులు అందరున్నారు. వీరంద రొకజాతి యెట్లగుదురు? హిందు
వులు మహమ్మదీయులు ప్రాతవైరులు. మన లోకోక్తులే అందుకు
నిదర్శనములు. హిందువులు తూర్పుకుతిరిగిన మహమ్మదీయులు
పడమటికి తిరుగుదురు. వారిని వీరు విగ్రహారాధకులని నిరసిం
తురు. హిందువులు గోవును పూజింతురు. మహమ్మదీయులు
సంహరింతురు. హిందువులు అహింసతత్త్వము నంగీకరింతురు.
మహమ్మదీయులంగీకరింపరు. ఈరీతిగా ప్రతివిషయములో భేద
ములు కలవు. భారతభూమి ఒకజాతి యెట్లు కాగలదు?

పదియవ ప్రకరణము.

భారతభూమిస్థితి.

హిందువులు—మహమ్మదీయులు.

సంపా: మీరు కడపట నడిగినప్రశ్న చిక్కుది. కాని ప్రత్యుత్తర మెంతో కష్టముకాదు. రైళ్లు, వకీళ్లు, వైద్యులు ఉండుట చేత ఈప్రశ్న కవకాశము కలిగినది. రైళ్లనుగురించి ఆలోచించి నాము, మరి ఇప్పుడు వకీళ్లు, వైద్యులనుగురించి ఆలోచింతము. స్వభావముచేత మనము కాళ్లుచేతు లెంతదూరము తీసికొనుపోవునో అంతమాత్రముననే అర్హులము. రైళ్లు మొదలైన మోహాకరసాధనములమూలకముగా తావునుండి తావునకు పిచ్చివేగమున పరుగిడకుందుమేని అనవసరగందరగోళము లుండియుండవు. మనకష్టములు మననిర్మితములే. మానవశరీరము నేర్పరచినప్పుడే యీశ్వరుడే శరీర సంచలనమునకు నొకమితి యేర్పరచెను. వెన్వెంటనే మానవుడు ఆ మితిని మీరుటకు సాధనములు వెదక మొదలిడెను. మానవుడు తనసృష్టికర్త నెరుంగునుగాక యని అతనికి బుద్ధిబలము కలిగెను. మానవుడుదానిని దుర్వినియోగముచేసితనసృష్టికర్తనే మరచెను. నేనునాచుట్టుముట్టునుండువారలకు తోడగునట్లు

మాత్రమే దైవమునన్ను నియమించినాడు. కాని గర్వముచేత నేను ప్రపంచములోని ప్రతిమానవునకు తోడగుదునని నటించుచున్నాను. ఈరీతిని అసాధ్యములను సాధ్యముచేయ నాలోచించుటలో మానవుడు అనేక భిన్నస్వభావములనుభిన్నముఖములను ఎదుర్కొనవలసిన వాడగుచున్నాడు. అందువలన ఎక్కడలేని గందరగోళమున పడిపోవుచున్నాడు. ఈ హేతువాదమును నంగీకరించునెడల రైళ్లు మహానర్థదాయకములనుట మీకర్థముకాగలదు. అవి కారణముగా మానవుడు సృష్టికర్తనుండి యెంతో వేరుపడిపోయినాడు.

చదువరి: కానిండు. నాప్రశ్నకు నుత్తరమునకై మిక్కిలి యాతురతతో నెదురుచూచుచున్నాను. మహమ్మదీయులరాకతో మన జాతీయత పోలేదా ?

సంపా: వివిధమతములవారు నివసించినమాత్రమున భారతభూమి యొక్కజాతి కాకపోలేదు. విదేశీయులు వచ్చినతోడనే దేశజాతి నశించిపోదు. వారు దీనియందు లీనమైపోదురు. ఇది జరిగినప్పుడు దేశ మొక్కజాతియే కాని వేరుకాదు. దేశమునకు ఇతరులను తనలో లీనముచేసికొను శక్తిమాత్రముండవలెను. భారతభూమికి ఎల్లప్పుడును ఆశక్తికలదు. నిజమరయగా తలకొక్కమతమనుట తప్పదు. కాబట్టి జాతితత్త్వము నెరిగినవారెవ్వరును మతభేదములను గణింపరు. అట్లుగణింతురేని వారుజాతి

కాజాలరు. హిందువులు భారతభూమిని తామే నివసింపనెంతు రేని మిథ్యలో పడినవారగుదురు. భారతభూమిని మాతృభూమిగా గొనియుండు హిందూ, మహమ్మదీయ, క్రైస్తవ, పారసీలందరును ఏకదేశీయులు. తమతమ స్వలాభమునకే యైనను వీర లొండొరులతో నైకమత్యముగా నివసింపవలసియుందురు. లోకములో నెచ్చటను జాతీయతయనిన ఏకమతావలంబనమను నర్థములేదు. భారతభూమిలోను ఆసిద్ధాంతము నడచినదికాదు.

చదువరి:-అయిన హిందూమహమ్మదీయులకు గల సహజవైరమునుగురించి మీ రేమందురు?

సంపా:-మనయిరువురకు శత్రువులైనవారీపదములనుకల్పించినారు. హిందువులు మహమ్మదీయులు పోరాడికొనినప్పుడు అట్లువర్తించిరి సరిగదా బహుకాలముగా పోరాటములు లేవే ఇక సహజవైర మెక్కడకలదు? మరియొకవిషయము జ్ఞాపకముంచుకొనుడు. హిందూ మహమ్మదీయులు పోరాటములు మానుకొనుట బ్రిటిషువారి రాజ్యస్థాపనకు తరువాతనే యని యనుకొనరాదు. హిందువులు మహమ్మదీయపరిపాలనలోను మహమ్మదీయులు హిందూపరిపాలనలోను చక్కగా వర్ధిలిరి. ఇరుప్రక్కలవారును పరస్పరము పోరాడుకొనుటఆత్మహత్యకు మార్గ మని యెరింగికొనిరి. కత్తికట్టినమాత్రాన ఒండొరుల

మతము వీడుదురనుటను మరచిపోయిరి. రెండుపక్షములును ఐక్యముమై జీవింప నిశ్చయించుకొనిరి. ఇంగ్లీషువారిరాకతో మరల నాపోరాటములు ప్రారంభమయ్యెను.

ఇరువాగులవారును పోరాడుకొనునప్పుడు మీచెప్పిన లోకోక్తు లేర్పడినవి. ఇప్పుడు వానిని తడవుట నష్టదాయకము. హిందూమహమ్మదీయు లనేకులు నేటిదినము ఏకమూలపురుషుని పేర్కొనుట లేదా? వారిరక్తము వీరియందు వీరిరక్తము వారియందు ప్రవహించుచున్నదిగదా! మతము మార్చినంతనే మానవులు విరోధు లగుదురా? హిందువులదైవము మహమ్మదీయులదైవమునకంటె భిన్నమా? మతములోకే గమ్యస్థానమునకు జేర్చుమార్గములు కావా? గమ్యస్థాన మొక్కటే యైనప్పుడు మన మేమార్గము ననుసరించిననేమి? పోట్లాడుకొనుటకు కారణ మేమికలదు?

అంతియే కాదు. శైవులకును వైష్ణవులకును సంబంధించిన లోకోక్తులెంతటి బలవద్విరోధమునో సూచించునట్టివియున్నవి. అయిన వీరేకజాతివారుకారని యెవ్వరును అనుట లేదు. వేదాధారమతము జైనమతముకాదు. అయిన నీ రెండుమతముల వారును భిన్నజాతులుకారు. నిజమిది. మనముదాసులమైనాము. అందుచేత ఒండొరులతో పోరాడుకొని మనపోరాటమును మూడవవానిమూలకముగా తీర్చుకొన నిచ్చగించుచున్నాము.

మహమ్మదీయులలో విగ్రహవిచ్ఛేదకు లెట్లుకలరో హిందువు లలోకూడ నట్టివారుకలరు. మనము విజ్ఞానాభివృద్ధినందినకొలఁది మతేతరులతో పోరాడ నవసరములేదనుట దృఢతరముగా నర్థము కాఁగలదు.

చదువరి: గోరక్షనుగురించి మీయభిప్రాయము విన వలతును.

సంపా: నాకు గోవునెడ గౌరవముకలదు. ప్రేమపూర్వక మగు పవిత్రభావమున్నది. భారతభూమివ్యవసాయక దేశము. గోసంతతిమీఁద నాధారపడినది. కావున గోవు హైందవభూమికి శరణ్యము. గోవుఇంకను వేయివిధముల నుపయోగకారి. మహ మ్మదీయ సోదరు లిది కాదనరు.

కాని నేను గోవును గౌరవించునట్లే సోదరప్రజనుకూడ గౌరవింతును. మానవుడు హిందువుకాని మహమ్మదీయుడు కాని గోవువలెనే యుపయోగకారి. ఇట్లుండ గోవు నురక్షించు టకుగా నేనుమహమ్మదీయునితోపోరాడుట కానిఆతనిని సంహ రించుట కాని తగునా? అట్లుచేయుదునేని నేనుమహమ్మదీయ సోదరునకును గోవునకును రెంటికిని శత్రువునగుదును. కాబట్టి గోరక్షణకు ఒక్కటేమార్గము. మహమ్మదీయసోదరుని దరిసి దేశక్షేమమునకు నాతోకలిసి గోవును సంరక్షింపవలసినదని అతనిని వేడికొందును. అతడంగీకరింపడేని కార్యము నాకు

నసాధ్యముకావున గోవును పోనిచ్చుట తప్పదు. గోవునెడల నా కత్యంతప్రియంబైనయెడల దానిసంరక్షణకై నాప్రాణము సమర్పింపవలసినదే తప్ప అందుకయి యొరులప్రాణము కోనరాదు. ఇది మనమతముయొక్క సిద్ధాంతమని నావిశ్వాసము.

మనుష్యులు పెడబుద్ధులైనప్పుడు పరిస్థితి విషమ మగును. నే నేదాడనిన మహమ్మదీయసోదరుడుకోదాడనును. నేనుగంభీరదృష్టినటించిన అత డట్టిరీతినే ప్రత్యుత్తరమిడును. అతనికి నే మర్యాదగా నమస్కరించిన అతడు పదింత లెక్కువమర్యాదతో నమస్కరించును. అట్లు చేయడేని నేనమస్కరించుట దోషమని యెవ్వరును ననబోరు. హిందువు లెప్పుడు పోరుపెట్టిరో ఆనాడు గోహింస మిక్కుటమయ్యెను. నాయభిప్రాయమున గోరక్షకసభలు నిజముగా గోహింసకసభలు. అట్టిసభలవసరమైయుండుటయే మనకులజ్జాకరము. గోరక్షణమార్గము మనము మరచినందుచేతనే ఈసభ లవసరమైనవి.

రక్తసంబంధిసోదరుడు గోసంహారమునకు కడంగినాడు. నేనేమి చేయవలెను ? అతనిని పైబడి సంహరింపవలెనా లేకున్న నతనిపాదములబడి ప్రార్థింపవలెనా ? రెండవమార్గమే అవలంబనీయ మందురు కదా! ఇప్పుడు మహమ్మదీయసోదరుని యెడ నవలంబింపవలసినమార్గ మదియేకదా ?

హిందువులు గోవులను హింసించి నశింపజేయుట లేదా? అప్పు డెవరు వానినిరక్షించుచున్నారు. గోసంతతిని కర్రలతో

పొడిచి కన్నకష్టములబెట్టు హిందువు లెందరులేరు? అప్పు డెవరు సంరక్షణకర్తలు ? ఇదెల్లయు మనయేకజాతీయత కడ్డముచ్చినదా ?

తుదివిషయము. హిందువు లహింసావాదులును మహమ్మదీయులు తదితరులును అనుట నిజమే యయినచో హిందువుల ధర్మమేమి? అహింసామతానుసారి సోదరమానవునిచంపవచ్చునని ఎవరు లిఖించిరి ? అతనికొక్కటే ఋజుపథము. ఒకజీవమును కాపాడుటకింకొకని జంపరాదు. మనసు కరగునట్లు ప్రార్థింపవచ్చును. అంతియే తనధర్మము.

ఇక, ప్రతిహిందువు అహింసావాదియేనా ? బునాదులకు దిగి ఆలోచింతుమేని మనలో నొక్కడుకూడ అహింస మతముగా బ్రతుకుటలేదు. మనము ఏదోయొకరీతిని జీవహింస చేయుచునే యున్నాము. హిందువులలో అనేకులు మాంసాహారులున్నారు. వారెట్లుంగిని గూడ అహింసావలంబకులుగారు. హిందువులహింసాపరులుమహమ్మదీయులుకారు, కాబట్టి వీరికి పొత్తుపొసగదు, అనువాదము ఈకారణముచేత మృషావాదము.

స్వార్థపరులగు ఆచార్యబృవు లీ గందరగోళమునంతయు కల్పించుచున్నారు. ఇంగ్లీషువారందుకుమెరుగుపెట్టుచున్నారు.

వారు చరిత్రవ్రాయుటయం దోకమార్గము తొక్కుదురు ; లోకములోని యెల్లరగుణములను అభ్యాసములను వారుగ్రహించుట నటింతురు. దైవము మనకు పరిమితమగు బుద్ధిని ప్రసాదించినవాడు. వారతని ధర్మములను తామే తలధరించి నవనవ ప్రయోగములనన్నియు గావించుచుందురు. తమ కనిపెట్టిన వానినిగురించి తామే అట్టహాసముగా వ్రాసి మనకు నమ్మకము కలుగునట్లుగా మోహమున పడవేయుచున్నారు. మనము జ్ఞానముపై వారిపాదముల కెరగుచున్నాము.

దుర్మతమును నూనదలచుకొనువారు కొరానును చదివి చూడవచ్చును. హిందువులకు అంగీకారార్హములైన సూత్రములందు నూర్లకొలదికలవు. అదేరీతిని భగవద్గీతలోను మహమ్మదీయుల కేమాత్రమును అభ్యంతరార్హములుకాని సూత్రములెన్నియో యున్నవి. కొరానులో నాకర్థముకానట్టివో నాకు రుచింపనియట్టివో వాక్యము లున్నవని నేనుమహమ్మదీయులతో పోట్లాడుదునా ? ఇరుపక్షములున్నగాని పోట్లాట పొసగదు. కాబట్టి నేను మహమ్మదీయసోదరునితో పోట్లాడ నిచ్ఛగింపనేని నాపై పోట్లాటను తెచ్చి పడవేయజాలడు. అదేరీతిని పోట్లాటకు తాను సాయముచేయడని మహమ్మదీయసోదరు డనునేని నాకును పోట్లాటకు శక్తి కలుగదు. అంతరాళమున చేయివిసరిన చేయినొప్పిపట్టవలసినదే కాని మరేమియుకాదు. ఆచార్య

బృవుల కాకరమీాక ప్రతివాడును తన మతమునందలి సత్యము నెరింగినచో పోట్లాటలకు అవకాశమే యుండదు.

చదువరి: మనఇరుతెగలను ఇంగ్లీషువా రెప్పటికైనను చేర నిత్తురా ?

సంపా : మీా యధైర్యమే ఈ ప్రశ్నకు కారణము. మన తెలివితక్కువకిది తార్కాణము. ఇద్దరు సోదరులు సుఖముగా శాంతముగా బ్రదుక దలచుకొనినయెడల మూడవవానికి చెరుపసాధ్యము? దుష్టబోధలను వినినచో వారిని మన మవివే కులమనము? ఇంగ్లీషువారు హిందూమహమ్మదీయుల విభేద పరుపగలిగినయెడల అది మనలోపమేకాని వారిలోపమంతగా కాదు. మృద్ఘట మొక్కరాతితాకుడునకుగాకున్న మరియొక్క రాతి తాకుడునకైనను పగులగలదు. కాబట్టి ఆ ఘట మును సంరక్షించుటకు మార్గము రాయిరప్పనుండి దూరము తీసుకొనిపోవుటగాదు. చక్కగా కాల్చి బలపరచుటయే పరమ సాధనము. మనహృదయములు మట్టివి కాకూడదు. వజ్రసన్నిభ ములుగా తప్తములైనవి కావలెను. అప్పుడు సర్వాపాయ ములనుండి సంరక్షితుల మగుదుము. ఈపని హిందువు లెక్కు వగా చేయవచ్చును. వారు సంఖ్యలో నెక్కువ. విద్యా వంతులనికూడ చెప్పుకొందురు. అందుచేత హిందూమహ మ్మదీయసఖ్యము చెడకుండ కాపాడుటకు వా రెక్కువ సమర్థులు.

పరస్పరము ఈరెండుసంఘములకు అవిశ్వాసము కలదు. మహమ్మదీయు లందుచేత పార్లీప్రభువునొద్ద కొన్ని ప్రత్యేక స్వాతంత్ర్యములు కోరుచున్నారు. దీనిని హిందువు లేల ప్రతి ఘటింపవలెను? హిందువులు ప్రతిఘటింపకయుండినచో ఇంగ్లీషు వారికది మనసున కెక్కును. మహమ్మదీయులు క్రమముగా హిందువులను విశ్వసింతురు. సోదరభావము ఫలించును. ఇంగ్లీషువారివద్దకు మనవిభేదములను తీర్పునకు కొనిపోవుట సిగ్గు మాలినతనము. ఊరకుండిన హిందువునకు నష్టములేదనుట యెవ్వరికైనను అర్థము కావలసినదే. ఒకడు రెండవవానికి విశ్వాసపాత్రుడగునేని మొదటివానికి నష్ట మెక్కడను సంభ వింపదు.

హిందూమహమ్మదీయు లెప్పుడును పోట్లాడుకొనరని నే ననువాడనుకాను. ఏకకుటుంబములో నివసించుసోదరు లే యెన్నివిషయములలోనో కలహింతురు. నెత్తులు పగులగొట్టు కొందురు. అట్లు జరుగవలెననుట అవసరముకాదు. కానియెల్లరు లోకమున సమభావులుకారు. ఆగ్రహావేశులైనప్పుడు మనుష్యు లెన్నియో వివేకవిహీనప్రవర్తనలపాలగుదురు. ఇవియన్నియు మనము భరింపకతీరదు. అయిన,మనముపోట్లాడుకొనినప్పుడు ఇంగ్లీషు న్యాయస్థానములకుగాని మరియే న్యాయస్థానము లకుగాని పోనక్కరలేదు. న్యాయవాదుల నియమించుకొన

నవసరము లేదు. ఇరువురు పోట్లాడినారు. అందులో ఇరువు రకో ·ఒక్కనికో శిరస్సు బ్రద్దలైనది. మూడవవాడు వీరికి న్యాయముతీర్చుటెట్లు ? పోట్లాడువారికి గాయపడుదుమేయను జ్ఞాన ముండవలదా ?

పదునొకండవ ప్రకరణము.

భారతభూమిస్థితి.

న్యాయవాదులు.

చదువరి: మీరనున దేమి? ఇరువురు పోట్లాడుకొనినప్పుడు వారు న్యాయస్థానమునకు పోరాదా? ఇది చిత్రముగానే యున్నది.

సంపా: మీరు చిత్రమన్నను మరియేమన్నను నేజెప్పినది నిజము. మీరువేసిన ప్రశ్నవలన మనము న్యాయవాదులను గురించియు వైద్యులనుగురించియు ముచ్చటింపవలసియున్నది. నాయభిప్రాయమున న్యాయవాదులచే దేశము దాసత్వమందినది. హిందూమహమ్మదీయవిభేదములు పెరిగినవి. ఆంగ్లాధికారము స్థిరపడినది.

చదువరి: ఈ నేరములుమోపుట సులభము కాని ఋజువు చేయుట మీతరముగాదు. న్యాయవాదులుకాకున్న మరియెవ్వరు మనకు స్వాతంత్ర్యమార్గమును చూపియుండగలరు? బీదల నెవరు సంరక్షించి యుండగలరు? న్యాయము నెవరు స్థాపించియుండగలరు? ఉదాహరణార్థము, గతించిన మన మోహన ఘోసుగారు ప్రతిఫలముకోరక ఎందరనో బీదలను

న్యాయస్థానములలో వాదించి రక్షించిరి. మీరు ఎంతో పొగడిన దేశీయమహాసభ న్యాయవాదులు పనిచేయకున్న రూపముతోనే యుండదు. ఇంతటివారగు న్యాయవాదుల తెగను దూషించుట న్యాయము నన్యాయముచేయుటగా నున్నది. వారిని బూతులాడుటచే పత్రికాస్వాతంత్ర్యమును అపవిత్ర మొనర్చు చున్నారు.

సంపా: ఒకప్పుడు నేను మీవలెనే అభిప్రాయపడియుంటిని. వారు యేమియు మేలు చేసినవారే కాదని ధృవపరచుట నా కవసరముకాదు. ఘోసుగారిని స్మరించికొనిన నా కెంతో గౌరవము. అతడు బీదలకు సాయపడెననుట నిజము. దేశీయ మహాసభ న్యాయవాదులకు కొంత ఋణపడి యుండుట సంభావ్యము. వకీళ్లు మనుష్యులే. ప్రతి మనుష్యునిలోను కొంతగుణము కలదు. ఎక్కడెక్కడ వకీళ్లు మేలుచేసినారని చెప్పవచ్చునో అక్కడక్కడ ఆలోచించి చూచునెడల వారి మానవస్వభావము అందులకు కారణముగా దోచగలదు.వారి న్యాయవాదిత్వముచే చేసిన మేలేమియు నుండదు. నేనుమీకు తెలుపదలచుకొనునదంతయుఇది. ఆవృత్తి అవినీతికి ఆకరము. అందులోదొరకుకొనినవారు దానిమోహమునుండి తప్పించు కొనుట యరిది.

హిందువులుమహమ్మదీయులు పోట్లాడుకొనినా రనుకొందము. సామాన్యమానవుడు వారిని ఆ విషయమే మరచి

పొం డనును. ఇరుపక్షముల లోపములేక పోట్లాట రాదనును. మరి పోట్లాడవలదని బుద్ధిచెప్పును. వారు వకీళ్లవద్దకు పోదురు. వకీళ్లు తామంగీకరించు పక్షమువారితో నొక్కటయిపోయి వారిని న్యాయమనిపించుటకు సాధనము లాలోచింపవలసియుందురు. అసలుపక్షమువారికి ఈసాధనములు తోచనుగూడ తోచవు. కాని ఈధర్మమునెరవేర్పనియెడల వకీలు తనవృత్తికికళంకము తెచ్చినవాడగును. కాబట్టి సర్వసామాన్యముగా వకీళ్లు కలహములను త్రుంచుటకు బదులు పెంచువారగుచున్నారు. ఇంతేకాదు. ఆవృత్తిలో చేసువారు ఎక్కువగా ఇతరులకుసహాయముచేయవలెననిచేరువారుకారు. తాము కుబేరులైన చాలునని వారియుద్దేశము. వకీలువృత్తిఐశ్వర్యమార్గములలోనొకటికాబట్టి వకీళ్లకు కలహములు పెంచుటమీదనే దృష్టి. మనుష్యులు తమలోతాము వివాదపడినచోట వకీలుకు సంతోషమనుట నే నెరిగినసంగతి. చిన్నవకీళ్లు కృత్రిమకలహములను సృష్టించుటకూడ కలదు. మధ్యవర్తులా బీదలరక్తమును పీల్చిపిప్పిచేయుదురు. వకీళ్లకు నిజముగా పనిలేదు. సౌఖ్యలోలురగు నుద్దేశముతో సోమరిపోతులీవృత్తి నవలంబింతురు. ఇది నిజము. మరి యేవాదమైనను చెప్పుదురేని అది వట్టి బూటకము. వకీలువృత్తి గౌరవపాత్రమని కనిపెట్టినవారువకీళ్లే.తమ గౌరవపాత్రతను సిద్ధముచేసినట్టులే వారు శాసనములనుగూడ

సిద్ధముచేయుదురు, ఏమిరుసుములు తీసికొనవలెనో వారే నిశ్చ యింతురు. ఏదో మహోపకారముచేసినట్లు నటించి బీద లోహాయను నట్లొనర్తురు.

సాధారణకార్మికులకంటె వారికేల యెక్కువ రుసుము చెందవలెను? వారి యవసరము లేల అంతకంటెను నెక్కువ? సామాన్యకార్మికులకంటె వీ రెట్లు దేశమున కెక్కువయుప యోగకారులు? ఎక్కువమేలుచేయువారి కెక్కువద్రవ్యము చేరవలెనా? ద్రవ్యముకొరకు వారు దేశమునకు మేలుచేయు నెడల దాని నెట్లు మేలుగా గణింపవచ్చును?

హిందూమహమ్మదీయవివాదములను గురించి కొంచె మైనను ఎరింగినవారు అవి పలుమరు వకీళ్లమూలకముగా జనిం చిన వనుటను గుర్తింపగలరు. కుటుంబములు వారివలన నశిం చినవి. వారు సోదరులను శత్రువుల నొనర్చినారు. సంస్థాన ములు వకీళ్లఅధీనమున జిక్కి అప్పులకుప్పలైనవి. కొందరు సర్వస్వమును ధారపోసికొనినారు. ఇట్టి సంగతు లూరకపెంచి చెప్పవచ్చును.

వకీళ్లుదేశమునకుచేసిన అపచారములలోనెల్ల పెద్దది ఇంగ్లీషు వారిపట్టును బలవత్తమ మొనర్చుటయె. న్యాయస్థానములు లేకపోయినయెడల ఇంగ్లీషువారిరాజ్యపరిపాలనసాధ్యమగునా? ప్రజలమేలునకయి న్యాయస్థానము లేర్పడినవని యాలో

చించుట పొరబాటు. తమయధికారమును నిలవబెట్టికొననాలోచించువారు న్యాయస్థానములమూలకముగా ఆపనిని నిర్వహింపజూచుచున్నారు. ప్రజలుతమలోనికలహములనుతీర్చుకొనగలుగునెడల మూడవవానికి అధికారమే దొరకదు. యుద్ధములుచేయుటచేతనో బంధువులమూలకముగనో కలహములు తీర్చుకొనునప్పుడు మానవుడు మానవత్వము లేనివాడయ్యెను. న్యాయస్థానములకు పోవునప్పటికి అంతకంటెనుపౌరుషవిహీనుడైనాడు. ద్వంద్వయుద్ధమున వివాదముతీర్చుకొనుట అనాగరకమనుట నిస్సంశయము. నాకును మీకును కలవివాదమునుతీర్చుటకుమూడవవానిని నియమింతునేని అదియంతకంటెనుతక్కువ యనాగరకమగునా? మూడవవాని తీర్మానము ఎల్లప్పుడును సరికాజాలదు. వివాదపడినవారికే తెలియును తమలో ఎవ్వరిదిన్యాయమో, ఎవ్వరిది కాదో. అట్లుండగా మనము మనయమాయకత్వముచేతను, అజ్ఞానముచేతను మనద్రవ్యము తీసికొనిన మూడవవాడు మనకు న్యాయము కలుగచేయునని భ్రమపడుచున్నాము.

ముఖ్యముగా జ్ఞాపక ముంచుకొనదగినదిది. న్యాయవాదులు లేక న్యాయస్థానములు స్థాపితములై యుండవు. న్యాయస్థానములు లేక ఇంగ్లీషుపరిపాలన అసాధ్యమైయుండును. ఇంగ్లీషు న్యాయాధికారులు, ఇంగ్లీషున్యాయవాదులు, ఇంగ్లీషు పోలీసు

ఉన్నయెడల వారు ఇంగ్లీషువారినిమాత్రమే పరిపాలించుట వీలగును. హైందవన్యాయవాదులు, హైందవన్యాయాధికారులు లేనిచో ఇంగ్లీషువారికి మార్గమేయుండదు. వకీళ్లెట్లు ఏర్పాటైరో, వారెట్లు ప్రోత్సహింపబడిరో మొదట వివరింపవలసియున్నది, అప్పుడు ఆవృత్తియెడల నాకెంత అసూయ కలదో మీకును అంతియే అసూయయుండును. న్యాయవాదులుత్తమవృత్తి దాసివృత్తివంటిదని గుర్తించివదలివేయుదురేని ఇంగ్లీషుపరిపాలన ఒక్కనాటిలో అసాధ్యముకాగలదు. మీనములునీటినివలె హైందవులమైనమనము వివాదమును న్యాయస్థానములను ప్రేమింతుమను నింద మనకు కలుగుటకు వారే ఉత్తరవాదులు. న్యాయవాదులనుగురించి నే చెప్పినది సహజముగానే న్యాయాధికారులకుకూడ నన్వయించుచున్నది. వారు జ్ఞాతులు; ఒకరికొకరు సహాయులు.

పంద్రెండవ ప్రకరణము.

భారతభూమిస్థితి.

వైద్యులు.

చదువరి: వకీళ్లనుగురించినాకిప్పు డర్థమయినది. వారుచేసిన మేలు ఆకస్మికము కావచ్చును. ఆవృత్తి నీచమని నాకు తోచుచున్నది. మీరువైద్యులనుకూడ లాగివైచుచున్నారే! అదియెట్లు?

సంపా: నేను తమకు తెలుపునభిప్రాయములు నావికావు. నేనును అంగీకరించినవే. పాశ్చాత్యరచకులు న్యాయవాదులను గురించియు వైద్యులనుగురించియు కఠినతరముగా వ్రాసినారు. అందులోనొక్కరు నేటి నాగరకపద్ధతినంతయు ఉపాసవృక్షమునకు పోల్చినారు. పరోపజీవికలగువృత్తు లావృక్షమునకు శాఖలు. ఇందులో న్యాయవాదివృత్తి, వైద్యవృత్తి చేరియున్నవి. మొదలింటిమీద మతమను గొడ్డలి పెట్టినారు. వేరు శాశ్వతత్వము. మీకు ఇందుమీదట! అభిప్రాయమంతయు నాదికాదనుట సులభగ్రాహ్యము. అనేకులేకమై యాలోచించినదనుటయు తెల్లమే. ఒకప్పుడు వైద్యవృత్తియనిన నాకు బహు ప్రేమ. దేశముకొరకయి వైద్యుడు కావలయునని నాయుద్దేశ ముండినది. ఇప్పుడాయుద్దేశము నాకు లేదు. మనలోని నాటు వైద్యులకేల గౌరవపదవి రాలేదో యిప్పుడునాకర్థమయినది.

మనపై అధికారము నిలుపుకొనుటకు ఇంగ్లీషువారు వైద్యవృత్తినిబహుచక్కగావినియోగించినారు. రాజకీయలాభమును సంపాదించుటకు ప్రాచ్యఖండవాసులగు సంస్థానాధీశ్వరులపట్ల ఇంగ్లీషువైద్యులు తమవృత్తిని వినియోగించినట్లు నిదర్శనము లున్నవి.

వైద్యులు మనబునాదులనే చెరపినారు. ఏమిరానినాటు వైద్యులే సున్నితులైన నేటివైద్యశిఖామణులకంటె మెరుగని నాకొకొకప్పుడు తోచుచున్నది. ఆలోచించి చూతము. దేహమును కాపాడుట వైద్యునివృత్తి.సరిగనాలోచించిననదియును గాదు. దేహమును బాధించు రుజలను పోనాడుట వారివిధి. ఈ రోగము లెట్లుకలుగుచున్నవి? నిజముగా మనయజాగ్రత్తవలన, మనవిషయలోలత్వమువలన. నేనూరకతిన్నాను. అజీర్తికలిగినది. వైద్యునికడకు పోయినాను. అతడుమందిచ్చినాడు. నాకు బాగైనది.మరల ఇష్టముకొలది మెక్కినాను. మరల అజీర్తియయినది. మరలవైద్యునిచేతిమాత్రలుమ్రింగవలసినదే. మొదట మాత్రలు మ్రింగనిచో నాకుతగిన శాస్తియగును. మరల మితిమీరి తినను. అంతటితో అజీర్తి నిలిచిపోవును. వైద్యు డడ్డుతగిలి నావిషయలోలత్వమును ప్రోత్సాహపరచినాడు. అందువలన దేహమేమో బాగుపడినదికానినామానసముమాత్రము శక్తివిహీనమైనది. మందులూరక త్రాగుచుండిన మానసము మంటగలియవలసినదే.

నేనేదో తప్పుదారి త్రొక్కినాను. రుజపైబడినది. వైద్యుడు బాగుచేయును. తరువాత నూటికితొంబదితొమ్మిదిపాళ్లుమరల తప్పుదారి త్రొక్కుదుననుట నిశ్చయము. వైద్యుడు అడ్డ పడనిచో స్వభావానుగుణముగ ఫలముకలిగియుండును. నన్ను నేను సంరక్షించుకొనుశక్తి యలవడును, నాతప్పుదారి తప్పి యుండును, నాకు సంతోషము కలిగియుండును.

ఆసుపత్రులు పాపమును పెంచునట్టిసంస్థలు. ఇవికారణ ముగా మనుష్యులు తమశరీరములను గురించి తక్కువజాగ్రత్త గా నుందురు. కావున అవినీతి ప్రబలిపోవుచున్నది. యూరోపి యను డాక్టరులు అధములు. దేహమును సంరక్షించు కొనుటనుగురించి పొరపాటు అభిప్రాయము మనసులో నిడుకొని వీరుసంవత్సరము సంవత్సరము వేనవేలు జీవములను హింసించుచున్నారు. ఇది యేమతముకూడ అంగీకరించినది కాదు. మనదేహములనుసంరక్షించుకొనుటకుఇన్నిజంతువులను చంపనక్కరలేదని అందరును అంగీకరించుచునే యున్నారు

ఈడాక్టరులు మనమతాభిమానమును చెడుపుచున్నారు వారి మందులలో ఎక్కువవానియందు క్రొవ్వుగాని మత్తు ద్రవములుగానికలియుచున్నవి. వీనిరెంటిని హిందూమహమ్మ దీయమతములు రెండును నిషేధించినవి. నాగరకమను నాట కము మనమాడవచ్చును. నిషేధితములన్నియుమూఢవిశ్వా

సములని యూడవచ్చును. ఇచ్చవచ్చిన యనుభవములలో నోలలాడవచ్చును. అయిన ఇందులో నిజమేమియుందురా? డాక్టరులు మనకీయనుభవములను పట్టించుచున్నారు. మనము ఆత్మనిగ్రహము లేనివారమయినాము. పౌరుషవిహీనత్వము మనపాలైనది. ఈకారణములచేత దేశసేవచేయుటకుమనమనర్హులము. యూరోపియను వైద్యము నేర్చుకొనుట మన బానిసత్వము దృఢతరము చేసికొనుటయే.

వైద్యవృత్తియేల అవలంబించుచున్నామో ఆలోచించుట ఆవసరము. లోకమును సేవించవలెనని మాత్రము కాదు. గౌరవము ఐశ్వర్యము సంపాదించుటకే మనము డాక్టరులగుచున్నాము. అవృత్తిలో నిజమైన లోకసేవ యేమాత్రములేదనియు దానివలన లోకమునకు అపకారమనియు చూపుటకు నే నిదివరకు ప్రయత్నముచేసితిని. డాక్టరులు తమకు గొప్ప జ్ఞానము కలయట్లు నటించి పెద్ద పెద్ద మొత్తములు లాగుదురు. రెండుదమ్మిడీలు చేయనిమందును వారు రూపాయలురూపాయలుపెట్టి యమ్ముదురు. పిచ్చినమ్మకముచేత తమకు కల రోగముకుదురునను భ్రమచేత ప్రజ ఈమందులను కొందురు. ఇదంతయు చూడగా ప్రజాహితమునెంతయో నెత్తిన వేసికొనునట్లునటించుడాక్టరులకంటె, మనయొద్దకలో నుండునట్టినాటు వైద్యులే మేలుగారా ?

పదిమూడవ ప్రకరణము.

నిజముగా నాగరకమననేమి ?

చదువరి: మీరు రైళ్లను ఖండించితిరి. వకీళ్లను ఖండించితిరి. వైద్యులను ఖండించితిరి. యంత్రసామగ్రినంతయు ఖండింతురనుట నాకు స్పష్టము. అట్లయిన నిజముగా మీరు దేనిని నాగరక మందురో ?

సంపా: ఈప్రశ్నకు ప్రత్యుత్తరము కష్టముకాదు. భారతభూమి నిర్మించుకొని వచ్చియుండు నాగరకము లోకమున మరెక్కడను లేదు. మన పూర్వీకులు వైచినవిత్తనమును బోలు గట్టివిత్తన మింకెక్కడను దొరకదు. రోము గతించె, గ్రీసుచనె. అసమానులు ఫేరోలు తరలిరి. జపానుపాశ్చాత్యవేషమును ధరించె. చీనానుగురించి యేమియు చెప్పరాదు. అయిన భారతభూమిమాత్ర మెట్లెట్లో ఇంకను అస్తిభారములలో చక్కగ నిలిచియున్నది. ఎన్నడో నాగరకముననుండిన గ్రీసురోములవద్దనుండి యూరోపియనుజాతులు పాఠములు చదువుకొనుచున్నారు. అట్లు నేర్చుకొనుటలోకూడ గ్రీసురోముల లోపములను మానుట తలపెట్టుకున్నారు. ఇది జాలికరమగు స్థితి. ఇంతటిమధ్యన భారతభూమి నిశ్చల

పై నిలచియున్నది. ఇదియే ప్రతిభ. భారతపుత్రులు ఏమాత్రము మార్పు చెందుటకును అంగీకరించరట. ఇది యజ్ఞానమట, మౌర్ఖ్యమట, భారతీయు లంత యనాగరకులట. ఈదోషారోపణ నిజముగా మన సుగుణమును ఖండించుట యయియున్నది. అనుభవముచే బాగుగా పరిశీలించి గడించినదానిని నిజ మని యెరింగినదానిని మనము మార్చుటకు రాదు. భారతభూమి నెత్తిన నెంతో సలహాలను క్రుమ్మరించుట కెందరో ప్రయత్నించుచున్నారు. మనము వినుట లేదు. ఇందులో సారస్యమిది, ఇదియే మన యాశలన్నిటిని నెఱవేర్చగల యాధారము.

ఏమార్గము మానవునకు స్వధర్మోపదేశమును చేయునో అదియే నాగరకము. ధర్మనిర్వహణము, నైతికప్రవర్తనము ఇవి రెండును చాలమట్టుకు అభేదములు. నైతికప్రవర్తనముచే మనస్సును ఇంద్రియములను నిగ్రహింతుము. తన్మూలమున ఆత్మస్వరూపము నెఱుంగుదుము. నాగరకము అనుపదమునకు గుజరాతీభాషలో నీతిప్రవర్తనము అనునర్థమిచ్చుపదము నుపయోగింతురు.

ఈపదార్థము నిజమగునేని అనేకులు గ్రంథకారులు వ్రాసియుండురీతిని పరులనుండి భారతభూమి నేర్చుకొనదగిన దేదియు లేదు. ఇది న్యాయమే కదా. మానసము నిలకడలేని పక్షి. ఎంత అలవడిన నంత దీనికి కోరిక. నిరంతరమిదియసంతుష్టమే.

మనమెంతటి సంతోషమింద్రియములకు కలిగింతుమో అంత యెక్కువగా నవి ఆశలననంతము చేయుచుండును. కాబట్టి మన పూర్వీకులు మనభోగములకు మట్టు లేర్పరచిరి. సౌఖ్యము మానసికస్థితి యనుటను గ్రహించిరి. ద్రవ్యమున్నంతమాత్రమున మానవుడు సుఖికాడు. ద్రవ్యము లేనందున బీదవాడు సౌఖ్యము లేనివాడుకాడు. కోట్లకొలది ప్రజ యెల్లప్పుడుబీదలే. ఇదంతయు గమనించియే మన పెద్దలుమనలనుభోగములనుండి భాగ్యములనుండి వారించిరి. వేలయేండ్ల క్రిందనుండిన నాగటి వంటి నాగటితోనే మనము కాలముగడుపుచున్నాము. పూర్వపుకుటీరములపోలు కుటీరములే నేటికినిమనకు నిలుచుటకాధారములై యున్నవి. మన దేశీయవిద్యకూడ నాటిదే నేడు. జీవితమును మర్భరముచేయు పోటీపద్ధతి మనదికాదు. ప్రతివాడును తనవృత్తినివ్యాపారమును చేసికొని తదనుగుణమగు ద్రవ్యమును సంపాదించును. యంత్రములు చేయుటకు మన పెద్దలకు తెలియదనరాదు. అయిన మనము అనుభోగములపయి ఆశ పెట్టితిమేని వానికి దాసులమగుదుమనుట వారెరుగుదురు. మన నైతిక జీవనము నశించుననుటయు వారుగమనించిరి. బాగుగ నాలోచించి వారందుచేతనే మనకు దైవమిచ్చిన కాలుసేతులు పయోగించి యెంతపని చేయవచ్చునో అంతమాత్రము పనినే నియోగించిరి. మనయవయవముల సద్వినియోగమే నిజముగ

సౌఖ్యమునకును ఆరోగ్యమునకును కారణభూతముకాని మరియొకటి కాదనుటను వారు గ్రహించిరి. ఇంతే కాదు. గొప్పగొప్పనగరముల నిర్మాణముకూడ వ్యర్థమనియు దోషాకరమనియు వారు కనిపెట్టిరి. అట మానవుడు సుఖపడజాలడు. దొంగలు, దోపిడికాండ్రు ఎక్కువగ నుందురు. దుష్టవృత్తులు మెండగును, భాగ్యవంతులు బీదలను దోచికొందురు. కాబట్టిమన పూర్వికులు చిన్నగ్రామములను నిర్మించుకొనుటతో సంతృప్తి పొంది యుండిరి. రాజులకత్తులు నీతికత్తికి లోకువయనుటవారి నమ్మిక. కాబట్టి ఋషులు, ఫకీరులయెదుట సార్వభౌములు తక్కువయని సిద్ధాంతీకరించిరి. ఇట్టి యమోఘసిద్ధాంతముల కాకరమయినజాతి ఇతరులకు గురుపదముననుండదగినదే కాని ఇతరులనుండినేర్చుకొనదగినది కాదు. మనజాతివారుకూడన్యాయస్థానములు, న్యాయవాదులు, వైద్యులు అనుసంస్థలను ఎరుంగుదురు. కాని వీనికెప్పుడును మితియేర్పడియుండును: ఈవృత్తులెంతో గౌరవాస్పదములు కావనుటను ప్రతివాడును అంగీకరించుచుండెను. అంతేకాక వకీళ్లు, వైద్యులు ప్రజలను దోచుకొనుచుండలేదు. వారు ప్రజలనౌకరులుగా నెంచబడుచుండిరి గాని యజమానులుగా నెంచబడుచుండలేదు. న్యాయవిచారణ సాధారణముగాసరిగానుండినది, న్యాయస్థానములకుపోకుండుట నాటిసామాన్యసూత్రము. మానవులను అందులోనికి ప్రవేశ

పెట్టు నేటిమధ్యస్థు లప్పుడు లేరు. ముఖ్యపట్టణములలో వాని చుట్టుపట్టును ఆమాత్రము న్యాయస్థాన విచారమైన నుండినది. సాధారణముగా ప్రజతమ గ్రామములలో తాము స్వతంత్రముగా జీవించుచు వ్యవసాయాదికములను చేసికొనుచుండిరి. స్వరాజ్యమును అనుభవించుచుండిరి.

నేటినాగరకము దూరనియట్టిఘట్టములలో భారతభూమి నేటికిని పూర్వమువలెనే యున్నది, అక్కడివారు మనలను చూచునప్పుడు మనసవనవమార్గములను నవ్వుదురు. వారిపై ఇంగ్లీషు అధికారమునులేదు. మీయధికారమునునుండబోదు. ఎవరి ప్రతినిధులము మనమని మాటలాడుచున్నామో వారిని మన మెరుగము. వారు మనల నెరుగరు. మీరును మీవలె దేశాభిమానులైనయితరులును నాతో చేరిని యట్టిప్రదేశములకు పోయి అచ్చట ఆరుమాసము లుండి రావలసినదని నా యిష్టము. అప్పుడు దేశాభిమానముతో మీరు స్వరాజ్యమును గురించి మాటలాడవచ్చును.

నిజమైన నాగరక మనగా యర్థమేమో ఇప్పుడు మీకు తెలిసియుండును. నేనువర్ణించియుండు ఈస్థితిగతులను మార్చ దలంచునట్టివారు దేశద్రోహులు. పాపులు.

చదువరి: తామువర్ణించినట్లే భారతభూమియుండునేని బాగుండును. అయిన నీదేశములో ఎందరో బాలవితంతువు లున్నారు. ఎందరకో రెండుసంవత్సరముల వయసుననే శిశువివా

హములు జరుగుచున్నవి. పండ్రెండేండ్ల బాలికలు బిడ్డలగని సంసారముబరువు మోయుచున్నారు. స్త్రీలుబహుభర్తృకలును కలరు. నియోగసూలు నడచుచునేయున్నవి. మతముపేరుపెట్టి స్త్రీలు వ్యభిచారమునువృత్తిచేసికొనుచున్నారు. దేవతలకుప్రీతి యని మేకలు గొర్రెలు హతమగుచున్నవి. మీరువర్ణించిననాగరకమున కివిగూడ చిహ్నములనియే మీయభిప్రాయమా?

సంపా: మీరు చెప్పునది సరిగాదు. మీరు చూపినలోపములు లోపములే. అవిపూర్వనాగరకమునకుచెందినవనియెవ్వరును భ్రమపడుట లేదు. దానిశక్తిని ప్రతిఘటించికూడఅవినిలచినవి. వానిని నశింపజేయుటకు ఎల్లప్పుడును ప్రయత్నములుజరిగినవి, జరుగుచున్నవి, జరుగగలవు. మనయందుద్భవించిన నవీనతేజముచే ఈదోషములను పోనాడుకొనుటకు ప్రయత్నింపవచ్చును. నవనాగరక చిహ్నములని నేను వర్ణించినదంతయు దానిచిహ్నములే యని తద్భక్తులే యంగీకరించుచున్నారు. ఏ నాగరకముక్రిందగాని, ఏదేశములోగాని మానవుడు సంపూర్ణత్వము నందినదిలేదు. భారతనాగరకముయొక్క దృష్టి మానవుని నైతికస్వభావమును పెంచుట. నవనాగరకముయొక్క దృష్టి అవినీతిని అధికముచేయుట, దీనికి దైవభక్తి తోడులేదు. దానికి దైవభక్తియే యాధారము. ఈవిధముగా నాలోచించి ఈరీతిని విశ్వసించు ప్రతిభారతీయుడును తల్లి యురము వీడని శిశువువలె తన ప్రాచీన నాగరకమును వీడక నడుచుకొనవలెను.

పదునాలవ ప్రకరణము.

భారతభూమి స్వతంత్ర మెట్లగును.

చదువరి: నాగరికమునుగురించి మీరుచెప్పిన యభిప్రాయము లర్థమయినవి. నేను వానిని గురించి మననము చేసి కొందును. అంతయు నొక్కపర్యాయముగా గ్రహింగజాలను. ఇట్టి యభిప్రాయములుగల మీరు భారతభూమిని స్వతంత్రము చేయుట కేమిమార్గము చెప్పుదురోయని యెదురు చూచుచున్నాను.

సంపా: నాయభిప్రాయము లొక్కపెట్టున అంగీకృతములగునని నేనునమ్మువాడనుకాను. మీబోటి చదువరులకు నివేదించుటమాత్రము నాధర్మము. కాలము తక్కుంగలపనిని నెరవేర్చును. భారతభూమిని స్వతంత్రమొనర్చు స్థితిగతులిదివరకే వివరించినాము. ఆవివరణమంతయు నేరుగాచేసినదికాదు కావునఇప్పుడట్లు చేసిచూపెదను. రోగకారణమును నశింపచేసిన రోగము నశించుననుట లోకములో అందరకును విశదమయిన సిద్ధాంతమే. అట్లే భారతభూమి దాస్యమునకు కారణమేదో ఆకారణమును తొలగించినయెడల దాస్యమును తొలగుననుట నిజము.

చదువరి: భారతనాగరకమే లోకములో నుత్తమమయిన యెడల భారతభూమికి దాస్యమెట్లు కలిగినది ?.

చదువరి: ఈనాగరకము ఉత్తమమనుటనిర్వివాదాంశము. అయిన ఒక్కటి జ్ఞాపకముంచుకొనవలెను. అన్నినాగరకములును వ్యవహారమున పరీక్షితము లగుచున్నవి. ఏది అచలమో అదియన్నిటినిగెలిచి స్థిరపడగలదు. హైందవపుత్రులు చలించుటనుజేసి భారతనాగరకము ఇక్కట్టుల బడినది. ఎన్నిమహోతరంగములు వచ్చినను కొట్టుకొనిపోవక నిలచుటచేతనే దీనిశక్తి యిట్టిదని బయల్పడుచున్నది. అంతేకాక భారతభూమియంతయుగూడ ఇంకనునీవ్యవహారపరీక్షలోనికిరాలేదు. పాశ్చాత్యనాగరకముసోకినవారు మాత్రము దానికి దాసులైనారు. మానవుడెప్పుడును మహాప్రపంచమును తనజేనడే యని తలంచుట స్వభావసిద్ధము. మనము దాసులైనప్పుడు లోకమంతయుదాస్యము నందినట్లే మనకుదోచును. మనమధోగతిలో నుండుటనుబట్టి భారతభూమియంతయుఅదేగతిలో నున్నట్లుమనముతలపోయుచున్నాము. నిజమరయగా అట్టిస్థితిలేదు. పైసంగతులన్నియు మరువనియెడల మనము స్వతంత్రులమయినయెడల భారతభూమియు స్వతంత్రయగును. ఈభావమే స్వరాజ్యశబ్దమునకు నిర్వచనమును స్థాపించుచున్నది. మనలను మనము పరిపాలించుకొనుయోగ్యతకలిగినప్పుడుమనకు స్వరాజ్యము తప్పకవచ్చినదే.

కాబట్టి అవి మనకు నిజముగా కరతలామలకము. ఈస్వరాజ్య
ము కలపోలినదని యెరుకొని ఊరక కూర్చొనుట పొసగదు.
నేను చెప్పినట్టిరూపముగల స్వరాజ్యమును ఒక్కపర్యాయము
మనముసంపాదించినయెడలఅందరును దానినిసంపాదించునట్లు
మనము ఎల్లప్పుడును ప్రోత్సహింపగలము. దాని స్వభావమే
యిట్టిది. అయిన ఆస్వరాజ్యమును ఒక్కొక్కడును ఆత్మాను
భవముచేత సంపాదింపవలసియున్నాడు. నీటమునిగి పోనుండు
వాడు అట్టివడినే మరియొకనిని ఎప్పుడును తరింపజేయ లేడు.
మనము దాసులుగా నున్నంతకాలము ఇతరుల దాస్యమును
పోనాడుట కాలోచించుట వట్టిదంభము. ఈకారణముల నాలో
చించినయెడల మనము ఇంగ్లీషువారిని వెడలగొట్టు నాదర్శము
పెట్టుకొనుట అవసరమే కాదు.ఇంగ్లీషువారుభారతీయులగుదు
రేని వారికిని ఇంపుతావుగలదు. వారినాగరకము నుంచుకొని
వారిక్కడ నుండదలంతు రేనివారి కిక్కడ తావు లేదు. అట్టిపరి
స్థితులను సృష్టించుశక్తి మనలో నున్నది.

చదువరి: ఇంగ్లీషువారు భారతీయు లెన్నటికిని కాజాలరు.

సంపా: అట్లనరాదు. ఇంగ్లీషువారిలో మానుషత్వము లేదన
వచ్చునా? వారు తమరీతిని మానుదురా లేదా యనుట ప్రస్తుత
మున కవసరముకాదు. మన యిల్లు మనము చక్కగాపెట్టు
కొనినయెడల అందులో నివసింపగలవారే నివసింతురు.తక్కం

కలహము తమకు తామే విడిపోయెను. ఇట్టిది మన యనుభవములో జరుగుచునే యున్నది.

చదువరి: చరిత్రలో ఇట్టి దెక్కడను జరుగలేదు.

సంపా: చరిత్రలో జరుగనిది జరుగనే జరుగదనుట మానవుని గౌరవమును సంశయించుటయగును. మనకు సకారణముగ తోచుదానిని ప్రయత్నించుట మన ధర్మము. అన్ని దేశముల పరిస్థితులును ఒక్కటే కావు. భారతభూమి స్థితి చిత్రముగా ప్రత్యేకము. దాని శక్తి అనంతము. కాబట్టి యితర దేశచరిత్రలతో ఈ భూమిని పోల్చనక్కరలేదు. ఇతర నాగరకములు నశించినవి గాని భారత నాగరకము కాలుకన్ని నిలచినదను సంగతి యిది వరలోనే చెప్పియున్నాను.

చదువరి: ఇది నాకర్థముకాలేదు. ముష్టిబలముచేత ఇంగ్లీషువారిని వెడలగొట్టవలెననుట నిర్వివాదాంశముగా నున్నది. వారు దేశములో నున్నంతకాలము మనకు శాంతి కలుగదు. మన కవీశ్వరులలో నొక్కడు దాసులు స్వాతంత్ర్యములను గురించి కలలైన కనరాదనుచున్నాడు. ఇంగ్లీషువారిచ్చట నుండుటచేత మనము దినదినము బలహీనుల మగుచున్నాము. మన ప్రతిభయంతయు పోయినది. మన ప్రజలు చూచిన భయాక్రాంతులవలె కన్పించుచున్నారు. ఇంగ్లీషువారు దేశములో మహారోగమువలె నున్నారు. ఆ మహారోగము నన్ని యుపాయముల చేతను తొలగింపవలెను.

సంపా: మీయుద్రేకములో ఇంత సేపు మనముచేసినవిమర్శయంతయు మరచిపోయినారు. మనము ఇంగ్లీషువారిని తెచ్చుకొనినాము. మనమే నిలుపుకొనుచున్నాము. వారు ఇక్కడ ఉండుటకు ముఖ్యకారణము మనమువారినాగరకమునుఅవలంబించుటయే యనునది మీరేల మరచెదరు? వారియెడ మీకుగల ద్వేషము వారి నాగరకమునెడను మరల్చవలసియున్నది. వాదముకొరకు యుద్ధముచేసియే ఇంగ్లీషువారిని వెళ్లగొట్టవలెనని యొప్పుకొందము. అది యెట్లు జరుగవలె?

చదువరి: ఇటలీ చేసినట్లే మనము చేయవలెను. మెజినీ గారిబాల్డిలకు సాధ్యమయినది మనకు సాధ్యము కాకపోదు. వారు మహాపురుషులు కారని మీ రనఁబోరుగదా!

పదునైదవ ప్రకరణము.

ఇటలీ భారతభూములు.

సంపా: మీరు ఇటలీ సాదృశ్యము తెచ్చియుండుట మంచిదే. మెజనీ చాలగొప్పవాడు. మిక్కిలి మంచివాడు. గారిబాల్డీ గొప్ప వీరుడు. ఇరువురుపూజ్యులు. వారి జీవితము లనేకవిషయముల మనకనుసరణీయములు. అయిన ఇటలీలో నుండిన స్థితికిని భారతభూమిస్థితికిని మిక్కిలి తారతమ్యముకలదు. మొదట మెజినీ గారిబాల్డీలకు పరస్పరము కల భేదము నాలోచించుట ఆవశ్యకము. ఇటలీనిగురించి మెజీని ఏయుద్దేశము పెట్టుకొనెనో అయుద్దేశము నేటికిని కొనసాగియుండలేదు. మానవధర్మములను గురించి అతడు వ్రాసినగ్రంథములో ప్రతిమానవుడు స్వారాజ్యమును మొదట సంపాదింపవలయునని వ్రాసినాడు. ఇటలీలో ఇది యేర్పడ లేదు. గారిబాల్డీ మెజీనిపెట్టుకొనిన ఈ దృష్టిపథము పెట్టుకొనలేదు. గారిబాల్డీఆయుధము లిచ్చెను. ప్రతియిటాలియను వానిని ధరించెను. ఆస్ట్రియ యిటలీలు జ్ఞాతులైనందున వారి నాగరక మేకమయియే యుండినది. వారు కన్నుపొడచిన వీరు కన్నుపొడచుటయే అవసరమై యుండనది. గారిబాల్డీకోరినది ఆస్ట్రియాప్రభుత్వమునుండి ఇటలీ వేరుపడ

వలయుననిమాత్రమే. మంత్రికేవరు చేసినకుతంత్రములు ఇటలీకి సంబంధించిన ఆనాటిచరిత్రకు కళంకాపాదకములు. దాని వలన ఫల మేమియైనది. ఇటాలియనులు ఇటలీని పరిపాలించుటను జేసి ఇటలీప్రజ సుఖమందుచున్న దందు రేని మీరంధకారమున బడి చూడలేకున్నారు గాని మరేమియును గాదు. మెజీని ఇటలీ స్వాతంత్ర్యము కాలేదని స్పష్టముగా చూపినాడు. ఆపదమునకు విక్టరు ఇమాన్యుల్ ఒకయర్థము చెప్పినాడు. మెజీనీ మరియొకయర్థమును చెప్పినాడు. ఇమాన్యుల్, కేవర్—గారిబాల్డీతో సహా—ఇటలీయనిన ఇటలీరాజును అతని సహకారులు ననిమాత్ర మాలోచించిరి. మెజీని ఇటలీయన తద్దేశప్రజ, రైతాంగమంతయు నని యాలోచించెను. ఇమాన్యుల్ నిజముగా ఆ ఇటలీకి సేవకుడు. మెజీని మానసము ననుండిన ఇటలీ ఇంకను దాస్యమును బాయలేదు. జాతియంతటికిని సంబంధించినయుద్ధము పొసగినప్పుడు ఇరువురురాజుల లాభాలాభములుమాత్రమే యాలోచింపబడెను. ప్రజను చదరంగములోని కాయలవలె ఈ రాజు లుపయోగించుకొనిరి. ఇటలీలో పనివార లీనాటికిగూడ అసౌఖ్యమునబడి కొట్టుకొనుచున్నారు. కాబట్టి వారు హత్యలుకావించుట, తిరుగుబాటులు చేయుట జరుగుచున్నది. ఎప్పుడును వారు విఘ్నముకలిగింతురను భయము కలదు. ఆస్ట్రియాసైన్యములు ఇటలీ వెడలిపోయిన

తరువాత ఇటలీవారి కేమి యంతగొప్పలాభము కలిగినది? ఏమి యు లేదు. వట్టినామకార్థము లాభముమాత్రము సమకూరినది. ఏసంస్కారములకొరకు యుద్ధము జరిగెనో ఆసంస్కారము లింకను ఇటలీలో అంగీకృతముకాలేదు. ప్రజల సాధారణస్థితి నాడెట్లు యుండెనో నేడును అట్లు లేయున్నది. అట్టిస్థితి ఇక్కడ కలుగజేయవలెననిమీకు నిష్టముకాదుకదా! భారతభూమి లోని కోట్లకొలది ప్రజలు సుఖమందవలయునేకాని మీచేతికి రాజ్యభారము దొరకిన చాలునని మీరాలోచింపరు కదా! నిజ మిదియే యగునేని మనమొక్కవిషయ మాలోచింపవలెను. కోట్లప్రజలకు స్వరాజ్య మబ్బుటెట్లు? అనేకసంస్థానాధీశ్వరుల పాలనలో నుండుప్రజలు మిక్కిలి బాధలుపడుచున్నారని మీరంగీకరింపవలసియుందురు. కరుణ కొంచెముకూడచూపక ఆయధిపతులు ప్రజలకు కష్టములు కలిగించుచుందురు. వారి నిరంకుశత్వము బ్రిటిషువారినిరంకుశత్వమునకంటె ప్రబలతరము. ఆనిరంకుశత్వము మీరు కావలయునందురేని మనమెప్పుడును అభిప్రాయములలో నేకీభవింపజాలము. ఇంగ్లీషువారు వెడలి పోయిన స్వదేశసంస్థానాధీశ్వరులకాలిక్రిందపడి ప్రజ నలిగిపో వచ్చును అను ఏర్పాటునకు నే నెప్పుడును సమ్మతింపజాలను. అది నాదేశభక్తి కాజాలదు. దేశాభిమానమునకు నామతమున నర్థము దేశప్రజలక్షేమము, సౌఖ్యము. ఇంగ్లీషువారిమూలక

పముగా అది నమునేని నేను వారికి వలవంచువాడ. ఏ యింగ్లీషు వాడైనను భారతభూమిలోని నిరంకుశత్వమును పోగొట్టి స్వాతంత్ర్యము సంపాదించుటకు తనజీవితమును ధారపోయునెడల అతనిని భారతపుత్రునివలెనే నే ప్రేమింతును.

ఇంతేకాదు. ఇటలీవలెపోరాడుట భారతభూమి ఆయుధములను ధరించినంగాని పొసగదు. మీరీవిషయము నాలోచించినట్లు కానరాదు. ఇంగ్లీషువారు చక్కగా సాయుధులైయున్నారు: దానికి నేజంకుటలేదు. కాని ఒక్కటిమాత్రము స్పష్టము. సాయుధులైనవారితో పెనగవలసినచో భారతపుత్రులలో వేలకొలది ఆయుధములు ధరింపవలసియుండును. అది జరుగవలయుననిన ఎన్నియేండ్లు పట్టునో ఆలోచించునది. అదిగాక భారతభూమిని విపులముగా సాయుధమొనర్చుటకు నర్థము మనము యూరోపునాగరకమున లయమగుట యగుచున్నది. అప్పుడు మనస్థితియు యూరోపుస్థితివలెనే కరుణాకరము కాకపోదు. ఈపరిణామమే మనము కోరుదమేని ఆనాగరకమున చక్కగా శిక్షితులైనవారు మనదేశములోనుండుట అత్యావశ్యకమగుచున్నది. అప్పుడు కొన్నికొన్నిహక్కులకై మనము పోరాడవచ్చును. కొన్ని సంపాదింపవచ్చును. కాలముగడుపవచ్చును. నిజమేమనగా భారతజాతి సాయుధముకాదు, అట్లు కాకుండుటయే మేలు.

చదువరి: మీరు విపరీతాలోచనలు చేయుచున్నారు. అందరు సాయుధులు కానక్కరలేదు. మొదట కొందరిని ఇంగ్లీషువారినిచంపిభయోత్పాతముకలిగించినయెడల తరువాత కొందరు సాయుధులైనను పనులను నెరవేర్పగలరు. రెండురెండున్నరలక్షల జనమును మనము నష్టపడవలసియుందుము. ఆ మాత్రము త్యాగముచేయగలమేని మనదేశము మనపాలగును. చిల్లరయుద్ధముతో ఇంగ్లీషువారిని జయించవలెను.

సంపా: ఈపవిత్రభూమిని మీరపవిత్రముచేయుట మీతలంపు. హత్యలుచేసి భారతభూమిని సంరక్షించుచింత తోచినప్పుడే మీకు దేహము వడకుటలేదా? మనకు కర్తవ్యము మనలను మనమే చంపుకొనవలెను. ఇతరులను చంపనాలోచించుట పౌరుషహీనత్వము. ఇతరులను జంపి మీరెవరికి స్వాతంత్ర్యము సంపాదింప తలచుచున్నారు. భారతజాతిలో కోటానుకోట్లు దానిం గోరరు. నేటి నవనాగరకము దిగద్రావి గ్రున త్రేపువా రిట్టియాలోచనలు చేయుదురు. హత్యచేసి పైకెక్కినవాడు జాతిని సుఖపెట్టుననుమాట కల్ల. ధింగ్రాకార్యమువలనను అట్టి యితరకార్యములవలనను హైందవభూమి లాభము పొందిన దనుకొనువారు మిక్కిలి పొరబడుచున్నారు. ధింగ్రా దేశాభిమానియే కాని అతని యభిమానము అంధప్రాయము. అతడు తప్పుదారిబడి దేహమును ధారపోసినాడు. తత్ఫలము తుదకు చెరుపేకాని వేరుకాదు.

చమూపతి: అయిన ఇంగ్లీషువారు ఈ హత్యలచేత భయపడినారనియు అందుచేతనే మార్లీసంస్కరణములు ప్రసాదితములైనవనియు మీరంగీకరింతురా?

సంపా: ఇంగ్లీషువారు ధైర్యస్థైర్యములజాతి. తుపాకీమందు ఆజాతిని సులభముగా ఆలోచనకు దించునని నానమ్మకము. మార్లీప్రభువు భయపడి సంస్కారము చేసినాడనుట నిజముకావచ్చును. అయిన భయముచే నిచ్చినది భయము వీడినతోడనే మరల పుచ్చుకొనవచ్చును.

పదునాఱవ ప్రకరణము.

పశుబలము.

చదువరి: ఇది నవీనసిద్ధాంతము. భయమునకై యిచ్చినది మరల పుచ్చుకొందురా? ఒకపర్యాయమిచ్చినది ఎవరైనను మరల్చుకొందురా.

సంపా: ఆటవవలదు. సిపాయిల తిరుగుబాటుకు తరువాత ౧౮౫౮సంవత్సరపు వరదానపత్రము ప్రకటితమయ్యెను. శాంతి నెలకొల్పుటకుగా నీపని జరిగినది. శాంతి నెలకొని ప్రజలు చక్కబడినపిదప ఆవరదానపత్రము తగ్గినది. నేను దొంగననుకొందము. భయము కలదని తోచినప్పుడు దొంగిలించుట మానివేయుదును. ఆభయము తొలగగా మరల నాపనిని ప్రారంభింతును. ఇది లోకస్వభావము. పశుబలము వినియోగించినచో ఏపనినైనను చేయించవచ్చునని తలంపుగొనినాము. కాబట్టి పశుబలము నుపయోగించుచున్నాము.

చదువరి: మీమాటలకు మీరే విఘాతము కలిగించుకొనుచున్నారే. ఇంగ్లీషువారు తమ దేశములో సంపాదించినది పశుబలముచేతనే సంపాదించినారు. వారు గడించినది వ్యక్తము

మీరు వాదించుట నాకు జ్ఞాపకమున్నది కాని అవి నావాదమును విఘాతము చేయజాలవు. వారికి వ్యర్థపదార్థములపై ఆశయుండినది. వానిని గడించినారు. వారి ఆశాపూర్తియైనదనుటయే నాకవసరము. వారేమి యుపాయములు వినియోగించిన నేమిపోయె? మన యాదర్శము ఉత్తమము? దానిని చేయుటకు ఏయుపాయములైనను మనము ఉపయోగింపవచ్చును పశుబలముకూడ వినియోగార్హమే. ఇంటిలో దొంగ దూరినప్పుడు వానిని తరుముటకు సాధనము లాలోచించుచు కూర్చొను వెర్రివాడుందురా? ఎట్లైనను అతనిని వెడలగొట్టు కార్యము. మనవులు పెట్టుకొనుటచేత మనకేమియు ఫలము కలుగలేదనియు కలుగబోదనియు మీరంగీకరించుట స్పష్టము. అప్పుడు పశుబల ముపయోగించి యేల ఫలముండరాదు? సంపాదించినది నిలుపుకొనుటకుకూడ అవసరమైనంతవరకు ఆ సాధనమునే ప్రయోగార్హముగా పెట్టుకొందము. శిశువు అగ్నిలో కాలుపెట్టుచుండ నిరంతరము నిషేధించుట సరియందురా కాదా? ఎట్లైనను మనయుద్దేశముల సాధించుట యుత్తమము.

సంపా: మీవాదము పైచూపునకు బాగుగదోచును. ఇది యనేకుల నిదివరలో మోసపుచ్చినది. అయిన నేనితరులకంటె బాగుగా నెరుంగుదును. కావున మీమోహమును తీర్చుటకు ప్రయత్నించెదను. ఇంగ్లీషువారు పశుబలముమూలకముగా నుద్దే

శములదీర్చికొనిరి కాన మనమును అట్లు చేయుట న్యాయ మనువాదమును మొదట నాలోచింతము. వారు పశుబల ప్రయోగముచేసి యుండుట నిశ్చయము. మనమును అట్టి సాధనమునే వినియోగింపనగుననుటయు సంభావ్యమే. కాని మనకు అట్టి సాధనముచే అట్టిఫలమే సిద్ధించుననుట। స్పష్టము. అట్టి ఫలము మనకు వలదని మీరంగీకరింతురుగదా! సాధనమునకు ఫలమునకు సంబంధములేదను మీయభిప్రాయము తప్పు. ఆతప్పుచేయుటచే దేశాభిమానులైన మహాపురుషులుకూడ మహానర్థములను లోకమున కల్పించినారు. విషబీజము నాటి సుందరమగు గులాబిపుష్పమును సృష్టింతుమని మీరు ప్రారంభించినారు. సముద్రముదాటుటకు నావయే యవసరము. బండిమీద ప్రయాణానైతిమా మనతోకూడ బండియు మునుగును. 'యథా రాజా తథా ప్రజాః' అనునది మననముచేయదగినది. దీనియర్థమెరుంగకమానవులు పలుపాట్లుపడినారు. సాధనముబీజము, ఆదర్శము వృక్షము. బీజమునకు వృక్షమునకుగల అవార్యసంబంధమే సాధనమునకు ఆదర్శమునకు గలదు. దైవభక్తివలన కలుగుఫలము శనిభక్తివలన నెప్పుడును కలుగదు. కాబట్టి ఎవ్వరైనను నేను దైవమునారాధింపవలెను. కాని శనినారాధించి దైవము నారాధించినట్లనుకొందును' అందురేని అది అజ్ఞానమని యందరును పరిహసింతురు. పవిత్రనమునకాఫలము

తెప్పను. ఇంగ్లీషువారు పశుబలము ప్రయోగించి ౧౮౩౨లో ఎక్కువ నిర్వచనాధికారము సంపాదించిరి. పశుబలప్రయోగముచే వారిధర్మము వారి కెక్కువయర్థమయ్యెనా? నిర్వచనాధికారముకోరిరి. పశుబలప్రయోగము చేసిరి. అధికారమలవడెను. అయిన నిశ్చయస్వాతంత్ర్యము ధర్మనిర్వహణమువలన కానిరాదు: ఆ స్వాతంత్ర్యమింకను వారికి కలుగలేదు. కాబట్టి ఇంగ్లండున ఇప్పుడొకనాటక మేర్పడియున్నది. ప్రతివాడును స్వాతంత్ర్యములు కోరువాడే. తనధర్మము నెఱింగినవాడు మాత్రమరుదు. ప్రతివాడు స్వాతంత్ర్యములు కోరువాడైనప్పుడెవ్వడు ఎవ్వరికి ఇయ్యగలడు? ఇంగ్లీషువారుధర్మము నిర్వహించుటే లేదని కాదు నామతము. వారుకోరు స్వాతంత్ర్యముల కనుగుణమగు ధర్మనిర్వహణముమాత్రము మృగ్యము. అది లేకపోవుటచేత, అర్హతగడింపకపోవుటచేత, వారుగడించినస్వాతంత్ర్యములు వారికి మోయరానిభారమగుచున్నవి. అనగా వారు వినియోగించినసాధనమునకుపూర్ణముగా ననుగుణమగుఫలము వారికి కలిగినది. ఫలమున కనుగుణమగుసాధనము వారు వినియోగించిరి. మీగడియారము నేనపహరింపవలెననిన యెడల నేనుమీతోపోరవలెను, కొనవలెననిన మీకు ద్రవ్యమీయవలెను, దానమడుగవలెనన్న మిముప్రార్థింపవలెను. ఈయుపాయములలో నేనుపయోగించునుపాయము ననుసరించి ఆగడి

యీరము దొంగసొత్తో, స్వార్జితమో, దానమో అగుచున్నది. ఈరీతిని మూడువిధములగుసాధనములచేతమూడువిధములగు ఫలము లేర్పడుచున్నవి. సాధనములతో ఫలమునకుసంబంధము లేదని ఇంకను వాదింతురా?

దొంగను పారద్రోలవలెనని మీరిచ్చినయుదాహరణమును విమర్శింతము. ఏసాధనమైనను దొంగను పారద్రోలునని నేను నమ్మను. మాతండ్రి దొంగలించుటకు వచ్చెను. అతనిని తప్పించుకొనుట కొక యుపాయము వెదకుదును. నాకు తెలిసినవాడు ఆతనికి దూరె ననుకొందము. ఇంకొకవిధమగు సాధనమును వినియోగించుకొందును. ఎవ్వడో సంబంధము లేనివాడు దొంగ. అప్పటియుపాయమే వేరు. తెల్లవాడు దొంగయైన నల్లవానియెడల నుపయోగించు సాధనముకాక ఇంకొక సాధనము నుపయోగించెదరు కాబోలు మీరు. బల హీనుడు, ఒక్కకట్టె దొంగయైనయెడల సమబలునియెడల నుపయోగించు నుపాయమును వినియోగింపబోము. ఆపాదమస్తకము ఆయుధధారి యగునేని కిక్కుమిక్కుమనక యూరకుందుము. ఈవిధముగా దొంగయొక్క స్వభావము ననుసరించి అతని నివారించుమార్గములు మారుచుండును. ఇంతేకాదు. దొంగ నాతండ్రియైనను, ఆపాదమస్తకము ఆయుధములు ధరించిన ఆమోటరియైనను, నేను నిద్రించుట నభినయింతును లే, నాతండ్రికూడ సాయుధుడుగా రావచ్చును. నాకు ఆరుచ్యత

హేత్వస్థ్యము ఫలమును నొక్కటే. ఇదువఱకును నాయాస్త్రి కొని పొరపాటే. అయిన తంత్రవిషయమగు నేని కరుణారసము నేన్ను కలుగును. మఱియొక్కచోట అగ్రహముకలిగి వైరముత్పన్నమౌ గును. ఇట్టిది చిత్రస్థితి. దీనినంతయు నాలోచింతుమేని సాధన ము లోపించే యుపయోగింప నగునను విషయమున మనమే భావిం పకపోవచ్చును. ఈయన్నిసందర్భములలో చేయవలసినది నాకు స్పష్టము. కాని నా సాధనము మీకుభయమును కలిగించవచ్చు ను. కాబట్టి మీకు తెలుపుటకు వెనుదీయుచున్నాను. మీరూ హించుకొందురుగాక. అట్టియూహకు తట్టునేని వేరువేరుసందర్భ ములలో వేరువేరుపాయముల చేసికొందురుగాక. ఒక్కటి మీకు విదితము, ఏయుపాయమైన నేమి యని మాత్రము ఉపయోగిం చుటకు రాదు. ప్రతిసందర్భమునకు అనుగుణోపాయమును మీ రాలోచింపవలసియుందురు. కాబట్టి ఏయుపాయము చేత నైన వెడలగొట్టుట మీధర్మము కాదనుట స్పష్టము.

ఇంకను నాలోచింతము. అపహారకుస్తకాయుధమును మీసొ త్తు దొంగిలించినాడు. మీ చిత్తమావిషయమున మగ్నమయి నది. మీ యాగ్రహ మనంతముగా పెరిగినది. మీ స్వలాభము నకు గాక మీ ఇరుగుపొరుగువారి లాభమునకై వానిని మీరు దండింపవలెనందురు. సాయుధులకొందరను చేర్చితిరి. పైబడి వానిఇల్లు స్వాధీనముచేసికొన నెంచితిరి. అది యంతని

కెరుకయైనది. అతడు పారిపోయినాడు. కాని అతని మనస్సున కూడ ఉద్రేకము కల్గినది. తనసోదరచోరబృందమును చేర్చినాడు. పట్టపగటివేళ మిము దోచుకొందుమనని అట్టహాసముగ సందేశము పంపినాడు. మీరు బలవంతులు. మీకు భయము లేదు. అతని నెదుర్కొనుసాహసము కలదు. ఈలోపుగ నా దొంగ మీ పరిసరవర్తుల పీడించును. వారు మీకడ మొఱ పెట్టుదురు ? మీరేమందురు. అయ్యలారా అంతయు మీకొరకే చేయుచున్నాను. అతడు నాద్రవ్యము నపహరించినాడని నాకాగ్రహములేదు. అని ప్రత్యుత్తరమిత్తురు. మీ పరిసరవర్తులందురుగదా ‘ వీడెప్పుడు మమ్ము హింసింపడు, మీరు వీనితో పోరాటము పెట్టికొనిన పిదపనే యీగతి తటస్థించినది.’ ముందుకుపోయిన గోయి వెనుకకు తరలిన చెరువు అయినది. మీపరిసరవర్తులగు బీదలయెడ మీ కెక్కువకరుణ. వారు చెప్పునది నిజము. మీకు తెలుసును. మీరేమి చేయవలెను ? దొంగను వదలితిరా మీకు నవమానము. కాబట్టి బీదల మీ రేమందురు ? “ అయ్యలారా రండు. నాద్రవ్యముమీది. నేను మీకు ఆయుధముల నిచ్చెద. ఆదొంగను మీరు పట్టి తన్నుడు వదలవలదు” ఈరీతిగా పోరాటము పెరుగును. దొంగలు సంఖ్యాతీతులగుదురు. మీపరిసరజనము అనవసరముగా అనానుకూలముల బడుదురు. ఈకారణముచేత దొంగమీద కసిదీర్చు

కొననెంచి మీశాంతికే మీరు భంగము తెచ్చికొనినారు. ఎప్పుడు దోపిడికలుగునో ఎప్పుడు శత్రువు పైబడునో అనుభయము మీకు శాశ్వతమై పోయినది. మీధైర్యము అధైర్యముగా పరిణమించినది. నావాదమంతయు జాగ్రత్తగా ఆలోచింపుడు. నేవిపరీత మేమియు వర్ణింపలేదనుట మీకె గోచరమగును. ఇది మొదటిసాధనము సంగతి. రెండవసాధనము నాలోచింతము. ఆపాదమస్తకాయుధుడైనదొంగ జ్ఞానవిహీనుడగుసోదరు డని గుర్తెరుగుదు రేని సరియైన తరుణమున ఆతనికి సంగతులు స్పష్టపరుప నిశ్చయింతురు. ఎట్లైనను సోదరమానవుడుకదా యని జాలిగొందురు. ఎందు కతడు దొంగలింపబయలుదేరినాడో ఊహింపజొత్తురు. అంతట సమయమయినప్పు డీతనిదొంగగుణము నశింపజేతును గాక యని తీర్మానించుకొందురు. మీ రీయాలోచనలలోనుండగనే అతడు మరల దొంగలించుటకు వచ్చును. మీరు వానిని కోపపడరు. వానిపై జాలిగొందురు. ఈదొంగగుణము వానికి నంటిన రోగమని మీ రెన్నుదురు నాటినుండి మీరు తలుపులు, కిటికీలు తెరచిపెట్టుదురు. మీరు పరుండుతావు మార్చి మీసొత్తు అతనికి సులభముగా దొరకునట్లుగా పెట్టియుంతురు. మరల దొంగ వచ్చినాడు. పరిస్థితి యంతయు క్రొత్త యయినది. అతనికి విభ్రమము తోచినది. అయిన మీవస్తువులమాత్ర మెత్తుకొనిపోయినాడు. అతనిమానస మూరకయుండునా?

ఆందోళన కాకర మగును. గ్రామములో మిమ్మునుగురించి అతడు విచారణ ప్రారంభము చేయును. అందరును విశాలము ఉదారము నగుమీహృదయమును ప్రశంసింతురు. అతనికి ఖేదము తప్పదు. మీపాదముల బడినాడు. మీ మన్ననను వేడినాడు, మీవస్తువుల మీకిడినాడు, దొంగగుణమును మానినాడు, మీసేవకు డైనాడు, గౌరవాస్పదవృత్తి నందినాడు. ఇది రెండవరీతి సాధనము. సాధనగుణమునుబట్టి ఫలగుణమును మారిన దనుట విదితము. ఇందువలన అందరు దొంగ లిట్లే నడుతు రనిగాని అందరకును మీకుగల కరుణార్ద్రహృదయమే కలుగు ననిగాని చెప్పరా లేదు. మంచి మార్గ మవలంబించిన మంచిఫలము సాధ్య మనుట కిది తార్కాణముగ చెప్పితిని. శాంతిమార్గ మనేకసందర్భముల ఫలప్రదము. ఫలప్రదము కానప్పుడు నష్టదాయకము కాదు. పశుబలప్రయోగమున నష్ట మున్నదికాని ఇందు లేదు.

అర్జీలు పెట్టుకొనుఆచార మాలోచింతము. బలాధారము లేనిఅర్జీ వ్యర్థ మనుట నిత్యము. అయినను కీర్తిశేషులైన రనడే గారు అర్జీలవలన ప్రజలవిజ్ఞాన మభివృద్ధి యగుఫల మున్నది కావున అవి ఆరీతిని ఉపయోగకరము లనిచెప్పిరి. వానివలన ప్రజలమతముయొక్కనిజస్థితి తెలియగలదు. పరిపాలకులకు హుషారు కాగలదు. ఇట్లాలోచించినయెడల ఒకవేళ అర్జీలు వ్యర్థములు కావేమో. సమానుడు పెట్టుకొను అర్జీమర్యా

దను సూచించును. దాసుడు పెట్టుకొనుఅర్జీ వానిదాస్యమును ప్రకటించును. బల మాధారముగాగల అర్జీ సమానునిది. అతడు అర్జీమూలకముగా స్వాతంత్ర్యముకోరుట అతని హృదయగౌరవమునకు నిదర్శనము. అర్జీల కాధారము రెండు విధము లగుబలము కావచ్చును. “ఇది ఈయవేని మేము మీకు చెరపుచేయుదుము” అనుట యొకరీతి. పశుబలము దీని కాధారము. దీని దుష్టఫలము లిదివరకే వర్ణితములు. రెండవవిధ మిట్లు పేర్కొననగును. “మాయుద్దేశముల నెరవేర్చ రేని ఇక మీ కర్జీలు మేముపెట్టము. మేము పరిపాలితులముగా నున్నంతకాలము మీరు మమ్ము పరిపాలించగలరు. ఇకముందు మేము మీతో సంబంధము పెట్టుకొనము” ఇందు కాధార మగుబలము ప్రేమబల మనవచ్చును. ఆత్మబల మనవచ్చును. లేదా సామాన్యముగా వ్యవహరింపబడురీతిని సాత్త్వికనిరోధ మనవచ్చును. ఇది అంత సరియైనపదము కాదు. ఈబలముమాత్రము నశ్వరము. దీనిని పూర్ణముగా ప్రయోగింపగలవాడు తనస్థితి కెప్పుడును వగవడు. ప్రాతలోకోక్తి యొక్కటికలదు. దానియర్థ మిది. ఒక్కనహి ముప్పదిమూడు రోగముల కుదుర్చును. ఈప్రేమ బలమునకు అథవా ఆత్మబలమునకు ఎదురుపడినప్పుడు పశుబలము వ్యర్థము. మీరు కడపటనిచ్చిన యుదాహరణమును విమర్శింతము. అదెద్ది? శిశువు అగ్నిలో కాలిడుట మాన్పుటెట్లు అనునది. మీరు

చెప్పినయుపాయము నిజముగా పనికిరాదు. శిశువును మీరేమిచేయుచున్నారో ఆలోచింపుడు. మిమ్మును కాదని తన పశుబలముచే శిశువు అగ్ని నురకగలదేని మీ యుపాయమాపదను వారింపదు. అప్పుడు మీకు రెండుపాయములు నిలువయుండును. అది యగ్ని నురుకకుండుటకు మీరు దానిని చంపనైన చంపవలెను లేదా చూచుట కోర్వలేక మీరైనను చావవలెను. దానిని మీరుచంపరు. మీహృదయము అంత కరుణార్ద్రము కాదేని శిశువునకు ముందుగా మీ రగ్ని నురికి నశింపరు. మీ రేమిచేయుదురు? చేతగాని శిశువు నగ్ని నురుకనిత్తురు. ఇట్లు మీరు పశుబలము నుపయోగించుట మానివైతురు. మీచేతనైనచో శిశువును అగ్ని నురకకుండ నిర్బంధింతురే అదియు పశుబలమే. అయిన క్రింది దర్జాకు చేరినది, అని మీ రందురేమో, అదికాదు దాని స్వభావము వేరు. మన మింకను నరయవలసియున్నాము.

ఆరీతిని మీరు శిశువును నిర్బంధించుటలో మీరు దాని లాభమునుమాత్ర మాలోచించుచున్నారు. దాని మేలునకై మాత్రమే మీరు అధికారము చేయుచున్నారు. ఇది మరువరాదు. మీ నిదర్శనము ఇంగ్లీషువారికి సమన్వయము కాజాలదు. ఇంగ్లీషువారిపై పశుబలప్రయోగము చేయునప్పుడు మీ రాలోచించునది మీ మేలుమాత్రమే, మీజాతియొక్క లాభముమాత్రమే. ఇందులో దయకుగాని ప్రేమకుగాని

తావు లేదు. ఇంగ్లీషువారు చేయుపని చెడ్డది. అందువలన అది అగ్ని. ఇంగ్లీషువారు శిశుపదమున నున్నారు, నే నాశిశువును సంరక్షింతును, ఆ సంరక్షణకై నాదేహ మర్పింతును అందు రేని అది ఇంగ్లీషువారియెడలమాత్ర మనుట గాదు. తప్పు చేయు ప్రతివారియెడల అట్లే చేయుదు ననుట యగును. అంత దయార్ద్రహృదయము మీదియగు నేని మీకు శుభం బగుగాక.

పదునేడవ ప్రకరణము.

సాత్త్విక నిరోధము.

చదువరి: మీరు ఆత్మబలము, ప్రేమబల మంటిరే అది యెచ్చటనైనను విజయమందినట్లు చారిత్రకనిదర్శనము లున్నవా? ఏజాతియు ఆత్మబలముచే అభివృద్ధియైన ట్లెచ్చటను చెప్పబడలేదు. పశుబలశిక్ష లేక దుర్మార్గులు దుర్మార్గమును వదల రని నా కింకను నమ్మకమే.

సంపా: కవి తులసీదా సిట్లనుచున్నాడు. "దేహమునకు అహంకారము బీజ మయినట్లు మతమునకు దయా ప్రేమలు బీజములు. కాబట్టి మన మెప్పుడును దయను వీడరాదు." ఇది స్వశాస్త్రీయము. రెంటను రెండు నాలుగను టెంతసంపూర్ణ సత్యమో ఇదియు నంత సంపూర్ణ సత్య మని నానమ్మిక. ప్రేమ యొక్క శక్తి ఆత్మశక్తి, సత్యశక్తితో నైక్యము. నిమేషనిమేషము దాని ప్రభావము మనకు దృష్టము. ఆశక్తియే లేనిచో ఈప్రపంచమే యుండదు. మీరు చారిత్రకనిదర్శనము కావలయు ననుచున్నారు. కాబట్టి చరిత్రయనగా నేమో యెరుంగుట యవసరము. గుజరాతిభాషలో చరిత్రకుగల పర్యాయపదము "ఇతిహాస్" "ఇది ఇట్లునడచినది". చరిత్రకు అర్థము ఇదే యగునేని జరిగినసంగతు లెన్నియో చెప్పవచ్చును.

కాని చరిత్ర మనగా రాజులయు సార్వభౌములయు కార్యా కార్యములే యనుచో అచ్చట ఆత్మశక్తి సాత్త్వికనిరోధముల కార్యపరత్వ మేమూలను కానరాదు. గాజులగనిలో వజ్రము వెదుకరాదు. చరిత్ర యనగా నేడు యుద్ధములచరిత్ర. అందు చేతనే ఇంగ్లీషులో నొకజనోక్తి యేర్పడినది. చరిత్రలేని దేశ ము, అనగా యుద్ధములులేని దేశ మని యర్థము, క్షేమదేశ ము! రాజు లెట్లాడినది వా రొండొరులతో నెట్లు వైరపడి నది, వా రొక్కరినొక్కరు ఎట్లు హాతముచేసికొనినది చరిత్ర లో చక్కగా వర్ణితమయి యున్నది. నిజముగా ఇదియే లోక ములో జరుగుపని యైనయెడల లోక మెన్నడో అంతమై యుం డును. ప్రపంచకథ యుద్ధములతో ప్రారంభ మగునేని నేటికి ఒక్కమనుష్యుడైనను సజీవియై యుండడు. ఎవ్వరిమీద యుద్ధములు జరిగినవో వారు విశేషముగా నశింపు నందినారు, ఉదాహరణార్థము ఆస్ట్రేలియా ఆదిమనివాసుల నాలోచిం పుడు. బయటివారి దాడికి వా రందరు రూపులేక చనినారు. ఒక్కటి జ్ఞాపక ముంచుకొనుడు. ఆ యాదిమనివాసులు ఆత్మ శక్తిని వినియోగించలేదు. తద్వినియోగము చేయని ఆస్ట్రేలి యనులుకూడ ఒక్కనాటికి ఆగతియే పట్టవలసి యుందురు. నీట నీదువానికి నీటిగండము తప్ప దనునట్లు కత్తిపట్టువానికి కత్తిగండము తప్పదు.

లోకములో ఇంకను ఇందరుప్రజలు బ్రతికియున్నారుగదా! ఇది యేమిసూచించుచున్నది? లోకనిర్మాణము కత్తులమీద పశుబలముమీద ఆధారపడి యుండలేదు. ప్రేమ సత్యముల మీద ఆధారపడి యున్నది. అందుచేత ఆత్మశక్తియొక్క ఫలమునకు వేరువాదమే అక్కరలేదు. ఇన్నియుద్ధములు జరిగినను లోకము నిలిచియుండుటే ఆత్మశక్తికి ప్రేమశక్తికి ప్రబల తార్కాణము. వేనవేలు కోటానుకోటులు జీవించుట ఈ శక్తి ఆధారముగానే జరుగుచున్నది. లక్షలకొలది కుటుంబములలో అహరహము జనించు చిన్నచిన్న పోట్లాటలన్నియును ఈశక్తిమూలకముగనే నిమేషనిమేషమును తీర్మానమగుచున్నవి. నూర్లకొలదిజాతులు శాంతముగా బ్రతుకుచున్నవి. చరిత్రము ఈవిషయము గమనించలేదు. గమనించజాలదు. ఈప్రేమశక్తి ఆత్మశక్తుల ప్రచారమును నాటంకపరచునట్టి సంగతులే చరిత్రనామమున బరగుచున్నవి. ఇరువురుసోదరులకు విభేదము కలిగినది. ఒక్కడు తనతప్పునెరింగి రెండవవానిదయను ప్రేరేపించుచున్నాడు, ప్రేమను ప్రేరేపించుచున్నాడు. ఇరువురకు శాంతికుదిరి కాలము గడుపుచున్నారు. దీని నెవ్వరును వ్రాసియుంచుట లేదు. కాని వీరిరువురు, వకీలు అడ్డపడుటచేతనో మరి యేకారణముననో, ముష్టియుద్ధమునకు దిగినప్పుడు తత్తుల్యమగు న్యాయవిచారణకు కడంగినప్పుడు వీరివిషయము రచ్చకెక్క

చున్నది. పత్రికలలో ప్రకటితమగుచున్నది. ఇరుగుపొరుగు వారి సంభాషణకు పాత్ర మగుచున్నది. చరిత్రలో భాగము కూడ కావచ్చును. కుటుంబములు తెగలసంగతి యెంతో జాతులసంగతియు నంతే. కుటుంబముల కొకస్వభావము జాతుల కొకస్వభావము కలుగు నని వేరుచేయుటకు కారణము కానరాదు. కాబట్టి చరిత్ర మనునది స్వభావస్థితికి కలిగిన విఘాతములకథగాని వేరుగాదు. ఆత్మశక్తి సహజస్థితి కావున చరిత్రకు నెక్కినది కాదు.

చదువరి: మీరు చెప్పునదిచూడగా సాత్త్వికనిరోధమునకు సంబంధించిన యుదాహరణములు చరిత్రమున లేవనుట స్పష్ట మగుచున్నది. కాబట్టి ఈ సాత్త్వికనిరోధ మనగా నేమో ఇంక కొంచెము విపులముగా నెరుగుట అవసరము. దయచేసి విశదీకరింపుడు.

సంపా: సాత్త్వికనిరోధ మనగా మనవలె స్వకాయమును కష్టపెట్టుటచే స్వాతంత్ర్యముల సంపాదించుటయే. ఆయుధధారణోపాయమున కిది ప్రత్యక్షవిరోధి. నామనస్సాక్షికి సమ్మతము కానిపనిని నేను చేయనిష్టపడక నిలుచుట ఆత్మబలమును వినియోగించుట. ముష్టిబలపద్ధతుల నుపయోగించి ప్రభుత్వము వారిచే నాకు సమ్మతముకాని శాసనమును రద్దు చేయింతునేని అది దేహబలోపాయ మగును. శాసనమునకు

నేను లోబడనని తెలిపి అది విధించుశిక్షల ననుభవింతునేని అది ఆత్మబలోపాయ మగును. దీనికి ఆత్మత్యాగ మవసరము.

అందరును ఇతరులను బాధపెట్టుటకన్న ఆత్మత్యాగము మహోత్తర మని యంగీకరించుచున్నారు. అంతేకాక న్యాయముకాని విషయములలో ఈశక్తి నుపయోగించినను ఉపయోగించువా డొక్కరుడే నష్టపడును. అతనితప్పమై ఇతరులను బాధపెట్టినవాడు కాడు. ఇదివరలో మానవు లెన్ని యోపనులు చేసినారు. అందులో ననేకములు తప్పనుట తరువాత బయల్పడినది. ఏమానవుడును సంపూర్ణత్వమును ఆరోపించుకొనరాదు. ఎప్పుడును తనయభిప్రాయమే సంపూర్ణముగా ననుకరణీయ మనరాదు. ఎవ్వడును ఇదితప్పు ఇది నిజ మని అచలసిద్ధాంతము చేయరాదు. తనయాలోచనకు తప్పనితోచినది తనమట్టుకు తప్పే, సందియము లేదు. అందుచేతనే తనకు దోష మని తోచినది యెవ్వడును చేయరాదు. అందువలన కలుగుఫలము ఎట్టిదైనను అనుభవింపవలసినది. ఇదియే యాత్మశక్తికి మూలాధారము.

చదువరి: అట్లైన మీరు శాసనముల నుల్లంఘింతురా? అది రాజభక్తికి మహావ్యతిరేకము. మన మెల్లకాలము న్యాయబద్ధుల మనుకీర్తి గడించినాము. మీరు అతివాదులను మించిపోవున ట్లున్నారు. వారు చెప్పున దేమి? ఎట్టిశాసనములకును మనము బద్ధులము గావలెను. అవి చెడ్డవియైనవి యగు

నేని వానికర్తలను బలాత్కారముగా నైననుసరే తరిమివేయవలెను.

సంపా: నేను అతివాదుల మించెదనో లేదో దానితో మన కవసరములేదు. ఏది ఋజుపథమో కనిపెట్టుట మన ధర్మము. తదనుగుణముగా నడుచుకొనుట మనకు కర్తవ్యము. మనము న్యాయబద్ధుల మనుట కర్థము మనము సాత్త్వికనిరోధుల మనియే. ఏదేనిశాసనము మన కరిష్టమగుచో శాసనకర్తల నెత్తులు బ్రద్దలుకొట్టువారముకాము. మనము దానిని తిరస్కరించి అందువలన కలుగుకష్టముల ననుభవింతుము. శాసనము శిష్టమైనను దుష్టమైనను లోబడవలయు ననుట క్రొత్తసిద్ధాంతము. పూర్వ మిట్టిఆలోచనయే యుండలేదు. ఏశాసనములు తమ కసమ్మతములో వానిని తిరస్కరించి ప్రజలు తత్ఫలము ననుభవింతురు. మనస్సాక్షికి విరోధ మగుశాసనములకు లోబడుట పౌరుషవ్యతిరేకము. మతమునకు విరోధము. దాస్యమునకు బునాది. ప్రభుత్వమువారు నగ్నులై తిరుగవలసిన దందు రనుకొందము. మన మట్లు కావింపవలసినదేనా. నేను సాత్త్వికవిరోధినేని వెంటనే అయ్యలారా, మీ యీశాసనము నా కన్వయింపజాల దని వారికి తెలియపరతును. మనము మనయాత్మలను మరచిపోయినాము. అడుగుల కెరగుట మన కభ్యాసమై పోయినది. కావున ఎంతటినీచశాసనము నైనను శిరసావహించుట కేవగింపకున్నారము.

ఎవ్వఁడు పౌరుషవంతుఁడో, ఎవ్వని కాయీశ్వరునిభయము దక్క వేరుభయములేదో వాఁడు ఇతరులకు జంకఁడు. మానవ నిర్మితశాసనములు వానిని బంధింపవు. ప్రభుత్వమువారుకూడ ఇట్లు బంధితులు కావలెనని మిమ్మును గోరరు. వారు మీ రిట్లుచేయునది యని యెప్పుడును చెప్పుటలేదు. ఇట్లు చేయ లేని ఈరీతిని దండింతుమందురు. శాసనములో వ్రాసినది వేద మనియు లోబడుటే ధర్మ మనియు అనుకొనునంతటి అధోగతి మనకు సంభవించినది. అన్యాయశాసనమునకు లోనగుట పౌరుషవిహీనత్వ మనుటను మానవుఁ డెరుంగునేని అన్యుఁడెంత నిరంకుశాధికారి యయినను ఇతని కాతఁడు బానిసీ డెన్నఁడును కాఁడు. స్వరాజ్యమునకయి యెరుంగదగిన పరమరహస్యం బిదియే.

అనేకు లేదిచేసిన నది స్వల్పసంఖ్యాకులను బంధింపవలె ననుట అంధపరంపరత్వము, ఆధ్యాత్మికవ్యతిరేకము. అనే కుల అపభ్రంశము కొందర వివేకము — వీనికి సంబంధించిన తార్కాణము లెన్నియైన చూపవచ్చును. ఎల్లసంస్కార ములు అనేకులను సంస్కరించుటను కొందరు ప్రారంభించు నట్టివే గదా! దోపిడిగాండ్రగుంపులో దోపిడికి కావలసిన శిక్షణ మవసర మని యభిప్రాయము. అందులో నొకశిష్టుఁడు జన్మించినాఁడు. వాఁడీసిద్ధాంతము నంగీకరింపవలెనా? అన్యా యశాసనముల నైనను అనుకరింపవలె ననుసిద్ధాంత మెంత

కాలముండునో అంతకాలము మానవులకు దాస్యము తప్పదు. సాత్త్విక నిరోధియే యీసిద్ధాంతమును త్రుంచగలదు.

పశుబలోపయోగము సాత్త్వికనిరోధ సిద్ధాంతమునకు వ్యతిరేకము. ఏలయందురా! మనము కోరునది, శత్రువు కోరనిది అతనిచేత బలాత్కారముగా చేయించువార మగుదుము. అట్టి బలాత్కారము న్యాయమైనయెడల అతడు మనయెడల అదేరీతిని ప్రవర్తించుట న్యాయమే యగును. కాబట్టి సమాధాన మెన్నడును కుదురబోదు. గుడ్డిగుర్రము గానుగ చుట్టు తిరుగుచు "ముందుకు బోవుచున్నాను" అనుకొనుపగిది మనమును కుమ్మరిసారెవలె తిరుగుచు అభివృద్ధి నందుచున్నామని పిచ్చిసంతసమును పొందవచ్చును. తమ మనస్సాక్షికి సమ్మతముకాని శాసనములను అనంగీకారార్హములని యనుకొనువారికి సాత్త్వికనిరోధ మొక్కటియే సాధనము. మరియన్నియు అరిష్టకారణములు.

చదువరి: మీరు చెప్పుదానినిబట్టి యాలోచింపగా బలహీనులకు సాత్త్వికనిరోధము పరమాయుధ మనియు బలవంతులు యుద్ధసన్నద్ధులు కావచ్చు ననియు తోచుచున్నది.

సంపా: ఇది వట్టియజ్ఞానము. సాత్త్వికనిరోధము అనునదియే ఆత్మశక్తి, అజయ్యము. అట్టియెడ దానిని బలహీనులసాధనం బనిమాత్ర మెట్లాడవచ్చును? పశుబలసిద్ధాంతమును వా

దించువారలలో ధైర్యము తక్కువ. సాత్త్వికనిరోధియందది యెక్కువ, అపారము. తన కనిష్ట మగుశాసనమును పిరికివా డెప్పుడైనను తృణీకరింపగలుగునా? అతివాదులు పశుబల పక్షపాతు లందురు. వా రేల శాసనబద్ధతను మాటిమాటికి ప్రకటించుచుందురు? వారిని నే నిందించుట కాదుకాని వా రింకొకరీతిగా మాటలాడుటకే రాదు. ఇంగ్లీషువారిని వెడల గొట్టి, తాము పరిపాలకు లైనప్పుడు, వారు నన్ను మిమ్మును వారిశాసనములకు దాసులు కావలసిన దని కోరగలరు. వారి రాజ్యాంగాభిప్రాయమున కది తగినదియే. ఫిరంగి యెదుట బెట్టి ప్రాణములుతీసినను సరియే తన కనిష్ట మైనశాసనమును తా నంగీకరించుట లే దని సాత్త్వికనిరోధి నిలువంబడగలడు.

మీ యభిప్రాయ మేమి? ఎవ్వడు ధైర్యముకలవాడు? ఫిరంగివెనుక దాగికొని ఇతరులపై గుండ్లుప్రేల్చి చంపునట్టి వాడా? హాసన్ముఖముతో ఫిరంగినుండి వెలువడుగోళము నెదుర్కొని ప్రాణము లర్పించువాడా? ఎవ్వడు వీరుడు? కాలుని పరమమిత్రునిగా భావించువాడా? ఇతరులప్రాణముల తనవశము చేసికొనువాడా? పౌరుషము ధైర్యములేనివా డెవ్వడును సాత్త్వికనిరోధి యెప్పటికిని కాజాలడు. దేహబల మెక్కువగా లేనివాడుకూడ సాత్త్వికనిరోధి కావచ్చును. ఇది నా కంగీకారమే. ఒంటరియై ఈ నిరోధము నెరపవచ్చును. కోట్లతోగూడియు నెరపవచ్చును. పురుషులు స్త్రీలు అను

విభేదము నించు లేదు. ఇందులకు సైనికశిక్షణ మక్కఱలేదు. జియుజిట్సు అక్కఱలేదు. మనమును నిగ్రహించుశక్తిమాత్ర మవసరము. అది కలిగెనేని మానవుడు పురుషసింహ మగును. అతని చూపుమాత్రన శత్రువు భయకంపితుడు కావలసి యుండును.

సాత్త్వికనిరోధము అనేకధారాయుత ఖడ్గము. ఎట్లు కావలసిన నట్లు దానిని త్రిప్పనగును. ఎవ్వ డుపయోగించునో వానిని, ఎవ్వనిపై ఉపయోగింపబడునో వానిని, ఇరువురనుగూడ నీఖడ్గము పవిత్రముచేయును. ఒక్కబిందువు రుధిరము చిందింపక యీయాయుధము మహత్తమఫలములను సంపాదించును. సాత్త్వికనిరోధులలో పోటీ వైచికొనినను పరాజయ మందువా రుండరు. సాత్త్వికనిరోధఖడ్గమునకు వరయు నక్కఱలేదు. ఇట్టి మహాయుధమును బలహీనులయాయుధ మని మీరు వర్ణించుట చిత్రముగానేయున్నది.

చదువరి: సాత్త్వికనిరోధము భారతభూమికి ప్రత్యేకసాధన మంటిరి. ఈదేశమున ఫిరంగు లెప్పుడును ఉపయోగించ లేదా?

సంపా: మీయభిప్రాయమున భారతభూమియనిన నిచ్చటి కొన్ని రాజవంశములనుటగా నున్నది. ఏకోటానుకోటి ప్రజపై ఆరాజవంశములును మనమును ఆధారపడియున్నామో ఆకోటానుకోటిప్రజయే సామాన్యమున భారతభూమి.

రాజులు ఎప్పుడును రాజసాయుధములను వినియోగింతురు. పశుబలదీక్ష వారికి పట్టినది. వారు అధికారమొనర్ప నాలోచింతురు. అయిన అధికారమును శిరసా వహించువారలకు ఫిరంగు లక్కర లేదు. ఈ రెండవ తెగవారే లోకమున మహాత్సంఖ్యాకులు. వీరు దేహబలమో ఆత్మబలమో అభివృద్ధి చేయవలసియుందురు. దేహబల మభివృద్ధిచేయుచోట పరిపాలితులు పరిపాలకులు అందరు మతిభ్రష్టు లగుదురు. ఆత్మబల మభివృద్ధి చేయుచోట రాజులయాజ్ఞలు వారికత్తి మొనలదాటి వ్యాపింపవు. ఏలయన, నిజపౌరులు అన్యాయాజ్ఞల నుల్లంఘింతురు. రైతుల నే ఖడ్గమును లోబరచుకొని యెరుగదు. ఇకముందును లోబరుచుకొన జాలదు. వారికి ఖడ్గ ముపయోగించుట తెలియదు. ఇతరు లుపయోగించిన వారికి భయము లేదు. జాతస్యమృత్యుం ధృవ మ్మని కాలుని తలగడగా నిడి ఏజాతి ప్రవర్తించునో అది యుత్తమజాతి. కాలుని గణింపని నాడు భయమునకు తావే లేదు. పశుబలముయొక్క పంచరంగులను పవిత్రముగా నెంచి మోహితులైనవారి కీవర్ణన మననార్హము. నిజ మేమన. భారతభూమిలో జీవితశాఖల నన్నింటను ప్రజ సాత్త్వికనిరోధము నవలంబించియే యున్నది. పరిపాలకులు మన కనిష్ట మగుకార్యములను చేసినప్పుడు మనము వారితో కలసి పనిచేయుటలేదు. ఇదియే సాత్త్విక నిరోధము.

చిన్న సంస్థాన మొకటి కలదు. దాని యధిపతి యొకయాజ్ఞ పాలించెను. అది ప్రజలకు సమ్మతము కాలేదు. వారు వెంటనే గ్రామమువదలి వలసపో నారంభించిరి. అధిపతి కధైర్యము పుట్టెను. ప్రజలక్షమాపణను ఆతడు ప్రార్థించెను. తనయాజ్ఞ నుపసంహరించుకొనెను. ఇది నాజ్ఞాపకమున జరిగినసంగతి. ఇట్టి ఉదాహరణములు భారతచరిత్రమున నెన్నియైనను కలవు. సాత్త్వికనిరోధము ప్రజలకు మహామంత్రముగా ఏర్పడినచోటనే నిజమగు స్వరాజ్యము సాధ్యము. వారి యేసందర్భము పొసంగినను అది పరిపాలనయే కాని స్వరాజ్యముకాదు

చదువరి: అట్లైన కాయమును పోషించి శిక్షించుటయే యనవసరమా యేమి ?

సంపా: అట్టిది నేనేమియు చెప్పలేదు. కాయము శిక్షితమైనగాని సాత్త్వికనిరోధి యగుటకు వీలులేదు. బాల్యముచే డీలుపడినదేహము నాశ్రయించుమానసము బలవంతము కాజాలదు. మనోదౌర్బల్యము ఆత్మదౌర్బల్యమునకు కారణము. కాబట్టి బాల్యవివాహముల మానుటచేతను విషయలౌల్యమును విడుటచేతను దేహపటుత్వము సంపాదింపవలసియుండుము. ఒక్కొకట్లైను ఫిరంగిగుండున కెర కమ్మని నే ప్రోత్సహింతునేని లోకమంతయు నను నవ్వుదురు.

చదువరి: మీమతానుసారము సత్యాగ్రహియగుట సుసా ధ్యము కాదు. అందు కేమార్గ మవలంబనీయమో దయచేసి చెప్పునది.

సంపా: సత్యాగ్రహి యగుట సులభమే. మిక్కిలి కష్టం బును నగు. పదునాలుగేండ్ల పసిబాలుడు సత్యాగ్రహియగుట నే నెఱుంగుదు; అదేరీతిని రోగపీడితులును నైనారు; బలిష్ఠు లును సుఖులును నైనవా రనేకులు కాలేకపోయిరి. అను భవముమీద నా కొక్కటి స్పష్టపడినది. దేశసేవకై సత్యా గ్రహ మవలంబించువారు బ్రహ్మచర్యవ్రతనిష్ఠులై, దారిద్ర్య వ్రతగరిష్ఠులై, సత్యదీక్షాప్రవర్తకులై, నిర్భయగుణభరితులు కావలెను. బ్రహ్మచర్యము, వ్రతనిష్ఠ, లేక మానసమునకు అవసరదార్ఢ్యము కలుగదు. విషయలోలుడు పతితుడై పౌ రుషవిహీనుడై ధైర్యదూరు డగును. మహాప్రయత్నమున కనర్హుం డగును. అనేకోదాహరణములచే దీనిని దృఢపరుప వచ్చును. అయిన వివాహితు డేమిచేయవలె ననుప్రశ్న తోచకపోదు. అది తోచవలసిన యవశ్యము లేదు. భార్యా భర్తలు తమమోహముల దీర్చుకొనునప్పుడు అది పశుప్రా యము కాకపోదు. సంతానవృద్ధికి దక్క ఈబాల్యము నిషే ధము. సత్యాగ్రహి ఈ కొద్దిపాటి యనుభోగమునుగూడ జింపవలసి యుండును. అతడు సంతానాభివృద్ధినిగూడ కోరడు. కాబట్టి వివాహితు డైనవాడును బ్రహ్మచారిగ నుండనగు

ఈవిషయము దీర్ఘతరముగ విమర్శింపరాదు. ఇం దెన్నియో పిల్లప్రశ్నలుపుట్టక తప్పదు. భార్య నేమిచేయవలెను? వెంట మోసికొని పోవచ్చునా? ఆమెకు గలహక్కు లేవి? ఇత్యాదులు. మహత్కార్యనిమగ్ను లీవిషయములకు సమాధానము నిశ్చయించుకొనవలసి యుందురు.

బ్రహ్మచర్యమున కవసర మున్నయట్టులే దారిద్ర్యదీక్షకును అవసర మున్నది. ద్రవ్యాకాంక్ష సత్యాగ్రహము రెండు నేకస్థలమున నుండజాలవు. ద్రవ్యము కలవారు పారవేయవలయు నని కాదు ఇందు కర్థము. దానినిగురించి వారు ఉదాసీనులై యుండవలెను. తుది దమ్మిడీవరకు పోయినను సిద్ధపడవలసినదే కాని సత్యాగ్రహముమాత్రము వీడరాదు.

మనవివరణములో సత్యాగ్రహము సత్యశక్తి యని నాము. అందుచేత సత్య మనుకరణీయము. ఎంతటినష్టము కలిగినను సత్యము వీడరానిది. ప్రాణనష్టము కలుగ నున్నప్పుడు మొదలైనవేళల ననృత మాడరాదా యను మున్నగుప్రశ్నలిచ్చుట పొడగట్టును కాని అనృతమును సూనృతము చేయ దలచువారే యీవిమర్శకు దిగుదురు. ఎల్లప్పుడు సూనృతము పాటింప నెంచువారల కిట్టిస్థితులు సంప్రాప్తమే కావు. అయినను, వారికి అసంబద్ధకార్యములు తటస్థించవు.

నిర్భయమానసము లేనిది సత్యాగ్రహ మొక్కయడుగైనను, పెట్టజాలదు. ఆస్తి యని, గౌరవ మని, బందుగు లని, పరి

పాలకు లని, అపాయము లని, మృత్యు వని భయ మందువారికి సత్యాగ్రహము నహి.

కష్టసాధ్య మని సత్యాగ్రహము వీడరాదు. ఎంతటికష్టము వచ్చినను మనము చేసికొనినది కానిచో భరించు మహత్తమ శక్తిని దైవము మనకు ప్రసాదించినాడు. దేశసేవయే పరమావధిగా లేకున్నను ఈ సత్యాగ్రహగుణ మలవడచేసికొనుట యావశ్యకము. ఆయుధధారులు కానెంచువారు కూడ సత్యాగ్రహగుణములు సంపాదించియే కావలెను. ఆలోచనమాత్రన ఆగర్భశూరు డెవ్వడునుకాడు. వీరుడు కాదలచువాడు బ్రహ్మచర్యము ననుష్ఠింపక దప్పదు. దారిద్ర్యవ్రతము నంగీకరింపక తీరదు. నిర్భయవిరహితు డగువీరుడు గగనకుసుమమువంటివాడు. అతడు సత్యవాదియే కావలయు ననునిశ్చయము లేదందు రేమో. ఎప్పుడు నిర్భయమానసుడో అప్పుడు మానవుడు ఋజుప్రవర్తకు డగును. ఏదోయొకరూపమున భయ మావేశించిననేకాని మానవుడు సత్యమును వదలడు. పై చెప్పిన నాలుగుగుణములసంపాదన మందుచేత నెల్లరకు అవశ్యకర్తవ్యము. ఎవ్వరును తత్పథమునకు వెరవ నవశ్యము లేదు. పశుబలపక్షపాతికి ఈ గుణములతోడం గూడ ఇంక నెన్నియో వ్యర్థగుణము లవసర మగును. సత్యాగ్రహి వానిం గోరడు. అంతియగాదు. ఖడ్గధారి అవలంబించు ఇతర గుణము లన్నియు పాక్షికభీతి యుండుటచేతనే ఆవశ్యకము

లగుచున్న వనుటయు స్పష్టమే. ఎప్పుడు భయమువీడునో అప్పుడు ఖడ్గ మాతనిచేతిని వదలిపోవును. దానిసహాయ మతనికి ననావశ్యము. వైరకల్మషము లేనివానికి ఖడ్గముతో పనిలేదు. ఒకానొకమనుష్యుడు దారినడచుచున్నాడు. అతని చేత కత్తి యున్నది. ఆకస్మికముగా సింహ మెదురుపడినది. నిరాలోచనమై ఆత్మసంరక్షణకై కత్తి నెత్తినాడు. అనిమేష ముననే యొకభావ మాతని మనోవీథిని తోచినది. ధైర్యము లేకున్నను ధైర్య మున్నట్లు దంభము లాడుకొని యుండుట స్మరణకు వచ్చినది. వెంటనే అతడు కత్తిని క్రింద పడవైచి నాడు. భయము పారిపోయినది.

పదునెనిమిదవ ప్రకరణము.

విద్య.

చదువరి: ఇంత మాట్లాడితిమి. ముఖ్యమైనది విద్య. దాని సంగతి రాలేదు. బడోదా గైక్వాడుమహారాజు నిర్బంధోచిత ప్రారంభవిద్య పెట్టినాడు. మేమంద రాతనిని పూజించుచు న్నాము. ఇదంతయు వ్యర్థమేనా.

సంపా: మహారాజు ఉత్తమోద్దేశమువాడు. కాని ఈ విద్యవలన ఫలముమాత్ర ముండదు.

విద్యయనగా అక్షరజ్ఞాన మగునేని అది యొకసాధనము. దానిని సద్వినియోగము చేయవచ్చును. దుర్వినియోగమును చేయవచ్చును. దుర్వినియోగము నే డెక్కువగనున్నది. కావున ఎక్కువగా నష్టముకలిగిన దనియే చెప్పతగియున్నది.

పిల్లలకు చదువు, వ్రాత, లెక్కలు నేర్పిన, అది విద్య యనుకొనుచున్నాము. రైతు కష్టపడి న్యాయముగా జీవనము చేయుచున్నాడు. సామాన్యలోకవ్యవహార మతనికి తెలుసును. అయిన అక్షరములువ్రాయుటమాత్ర మతనికి రాదు. అక్షరములు నేర్పి అతనికి ఎక్కువ మరేమి కలుగజేయుచున్నారు. ఆతనిసౌఖ్యమున కొక్కలవము పెంపు గల్గింపగలరా? అనవసరాసంతుష్టిని పెంపొందించుటయే

గదా! దానికిగూడ నిప్పటివిద్య వలంతికాదు. పాశ్చాత్య నాగరికమోహముచే మన మీవిద్యను పట్టుకొని పెనగు చున్నాము.

ఉత్తమవిద్య యనునదియు మిథ్యయే. నేను భూగోళశాస్త్రము, ఖగోళశాస్త్రము, గణితశాస్త్రము, బీజగణితము, రేఖాగణితము అన్నియు నేర్చితిని. వీనిని నేనేమి యుపయోగించినాను? అవి యెందుకు పనికివచ్చినవి? హక్స్లీ పండితుడు విద్య నిట్లు వర్ణించినాడు. సంకల్పమున కనుగుణముగ సంతసమున సేవయొనర్చు శరీర మలవడునట్లు ఏవాడు బాల్యమున శిక్షనందినవాడో ఎవ్వనిబుద్ధి కుశాగ్రమయి శాంతమయి తేటయయి ప్రకాశించునో ఎవ్వనిమానసము స్వభావసిద్ధసూత్రముల గ్రహించినదో ఎవ్వనియింద్రియములు సుశిక్షితములైన మనస్సాక్షికి నిరంతర మడకువతో ప్రవర్తించునో ఎవ్వడు ఎల్లనైచ్యమును నిరసించి ఇతరునింగూడ తన్నుబోలె గౌరవించునో వాడే విద్యావంతుడు.

ఇట్టివిద్య మన ప్రాథమికవిద్యాపద్ధతిలోను కానము. ఉత్తమవిద్యలోను కానము.

చదువరి: మీయుత్తమవిద్య మీకు ఫలమునియ్యనిచో ఇంతదూరము మీరు నాకు విమర్శించి చెప్పియుండజాలరు.

సంపా: నాకు ప్రాథమికవిద్యగాని ఉత్తమవిద్యకాని మా పెద్దలు నేర్పనియెడల నాజీవనము చెడిపోయి యుండజాలదు.

ఆడినంతమాత్రన కార్యము సాధించుట కాదు. ఈమాట లై నను మీకు చెప్పగలనేకాని దేశములోని కోట్లసంఖ్యాక మగు సోదరబృందమునకు చెప్పలేను. మన విద్యాపద్ధతిని ఖండిం చుటకు ఇదియే చాలును. దానిలోపములనుండి పీడ్వడినా నని నాతలంపు కావున మీకును నామార్గ ముపదేశింప తల పెట్టినాను.

అక్షరజ్ఞాన మంతట పనికిరా దనరాదు. అయిన దానినే పెద్దచేసి శరణ్య మనరాదు. అది కామధేనువుగాదు. మన ప్రాచీనవిద్యాపద్ధతి మంచిది. దానిలో శీలనిర్మాణము ప్రథ మాంగము. అదియే నేర్పదగిన ప్రథమవిద్య. దానిపై కట్టు హర్మ్యము ఉత్తమస్థితము. నేటివిద్య గడించి దానికి రంగు పెట్టవచ్చును.

చదువరి: ఐన ఇంగ్లీషువిద్య అనవసర మని మీ రందురా?

సంపా: అవసరము, అనవసరము రెండును. కోట్లప్రజకు ఇంగ్లీషునేర్పుట వారిని దాస్యమున వేయుట. మెకాలేప్రభువు మనవిద్యకు వేసిన బునాదులు మనలను దాసులం జేసినవి. అతనియుద్దేశ మది కాకపోవచ్చును. ఫలముమాత్రము తప్ప లేదు. స్వరాజ్యమునుగురించి మాట్లాడుటకుకూడ మన ఇం గ్లీషే కావలసివచ్చినది. అది సిగ్గుమాలినస్థితి కాదా?

ఇక మనవిద్యాపద్ధతు లందురా సీమలోవా రేకాలముననో త్యజించినవి మనకు నేడమృతప్రాయములు. ముఖ్యమంత్రి

లాయడుజార్జి వేల్సుపిల్లలు వెల్షుభాషనే అభ్యసింపజేయ ప్రయత్నించుచున్నారు. మనగతి ? పత్రికలకు, సభలకు, ఉత్కృష్టభావప్రకటనకు, తుదకు జాబులకు అన్నిటికి ఇంగ్లీషే. ఇట్లే జరుగుచుపోయినయెడల అచిరకాలములోనే మనసంతతివారు మనల శపించవలసి యుందురు.

నేను బారిస్టరు. కోర్టులో నే నింగ్లీషే మాట్లాడవలె. నా ఇంగ్లీషును ఇంకొకరు నా మాతృభాషలోనికి తర్జుమా చేయవలసి యున్నది. ఇది దాస్యముకాదా ? దీని కెవ రుత్తరవాదులు ? ఇంగ్లీషువారు కాదు. మనమే. భారతజాతిశాపములు వారికి దగులవు. మనకు తగులును.

మీ ప్రశ్నకు అవును కాదని రెండురీతులు ప్రత్యుత్తరమిచ్చితిని. కాదనుటకు కారణములు నిరూపించితిని. ననుటకును కారణములను దెల్పెద. మనకు ఇప్పటి నాగరకము మిక్కిలి ఎక్కువగా పట్టుపడినది. కాబట్టి ఇంగ్లీషులను వెంటనే వీడిపోదు. ఇంగ్లీషువారు తమనాగరకము యెంత ఏవగించుకొనునది ఎరుంగుటకును ఇంగ్లీషు అవసరము ఇంగ్లీషుమూలకముగా ద్రవ్య మార్జింపవలె నను దురాశ త్రము మానితీరవలెను. ఇప్పు డింగ్లీషునేర్చినవారు తమసంతతులకు జీవరహస్యజ్ఞానము నంతయు దేశభాషలమూలకముగా నేర్పవలెను. వారు పెద్దలైనప్పుడు ఇంగ్లీషు నేరువవచ్చున ఇట్లు మితముగా నేర్చుటలోకూడ ఏవిషయ మభ్యసనసేయవ

ఏవిషయము కాదు, ఏశాస్త్రము అవసరము ఏశాస్త్రము కాదు అనువిషయము లాలోచింపవలసి యుండును. ఇంగ్లీషు పట్టములకు మన మెప్పుడు ఆశింపమో అప్పుడే మనపరిపాలకులు గాఢాలోచనపాలు గావలసియుందురు.

చదువరి: అయిన మన మేవిద్య నేరువవలెను?

సంపా: మనభాష లన్నిటిని అభివృద్ధిచేయవలెను. ఇంగ్లీషులోని ఉత్తమగ్రంథములను ఇందులోనికి వ్రాయవలెను. శాస్త్రములన్ని నేర్చెద మనునటమును మానవలెను. నీతిమతబోధకు అగ్రస్థాన మీవలెను. విద్యావంతు డగుప్రతిహైందవుడు తనదేశభాష నెరుంగుటతోడగూడ హిందీ నేరువవలెను, దానితోగూడ హిందువైన సంస్కృతము, మహమ్మదీయుడైన అరబ్బీ అభ్యసింపవలెను. కొందరు హిందువులు అరబ్బీ నేర్చుటయు కొందరు మహమ్మదీయులు సంస్కృతము నేర్చు
యు అవసరము. హిందీ సామాన్యభాష కావలెను. దానికి
పి నాగరీ పారసీలు ఇష్టానుసారము వాడవచ్చును. హిందూ
హమ్మదీయ సోదరభావము వృద్ధియగుటకు రెండులిపులును
డుట యుత్తమము. ఇది చేయగలమేని ఇంగ్లీషుభాషను
మాంత్వరలో ముఖ్యస్థానమునుండి కదల్చివేయవచ్చును. బా
సలగు మనకు ఇదియంతయు నవసరము. మన బానిసను
దేశ మంతయు బానిసమైనది. మన స్వాతంత్ర్యముతో
శమంతయు స్వతంత్రము కాగలదు.

చదువరి: అయిననుదానిం దక్క మన మేమియు చేయ జాలము. భారతభూమి ఏనాడును దైవమును త్యజించునది కాదు. నాస్తిక మిచ్చట పెచ్చు పెరుగజాలదు. కార్యము కష్టతమము. మతవిద్యనుగూర్చి యాలోచించినచో తల తిరుగు చున్నది. మన మతాచార్యులు దంభోపేతులు, స్వార్థపరులు, వారిని మనము వినియోగింపవలసియుండును. ముల్లాలు, దస్తూరులు, బ్రాహ్మణులు మతవిద్యకు ధర్మకర్తలైయున్నారు. వారు జాగ్రత్తపడి ధర్మము నెరవేర్చ లేని ఇంగ్లీషువిద్యచే మనకు గలిగినశక్తిని తత్కార్యసాధనకు వినియోగింతుము. మత మను మహాసముద్రగర్భము గంభీరముగనే యున్నది. భూస్పర్శగల యలలుమాత్రము కలుషితములై యున్నవి. ఈయలలు మనము. కోటానుకోట్లుప్రజ అకలుషితులు. మనము హైందవత్వము నందవలెను. పాశ్చాత్యనాగరకమును తరుమవలెను. మన పరిణామమున అభివృద్ధి, లోపములు, దోషములు, అపాయములు కలుగవచ్చును. కాని ముక్తిమాత్రము కరతలామలకము.

పందొమ్మిదవ ప్రకరణము.

యంత్రసామగ్రి.

చదువరి: పాశ్చాత్యనాగరకము వలదందురే. ఆ యంత్రసామగ్రియు వలదనియేనా ?

సంపా: ఈ ప్రశ్న వేసి నాకు తగిలినగాయమును చిదుకపొడిచితిరి. దత్తుకృత హైందవార్థికచరిత్రను చదివినప్పుడు నేను కన్నీరునించితిని. మరల నా కది జ్ఞాపకమునకురా నా మానసము పీడిత మగుచున్నది. యంత్రములే భారతభూమిని బీదవడ జేసినవి. మాంచెస్టరు మనకుచేసిన యపచారము గణించుటకు రానిది. మాంచెస్టరువలననే మన చేతిపనులన్నియు మృతకల్పము లైనవి.

మరచితి నేనే పొరవడుచున్నాను. మాంచెస్టరు నెట్లు నిందింపవచ్చును. మనము మాంచెస్టరువస్త్రముల ధరించితిమి. కాబట్టి మాంచెస్టరు వానిని మనకు నేసియిచ్చినది. బంగాళమువారి ధైర్యమును విని సంతసించితిని. అచ్చట వస్త్రయంత్రాలయములు లేవు. కాబట్టి పూర్వపు చేతినేతను వారు పునరుద్ధరింప గలిగిరి. బొంబయి వస్త్రయంత్రములకు బంగాళమునుండియు ప్రోత్సాహము కలుగుచుండుమాట నిజమే.

బంగాళము యంత్రసహాయమున సిద్ధమయిన యెల్లవస్త్రము లను బహిష్కరించియుండిన బాగుండును.

యంత్రములు యూరోపును నశింపజేయ నారంభించినవి. ఆనాశము ఇంగ్లండుతలుపు దట్టుచున్నది. ఇప్పటి నాగరకము నకు యంత్రములు ముఖ్యచిహ్నములు. ఇవి పాప కారణములు.

బొంబయి వస్త్రయంత్రములలో పనిచేయువారలు దాసు లైనారు. అచ్చట పనిచేయుస్త్రీలస్థితి మహా విషాదకరము. యంత్రశాలలు పుట్టకముందు ఈస్త్రీలు ఆకలికి మాడుచుండ లేదు. యంత్రములపిచ్చి మనదేశములో ప్రబలినయెడల ఇది యభాగ్యదేశము కాక మానదు. విపరీతముగా దోచవచ్చు నేమో కాని మనదేశములో యంత్రాగారములు పెంచుటకన్న మాంచెస్టరుకు ద్రవ్యముపంపి అచ్చటినుండి దిగుమతియగు పనికిరానిగుడ్డలను ధరించుటే మేలు. మాంచెస్టరుగుడ్డ లుప యోగించుటవలన మనకు ద్రవ్యనష్టముమాత్ర మగుచున్నది. మాంచెస్టరు నిచ్చట రూపుదాల్ప చేసితిమేని మన జాతీయ వంశమునకే ముప్పు వాటిల్లి మన నైతికజీవనమే నశింపగలదు. ఇందుకు తార్కాణము వలయునేని యంత్రాగారములలోని పనివారలనే సాక్ష్యమునకు కోరుచున్నాను. యంత్రాగార ములమూలకముగా ధనము గడించినవారు ఇతర ధనవంతుల కంటె నెక్కువ మంచివారుగ నుండపోరు. రాక్ఫెల్లరు భారతభూమిలో పుట్టినంతమాత్రముచేత అమెరికాలో పుట్టిన

వానికంటె మెరుగుగా నుండునని నమ్ముటకు రాదు. బీదభారతభూమి స్వతంత్రము కావచ్చును. కాని అవినీతిచే ఈ భూమి భాగ్యవంత మగునేని తరువాత స్వతంత్ర మగుట కష్టము. డబ్బుగలవారు బ్రిటిషుపరిపాలనను బలపరతురు. వారి లాభాలాభములు ఆ పరిపాలన లాభాలాభములతో మేళవమై యున్నవి. డబ్బు మానవుని బలహీను నొనర్చును. స్త్రీలోలతయు తత్సమానము. రెండును విషమే. విషసర్పదష్టుడు ఈ రెంటి దాసునకంటె మేలు. ఏలయన, విషస్పర్శ దేహమును మాత్రము నశింపజేయును. ఇయ్యవి దేహమును, మానసమును, ఆత్మను అన్నిటిని నశింపజేయును. కాబట్టి యంత్రాగారాభివృద్ధి యేదో లాభ మని మనము సంతసింప బనిలేదు.

చదువరి: అయిన యంత్రాగారములు మూయవలసిన దేనా ?

సంపా: అది కష్టము. ఏర్పడినదానిని ఎత్తివైచుట సుకరము కాదు. కాబట్టి ప్రారంభింపకుండుటయే పరమవివేకము. యంత్రాగారాధిపుల ఖండింపరాదు. వారియెడ కరుణచూపనగు. యంత్రాగారములను వారు వదలవలె ననుట విపరీతము. వానిని పెంచకు డనిమాత్రము ప్రాధేయపడవచ్చును. వారు మంచివా రగుదురేని తమ వ్యాపారమును కురుచచేయుచు వత్తురు. వేనవేలయిండ్లలో ప్రాచీనమగు నేతమగ్గమును నెలకొల్పి అందగు నుత్పత్తినంతయు వారు కొననగును. యం

త్రాగారాధీశు లిదిచేసినను చేయకున్నను ప్రజ యంత్రాగార ములలో చేసిన వస్త్రములను ధరించుట మానివేయవచ్చును.

చదువరి: ఇంతకాలమును మీరు యంత్రవినిర్మితవస్త్ర ములసంగతియే చెప్పుచువచ్చితిరి. ఇంక నెన్నియోవస్తువులు యంత్రనిర్మితము లున్నవి. వానిని దిగుమతియైన జేయవలెను. లేదా వానికై మనదేశమున యంత్రముల నైనను స్థాపించ వలెను.

సంపా: నిజము. మన దేవతలనుగూడ — విగ్రహములను కూడ నని యర్థము.—జర్మనీవారు చేయుచున్నారు. నిప్పుపు ల్లలు, గాజు, గుండుసూదులు ఇత్యాదులమాట చెప్పనేల? నాయుత్తరము మీకిది. ఈ వస్తువులు రాకముందు భారత భూమి ఏమిచేసినది? అదియే నేడును చేయవలెను. యంత్ర సహాయము లేక గుండుసూదులు చేయలేనంతకాలము మన ము వానిని ఉపయోగింపవలదు. గాజు జాజ్వల్యమానము మన కక్కరలేదు. ఎప్పటివలె ప్రమిదలుచేసి వత్తిచేసి దీపము ముట్టించుచుందుము. అట్లు చేసినచో కండ్లకు రక్ష. కర్చు తక్కువ. స్వదేశిసంరక్షితము. స్వరాజ్యము చేరువ.

అందరు ఇన్ని ఒకేపర్యాయము చేయుదు రనికాని కొంద రైనను అన్ని యంత్రనిర్మితవస్తువుల వదలుదు రనిగాని నా యర్థము కాదు. భావము సరియైన దయినయెడల ఏదియేది వదలవచ్చునో కనిపెట్టి వదలుచు పోదురు. కొందరు చేయు

నది అంద రనుకరింతురు. విత్తు వృక్షమై మఱ్ఱివలె వ్యాపించును. నాయకులు చేయునది ప్రజ తప్పక యనుకరింతురు. కష్టము కాదు. చిక్కును లేదు. ఇతరులు మనతోడంగూడ నడచువరకును నేను మీరు నిలువ నక్కఱలేదు. పనిబూనని వారే నష్టులు. తెలిసియు ప్రారంభింపనివారు పిరికివారు.

చదువరి: ట్రాంబండ్లను గురించియు విద్యుచ్ఛక్తిని గురించియు మీ రేమందురు?

సంపా: ఈ ప్రశ్న యప్రస్తుతము. దీని కర్థమే లేదు. రైళ్లే అక్కఱలే దన్నప్పుడు ట్రాంబండ్లును అక్కఱలేదే. యంత్రములు పాముల పుట్టలు. అందులో నొకపా ముండవచ్చును. నూరుపాము లుండవచ్చును. యంత్రముల వృద్ధి యున్నచోట నగరముల వృద్ధియుం గలదు. నగరములు కలచోట ట్రాంబండ్లు, రైళ్లు తప్పవు. విద్యుచ్ఛక్తియు నటనే తాండవమాడును. ఇంగ్లీషు గ్రామముల కీదంభములు ప్రాకలేదు. యంత్రాధారమగు రాకపోకలు ప్రబలినచోట ప్రజల ఆరోగ్యము చెడిపోయిన దని ధర్మమెరుంగు వైద్యులు చెప్పుదురు. యూరోపు నగరములలో నొక్కట నొకప్పుడు ద్రవ్యము లేకపోయెను. ట్రాములకు వకీళ్లకు, వైద్యులకు ఆదాయము తగ్గిపోయెను. ప్రజలకు ఆరోగ్యము అలవడెను. ఇది నేనెరిగిన సంగతి. యంత్రములవలన ఒక్కమేలు కల దని నాకు దోచదు. వానివలన నష్టములను గురించి గ్రంథములు వ్రాయవచ్చును.

చదువరి: మీరు చెప్పుచుండున దంతయు యంత్రమూలకముగా అచ్చుగునుకదా? ఇది మంచిదా చెడుపా?

సంపా: విషమును జంపుటకు విష ముపయోగించుట కలదు. ఇది అట్టిది. దీనివలన యంత్రములపక్షమున కేమియు సహాయము కాదు. యంత్రము మము వీడిపోవుచు ఇట్లనును. “ననుగురించి జాగ్రత్తపడుడు. నన్ను వీడి దూరముపొండు. నావలన మీకు లాభము లేదు. అచ్చువలన కలుగులాభము యంత్రములపిచ్చి పట్టినవారికే మాత్ర మనుట నెరుంగుడు.” కాబట్టి, ముఖ్యవిషయమును మరువకుడు. యంత్రసంస్థలు కీడు. ఇది జ్ఞాపకమున్న యంత్రములను మనము దప్పించుకొనవచ్చును. మనయుద్దేశము సద్యఃఫలముగా నెరవేరుటకు దైవము మార్గము ఏర్పరచియుండలేదు. యంత్రసామగ్రి వరదాన మని యంగీకరించుట మాని చెఱుపనుట గురితింతుమేని అది క్రమముగా నశింపగలదు.

ఇరువదియవ ప్రకరణము.

ఉపసంహారము.

చదువరి: మీయభిప్రాయములను బట్టిచూడగా మీరు మితవాదులు గారు. జాతీయవాదులుం గారు. మీది తృతీయపంథగా దోచుచున్నది.

సంపా: అది పొరబాటు. నా మానసమున మూడవపక్షము లేదు. అందరొకేవిధమున నాలోచింతు ననుట వెఱ్ఱి. మితవాదు లందరు చూచూ తప్పక ఏకాభిప్రాయు లని చెప్పరాదు. అంతియ గాదు. సేవమాత్ర మాదర్శముగా కలవారికి కక్షయేడిది? మితవాదులు జాతీయవాదులు ఇరువురకుం గూడ నే సేవ యొనర్చువాడ. ఎచ్చట భేదాభిప్రాయము కల్గును అచ్చట దానిని వారికి నివేదించి నామార్గమున నేను సేవచేయుచు పోదును.

చదువరి: అయిన ఈ రెండుకక్షులవారికి మీ రేమి యుపదేశింతురు.

సంపా: జాతీయవాదులకు నేను చెప్పునది. "మీరు భారతభూమికి స్వారాజ్యము కోరుట నే నెరుగుదును. అడిగినంతమాత్రన మన కది రాదు. ప్రతివాడును దానిని సంపాదించవలసి యుండును. ఇతరులు నాకు సంపాదించిపెట్టునది

స్వరాజ్యము కాదు. పర పరిపాలనము. కాబట్టి ఇంగ్లీషువారిని వెడలగొట్టినమాత్రాన మీరు స్వరాజ్యము సంపాదించినట్లెన్నరాదు. స్వరాజ్యముయొక్క నిశ్చయస్వరూప మిదివరలో మీకు వర్ణించితిని. దీనిని పశుబలముచేత ఎప్పుడును సంపాదింప వీలులేదు. పశుబలము భారతభూమికి స్వభావసిద్ధసాధనము కాదు. కాబట్టి ఆత్మశక్తిమీదనే మీర లాధారపడవలసి యుందురు. మనయుద్దేశము నెరవేర్చుటకు ఏసందర్భమునను బలాత్కార మవసర మని మీ రెంచరాదు.

మితవాదుల కేనుబోధించున దిది. "వట్టియర్జీలు పంపుచుండుట మానహీనత. దానివలన మనము లోకువ యని మనమె యంగీకరించినవా రగుదుము. బ్రిటిషుపరిపాలన వీడరా దనుట ఇంచుమించు దేవుడు లే దనుటయే. దైవ మొక్కఁడు దప్ప మరి యేమానవుడును ఏవస్తువును వీడరానిది కాదు. అంతేకాక, ఇంగ్లీషువారు భారతభూమిలో నే యుండియే తీరవలె ననుట వారిని గర్విష్ఠుల జేయుటయె.

ఇంగ్లీషువారు మూటలు ముల్లెలు కట్టుకొని వెళ్లిపోదురేని భారతభూమి విధవ కాబోదు. వారుండగా శాంతము వహింపవలసినవారు వారు పోయినపిదప దేశసంరక్షణకు పోరాడవచ్చును. ఆకస్మికోద్భవమును నడంపరాదు. దానిని పరిణామ మందనిచ్చుటయె కార్యము. కాబట్టి మనము శాంతముగా జీవించుటకుముందు మనలో మనము కలహింపవలసి

యుందుమేని అది సాగుటయే మేలు. బలహీనుల సంరక్షిం చుటకు మూడవవా రనవసరము. ఈ సంరక్షణయే మనలను పిరికివారి నొనర్చినది. ఇట్టి సంరక్షణ బలహీనులను నింకను నెక్కువబలహీనుల గావించునుగాని వేరుకాదు. ఇది మనము గుర్తెరింగినం గాని మనకు స్వరాజ్యము లభింపదు. ఇంగ్లీషు మతాచార్యు డొకరు చెప్పినమాటలు వినుడు. స్వరాజ్యము లోని అరాచకత్వము పరరాజ్యములోని సక్రమశాంతి జీవ నమునకంటె మెన్న. ఆ మతాచార్యుడు స్వరాజ్యమునకు నే నిచ్చిన హైందవ స్వరాజ్యార్థము నియ్యలేదు. మనకు ఇం గ్లీషుపరిపాలన కానిండు, హైందవపరిపాలన కానిండు నిరం కుశత్వము అక్కరలేదు. ఇది మనము నేరువవలెను. ఇతరు లకు నేర్పవలెను.

ఈ యభిప్రాయ మంగీకృత మైనయెడల మితవాదులు జా తీయవాదులు ఏకము కావచ్చును. ఒకరికొకరు భయమందు టకు గాని ఒకరినొకరు అనుమానించుటకు గాని యెడ ముండదు.

చదువరి: అయిన మీ రింగ్లీషువారి కేమి తెల్పుదురు.

సంపా: గౌరవభావముతో వారి కీమాట లందచేయు దును. "మీరు మాపరిపాలకు లనుట నే నంగీకరించెద. మీరు ఖడ్గబలముచే భారతభూమి నేలుచున్నారా, నాయంగీ

కారముచే నేలుచున్నారా యనుప్రశ్నను విమర్శించుట యవ
సరము కాదు. మీరు మాదేశములో నుండుటకు నాకభ్యం
తరము లేదు. పరిపాలకులు మీరైనను ప్రజల సేవకులుగా
మీ రిట నుండవలసియుందురు. మీరు కోరునట్లుగా చేయ
వలసినవారము మేము గాము. మేము కోరినట్లుగా చేయవల
సినవారు మీరు. మీరు ఇటనుండి ఇదివరలో తీసికొనిపో
యిన ద్రవ్యము నుంచుకొనుడి గాని ఇకముందు తీసికొనిపో
కుడు. మీ కిష్టమేని భారతభూమిసంరక్షణ మీ రుంచుకొను
డు. మానుండి వ్యాపారలాభము గడించు నభిప్రాయము
మాత్రము మీరు మానవలసినది. మీరు ప్రోత్సహించు నా
గరకము నిజముగా నాగరకవ్యతిరేక మని మావిశ్వాసము.
మీ నాగరకమునకంటె మా నాగరకము వేయిరెట్లు మిన్న
యని మా నమ్మకము. మీ రీ నిజ మెరుంగుదు రేని మీకే
లాభము. మీ రెరుంగ రేని మీ లోకోక్తులలో నొక్కదాని
ననుసరించి మాభూమిలో మే మెట్లు నివసింతుమో అదేరీతిని
మీరును నివసింపవలసి యుందురు. మామతములకు వ్యతిరే
కముగా మీ రేమియుం జేయరాదు. పరిపాలకు లైనందున
హిందువులయెడ మీధర్మము నెరవేర్చుటకుగా మీరలు ఎద్దు
మాంసము మానవలెను. మహమ్మదీయులయెడ అదేధర్మ
మును నూనుటకు సూకరమాంసమును వీడవలెను. భీతచిత్తు
లమై యుండినందున మే మింతకాల మీమాట యెత్తలేదు.

కాని మీ నడవడిచే మామానసమునకు వైక్లబ్యము కలుగలేదని మాత్ర మనుకొనబోకుడు. స్వార్థముమై కాని భయముమై కాని మా యభిప్రాయముల వెలిబెట్టు చుండలేదు. ఇప్పుడు నిర్భయముగా తెలియపరచుట మా ధర్మము కావున తెలుపుచున్నాము. మా ప్రాచీనవిద్యాలయములు న్యాయస్థానములు పునర్జీవితములు కావలెను. భారతభూమికి సామాన్యభాష హిందీ కాని ఇంగ్లీషు కాదు. మీర లందువలన దానిని నేర్చుకొనవలెను. మీతో మేము మా జాతీయభాషలోనే ఉత్తరప్రత్యుత్తరములు జరుపగలము.

రైళ్లకు, సైన్యాలకు మీరు కర్చుపెట్టుచుండుట మా కసమ్మతము. రెంటికి అవసరము మాకు కానరాదు. రుష్యావలన మీకు భయ ముండవచ్చును. మాకు లేదు. ఆజాతి పైబడివచ్చిన మేము చూచికొందుము. మీరు మాతో నప్పటికి నుందురేని ఇరువురము కలసి చూచుకొందము. యూరోపియను వస్త్రములు మా కక్కరలేదు. మా దేశమున సిద్ధ మయినవస్తువులతో, ఉత్పత్తులతో, సంతుష్టి నందుదుము. మీ రొకకన్ను మాంచెస్టరుమీద ఒక్కకన్ను భారతభూమిమీద పెట్టి యుంచకుడు. మన లాభాలాభము లేకము చేసికొనిననే మన మేకముగా నుండి పనిచేయవచ్చును.

దీనిని మేము మీకు చెప్పుట దంభపరత్వమున గాదు. మీకు గొప్ప సైనికబలము కలదు. మీ నావికబల మసా

మాన్యము. మీతో సరిసమానముగా మీ మార్గమున పోట్లాడ నెంచుదుమేని మీకు నిలువజాలము. పై మేము తెలిపినకోరికలు మీకు సరిపడవేని మేము పాలితులుగా నుండము. మీ కిష్టమేని మమ్ము నుతుపాకులక్రింద తరిగివేయుదురు గాక. ఫిరంగుల యెదుటనిడి తుత్తునియలుగా ఛేదింతురు గాక. మా సంకల్పమునకు వ్యతిరేకముగా మీరు ప్రవర్తించు నెడల మీకు మేము సహాయముచేయము. మా సహాయము లేక మీ కొకయడుగైనను పెట్టలే రనుటయు మే మెరుంగుదుము.

మీకు అధికారము కలదు. దానిమత్తుచే మీరు మమ్ము నవ్వుదురు కాబోలు. వెంటనే మీ మోహమును మేము పాపలేము. కాని మాయందు పౌరుషము కొరవడదేని అచిరకాలముననే మీ రెంతటి ఆత్మవినాశకమార్గము నవలంబించినదియు బుద్ధిపటిమలోపమున మము నవ్వినదియు మీ కె యెరుకపడగలదు. మీరు ఆధ్యాత్మికజాతికి చెందినవా రని మా హృదయపూర్వకవిశ్వాసము. మా వసించుభూమి ఆధ్యాత్మిక సత్యములకు పుట్టిన యిల్లు. మన మెట్లు ఒక్కరికొక్కరు తటస్థించినదియు విమర్శింప నక్కరలేదు. కాని మన పరస్పర సంబంధములు పరస్పరలాభమునకు వినియోగించుకొనుట మాత్రము సాధ్యము.

భారతభూమికి పయనమై వచ్చియుండు ఆంగ్లేయులు మీరు సరియైన ఆంగ్లజాతిప్రతినిధులు కారు. సగ మాంగ్లమై పోయిన మేమును సరియైన భారతజాతిప్రతినిధులము గాము. మీరు చేసినదంతయు ఇంగ్లీషుజాతికి తెలియునేని ఆజాతి అనేకవిషయములలో మీతో నేకీభవింపక పోవును. భారత జాతితో నెక్కువభాగము మీతో నెక్కువసంబంధము పెట్టు కొనలేదు. మీ నాగరకమును కొంచ మావలపెట్టి మీ వేద గ్రంథములనే వెదకుదురేని మేము కోరునదంతయు న్యాయ మనుట మీ కందులోనే కానవచ్చును. మేము కోరేకోరిక లన్ని నెరవేరిననే మీ రిట నుండనగును. మీ రట్లుందురేని మీవద్ద మే మెన్నియో విషయములు నేర్చుకొందుము. మీరును అట్లే మావద్ద నేర్చుకొనగలరు. అట్లు చేసినయెడల మనము పరస్పరము లాభ మందుదుము. లోకకల్యాణమునకును తోడ్పడుదుము. ఇదియంతయు మనసంబంధము అధ్యాత్మికబంధముచే కట్టబడినప్పుడే సాధ్యము.

చదువరి: మీరు జాతి కేమి చెప్పుదురు?

సంపా: జాతియెవరు?

చదువరి: మనకార్యముల కేజాతి నింతసేపు ఆలోచించుచుంటిమో ఆజాతి, యూరోపియనునాగరకము నెవ్వరి నంటినదో, అట్టి మనము, స్వరాజ్య మెవ్వరము కోరుచున్నామో ఆ మనము.

సంపా: వీరికి నే చెప్పునదిది. నిజమైనప్రేమ స్వరూపము నెరింగినవాడు నిర్భీతుడై ఇంగ్లీషువారితో ముఖాముఖిని పైరీతిని వచింపగలడు. ఎవ్వరు భారతనాగరకమే ఉత్తమమనియు యూరోపియనునాగరకము మూడునాళ్లముచ్చటయనియు మనఃపూర్వకముగా నమ్ముచుదురో వారే యీపనికి వలంతులు, ఇట్టి మూడునాళ్లముచ్చట నాగరకము లెన్నియో కలిగినవి, గతించినవి, కలుగగలవు, గతింపగలవు. ఎవ్వరు ఆత్మబలమును తమంతట తా మెరింగి పశుబలమునెదుట జంకరో పశుబలము నెప్పుడును నుపయోగింపదలంపరో వారలే ఇందుకు సమర్థులు. ఇప్పటి విషమస్థితిని శల్యాగతంబుగ ననుభవించి దీనిపై సంపూర్ణాసంతుష్టి ఎవ్వరు పొందినారో వారలే ఇందుకు సాధకులు.

అట్టివాడు ఒక్కడు భారతపుత్రు డున్నను అతడు పైరీతిని ఇంగ్లీషువారితో ప్రసంగింపగలడు. వా రాతనిమాటలు విని తీరవలసి యుందురు.

ఈ కోరికలు మనము ప్రకటించుకోరిక లనుకొనరాదు. ఇవి మనమనస్థితిని ప్రకటించునట్టివియై. అడుగుటమాత్రాన మన కేదియు నమరదు. మనము సంపాదించవలసి యుందుము. అందుకు తగినశక్తి కావలెను. అది యెవ్వరికి కలదందురా? ఏవాడు

(౧) ఎప్పుడో తప్ప ఇంగ్లీషుభాషను ఉపయోగింపడో

(౨) వకీలైయున్నచో తనవృత్తిని వదలి చేతిమగ్గమున కూర్చొనునో

(౩) వకీలైయున్న, తనజ్ఞానమును కాలమును దేశప్రజకు ఆంగ్లేయులకు సంగతిసందర్భములను బోధించుటకు వ్యయపరచునో

(౪) వకీలైయున్న, కక్షిదారులకలహములతో జోక్యము పెట్టుకొనక కోర్టులను త్యజించి తనయనుభవములను చెప్పుట చేత ఇతరుల నదేమార్గమునకు త్రిప్పునో

(౫) వకీలైయున్న, వకీలువృత్తి వదలునట్లే జడ్జిపదవిని కూడ త్యజించునో

(౬) వైద్యుడైయున్న, వైద్యమును మాని దేహములకు చికిత్సలు చేయుటకన్న ఆత్మలకు చికిత్స చేయుట మే లని పని బూనునో

(౭) వైద్యుడైయున్న, యూరోపియను వైద్యముపేరిట చేయబడు జంతుహింసమూలకమున రోగములు కుదుర్చుట కన్న శరీరములు రోగపీడితము లైనను తప్పు కా దని యెరుంగునో

(౮) వైద్యుడైయున్నను, చేతిమగ్గమున పనికి దిగి రోగులు తనదగ్గరకు వచ్చినప్పుడు వారి రోగకారణములను చెప్పి వారిని వృథామూలికలచే వేధించుటకన్న రోగకారణము పో

ద్రోల ప్రయత్నించునో, మూలికలుతినక రోగి చచ్చినను లోక మంతము కాదు. రోగికిని నష్టము లేదు. అని ఎరుంగునో

(౯) ద్రవ్యవంతుడై యున్నను, ఆద్రవ్య ముండునా పోవు నా యని మీనం మేషము లెక్కలువేసి భీతిచెందక మోమో టముదక్కి తనమానసమున నున్నదానిని పల్కునో,

(౧౦) ద్రవ్యవంతుడై యున్నను, ద్రవ్యమును చేతిమగ్గ ములు పెట్టుటకు వినియోగించి తాను చేతినేతవస్త్రములు ధరించుటచే ఇతరుల నామార్గమున ప్రోత్సహించునో

(౧౧) ఇతర భారతపుత్రులవలె, ఈతరుణము, తనకును వ్రతములకు ఉపవాసములకు ప్రాయశ్చిత్తములకు కాల మను టన్న నెరుంగునో

(౧౨) ఇతర భారతపుత్రులవలెనే, ఇంగ్లీషువారిని దూ రుట వ్యర్థ మనియు మనముకోరగా వారు వచ్చి రనియు మన ముంచుకొనుటవలన వా రున్నా రనియు మనము సంస్కా రము కనబరచినప్పుడే వారు పోవుటయో తమ్మును సంస్క రించుకొనుటయో చేయుదు రనియు నెరుంగునో

(౧౩) ఇతరులవలెనే, దుఃఖసమయమున సుఖానుభోగ ము లననుకరణీయము లనియు పతితులమై యుండు యుగ మున కారాగారమున నుండుట ప్రవాసమున నుండుట ప్రశ స్తము లనియు నెరుంగునో

(౧౪) ఇతరులవలెనే, ప్రజలమేలు నాలోచించుటకు మనము కారాగారప్రాప్తినుండి తప్పించుకొనవలె ననుట అంధాభిప్రాయ మని యెరుంగునో

(౧౫) ఇతరులవలెనే, మాటకంటె పాటు మే లనియు, మనము నమ్మినది నేరుగా చెప్పి ఫల మనుభవించుట యుత్తమ మనియు, మనమాటల కప్పుడుగాని అర్థ ముండదనియు నెరుంగునో

(౧౬) ఇతరులవలెనే, మనము కష్టపడిననే స్వతంత్రుల మగుదు మనునది విశ్వసించునో

(౧౭) ఇతరులవలెనే, పాశ్చాత్యనాగరకమును ప్రోత్సహించినందులకు అండమానుదీవులలో ఆజన్మప్రవాస మున్నను తగినప్రాయశ్చిత్తము కా దని తెలిసికొనునో

(౧౮) ఇతరులవలెనే, ఏదేశజాతియు కష్టపడక అభివృద్ధి కాలే దనియు పశుబలయుద్ధముననే, నిజమైనశౌర్యము, ఇతరుని చంపుటకాక తాకష్టముల భరించుట యైనప్పుడు, సాత్త్వికనిరోధమున స్వార్థత్యాగమే ముఖ్యాంగ మనియు గురుతించునో

(౧౯) ఇతరులవలెనే, ఇంకొకరు చేసిన మనము చేయుదు మనుట వ్యర్థులమాట యనియు, మనము న్యాయ మని నమ్మినది చేసినచో మార్గముం గన్ని ఇతరులు తప్పక చేయుదు రని

యు, కన్పించిన, రుచికరవస్తువు మరియొకరు చవిచూచువరకు నిలుచుట స్వభావము కాదనియు జాతీయోద్యోగ మొన ర్చుట తదర్థమై ఇడుమలవడుట రుచికరకార్యజాల మ్మనియు, నిర్బంధముచే కష్టపడుట కష్టము కాదనియు తలపెట్టునో

వానికే ఆశక్తి యలవడును.

చదువరి: ఇది గొప్పజాబితా యైనది. అందరును దీని సే నా డనుకరించుటో?

సంపా: హారవడకుడు. ఇతరులతో మీకును నాకును సంబంధము లేదు. ప్రతివాడు తనధర్మనిర్వహణ మాలోచింప వలసినది. నాధర్మము నెరవేర్చి ఆరీతిని నాసేవనే చేసికొందు నేని ఇతరులసేవ సులభముగా చేయగలను. మీకు సెల వొసంగుటకుముందు మరల నొక్కపర్యాయము నా చెప్పినది జ్ఞాపక పరచెద.

(౧) నిజమైన స్వారాజ్యము స్వరాజ్యము అనగా స్వనిగ్ర హము.

(౨) దానికి మార్గము సత్యాగ్రహము అనగా ఆత్మశక్తి, ప్రేమశక్తి.

(౩) ఈశక్తిని ప్రచారపెట్టుట కన్నిట స్వదేశి మూలా ధారము.

(౪) మనము చేయునట్టి పనియంతయు ఇంగ్లీషువారి నభ్యంతరపెట్టుదు మని కాని వారికి ప్రతిచేయవలె ననిగాని చేయరాదు. మనధర్మ మని చేయవలెను. ఇంగ్లీషువారు ఉప్పుపన్ను తీసివేసినా రనుకొందము. మనద్రవ్యము వెనుకకు మరల్చినా రనుకొందము. ఉత్తమోద్యోగములు భారతపుత్త్రుల కిచ్చినా రనుకొందము. ఇంగ్లీషుసైన్యములను తీసివేసినా రనుకొందము. అప్పటికిని యంత్రనిర్మితవస్తువులను వినియోగింపబోము. ఇంగ్లీషుభాష నుపయోగింపబోము. ఇంగ్లీషువారి పరిశ్రమలను ప్రోత్సహింపబోము. ఇవి సహజముగనే స్వభావసిద్ధముగనే దుష్టములు. కాబట్టి యివి మన కక్కరలేదు. ఇంగ్లీషువా రనిన నాకు వైరములేదు. వారి నాగరక మనిన నాకు వైరము. నాయభిప్రాయ మడిగితిరా ఇదివరలో మనము స్వరాజ్య మనుపదమున కర్థము తెలియక దాని నుపయోగించినాము. నా కర్థమయినంతవరకు దాని స్వరూపమును విశదపరచుటకు ప్రయత్నించినాను. ఆరూపమున దాని నారాధించుటయె ముందు నాజీవితమున ధర్మ మని నాయంతరాత్మ బోధించుచున్నది.

నలవార్ధిజలము చుం యన నింకఁ గ్రోలి
బలసి లోకము లెల్ల భస్మీకరింప
నడరెనో బడబాగ్ని యనఁ జుట్టు ముట్టి
పుడమియు దిశలు నభోమండలంబుఁ
గప్పి మండుచు వచ్చు కార్చిచ్చు రాక
తప్పక వీక్షించి ధరణీవల్లభుఁడు
జాలి నెక్కొన నక్కజంబునఁ జింతఁ
దూలుచుఁ దనదేవితోడ నిట్లనియె
'నీవనవహ్ని నిం కేవిధిఁ గడచి
పోవచ్చుఁ జావక పోరాదు మనకు
నంకించి మునితోడ నాడినమాట
బొంకు గాకుండ నాపూనిననాఁటి
మితికి ఋణం బెల్లఁ మేలుగాఁ దీర్చి
మృతిఁ బొంద లేనైతి మృగనేత్రి వినుము
వావిరిఁ బుట్టినవారికి నెల్లఁ

పేలఁగా, ఒరలుచున్ = ఓలుచు, వార్ధిజలము = సముద్రపునీరు, 'చుం' యనన్ = చుం అని, ఇంకన్ గ్రోలి = ఇంకిపోవునట్లుత్రాఁగి, అడరెనో = తలపడెనో-సముద్రపునీళ్లంతయు త్రాగి తీఱఁగా పిదప లోకములనెల్ల చుట్టుక్రమ్మి నీఱు సేయుటకు బడబాగ్ని తలపడినదో యన్నట్లు, నభోమండలము = ఆకాశము, కార్చిచ్చు పుట్టినవిధ మెట్లనఁగా;- మొదటబిట్టుగా వాయువులు వీవఁగా చెట్లకొమ్మలు ఒరసికొని వేఁడిమిపుట్టి దానివలన చిఱునిప్పులు గలిగి యవి కారాకుగుంపులంబడి రాఁజి చిన్నమంటలు పుట్టి యామంటలు కనవుజొంపము నంబడి కాలిక్రమముగా పొదరిండ్లు రగులుకొని మండి చెట్లకుఁదగిలి పెనుజ్వాలలుగా చుట్టుక్రమ్ముకొన్నదయ్యెననుట. నెక్కొనన్ = కలుగఁగా, అక్కజంబు = మిక్కుటమైనది, అంకించి = పూని, నాపూనిననాఁటిమితికి = నేను ప్రతిజ్ఞచే

జావక పో రాదు చర్చించి చూడ
ధరణీశుఁ డగునాకు దర్ప మేర్పడఁగఁ
బరబలంబులు సొచ్చి బలువిడిఁ గడచి
వెస నురస్థలిఁ గాఁడి వీఁపున వెడలు
నిశితాస్త్రములఁ జచ్చి నెఱి నిందు నందు
వినుతి కెక్కుట మాని విన సైఁప రాని
వనవహ్నిఁ గాలంగ వలసె నీరీతి
నాతి నాదుర్మరణమునకు వగవ
బ్రాఁతి యైనట్టియీపట్టికి వగవ
గురుభక్తి మేకొని ఘోరాటవులకు
నరుదెంచి మనతోడ నలజడిఁ బొంది
కడపట నేఁ డిట్లు కాలాగ్నిచేత
సుడివడు మునితనూజునకు నే వగతు
నీమహాపాతకం బేమిటఁ బాయుఁ
గామిని నా కింక గతి యొండు లేదు
కన్నుల నీపాతకము గనుంగొనక
మున్నె యిచ్చెదఁ బ్రాణముల వహ్ని కనుచు
మనసులో శివు నిల్పి మంటకు నెదురు
చను చున్నయాహరిశ్చంద్రునిఁ జూచి
నిగుడుశోకము మది నిల్పి నవ్వుచును

సెననాఁటిగడువునకు, కాఁడి=దూసికొని, నిశితఅస్త్రములన్ = వాఁడిబాణములచే, బ్రాఁతి= గారాబు, పట్టి=బిడ్డఁడు, మేకొని=సమ్మతించి, సుడివడు= చిక్కుకొన్న - తబ్బిబ్బుపడు, మునితనూజునకున్ =మునికుమారునకు, నిగుడుశోకము=పయిపయి రేఁగుచున్న దుఃఖము, మదినిల్పి=మనస్సులో నేయుడఁచి, నవ్వ

దెగువమ్మెఁ జంద్రమతీదేవి పలికె
'దేవ మీ కిట్లెల్ల ధృతి దూలి పలుక
భావింప ననమానభాగ్యసంపదల
లలితమంగళసూత్రలక్ష్మి నిక్కముగఁ
దలఁచెదుచో నాకు దైవ మెంతయును
బగ గొని యిటు నగుఁబాటు గావింప
వగల నొక్కించుక వడి నిన్నుఁ బాసి
కడులోల నైయుండఁగా నెట్టు లోర్తు
జడియక పదివేలజన్మంబులందుఁ
బతి నీవ కాఁ గోరి పడి వహ్నిఁ గాలి
మృతిఁ బొంది పొందుదు మీఁద నీపొందు
సమ్మద మార నీచన విచ్చి నన్నుఁ
బొమ్మని యానతీ పోదు వే వేగ'
యనిన భుగాలున నడరుశోకాగ్ని
మనసు సుఱ్ఱు క్కని మను జేశుఁ డనియె
'జలజాక్షి నీకిట్టిసాహసకృత్య
మలవడ నోపునే యక్కటా నీవు
తొడిబడఁ జచ్చినతోడనే బెగడి

చును=దుఃఖాతిశయముపట్టలేకనవ్వుచును, లలితమంగళసూత్రలక్ష్మి=ఒప్పుచున్న మంగళసూత్రముయొక్కసంపత్తిని-మంగళసూత్రపుబలిమి ననుట, నగుఁబాటు =నవ్వులాటసేయుఁగా- నామంగళసూత్రము వ్యర్థము కానిదని తలఁచియుండఁగా దైవమేయిట్లునన్ను అగడుసేయునేని యనుట, వగలన్ = దుఃఖములచే, సమ్మదము ఆరన్ =సంతోషమునిండఁగా, ఈచనవు = నేను ముందగ్నిలోఁబడి మృతిఁబొందెడిస్వాతంత్ర్యము, ఆనతీ=ఆనతిమ్ము, తొడిఁబడన్ = తొందర

విడివడఁ బ్రాణముల్ విడుచు నీశిశువు
సుతుఁడు నీవును జావఁ జూచి ప్రాణంబు
ధృతి నిల్పి యెట్లు వర్తింపఁగ వచ్చు
వచ్చునే నోరాడి వాక్రుచ్చి నిన్నుఁ
జిచ్చులోఁ బడు మని చెలఁగి వీడ్కొలుపఁ
గరుణ మాలినయట్టికఠినాత్ముఁ డైన
నరునిఁ బల్కినరీతి నయ మేది నన్నుఁ
బలికితి పలుకని బాష్పపూరంబు
నెలమి ఱెప్పల నిల్పి యేఁగుచు నున్న
మనుజేశునకుఁ జంద్రమతి సాఁగి మ్రొక్కి
ఘన మైనభక్తితోఁ గరములు మొగిచి
'నలినాప్తకులనాథ నావిన్నవించు
పలుకు వేఱొకటిగా భావింప వలదు
దలముగా నలుదిశల్ దలకొని మండఁ
జలిచీమ కొఱవిపైఁ జనుదెంచినట్లు

పాటుతో, బెగడి=బెదరి, ధృతిన్=ధైర్యముతో, నోరాడివాక్రుచ్చి=నోరు కదల్చి చెప్పి, 'నిన్ను...చిచ్చులోఁ బడు మని నోరాడి వాక్రుచ్చి చెలఁగివీడ్కొలుపవచ్చునే' అని యన్వయము. కరుణ... ...నరునిన్=దయలేక కఠిన హృదయుఁడైనమనుష్యునితోఁ జెప్పినట్లు, నయముఏది=మెత్తనవిడిచి, 'నన్నుఁ బలుకు పలికితి' అని అన్వయము, దలముగా ..చనుదెంచినట్లు = నలుప్రక్కల దట్టముగా కార్చిచ్చు క్రమ్ముకొని వచ్చుచుండఁగా చలిచీమ తప్పించుకొనుటకై నడుమనున్నయొకకొఱవిపైనెక్కి ప్రాఁకినట్లు నక్షత్రకుఁడు తమ్ము నండగొని యొదిఁగియున్నాఁడనుట. తమ్ము కొఱవిగా రూపించుటచే తాము నాకార్చిచ్చులో కొఱవివలెఁగాలనుండుట సూచితము. చలిచీమ కొఱవి నాశ్రయించుట యెట్లువ్యర్థమో అట్లేకాలనున్నతమ్మాశ్రయించుటయు వ్యర్థమనుట, ఉలికి=భ.

వలయంబుగా మండి వచ్చు కార్చిచ్చు
కులికి యొందును వెళ్ల నుఱికి పో రాక
సుడి వడి మనలోనఁ జొచ్చి వా తెఱలఁ
దడుపుచు నున్న యీతపసికుమారుఁ
గొంకక వెస నెత్తుకొని వెర వైన
వంకగా నీవహ్ని వలయంబు గడపు
మీవు గల్గినఁ దీఱు నీమునిఋణము
నీవు గల్గినఁ గల్గు నెలఁతలపొందు
నీవు గల్గినఁ బుత్రనివహంబు గలుగు
నీవు గల్గినఁ గల్గు నిత్యసౌఖ్యములు
నీవు గల్గినఁ గల్గు నిత్యధర్మములు
నీవు గల్గినఁ గల్గు నిఖిలభోగములు
నీవు గల్గినఁ గల్గు నిత్యసంపదలు
నీవు గల్గినఁ గల్గు నిఖిలరాజ్యములు
నెడ లేదు భాషింప నిదె చేర వచ్చె
మిడుఁగుఱు లడరంగ మి న్నంది వహ్ని
తెగువ లే కున్నను దెగుట నిక్కంబు
సుగుణాత్మ తొలుత నేఁ జొచ్చినపిదప
భగవంతుఁ డొనరించుపద్ధతి జరుగు

యపడి, వెళ్లనుఱికి=వెడలదూఁకి, సుడివడి=తబ్బిబ్బుపడి, వా తెఱలు=పెద వులు, వెరవైనవంకగా=వీలయినదిక్కుగా, నివహము=సమూహము, ఎడలేదు భాషింపన్=మాటలాడుటకు అవకాశము లేదు, మిన్నంది=ఆకాశముముట్టి. మిక్కిలిపొడవుగా పెరిఁగియనుట, తెగువలేకున్నను తెగుటనిజంబు=సాహసము చేయనియెడల చచ్చుటనిశ్చయము, తొలుత......జరుగు= మొదట నేనగ్ని

తగవు మీఱఁగఁ దెంపు దయ సేయు' మనుచు
వేఁడినఁ దల వ్రేల వ్రేసి నిట్టూర్పు
వేఁడి యై నృపతి నివ్వెఱ నూర కున్న
వసుధీశు నతిభక్తి వలగొని మ్రొక్కి
మసలక చనుచంద్రమతి వెంటఁ దగిలి
'యమ్మమ్మ నీ విపు డగ్నిలో నుఱుక
సమ్మదం బొదవంగఁ జనియెద వేని
వత్తు నేనును నన్ను వదలక తిగిచి
యెత్తికొ' మ్మనుచుఁ బెల్లెసఁగు దైన్యమ్మున
గిదుకుచుఁ జిన్ని కెంగేలఁ బైకొంగుఁ
గదియించి బుడిబుడి కన్నీరు దెచ్చి
మోహ మేర్పడఁ గుచంబుల మోము రాచు
లోహితాస్యునిఁ జూచి లోనన పొక్కి
యక్కునఁ గదియించి మూఁదల నివిరి
చెక్కిలి నొక్కి యాచిన్నారిబొజ్జఁ
బుడికి చక్కిలిగింత పుచ్చి కన్నీరు
దుడిచి ముద్దులచుంచు దువ్వి మూర్కొనుచు
'నాయన్న నాకూన నాముద్దుపట్టి
మాయయ్య యీపేర్చు మంటఁ జల్లార్చి
వత్తు వేవేగ రావలదు నా తోడఁ
జిత్తె మారఁగ నీకుఁ జేకూరు శుభము'

లోఁబ్రవేశింపఁగా పిదప దైవము కావించుదారి కాఁగలదు, తెంపుదయ సేయుము= తెగువ చేసి యగ్ని లోఁబడుటకు అనుమతి యిమ్ము, నివ్వెఱ= మిక్కిలి భయము, వలగొని= ప్రదక్షిణము సేసి, కిదుకుచు= మెల్లగా శబ్దించుచు, చిన్ని కెంగేలన్ =

లని యెట్టకేలకు నాలోచితాస్యు
మనుజేశుకడ నిల్పి మఱి యొండుదలఁపు
మది లేక నిల్చి యమ్మగువ ప్రాణేశుఁ
బదిలంబుగా మనఃపద్మంబునందు
ధృతి నిల్పి చంద్రమతీదేవి భక్తిఁ
బ్రతిముఖం బై యగ్నిభట్టారకునకుఁ
దరుణప్రవాళసుందరకాంతిఁ దనరు
కరపల్లవంబులు గర మొప్ప మొగిచి
'వరద వైశ్వానర వరదయాలోల
దురితసముత్కరతూలవాతూల
మదిలోన వాక్కున మఱి చేతలందు
వదలక పతిభక్తి వఱలుదు నేని
నరలోకనుతుఁ డైన నాకూర్మివిభుఁడు
పరమసత్యంబు దప్పక మను నేని
పరమశీతలుఁడ వై ప్రాణదానంబుఁ
గరుణ మైఁ దొలుత నక్షత్రుని కొసఁగి
మునినాథుఋణమున మునిఁగి పోకుండ
మనుజేశుఁ గొడుకును మఱి కావు' మనుచుఁ
జెచ్చెర రాయంచ చెంగల్వకొలనుఁ
జొచ్చినగతిఁ జిచ్చుఁ జొచ్చి యానడుమఁ

సొగసైనచిన్నయెత్తునిచేతితో, తరుణప్రవాళసుందరకాంతిన్ = లేఁతచిగుళ్ల వంటిసొగసైనకాంతితో, దురిత...తూల- దురితసముత్కర=పాపసమూహమను నెడి, తూల=దూదికి, వాతూల=గాలియైనవాఁడా-గాలి దూదిని పింజెలుగా నెగురఁగొట్టునట్లు పాపసమూహమును నాశముసేయువాఁడాయనుట, కలశ

గలయఁ బూసినకింశుకంబులలోనఁ
జెలువారు చున్న రాచిలుకచందమునఁ
బ్రబలసంధ్యారాగపటలంబునందు
సొబ గొందు క్రొన్నెలసోగబాగునను
మలసి మండెడుపెనుమంటలలోన
నిలిచి మైదీఁగెకాంతికి వన్నె నిగుడ
దీపింప రానిపాతివ్రత్యమహిమ
కేపార వెఱఁ గంది యెల్ల దేవతలుఁ
బొరిఁ బొరి నుతియింపఁ బువ్వులవాన
గురిసె నప్పుడు వహ్ని గొబ్బున నడఁగ
నిగుడుకీలలు మాని నివుఱు పైఁగప్పి
పొగులుట లుడిగి నిప్పుకలు సల్లారె
నావిధంబునను దావాగ్ని సల్లారి
పోవుటయును మహాద్భుతముగా మెఱసి
తలపువ్వు వాడక తరుణీలలామ

బూసినకింశుకములు-అంతటనుఎల్లిగా పూచియున్న మోదుగుచెట్లు, ప్రబల... పటలమునందు = దట్టమైన సంజకెంజాయలసమూహమునందు, సొబగు ఒందు= అందగించునట్టి, క్రొన్నెలసోగబాగునను=లేఁతయై నిడుదగానున్న చంద్రరేఖ విధమున - ఇట చెంగల్వకోలను, పూచినమోదుగుచెట్లు, దట్టంపుసంజకెంజాయలు అగ్నికిని, రాయంచ, రాచిలుక, క్రొన్నెలసోగయనునివి చంద్రమతికి నిచెప్పినాఁడని తెలియునది. మైదీఁగె...నిగుడ-తీఁగవంటి మేనికాంతికి యా యగ్నియందు మఱింతకాంతి హెచ్చఁగా, నిగుడుకీలలన్ = సాఁగుచున్న జ్వాలలను, నివుఱుపైఁగప్పి=మండుటతీసి పైని నివుఱుగ్రమ్మి, పొగులుట=కుములుట. తలపువ్వువాడక=తలయందలి పువ్వుసైతము కందక-ఇంచుకైనను కసుగందక

యెలనవ్వు సిగురొత్త నెప్పటి యట్టు
లలవడఁ జేతు లల్లార్చుచు నెదుర
నలరి యానందనృత్యముఁ జూపు చున్న
యాలోహితాస్యుని నక్కునఁ జేర్చి
పాలు చన్నులఁ జేఁపి పయ్యెద దడియ
జడిగొని హర్షాశ్రుజలముల మేనిఁ
దడిపి ముద్దాడుచు ధవునకు నర్థి
నిలఁ జాఁగి మ్రొక్కిన 'నింతి నీ యట్టి
కులసతి నాకుఁ గల్గుటఁ గాదె యిట్టి
యాపద లెడఁబాసి యలరంగఁ గలిగె
నీపుణ్యవర్తన నెగడె లోకముల
నే రట్టుఁ దిట్టు నా కెసఁగక యుండ
బోరన మునిపుత్రుఁ బ్రోచితి గాన
నీనిమిత్తంబున నెలఁత నా కింకఁ
బూని కౌశికుఋణంబును దీర్పఁ గలుగు'
నని యుచితోక్తుల నమ్మహీవిభుఁడు
తనదేవి ప్రియ మారఁ దగ గారవింప
నప్పు డా కౌశికుం డవ్విధం బెల్లఁ
దప్పక వీక్షించి తద్దయు నలిగి
'కాలాగ్నిఁ బోనియీ కార్చిచ్చు చేతఁ
గాలి వే భస్మంబు గాక తా నిలిచి
పతియును దాను నెప్పటియట్ల కలసి
సుతుని ముద్దాడుచు సురలు నుతింప

యనుట-ఇది భాషాశైలి, ఎలనవ్వు=చిఱునవ్వు, రట్టు=అపవాదము, సీమంత

నున్నది కళ్యాణి కొక్కింత నైనఁ
జెన్నఱి యుండదు సీమంతవీథి
యలికంబు నెమరింప దలకలు గమర
వెలనవ్వు గడివోవ దెసఁగదు దప్పి
చిలుకదు కన్నీరు జిగి దప్పి మేను
సొలయ దేమియుఁ బొగచూరదు వలువ
పసిమి దప్పదు కమ్మపసపు లేఁబూఁత
కసుగంద వడుగులుఁ గమరవుఁ జేతు
లీతగ వీతెంపు నీవెంపు సొంపు
లీతెఱం గీమేర లీదిట్టతనము 2320
లెందు మహాశ్చర్య మేమన వచ్చు
నిందుకళాధరుం డెఱుఁగు నొక్కరుఁడు
బాపురే నా తపోబలమునకంటె
దీపించు దీనిపాతివ్రత్యమహిమ
పతిభక్తి సతులకుఁ బరమశీలంబు
పతిభక్తి సతులకు భాగ్యమూలంబు
పతిభక్తి సతులకుఁ బరమభూషణము
పతిభక్తి సతులకు భాగ్యపోషణము
పతిభక్తి సతులకు భయనివారణము

వీథి=పాపటరేక, అలికము=నెత్తి, అలకలు=ముంగురులు, కమరవు=కాలవు, కడివోవదు = వాసనపోవదు-చెడిపోదు. చిలుకదు = తొరఁగదు-కన్నీరు కాఱదనుట. సొలయదు=బడలదు, పొగచూరదు వలువ=వస్త్రము మాఁడి పొగయదు, కమ్మపసపు లేఁబూఁత=మంచిపసపు పలుచగాఁబూసినపూఁత, కసుగందవు=కొంచెమైనను వాఁడవు, ఇందుకళాధరుఁడు =శివుఁడు, బాపురే =

పతిభక్తి నిఖిలశోభనకారణంబు
పతిభక్తి నింతికిఁ బడయంగ రాని
యతులితపుణ్యంబు లవి యెందుఁ గలవు
వెఱపింపఁ బోయి తా వెఱచినయట్టి
తెఱఁగయ్యె నింక నే తెఱఁగిట మీఁద'
నని తలపోసి హా యని వెచ్చ నూర్చి
మౌనమునఁ జలముఁ గ్రమ్మఱ నూలుకొల్పి
యడరెడు తనరూప మన్యు లెవ్వరికిఁ
బొడగాన రాకుండఁ బొందుగాఁ గదిసి
వక్షంబు మోము మోవఁగఁ గౌఁగిలించి
నక్షత్రకునకుఁ దిన్నఁగ నిట్టు లనియెఁ
'జయ్యన బహువేదశాస్త్రపారీణు
లయ్యున్ననా శిష్యు లందఱిలోన
వెలయునష్టాదశవిద్యలయందు
బలవంతుఁ గావించి పాటింతు నిన్ను
నేచందమున నైన నీ వధూమణికి
నీ చక్రవర్తిపై నెనఁగినకూర్మి
వీడి పోవఁగఁ బల్కి విరిపోటు సేసి
జోడుఁ బాపుము దాన సురసమై జరుగుఁ
గైకొని నాసేయుకపటకృత్యములు

సెబాసు, వెఱపింపఁబోయి... తెఱఁగయ్యె- ఒకరిని భయపెట్టఁబోయి తుదకు తానే భయపడినట్లు, చలము=హఠము, మోము మోవఁగన్ = మొగమువఱకు· మోమును వక్షమును ఒండొంటికి తగులునట్లుగా, విరిపోటు= వీడ్పాటు—ఎడబాటు, జోడు=జంట 'దాననాచేయుకపటకృత్యములు సురసమై జరగ

లేకున్నఁ గొన సాఁగ లేవు నిక్కువము
సేయు మీపని కార్యసిద్ధి నా కొదవు
పోయి వచ్చెద'నని పోయె నమ్మౌని
యంత నక్షత్రకుం డామహారాజు
కాంతాశిరోమణిఁ గాంచి దీవించి
"దేవి నీ దైనపాతివ్రత్యమహిమ
వేవేలదెఱఁగుల వినుతింప నరిది
యనలకీలావళి కాహుతి యైన
ననుఁ బ్రాణములు గాచి నయమునఁ బ్రోచి
తిక్షితి స్త్రీలలో నెన్నఁగా మొదలి
పక్ష మేర్పడఁగ లోపాముద్ర నెన్ని
యాయరుంధతిఁ జెప్పి యనసూయఁ బొగడి
శ్రీ యలరార శచీదేవిఁ దలఁచి
యలవడఁ గొనియాడ నగుఁ గాక యున్న
పొలఁతులు నీతోడఁ బురుడింపఁ గలరె
కరుణమై నీ యుపకారంబు నాకుఁ
బరఁగఁ జేసిననీకుఁ బ్రత్యుపకార
మొనరఁ గావించెద నొకమాట వినుము
చనవుమైఁ గౌశికసంయమి వేఁడి

ననియన్వయము. సురసమై=మిక్కిలి రసవంతముగా, అనల కీల ఆవళికిన్=అగ్ని జ్వాలలవరుసకు, ఆహుతి=బలి, మొదలిపక్షము = మిక్కిలి మేలయినతరగతి, ఏర్పడఁగాన్=తేటపడునట్లు, మొదటఅరుంధతి మొదలుగా శచీదేవివఱకుఁ గలపతివ్రతల నెన్ని వారితో పాటిగా నిన్నును ఎన్నవలయునుగాని, ఉన్న పొలఁతులు = తక్కయున్న, కేవల స్త్రీలు, పురుడింపన్ = సరిపోల,

క్రమ్మఱ నాకుఁగాఁ గైకొని రాజ్య
మిమ్ముల నీ కిచ్చి యీ లోహితాస్యుఁ
బట్టంబు గట్టింతుఁ బరఁగ నీ ముద్దు
పట్టిఁ దోడ్కొనుచు నీ పట్టణంబునకు
రమ్ము నీ కిది పొందు రాదన వలదు
నమ్ముము మృష గాదు నా మాట లతివ
యెలమిమై నటు గాక యీరాజు వెంట
నలయక వర్తింప నాశించె దేని
వనహుతాశనమహాజ్వాలాకరాళ
ఘనతరవిస్ఫులింగముల నంగములు
గమరక పోవచ్చుఁ గాక కల్పాంత
డమరు నిష్ఠుర ఢమఢమ రవ స్ఫురిత
పటుతర బ్రహ్మాండ భాండ చండీశ
చటుల రౌద్రాకృతి సమకొనఁ బేర్చు

కౌశికసంయమి = విశ్వామిత్రమునిని, 'నాకుఁగారాజ్యము క్రమ్మఱఁ గైకొని నీ కిమ్ములనిచ్చి' అని యన్వయము, పొందుగాదు=ఉచితముగాదు. మృష=కల్ల, వన...హుతాశన...విస్ఫులింగములన్ - వనహుతాశన = అడవినిప్పుయొక్క, మహాజ్వాలా= గొప్పమంటలయొక్క, కరాళ = భయంకరములైన, ఘనతర విస్ఫులింగములన్ = మిక్కిలిగొప్పవైన మిడుఁగుఱులచేత, కల్పాం...రౌద్రాకృతి-కల్పాంత=ప్రళయమందలి, డమరు=డమరువాద్యముయొక్క, నిష్ఠుర= కఠోరమైన, ఢమఢమరవ=ఢమఢమయనుశబ్దముచేత, స్ఫురిత=అల్లలార్పఁబడిన, పటుతర=మిక్కిలిపటువైన, బ్రహ్మాండభాండ = కుండలవంటి బ్రహ్మాండములుగలవాఁడైన-తనడమరు మ్రోఁతలచేత బ్రహ్మాండముల నల్లలార్చువాఁడైన యనుట, చండీశ-శివునియొక్క, చటుల=మిక్కుటమైన, రౌద్రఆకృతి=భయంకరమైన ఆకారము, సమకొనన్=జతపడునట్లుగా, కుటిలకౌశికు= వంచకుఁడైన

కుటిలకౌశికుతీవ్రకోపాగ్నిశిఖలఁ
బెట పెటఁ బ్రేలక ప్రిదిలి పో వశ మె
యదియును గాక నేఁ డాదిగా నింకఁ
బదిదినంబులు సిక్కెఁ బలికినమితికి
మునినాథుధన మెట్లు ముందఱఁ జెల్లు
వెనుకఁ జెల్లిన దఱవీసంబు లేదు
లే దుపాయం బింక లేశమాత్రంబు
మేదినీపతి కిట మీఁద నూహింప
నోదవు పేరాఁకట నుదరి హా యనుచుఁ
గదియుబెబ్బులివలెఁ గౌశికుఁ డలిగి
తడయక వచ్చి మాధనముఁ దె మ్మనుచు
నడిగి యఱ్ఱాని బి ట్టదలించెనేని
కడువడి గర్భంబు గదలి కంపించి
సుడివడి నిన్ను నీ సుతుని నక్కఱకుఁ
బోయినంతకు నమ్మి పుచ్చు భూవిభుఁడు
తోయజానన నాకుఁ దోఁచినబుద్ధి'
నావుడుఁ జిఱునవ్వు నవ్వి యారాజు
దేవి నక్షత్రకు దెసఁ జూచి పలికె
'సతి కేడుగడయును జర్పింపఁ బతియె

విశ్వామిత్రునియొక్క, పెట పెటఁ బ్రేలక = పెట పెటమని మాఁడక, ప్రిదిలిపోక = జాఱితప్పించుకొనిపోవుటకు, నేఁడాదిగాక = నేఁడు మొదలుకొని, చిక్కెఁక = మిగిలెను, మితికిక = గడువునకు, ముందఱక = ఇఁకమీఁద, వెనుకక = ఇంతకు ముందు, ఊదరి = చలించి, అఱ్ఱు ఆని = మెడపట్టుకొని, సుడివడి = తబ్బిబ్బుపడి, అక్కఱకుక = ఆవశ్యకతకు-లేక - ఆవశ్యకకార్యమునకు, ఏడుగడ = స్వామి,

పతియ చూ దైవ మెబ్భంగుల సతికి
బలవంత మగువిధి ప్రాణేశుఁ బాప
వలవంతఁ జెందినవరవధూమణికి
భారంబు హారంబు భాసురగంధ
సారం బసారంబు సారకాసార
తీరంబు దూరంబు తీవ్రసల్లాప
కీరంబు క్రూరంబు కిన్నరమంజు
నాదంబు ఖేదంబు నవచంద్రకాంత
వేదులు సూదులు విరచితోద్యాన
చూతంబు భూతంబు సురభికస్తూరి
పూఁతలు రోఁతలు పూర్ణచంద్రికల
మెఱపులు వెఱపులు మెత్తని దూది
పఱుపులు మఱుపులు పరభృతసమితి

చర్చింపఁగ=విచారింపఁగా, పాపఁగ=ఎడఁబాపఁగా, వలవంతఁగ=దుఃఖమును, వరవధూమణికిఁ = ఉత్తమురాలైన స్త్రీరత్నమునకు, హారము, భారంబు = బరువు, భాసురగంధసారంబు=మనోజ్ఞమైనచందనము, అసారంబు=పసలేనిది, సార కాసారతీరంబు=శ్రేష్ఠమైనసరస్సుయొక్క గట్టు,దూరంబు=దవ్వయినది-పోవనొప్పనిది,తీవ్రసల్లాపకీరంబు=వడిగలపలుకులుగలచిలుక, క్రూరంబు=కటువైనది,కిన్నరమంజునాదంబు= కిన్నెరవీణయొక్క యింపయినధ్వని, ఖేదము= దుఃఖము-దుఃఖకరమనుట. నవచంద్రకాంతవేదులు = క్రొత్తలై చంద్రకాంత శిలలయరుఁగులు,సూదులు=సూదులవలె నొప్పించునని, విరచిత ఉద్యానచూతము=చక్కఁగా నేర్పఱుపఁబడిన ఎలతోఁటయందలి మామిడి,భూతంబు=భూతమువలె భయంకరమైనది, సురభి కస్తూరి పూఁతలు=వాసనగల కస్తురిపూఁతలు, రోఁతలు= అసహ్యములు, పూర్ణచంద్రికల మెఱపులు=పండు వెన్నెలప్రకాశములు, వెఱపులు=భయంకరములు, మఱుపులు=మఱపునకుపాత్రములు- మఱ

కూఁతలు ఘాతలు గోదమతుమ్మెదల
మ్రోఁతలు వ్రేఁతలు ముద్దురాయంచ
మురువులు పరువులు మోహంపుఁజెలుల
సరసముల్ విరసముల్ చందనానిలపు
మెలఁకువ యలఁకువ మేల్మిచెంగావి
జిలుగులు సిలుగులు చివురుఁజప్పరపుఁ
బొంతలు వింతలు పూఁబొదరిండ్ల
క్రంతలు వంతలు కమనీయసరసి
బిసములు నుసములు పృథుమకరంద
రసములు విసములు రమ్యహిమాంబు
పూరంబు గాదు కర్పూరంబు సేఁదు
వీరుండు మారుఁ డీవిధమును గాక
ముదమునఁ గులశీలములు మదిఁ గోరి

చిపోవఁబడునవియనుట, పరభృతసమితి = కోవెలలసమూహము, ఘాతలు=దెబ్బలు-దెబ్బలవలెగడుసైనవి, వ్రేఁతలు=దెబ్బలు, మురువులు=నడలమురిపములు, పరువులు=పరుగెత్తిపోవునవి-దూరముగా పలాయితములగుననుట, చందనఅనిలపు=చందనపుఁగొండనుండి వీచుగాలియొక్క, మెలఁకువ=సంచారము-వీచుట, అలఁకువ=ఆయాసము-ఆయాసకరమనుట-జిలుగులు = సన్నవస్త్రములు, సిలుగులు=ఉపద్రవములు, చివురు చప్పరపు పొంతలు=చిగురుటాకులతోపన్నినచాకపుపందిరియొక్క సమీపములు, వింతలు= ఆశ్చర్యము-అనుభవించుటయరుదనుట, క్రంతలు=రచ్చలు-స్థానములనుట, వంతలు=దుఃఖములు-దుఃఖకరములనుట. కమనీయసరసి=మనోహరమైనకొలనుయొక్క, బిసములు=తామరతూండ్లు, నుసములు=కనరులు, పృథుమకరందరసములు=గొప్ప పూఁదేనెద్రవములు, రమ్యహిమాంబుపూరంబు=మేలైన పన్నీటిముంపు, కాదు=ఇష్టముగాదు, మారుఁడువీరుండు=మన్మథుఁడో పరాక్రమశాలి-పురుషునిఁ బాసిన స్త్రీకి మన్మథునిపరా

బ్రదుకుపతివ్రతారత్నంబులకును
బతి లేనిరాజ్యసంపద లవి యేల
పతి లేనిసుతు లేల బంధువు లేల
పతి లేనిహితు లేల ప్రాణంబు లేల
మతిఁ దలపోయ నీ మానవేశ్వరుఁడు
నా కూర్మి నిలుకడ నా తోడునీడ
నా కన్న పెన్నిధి నా నోముఫలము
నా మేలిచెలికాఁడు నా పట్టుఁగొమ్మ
నా మెచ్చువలరాజు న న్నేలురాజు
చిక్కనే కౌశికుచిక్కులఁ దగిలి
వెక్కురువడుగ యీ వెడమాట లుడుగు
నీవు నీ గురుఁడును నిఖిలనిర్జరులు
వేవేలదెఱఁగుల వినుతులు సేయ
జగ మెఱుంగఁగ హరిశ్చంద్రభూవిభుఁడు
నెగడుసత్యవ్రతనియతిఁ బెం పొంది

క్రమమునోర్చుట కష్టమనుట, ఈవిధమునుగాక = ఈప్రకారమే కాక - అనఁగా నింతవఱకుపతినిబాసిన స్త్రీకి వలపుచేఁగలుగునట్టిబాధలుచెప్పియిప్పుడు పాతివ్రత్యధర్మమునుబట్టి కలుగు నభాగ్యములను జెప్పుచున్నది, నాకూర్మినిలుకడ = నాప్రేమము ఎడతెగక నెలకొనియుండు స్థానము, నాతోడునీడ = నన్నుతోడు నీడవలె నెడఁబాయనివాఁడు, నాకన్న పెన్నిధి = నాకుదొరకిన పెద్దలిబ్బి - పెద్ద నిధివలెనాకుఁ బెంపుసొంపులన్నియుఁ జేయువాఁడు, నానోముఫలము = నేను నోఁచిననోములకు ఫలముగానుండువాఁడు, నా మేలిచెలికాఁడు = నాకు మేలయినస్నేహితుఁడు, నాపట్టుఁగొమ్మ = నాకు అధారభూతుఁడు, నా మెచ్చువలరాజు = నేను మెచ్చిన మన్మథుఁడు, 'కౌశికు చిక్కులన్ తగిలిచిక్కనే' అని యన్వయము. కౌశికుఁడు పెట్టుసంకటములందుఁ బడియు నియమముతప్పఁ

వెలయ నష్టాదశద్వీపసంధులను
నెలమిమైఁ గ్రమ్మఱ నేలు నిక్కముగ'
ననుటయు 'నిది తథ్య' మని వినువీథి
నను వెంద భాషించె నశరీరవాణి
యది విని మదిని నత్యాశ్చర్య మంది
కొదుకుచు నక్షత్రకుం డూరకుండె.

ప్రథమభాగము సమాప్తము.

డనుట, వెడమాటలు=పిచ్చిమాటలు, నిఖిలనిర్జరులు=సమస్తదేవతలు, నెగడు సత్యవ్రతనియతిన్=ప్రకాశించుచున్న సత్యమేపలికెడి నియమముయొక్క నిలుకడచేత, పెంపు=ఐశ్వర్యము, కొదుకుచున్=సంకోచించుచు.

హరిశ్చంద్రోపాఖ్యానము.

ద్విపద

ద్వితీయ భాగము.

మనుజేశు డంత నమ్మగువ నీక్షించి
'మనకు నేఁడిచ్చోట మసలుట దగదు
ముందఱ నున్నది ముయ్యేఱు నేల
యం దున్నజనులు మహాజను' లనిన
వనిత యిట్లనుఁ బ్రాణవల్లభుఁ జూచి
'పెను పొందుతత్తరపా టేమి దేవ
యొనరంగ నేలెడియొడయుఁ డెవ్వాఁడు
మన కెవ్వ రందు సంబంధబాంధవులు
మనయప్పు తెగటార్ప మది వేఁడువారి
వినిపింపు వారల విమలాత్మ' యనినఁ
జందనగంధి కాజననాథుఁ డనియె
'నిందుకళాధరుం డేలు నప్పురము
నావిశ్వనాథుఁడే యాత్మబాంధవుఁడు
దైవంబుఁ ద్రాతయు దాతయు మనకు

ముయ్యేఱు నేల='త్రిస్రోతాః' అన్నట్లుమూఁడుప్రవాహములుగా గంగానదిప్రవహించు స్థలము, మహాజనులు=గొప్పవారు-పుణ్యాత్ములనుట,ఒనరంగన్=ఒప్పట్లుగా,ఒడయఁడు=ఏలిక-ప్రభువు, ఇందుకళాధరుఁడు=శివుఁడు, త్రాత=

నగలక మునినాథునప్పన కొక్క
తెగసేయ వలయు నో దేవి యె ట్లైన'
నని కుమారునిఁ దనయాస మెక్కించు
కొని యట పోవుచోఁ గొంత దవ్వులకు
నరుణారవిందంబు లడుగులు గాఁగ
దరుల గ్రుమ్మరువనదంతావళముల
యురుతరతుండంబు లూరులు గాఁగ
సరససైకతసీమ జఘనంబు గాఁగ
సురుచిరం బగుమేటిసుడి నాభి గాఁగ
గరమొప్పుచిఱుతరఁగలు వళుల్ గాఁగ
నునుఁదీఁగనాచు లేనూఁగారు గాఁగ
నెనయ జక్కవలు పాలిండ్లును గాఁగఁ
జెలువంపుబిసములు సేతులు గాఁగ
వెలిదమ్మి వదనారవిందమ్ము గాఁగఁ
గలికిబేడిసలు వాల్గన్నులు గాఁగ
నెలకొన్నజలవేణి నెఱివేణి గాఁగ

రక్షకుఁడు, అగలక=వెనుదీయక, తెగ=విధము, అంసము=మూఁపు, అరుణఅరవిందంబులు=ఎఱ్ఱదామరలు, దరులన్=గట్టులందు, వనదంతావళములు=అడవియేనుఁగులయొక్క, ఉరుతరతుండములు=మిక్కిలి గొప్పవైన తొండములు, ఊరులుగాగన్=తొడలుకాఁగా, సరససైకతసీమ=ఒప్పిదమైనయిసుకదిబ్బపట్టు, జఘనము=కటి, సురుచిర=అందమైన, మేటి=గొప్ప, చిఱుతరఁగలు=చిన్నయలలు, వళుల్=కడుపుమీఁదిముడుతలును, నునుఁదీఁగనాచు=నిద్దమైనపాఁచితీఁగ, లేనూఁగారు=లేఁతయైననూఁగారు, చెలువంపుబిసములు= అందమైనతామరతూండ్లు, వెలిదమ్మి=తెల్లదామర, కలికిబేడిసలు= ప్రకాశించుచున్న బేడిసచేఁపలు, వాల్గన్నులు=నిడుదలైనకన్నులు, నెలకొన్న జలవేణి = నిశ్చలముగానున్న నీటి

సరవిఁ బెల్లెసఁగెడు జలకణ పంక్తు
లరు దారుమౌక్తికహారముల్ గాఁగ
నవలఁ గ్రీడించు రాయంచలరవము
నవహేమనూపురనాదంబు గాఁగఁ
బెనుపొంద నెరసిన ఫేనంబు దెలుపు
దనరారు చున్న చందనచర్చ గాఁగఁ
గూలావనీరుహకుసుమపరాగ
జాలంబు చిత్రవస్త్రంబుగా మెఱయ
జనలోకపావని జాహ్నవి గంగఁ
గనుఁగొని హస్తపంకజములు మొగిచి
నుదుటఁ గీలించి సన్నుతు లొప్ప భక్తిఁ
గదిసి నందనుఁడును గాంతయుఁ దాను
నాపుణ్యవాహినియం దవగాహ
మొాపికఁ గావించి యుచితాహ్నికములఁ
గ్రమమునఁ దీర్చి యక్కడఁ గొంత సేపు
శ్రమము దీరఁగ నిల్చి జననాథతిలకుఁ

వెల్లువ, నెఱివేణిగాఁగన్ =నిండారుజడగాఁగా, పెల్లు=మిక్కిలిగా, జలకణపంక్తులు=నీటిబొట్లవరుసలు, అరుదారుమౌక్తికహారముల్ = వింతయైనముత్తెపుసరులు, నవహేమనూపురనాదము=క్రొత్తబంగారందియచప్పుడు, పెనుపు=పెంపు, నెరసిన ఫేనంబు దెలుపు=వ్యాపించిన నురుఁగుతెల్లఁదనము, చర్చ=పూఁత, కూలా...జాంము- కూల=గట్టునందలి, అవనీరుహ=చెట్లయొక్క, కుసుమపరాగ=పుప్పొడియొక్క, జాలంబు=సమూహము, గంగనుఇంతవఱకొక స్త్రీగావర్ణించినాఁడు. జనలోకపావని = భూలోకమును పవిత్రముచేయునది, జాహ్నవి - జహ్నుమునివలనఁబుట్టినది, నందనుఁడు=కొడుకు, పుణ్యవాహిని = పవిత్రమగునది, అవగాహము=స్నానము, ఉచిత ఆహ్నికముల = తగినట్టిపగటికర్మములను,

డట చని ముందట నా వేల్పుటేటి
తటమున నురుతరద్వారకవాట
వాపీతటాకోపవనసముత్తుంగ
గోపుర ధ్వజ మణి కుడ్య విచిత్ర
తోరణ ప్రాసాద తురగ మదాంధ
వారణ రథ భట వ్రాత సామగ్రిఁ
జెన్నొందు చున్న కాశీపురిఁ జేరి
కన్నులు విలసిల్లఁగా మహీవిభుఁడు
ముదమునఁ దన దేవిమోము వీక్షించి
మదిరాక్షి యిందులమహిమ వర్ణింపఁ
బదినూఱుముఖములఫణియును జాలఁ
డిది వేదవిఖ్యాత మిది ముక్తిమార్గ
మిది స్వర్గసోపాన మిది సిద్ధసేవ్య
మిది దోషచయదూర మిది తీర్థసార
మిది భుక్తిముక్తిద మిది సత్యచరిత

వేల్పుటేటితటము- దేవనదియైనగంగగట్టు, ఉరుతర... సామగ్రిఁ - ఉరుతర= మిక్కిలిగొప్పవైన, ద్వారకవాట=ద్వారపుతలుపులును, వాపీ=నడబావులును, తటాక=చెఱువులును, ఉపవన=తోఁటలును, సముత్తుంగగోపుర = పొడవైన గోపురములును, ధ్వజ=ధ్వజములును, మణికుడ్య = రత్నమయమైనగోడలును, విచిత్ర= వింతలైన, తోరణ=ముఖద్వారములును, ప్రాసాద= మేడలును, తురగ =గుఱ్ఱములు,మదాంధవారణ=మదముచే కన్నుఁగానని యేనుఁగులు, రథ=రథములును, భటవ్రాత= బంట్లసమూహములును, సామగ్రిఁ = వీనియొక్క సంపూర్ణతచేత, దోషచయదూరము= దోషసమూహములకుదవ్వయినది- దోషములనెల్ల పోఁగొట్టునది. తీర్థసారము=శ్రేష్ఠమైనతీర్థము. భుక్తిముక్తిదము= భోగమోక్ష

మిది శంకరక్షేత్ర మిట్టిచిత్రంబు
కంతునికొఱ రోసి కన్నులు మూసి
చింత లొక్కటిఁ జేసి శివుఁ దలపోసి
యల సంతతోల్లాస మందెడువాసి
గలిగించునీకాశి ఘనపుణ్యరాశి
వామాక్షి విప్రుని వధియించునతఁడు
కామాంధుఁ డై తల్లిఁ గదిసినయతఁడు
నుడుగక సురఁ ద్రాగు చుండెడునతఁడుఁ
దొడరి సువర్ణంబు దొంగిలునతఁడు
వనితల శిశువుల వధియించునతఁడుఁ
గినుకమై ధేనువుఁ గెడపినయతఁడుఁ
గొండీఁడు గృహదాహకుఁడు గరదుండుఁ
జండాలు డఖిలదూషకుఁడును మఱియుఁ
గ్రిమి పశు మృగ పక్షి కీటాది జంతు
సముదాయ మైన నిచ్చట మృతిఁ బొంది
మిన్నేఱుజడలును మిక్కిలికన్నుఁ
గ్రొన్నెలపువ్వును గుత్తుకనలుపుఁ
బులితోలు కాసెయుఁ బునుకకంచంబు

ములనొనఁగునది. కంతునికొఱ=మన్మథునితక్కువ, సంతతఉల్లాసము=ఎడతెగని యానందము, వాసి=మేలిమి-ఆధిక్యము, సుర=కల్లు, సువర్ణము=బంగారు, కెడపిన=చంపిన, కొండీఁడు=కొండెము చెప్పువాఁడు, గృహదాహకుఁడు=ఇంటికి నిప్పుపెట్టెడువాఁడు, గరదుండు=విషము పెట్టెడివాఁడు, అఖిల దూషకుఁడు=అందఱిని దూషించువాఁడు, మిన్నేఱుజడలు=ఆకాశగంగగలజడలు, మిక్కిలికన్ను=మూఁడవకన్ను, క్రొన్నెలపువ్వంబు=క్రొత్తచందురుఁడనెడితలపువ్వును, కుత్తుకనలుపు=గొంతునందలినీలిమ. పునుకకంచము=తలపుఱ్ఱపాత్ర. పలుఁద=వెడలు

వలుఁదశూలము నస్థి వనమాలికయును
గలయిత డాత డై కమనీయరత్న
కలిత మై తలఁచినకడలనే మెలఁగు
నతులవిమానంబు నందు' ద న్నెలమిఁ
బ్రతిదినంబును ససంభ్రమముగాఁ గదిసి
యొసపరివన్నెలు నోరచూపులును
ముసిముసినగవులు మొగడచన్నులును
నసియాడునడుములు నలసయానములు
రస మొల్కుబింబాధరంబులుఁ గలిగి
యలరువిల్తుని మోహనాస్త్రంబు లనఁగ
నలరారురుద్రకన్యాసహస్రములు
వివిధభంగులఁ గొల్వ వినుతికి నెక్కి
శివలోకమున సుఖస్థితి నుండఁ గాంచు'
ననుచుఁ జిత్రంబుగా నచ్చటిమహిమ
మన మార నాచంద్రమతికిఁ జెప్పుచును
ధవళగోపురచతుర్ద్వారబంధురము

అస్థివనమాలిక=ప్రేవులమాల, ఇతఁడు ఆతఁడై = ఇచట మృతిఁబొందినవాఁడు శివునిలక్షణములను బొంది ఆశివుఁడేయై-శివసారూప్యమును బొందియనుట, కమనీయరత్నకలితము= మేలయినమణులతో పొదుగఁబడినది, తలఁచినకడలనే = తలఁచుకొన్నచోట్లనే, ఒసపరి వన్నెలు = సింగారపువగలు, మొగడచన్నులు= మొగ్గలవంటిపాలిండ్లు, అసియాడు=జవ్వాడు, అలసయానములు= మెల్లనినడలు, బింబాధరములు=దొండపండువంటి పెదవులు, అలరువిల్తుని మోహనాస్త్రములు = మన్మథుఁడు జగత్తును మోహింపఁజేయుటకై వేయుబాణములు, **ధవళ... బంధురము**—ధవళగోపుర=తెల్లనిగోపురములచేతను, చతుర్ద్వార=

ప్రవిమలముక్తాతపత్రసుందరము
నరుణవితానరమ్యమును సమీర
తరళితవృషభకేతనభాసురంబు
మణిరంగవల్లికామంటపోజ్జ్వలము
ప్రణుతగుగ్గులుధూపపటలవాసితము
పటహా భేరీ శంఖ పణవ మృదంగ
పటు ఘంటికానేకబహువాద్యరవము
కాంతాసమర్పితకర్పూరశకల
కాంతనీరాజనకాంతి శోభితము

నాలుగు హజారముల చేతను, బంధురము=మనోజ్ఞమైనది. ప్రవిమల...సుందరము—ప్రవిమల=మిక్కిలి తెల్లనైన, ముక్తా ఆతపత్ర = ముత్యపుగొడుగు చేత, సుందరము=అందమైనది, అరుణవితానరమ్యము = ఎఱ్ఱని మేలుకట్లచే సొగసైనది, సమీర...భాసురంబు—సమీర = గాలిచేత, తరళిత = కదల్పఁబడిన, వృషభ కేతన=ఎద్దుపడఁగ చేత, భాసురము=మనోజ్ఞమైనది. మణి...జ్వలము—మణి=రత్నముల చేతనైన, రంగవల్లికా = ముగ్గులతోఁ గూడిన, మంటప = మంటపములచే, ఉజ్జ్వలము=ప్రకాశించుచున్నది. ప్రణుత...వాసితము - ప్రణుత=మిక్కిలినుతింపఁబడిన, గుగ్గులు ధూపపటల = గుగ్గిలపు ధూపముల సమూహముచే, వాసితము=వాసనగలదిగా చేయఁబడినది. పటహా...రవము - పటహా=తప్పెట, భేరీ=నగారాలు, శంఖ=చిందములు, పణవ=చిన్నతప్పెటలు, మృదంగ=మద్దెలలు, పటుఘంటికా = గొప్పగంటలు, అనేక = పెక్కులైన, బహు=నానావిధములైన, వాద్య=వాద్యములయొక్క, రవము=ధ్వని, గలది. కాంతా...శోభితము - కాంతా = స్త్రీలచేత, సమర్పిత = అర్పింపఁబడిన, కర్పూరశకల = కప్పురపు తునుకలచేత, కాంత=మనోజ్ఞమైన, నీరాజన =నివ్వాళులయొక్క, కాంతి=ప్రకాశముచేత, శోభితము=ఒప్పునది. అగణిత...

నగణితకనకకుంభాభిరామంబు
నగు విశ్వనాథమహాదేవునగరుఁ
జేరి యాదేవుని శ్రీలింగమూర్తిఁ
గోరి సద్భక్తి నెక్కొనఁగ దర్శించి
ధరణిఁ జాఁగిలి మ్రొక్కి తనమోడ్పుఁగేలు
కరమొప్ప ఫాలభాగంబునఁ జేర్చి
జయ భక్తమందార సజ్జనోద్ధార
జయ సద్గుణాధార సంసారదూర
జయ సత్కృపాలోల శాతత్రిశూల
జయ హుతాశననేత్ర జలజాక్షమిత్ర
జయ మేరుకోదండ జయ విష్ణుకాండ
జయ నిర్జితానంగ శశిధవళాంగ
చారుకోమలహాస చతురవిలాస
గౌరీమనోల్లాస కాశీనివాస
యీకాశికునిఋణం బీకాశిలోన
దీకొని తీర్పఁగాఁ దెరువు గల్పింపు'

రామంబు - అగణిత=లెక్కింపరాని, కనకకుంభ=బంగారుకలశముల చేత, అభిరామంబు=మనోజ్ఞమైనది, భక్తమందార=భక్తులకు కల్పవృక్షమువంటివాఁడా, సజ్జన ఉద్ధార=సత్పురుషులను ఉద్ధరించువాఁడా, శాత=వాఁడియైన, హుతాశననేత్ర=నిప్పుకన్నుగలవాఁడా, జలజాక్షమిత్ర=విష్ణువునకు చెలికాఁడా, మేరుకోదండ=మేరుపర్వతము విల్లుగాఁగలవాఁడా, విష్ణుకాండ=విష్ణువుబాణముగాఁగలవాఁడా, నిర్జితఅనంగ = జయింపఁబడిన మన్మథుఁడుగలవాఁడా, శశిధవళాంగ = చంద్రునివలె తెల్లనిఅంగములు గలవాఁడా, చారుకోమలహాస = సొగసై మృదువైన నవ్వుగలవాఁడా, దీకొని=ఎదుర్కొని-పూని, తెరువు=మార్గ

మని సన్నుతులు సేసి యచ్చోటు వాసి
మనమార నా చంద్రమతియును దాను
భుక్తి ముక్తులు రెండుఁ బోలంగ నొసఁగు
భక్తవత్సలుఁ గాలభైరవుఁ గొలిచి
భసితత్రిపుండ్రంబు ఫాలలోచనము
నిశితత్రిశూలంబు నీలకంఠంబు
భోగీంద్రహారంబుఁ బునుకకప్పెరయు
నాగకంకణమును నల్లనిమేను
మరులుకెంజడలును మణికుండలములుఁ
జిఱుగజ్జెమొలనూలు సింగినాదంబు
డాకాలిపెండెంబు డమరువుఁ గత్తి
రాకాసితలలతోరపువనమాల
సెలవిపైఁ జిఱునవ్వు చిలికెడుమోముఁ
గలిగి యుజ్జ్వలరత్నఖచితంబు లైన
యోగవాగలు మెట్టి యొకపాద మూఁది

ము ఉపాయము, భసితత్రిపుండ్రంబు = బూదిమూఁడురేకలు, ఫాలలోచనము = నొసటికన్ను, నిశితత్రిశూలంబు = వాఁడియైనత్రిశూలము, భోగీంద్రహారంబు = సర్పశ్రేష్ఠుఁడైన వాసుకి అనెడుహారము, పునుకకప్పెర = కపాలపాత్ర, నాగకంకణము = సర్పముల కడియము, మరులు కెంజడలును = మోహముగొలిపెడు ఎఱ్ఱనిజటలును, చిఱుగజ్జె = చిన్నగజ్జెలు, సింగినాదంబు = పొడదుప్పికొమ్ముతో చేయఁబడిన యోగుల సుషిరవాద్యవిశేషము, డాకాలిపెండెంబు = ఎడమకాలిపెండేరమును, డమరుగము, రాకాసి⋯వనమాల-రాకాసితలల=రాక్షసుల శిరస్సులచేతనైన, తోరపు = పెద్ద, వనమాలయు, సెలవి= పెదవిమూల, ఉజ్జ్వలరత్నఖచితము = ప్రకాశించురత్నములచే పొదుగఁబడినది. యోగ వాగ

బాగుగా నొసపరిబాగు నటించు
నాదేవదేవుని యానందమూర్తి
మోదంబుతోఁ జిత్తమున నిల్పి మ్రొక్కి
మఱియు నచ్చట మణిమంత్రౌషధములఁ
గఱవక యుండ వాకట్టి సింహముల
శరభంబులను ఘోరశార్దూలములను
వెరవారఁగా నెక్కి విహరించి యజిన
విరచితాసనభద్రవిన్యాసనరణి
నరుదుగా నాసీను లై యణిమాది
సిద్ధులు గలిగి ప్రసిద్ధు లైనట్టి
సిద్ధుల నిష్టార్థసిద్ధిగాఁ గొలిచి
మగుడి భూవిభుఁ డొక్కమఠముపొంతకును
దగఁ జేరి యున్నయత్తఱి నిప్పు లురుల
వీక్షించి యమ్మహీవిభునితో ననియె
నక్షత్రకుఁడు మది నయమింత లేక
'యచ్చుగా మాగురుం డవనీశ నీకు
నిచ్చినమితి నేఁడు నెల్లియుఁ జిక్కెఁ
బచ్చపైకము గూడఁ బడినది లేదు

లు=యోగసిద్ధులుమెట్టుపాదుకలు, ఒసపరిబాగు=శృంగారవంతునివిధము, వాకట్టి=నోరుబంధించి, శరభము=ఎనిమిదికాళ్లమృగము, శార్దూలము=పెద్దపులి, అజిన...సరణిన్=అజిన-కృష్ణాజినముచేత, విరచిత=చేయఁబడిన, ఆసన=ఆసనముయొక్క, భద్ర=శుభమైన, విన్యాస = రచనయొక్క, సరణిన్=విధమున, నిప్పులు ఉరులన్ = కన్నుల నిప్పుకలురాలఁగా, నయము = మెత్తఁదనము, ఇచ్చినమితిన్ = పెట్టినగడువులోపల, నేఁడును ఎల్లియున్ చిక్కెను = నేఁడు రేపును మిగిలెను, పచ్చపైకము = బంగారుపైకము, కూడఁబ

తచ్చలు పచరించి తటమటించెదవు
యిప్పు డేమఱిపాటు నిటకు నేతెంచి
ముప్పిరి గొనుకోపమునఁ గౌశికుండు
నన్ను వీక్షించి యీనరనాథుమీఁద
మిన్నక తరువుండి మితివ్రాక మున్నె
పన్నుగాఁ దె మ్మన్నపసిఁడిచౌకముల
నెన్నము నీవన్న నెచట నేఁ దెత్తుఁ
బసిఁడిఁ దె మ్మనుచు నేఁ బలుమాఱు వేఁడ
మిసుగ వేనుఁగుగవ్వ మీటినయట్లు
చదువు నంతరమాయెఁ జాలు నీజాగు
తుద లేదు పీనుఁగుతోడిజాగరము
బోయబొంకులు బొంకి పోయెదో లేక
మాయప్పు నేఁటితో మాన్పి పుచ్చెదవొ
నిను నేఁడు ముఖమున నెత్తురు ద్రొమిఁ
గొని గుల్ల పఱుపక కొలికికి రావు

డినది=కూడినది - స్వార్థమునఁబడు. తచ్చలుపచరించి = జిత్తులునెఱపి, తటమటించెదవు=మోసపుచ్చెదవు,ఏమఱిపాటు=పరాకుగా-అదాటున,పన్నుగాన్ = ఒప్పిదముగా, పసిండిచౌకముల=కఱకువరాలు - నాలుగురూపాయలవరా చౌకమనఁబడును. మిసుకవు=కదలవు, ఏనుఁగుగవ్వమీటినయట్లు=పెద్దగవ్వను ఎగఁజిమ్మినను కదలనట్లు కదలకున్నావనుట- చదువును అంతరమాయె=విద్యాభ్యాసమునకును అడ్డికలిగెను, పీనుఁగుతోడిజాగరము=పీనుఁగుతోఁగూడ మేలుకొనుట-పీనుఁగుతో ఎంతసేపు మేలుకున్నను తుదిలేనట్లు నీజాగునకును తుదిలేదనుట. బోయబొంకులు=కటికిబొంకులు, నెత్తురుఁ ద్రొమికొని=మొగమున నెత్తురులేకుండునట్లు చేసి- అవమానభయాదులవలన మొగమున నెత్తురు లేకపోవుట ప్రసిద్ధము. గుల్లపఱపక=గుల్లవలె తెల్లఁబాఱనీయక, కొలికికిరావు=పరిపాకమునకు రా

పట్టి గుత్తని నిన్నుఁ బ్రజలు వీక్షింపఁ
జట్టు మోయించెద సర్వథా చూడు'
మనుచు నక్షత్రకుం డంతరంగమును
మునుకొని చిల్లులు వ్రోవ నాడుటయు
జననాథుఁ డాత్మలోఁ జాలఁ జింతించి
తనయుండు నాలును దానును దక్క
నితరధనంబు లొండేమియుఁ గలుఁగ
మతము గానక చంద్రమతిదిక్కుఁ జూచి
గుడిగుడి కన్నీరు గ్రుక్కుచు నొండు
నుడువ నాలుక రాక నులివేఁడియూర్పు
లందంద నిగుడ మో మరవాంచి యున్న
చందంబుఁ జూచి యాసాధ్వీలలామ
దీపించుపతివక్త్రదృష్టివిచేష్ట
లేపార నింగితం బెఱిఁగెడియట్టి
చదురాలు గాన సంశయలేశ మైన
మదిలేక పల్కె దీమసము పెంపునను
'భూచక్రి మెల్ల నేర్పున నేలినట్టి
రాచవేల్పవు నీవు ప్రాకృతు నట్లు
పాయనిచింత విభ్రాంతిఁ గుందెదవు

వు- కార్యము తీర్పవనుట. గుత్తని=గుత్తయని, చట్టు=బండఱాతిని, చిల్లులువో వఁ=తూటులుపడునట్లు, నులివేఁడి=నులివెచ్చ, వక్త్రి=మొగము, దృష్టి=చూపు, చేష్టలు=వ్యాపారములు, ఇంగితము=మనస్సునందలి యభిప్రాయము, చదురాలు=నేర్పుకత్తె, దీమసము=ధైర్యము, రాచవేల్పవు=రాజురూపమైన దేవతవు, ప్రాకృతునట్లు=పామరునివలె, దాయంబుకల=విపత్తుసమయమున, ఒండొ

దాయంబుతల నిట్టిదైన్యంబు దగునె
మతిఁ బూని నీ సత్యమహిమ పెంపొంద
మితి రెండు దినములు మీఁద నుండఁగనె
చొప్పడ నప్పు దీర్చుట మేలు దినము
తొప్ప నొండొక టెక్క నొక్కటి దఱుఁగు
నుడితప్పు వాతప్పు నుసలక సత్య
మెడలింపఁ గనిపెట్టు నెపుడుఁ గౌశికుఁడు
శిశువులు వాపోవఁ జెక్కిలి మీఁటి
విశదాత్మ పాలుఁ ద్రావించుచందమున
నుసలక మనవెంట నుండి యీయప్పు
కసటు వాపఁగ నేఁడు గలిగె నీ వడుగు
నింటివేలుపు మన కితఁ డింక నెన్ని
కంటకంబులు వల్కఁగా కేమి దీనఁ
బేద నేనని నోరఁ బ్రేవులుఁ జూపఁ
బోదురే ఋణముఁ దెంపునఁ గొనువారు

కటిఎక్కన్ = ఒక్కొక్కటి జరుగఁగా, ఒకటి తఱుఁగున్ = ఒక్కొక్కదినము గడువులో తగ్గును, నుడితప్పు=మాటతప్పు, వాతప్పు=నోటితప్పు, చెప్పినమాటతప్పుటయు, చెప్పరానిమాట చెప్పుటయు నని రెండుతప్పులు, నుసలక =ఆలస్యములేక, సత్యము ఎడలింపన్ =సత్యమును తప్పించుటకై నుడితప్పును వాతప్పును గనిపెట్టుననుట. చెక్కిలిమీఁటి=చెంపపుడికి, అప్పుకసటు=ఋణదోషము, వడుగు=వటుఁడు, ఇంటివేలుపు=గృహదైవము, గృహదేవతవలె దగ్గఱనేయుండి శుభములిచ్చువాఁడనుట. కంటకములు=కఠినవాక్యములు, పల్కఁగాక =పలికినను పలుకనీ, ఏమిదీనన్ =దీనివలన నేమిగలుగఁగలదు, పేద నేనని నోరన్ బ్రేవులుచూపన్ = నేను పేదవాఁడను అని కడుపులోని ప్రేగులు దెలియునంత విటివిగా నోరుదెఱచి బతిమాలుకొన్నను, పోదురే ఋణము తెంపునఁ గొను

జపములు దపములు సకలదానమ్ము
లుపవాసవిధులు దేవోపచారములుఁ
గ్రతువులు నొనరించి కాంచుపుణ్యంబు
లతులితసత్యవాక్యమునకు సరియె
కావున నిప్పు డక్కఱ వాపి కొనఁగ
నేవిధంబున వెర యేమియుఁ గాన
యెడపక నను విక్రయించి చెల్లింపు
కడఁబడుఁ గొంతైనఁ గౌశికుబుణము
కడమకు నొకతెగ గల్గు నెల్లిటికి
గుడిఁ జుట్టి వచ్చినకొలఁదిమే లౌదవు
నఱమఱ లేక లెమ్మనుటయు గుండె
మెఱుఁగుఁగ్రైదువుఁ గ్రుచ్చి మెఱమి నట్లైన
నులికి భూపాలుఁ డాయుగ్మలిఁ జూచి
పలికె బాష్పములు ఱెప్పల నప్పళింప
'మదిరాక్షి యీవేఁడిమాట నా చెవులఁ
గదియించి పాపంబు గట్టుకోఁ దగునె

వారు=అప్పను కటువుగా పుచ్చుకొనువారు విడిచిపెట్టిపోదురా, అక్కఱ=నిర్బంధము, ఎడపక=ఆలస్యముచేయక, కడఁబడున్ కొంతైనన్ కౌశికుబుణము=విశ్వామిత్రునియప్పు కొంచెమైనను తగ్గును, కడమకు=మిగతయప్పునకు, ఒక తెగ=ఒకదారి, గుడి... కొలఁది=గుడి ప్రదక్షిణముచేసినంతమాత్రమునకుఁ దగినట్టి, మేలు=శ్రేయము, గుండెన్=గుండెయందు, మెఱుఁగుఁగ్రైదువు=పదను పెట్టఁగా తళతళ మెఱయు వాఁడియాయుధము, మెఱమినట్లు=నాటినదానిని ఇటు నటు మెదల్చినట్లు, ఉలికి=అదిరిపడి, ఉగ్మలి=స్త్రీ, అప్పళింపన్=ఆక్రమింపఁగా, కదియించి=పొందించి - వినిపించి, ఏవగింపన్=అసహ్యపడుకోఁగా, మా

పతి యెట్టికష్టంపుఁబని సేసి యైన
సతిఁ బ్రోచు టిది ధర్మశాస్త్రసమ్మతము
యాలి నమ్మినకష్టుఁ డనుచు నెల్లెడలఁ
జాల నిందించుచు జను లేవగింప
వదనాంబుజము వంచి వసుధఁ బెక్కేండ్లు
బ్రతికెడియామాలబ్రతు కేటిబ్రతుకు
పడతి నేఁ డిట్టు నిట్టి బతిమాలి యమ్మి
పడయఁగాఁ దగు నింద్రప దవైన నొల్ల
లెక్కింప నపకీర్తి లేనిజీవనము
నిక్కంబుగా నొక్క నిమిషంబె చాలు
నొఱలంగఁ బ్రాణుల నొత్తి కుత్తుకలు
గఱగఱ దఱిగెడికటికవాఁడైన
దయ లేక తనకళత్రము నమ్ము కొనునె
నయ మేది దీనికి నా మది సొరదు
ధనమునకై పత్ని దాసిగా నమ్మి
చనునె భర్తకుఁ గూడు చవి యని కుడువ
మరణంబు మేలు నెమ్మది దీనికంటెఁ
బరికింప' ననుడు నప్పడఁతి యిట్లనియె
'నాపద వచ్చినయప్పుడే మున్ను
దాఁపినధన మిచ్చి తగుఁ బత్నిఁ గావఁ

మాలబ్రతుకు=అతినీచపుబ్రతుకు, ఒఱలంగ=విలపించునట్లుగా, కళత్రము=భార్య, నయముఏది=మెత్తనవిడిచి, చనునె . గుడువ -'భర్తకుఁ గూడుచవియని కుడువఁజనునె' అనియన్వయము. ఆపద...గావఁ జనును = విపత్తు కలిగినసమయమందే ముందు తాను దాఁచిపెట్టుకొన్న ధనమిచ్చి తనభార్యనుగాపాడఁదగును. ప

జనుఁ బత్నినైనను జట్టిగా నమ్మి
తనకు వచ్చినబారిఁ దప్పింప వలయు'
నని చెప్పి 'నీతివాక్యస్థితిఁ గొంత
మనమునఁ దలపోయుమా చలమేల
సతి నమ్మియైన దోషముఁ బాసి పుణ్య
గతి కేఁగుసద్విధి గలిగినఁ జాలుఁ
బంకజహితవంశ పాఱున కిచ్చి
బొంకినపాపంబు పోలియ దేమిటను
బొంకిన మొగసిరి వ్రెలియు నాయుష్య
మింకుఁ దేఁకువ దప్పు నెడతెగుఁ గీర్తి
నమ్మిక మాలు మానము దూలపోవు
వమ్మగుఁ బుణ్యంబు వచ్చు నాపదలు
ధర నానృతాద్దుష్కృతం పర మనుచు
నురువడి మ్రోయుచు నుండు వేదములు

త్నినైనను...వలయును - తనకే బాధకలిగెనేని తనభార్యనైనను వెలకునమ్మి దానిని తప్పించుకొనవలయును. జట్టి=వెల, సతి...జాలు - భార్యనువిక్రయించి యైనను తనకుఁగలుగుదోషమును దొలఁగించుకొను పుణ్యగతికిఁబోయెడు మంచి విధి ఆచరించినఁ జాలును-భార్యనైనను అమ్మవచ్చునుగాని సద్గతిగూర్చు ధర్మవిధిని దప్పరాదనుట. పాఱు...పాపంబు - బ్రాహ్మణునకిచ్చెదనని చెప్పి వెనుకలేదని కల్లలాడుటవలనఁ గలుగుపాపము. పోలియదు ఏమిటను=ఏద్దానిచేతఁగాని నశింపదు, మొగసిరి=పురుషత్వపుసొంపు, తేఁకువ=బెట్టు, ఎడతెగు=విచ్ఛిన్నమగును - నడుమ నశించిపోవును. నమ్మికమాలు=తనయందు ఇతరులకుఁగలనమ్మకము చెడిపోవును, తూలపోవు=చెడును, వమ్ము=వ్యర్థము, నానృతాత్ దుష్కృ

నాలును బిడ్డలు నర్థంబు నెపుడుఁ
గాలిసంకెల లెల్లకడలను బతికి
మఱచియు వీనిపై మక్కువ సేయ
రెఱుక గల్గినధీరు లెల్లకాలంబు
వక్రంబుగా నాడ వలదు నన్నిపుడు
విక్రయింపఁగ వేళ విచ్చేయు' మనుచు
ముదమునఁ జాఁగిలి మ్రొక్కి హస్తములు
గదియ మొగుడ్చునాకళ్యాణిఁ జూచి
వనజాక్షి నిను నాఁడు వనవహ్నిఁ గూల
ననుమతించిననాకు నవఘళం బెద్ది
నాకతంబున నిట్టి నలఁకువ వచ్చె
నాకతంబున నిట్టి నగుఁబాటు పుట్టె
సారిదిఁ బెం పెసఁగురాజులదేవు లెల్లఁ
బరువడిఁ గనుసన్నఁ బనులు గావింప
నురువైభవంబుల నుండుని న్నిట్టి
వరవుగ నమ్ముకో వలసె నే మందు
నీయట్టికులసతి నీయట్టిసాధ్వి
నీయట్టిప్రియురాలి నేఁటితోఁ బాప
సమకట్టె నే పాపజాతిదైవంబు
కమలాక్షి నాపూర్వకర్మ మెట్టిదియొ

తంపరమ్=అబద్ధమునకంటె మించిన పాపములేదు, వక్రంబుగాన్=ఏసగా, అవఘళంబు=లక్ష్యము, నలఁకువ=పీడ, నగుఁబాటు=అపహాసము, కనుసన్నఁబనులుగావింపన్=నీయొక్క కనుసైగలచేతనే తెలిసికొనినీకువలయు ఊడిగములు చేయఁగా, ఉరువైభవంబునన్=గొప్పయైశ్వర్యముతో, వరవు=దాసీత్వము,

లక్కయై కరఁగదు లలన నాకిట్టి
చిక్క వచ్చుటకొ నా చిత్తంబు మిగుల
ననదవై నిన్నిప్పు డమ్ముకొ మ్మంచు
ననుమతిఁ జేసెద వకట నా గుండె
తూలదు వీలదు తునియలై పోవ
దోలంపుముద్ద గా దోపువ్వుబోఁడి
వనజాక్షి నినుఁ గూడి వర్తించు ఘోర
వనములు శృంగారవనములు నాకు
మగువ నీ వున్న కోమలతృణశయ్య
తగుహంసతూలికాతల్పంబు నాకుఁ
గలకంఠి నీ పొందు గలగిరిగుహలు
సలలితమణిచంద్రశాలలు నాకు
మలయజగంధి ప్రేమమున నీ వొసఁగు
ఫలకందమూలముల్ బహువిధాన్నములు
జలజాక్షి నేఁడు నాసామ్రాజ్యలక్ష్మి
తొలఁగి పోయినరీతి దోఁచుచున్నదియు'
ననుచు నాందోళింప నతనిఁ గ్రోధమునఁ
గనుఁగొని మఱియు నక్షత్రకుం డనియె

'లక్కయై...నాచిత్తంబు'-లలన నాచిత్తంబు నాకిట్టి చిక్కవచ్చుటకో లక్కయైకరఁగదు-నామనస్సులక్కవలె కరఁగకున్నది; నేనిట్టి చిక్కపడవలసియున్నందువలన నేమో అదియట్లు కరఁగకున్నది. అనదవై = అనాథవై, తూలదు=చెడదు, వ్రీలదు=పగులదు, ఓలంపుముద్ద గాదు= గందపుముద్ద గాదు. గిరిగుహలు=కొండబిలములు, సలలితమణి చంద్రశాలలు = మేలయినరత్నములతోఁగట్టఁబడినమిద్దెటిండ్లు, మలయజగంధి=చందనమువంటి వాసనగలదానా, ఆందోళింపక్=మిణకరింప,ఆజానుబాహులును=మోఁకాలివఱకు నందుచేతులు

'భూమీశ మాటలఁ బ్రొద్దుఁ బుచ్చెదవు
తామసం బేల నిత్తఱి వెరవేది
తరుణిఁ బాయఁగ లేక తల్లడించినను
మరి యుపాయముఁ జెప్పు మాధనంబునకు
జాగు సేయక పత్ని జట్టిగా నిచ్చి
నాగురునాథుధనంబుఁ జెల్లింపఁ
జెచ్చెర లేచి వచ్చెదో మానికడకు
వచ్చెదవో రావు వైళంబె' యనుచు
'నాసల బెట్టి నన్నడఁగింప వలదు
వేసాలు సేయక వేగ లె'మ్మనుచుఁ
జేపట్టి తివియ వచ్చిన వానితెగువ
కావసుధాధీశుఁ డాత్మలోఁ రోసి
నిమిషంబు నచ్చోట నిలువక కదలి
రమణి నమ్ముటకునై రాజమార్గమునఁ
జను దెంచు నప్పు డాజానుబాహులును
బెను పొందుమూఁపులుఁ బీనవక్షంబు
నురుతరస్కంధంబు నొఱ పగు మేను
నరనుతసింహాసనస్థితుభంగి
నరుదార జెప్ప లల్లార్పక చూచి
పురజను లాత్మలోఁ బొదలువేడుకల
నీచంద మీయంద మీరాజసంబు

ను, పెనుపొందు మూఁపులు=బలుపుగలభుజశిరస్సులు, పీనవక్షంబు=బలుపుగల ఱొమ్ము, ఉరుతరస్కందంబు=మిక్కిలిగొప్పమూఁపు, ఒఱపు=అందము, నరనుత...స్థితుభంగిక్=మనుష్యులచే కొనియాడంబడుసింహాసనమందున్నవానివలె,

నీచూపు నీయేపు నిట్టితేజంబు
నీపెంపు నీసొంపు నీ ప్రతాపంబు
నీపోఁడి మీవాఁడి మీభుజాబలము
నెందు నెవ్వరియందుఁ నెన్నఁడుఁ గాన
మిందుకళాధరుం డితఁ డగు నేని
నందివాహనము పినాకంబు నేది
కఱితోలు ఫణులకంకణహారములును
జుఱుకుఁగన్నును వాఁడిశూలంబు నెవ్వి
కరిరాజవరదుఁడు గాఁబోలు నితఁడు
కరిరాజవరదుఁ డీఘనుఁ డగు నేని
గరుడవాహన మెద్ది ఘనమైనయట్టి
సరసను నిజశంఖచక్రము లెవ్వి
పురుహూతుఁ డీఘనభుజుఁడు గాఁబోలు
పురుహూతుఁ డీఘనభుజుఁ డగు నేని
యిర వొందఁగా వెల్లయేనుంగు నేది
కరమొప్పు నలవేయిగన్నులు నెవ్వి
మనసిజుఁ డీమహామహుఁడు గాఁబోలు
మనసిజుఁ డీమహామహుఁ డగు నేని
ననవిల్లుఁ బుష్పబాణంబులు నెవ్వి

ఏపు=విజృంభణము, పోఁడిమి=రూపము, వాఁడిమి=ప్రతాపము, ఇందుకళాధరుండు=శివుఁడు, పినాకము=త్రిశూలము కఱితోలు=నల్లగజచర్మము, ఫణులకంకణహారములును=సర్పములకడియములును హారములును, చుఱుకుఁగన్ను=వేఁడికన్ను।- అగ్నినేత్రము, కరిరాజవరదుఁడు=మేటియేనుఁగునకు వరమిచ్చిన విష్ణుదేవుఁడు, పురుహూతుడు=ఇంద్రుఁడు. వెల్లయేనుఁగు=ఐరావతము, మనసిజుఁ

చనువొప్పఁగాఁ గీరజయవాజి యెద్ది
యెఱుఁగ రాదీతనియొసఁగు తేజంబు
మఱు పడ్డనిప్పుకమాడ్కి నున్నాఁడు
పరఁగ నీవిభుపదపంక్తి జాడలను
బరికింపుఁ డిదె సార్వభౌమచిహ్నములు
మరి చూడరమ్మ యీ మానినీమణిని
దెర వుచ్చునద్దంబుఁ దెగడెడు మోము
జాతినీలపురంగు జడిపించుకురులు
లేఁత చందురుఁ బిసాళించు నెన్నుదురు
మదచకోరములతో మలయు నేత్రములుఁ
గొదమలేళ్లకు సిగ్గుగొలిపెడిచూపు
విరులవిండ్లకు నమ్ము వేసినబొమలు
సరసచంపకము మెచ్చనినాసికంబుఁ
దెలిమొల్లమొగ్గలఁ దెగడుపల్వరుస
పులకండ మొలికెడుబొమ్మంచు మోవి
చీఁకటి విరియించుచెఱునవ్వు పసిఁడి

డు=మన్మథుఁడు, ననవిల్లు=పుష్పధనువు, కీరజయవాజి=చిలుకయనెడు జయప్రద
మైనగుఱ్ఱము, మఱుపడ్డ=నివుఱుగప్పిన, పదపంక్తిజాడలను= అడుగులవరుసల
జాడలందు, పరికింపుఁడు = చూడుఁడు, తెరవుచ్చునద్దంబు = గవిసెనతీసిన
యద్దము, జాతినీలపురంగు=మేలుజాతినీలమణులవన్నెలను, పిసాళించు=పోలు,
మలయు=మాఱాడు, కొదమలేళ్లు=చిన్నలేళ్లు, సిగ్గుగొలిపెడు=సిగ్గుఁబుట్టించు,
విరులవిండ్లకున్=పూలవిండ్లకు, అమ్ము వేసిన=బాణముదొడిగినట్టి-బాణముదొడు
గఁగా వంపుగావంగియున్న పూలవిండ్లవలె బొమలున్నవనుట, సరసచంపకము=
మేలైన సంపెఁగమొగ్గను, నాసికంబు=ముక్కు, బొమ్మంచు మోవి = ఎఱ్ఱని

రేకులతోఁ నెదిరించుచెక్కిళ్లు
కంతుసంకుకు బొమ్మ గట్టినగళము
దంతికుంభముల నదల్చుపాలిండ్లు
చిగురుటాకుల నిరసించుహస్తములు
గగనంబుతోఁ బరిఘూణించునడుము
తేఁటితెక్కలదండఁ దెగడునూఁగారు
వాటమై త్రొక్కి నిల్వఁగ వచ్చుపిఱుఁదు
లనటికంబముల గయ్యాళించుతొడలు
ననవిల్తుకాహళల్ నగుచిఱుదొడలుఁ
గెందామరల నేవగించుపాదములు
సుందరి గా దిది సొబగురాయంచ
యంచ గా దిది నడ పారుక్రొమ్మించు
మించు గా దిది రాచమెచ్చులప్రతిమ
ప్రతిమ గా దిది పచ్చి పగడంపులతిక
లతిక గా దిది నవలావణ్యసరసి
సరసి గా దిది పుష్పచాపునిశరము
శరము గా దిది రతి సవరించుచిలుక

పెదవి, పసిఁడిరేకులు = బంగారుతగట్లు, కంతుసంకుకు = మన్మథునివిజయశంఖమునకు, బొమ్మగట్టిన=జయించిన, దంతి=ఏనుఁగు, పరిఘూణించు = మాఱాడు, దండ=సరము, గయ్యాళించు=ధిక్కరించు, చిఱుదొడలు=పిక్కలు, ఏవగించు =అసహ్యపడుకొను, సొబగురాయంచ=సొగసైనరాజహంసము, నడపారుక్రొమ్మించు=నడకగలక్రొత్త మెఱుఁగుఁదీఁగ, రాచమెచ్చులప్రతిమ= మెచ్చుకొనఁదగినరాచబొమ్మ, లతిక= తీఁగ, నవలావణ్యసరసి = మనోజ్ఞమైన లావణ్యరసమునకు సరస్సుఅయినది. పుష్పచాపునిశరము=మన్మథునిబాణము, రతిసవరించు

చిలుక గా దిది వికసించుచెంగల్వ
గలువ గా దిది చంద్రకళవంటిచెలువ
చెలువ యీ గతి విలసిల్లఁగా వలయు
వలయుఁ గాంతల కిటువలెఁ బుట్టు గలుగ'
నని ప్రజ దర్శింప నారాజు పలికె
'వినరయ్య చెప్పెద విశ్వంబులోనఁ
గానియాడఁ దగుభానుకులమున నేను
జనియించినాఁడఁ ద్రిశంకునందనుఁడ
సార్వభౌముఁడ హరిశ్చంద్రుఁ డనువాఁడ
సర్వసర్వంసహాచక్రంబు నెల్ల
నాకౌశికున కిచ్చి యతనికి మున్న
మేకొన్నధనముకై మెలఁత నమ్మెదను
సన్నుతబహువేదశాస్త్రాదికళల
నెన్నిక కెక్కుమహీసురులార
శర ణన్న ము న్నెట్టిశత్రువు నైనఁ
గరుణించు నుత్తమక్షత్రియులార
కోటికిఁ బడ గెత్తి కోరువస్తువులు
పాటించి యొసఁగుసంపాసారులార
మగఁటిమి ననిమొన మార్కొని పోరి
పగఱకు వెన్నీనిభటముఖ్యులార

చిలుక=రతి గోముగాఁ బెంచుచిలుక, భానుకులము=సూర్యవంశము, సర్వసర్వంసహాచక్రంబు=సమస్తమైనభూమండలము, మేకొన్న=ఒప్పుకొన్న, మహీసురులు=బ్రాహ్మణులు, కోటికిఁ బడగ ఎత్తి=ఒకకోటిధనమునకు ఒకపడగ ఎత్తి-అత్యం-ధనికులై, సంపాసారులార=వైశ్యులార, మగఁటిమి=ప్రతాపము, అనిమొన=

కట్టల్క వేటాఱుగా వడి వ్రేయు
రట్టఁడిబిరుదులరాహుత్తులార
పతిహితసాహసబహువిధోపాయ
చతురులై మతి కెక్కు సన్మంత్రులార
చనవరులార యోసామంతులార
ధనపతులార యోతగుదొరలార
పసిఁడిగేదఁగిరేకు పస మించుమేను
కుసుమకోమలి నిత్తు కొనరయ్య మీరు
తామరపువ్వు నదల్చు నెమ్మోము
కోమలి నమ్మెద కొనరయ్య మీరు
నెరసి క్రొమ్మించు రాణించుగన్గవల
గురుకుచ నమ్మెదఁ గొనరయ్య మీరు
మృగరాజునకు బొమ్మ మెట్టిననడుము
చిగురాకుఁబోఁడి నిచ్చెదఁ గొనరయ్య
కలహంసలకు నవఘళ మైననడపు
మెలఁతుక మీకు నమ్మెదఁ గొనరయ్య
తగవు మీఱఁగ నన్ను దయఁ జూడరయ్య
తెగడక నాకొక్క దిక్క గారయ్య
యలుగక నామాట లాలింప రయ్య

యుద్ధాగ్రము, కట్టల్క=పెనుకోపము, వేటు ఆఱుగా=ఒక్కొక్క వేట ఆఱు దునుకలుగా, రట్టఁడిబిరుదులు=నిందలేని-పొగడ్తకెక్కిన-బిరుదులుగల, పసిఁడి గేదఁగిరేకుపస=బంగారుమొగలిరేకు బాగు, క్రొమ్మించు=క్రొత్త మెఱుఁగు, రాణించు=చెలువుచూపు, గురుకుచ=గొప్పచన్నులుగలది, మృగరాజునకున్=సింహమునకు, బొమ్మమెట్టిన=గెలిచినట్టి, కలహంస=రాయంచ, అవఘళము=అతిమాత్రము,

చెలఁగి నా యక్కఱఁ జేకొనరయ్య'
యని దైన్య మేర్పడ నమ్మహారాజు
దనపత్ని నమ్ముదుర్దశఁ జూచి పౌర
వాడవాడల నెల్లవారలు గుములు
గూడి యశ్రులు జడిగొనఁ దమలోనఁ
'కటకటా యిట్టివెంగలిరాజు గలఁడె
మటుమాయతపసి యేమరులు కొల్పినను
నెమ్మదిఁ దనయేలునేలకుఁ దోడు
సొమ్ము లన్నియు నిలుచూఱగా నిచ్చి
యమ్మెదఁ గడమకై యాలిఁ గొంచ నెడుఁ
దమ్ము మాలినయట్టిధర్మంబు గలదె
యివ్వసుంధరఁ బుణ్య మెంతయుఁ జేసి
యెవ్వరు బొందితో నేఁగిరి దివికిఁ
జదువులు విని మీఁద జరుగుసౌఖ్యంబు
మది నమ్మి బ్రతుకు బ్రాహ్మణునకు నిచ్చెఁ
బనుపడ మొగిలులోపలినీళ్లనమ్మి

గుములు=గుంపులు, అశ్రులు=కన్నీళ్లు, జడిగొనక్=వానవలెఁదొరుఁగగా, వెంగలి=వెఱ్ఱి, మటుమాయతపసి=మిక్కిలి మాయలు చేయుముని, మరులుకొల్పినను=మోహపెట్టినను-తబ్బిబ్బుకలిగించినను, తనయేలు... దోడు = తానుఏలునట్టిభూమితోఁ గూడ, నిలుచూఱ=నిలువుకొల్ల-ఆపాదమస్తకము గలనిలువుసొమ్ములన్నియును కొల్లగాననుట, కడమకై=మిగతయప్పునకై, తమ్ముమాలినయట్టి ధర్మము, గలదె=తనకుపయోగింపనట్టి ధర్మమునుగలదా - తన కుపకరింపనిధర్మ మొకధర్మమగునాయనుట, వసుంధర=భూమి, చదువులు=వేదశాస్త్రాదులు, మీఁదజరుగుసౌఖ్యంబు=రాఁబోవు సుఖములు-స్వర్గరంభాభోగాదులనుట, బ్రతుకు=జీవనము-జీవనాధారమైన భూరాజ్యధనదారాదులు, పనుపడక్=గట్టిగా, మొగిలు

దోననీళ్లుఁ జల్లు వేఁదుఱుఁ డెందుఁ గలఁడె
యాలు బిడ్డలు దగులని మున్నె రోసి
చాలించి నట్టినిస్సంగుని నైనఁ
జేసిననేరమి చేసేతఁ గుడువఁ
జేసి యీబూమెలు సేసె దైవంబు'
ననుచుండ మఱి కొంద ఱకట యీ రాజు
నన నేల విప్రుల కవనివల్లభులు
దగినదానము లీరొ ధన మియ్యఁ గొనరొ
పగ గొని యీరీతిఁ బట్టి యఱ్ఱదిమి
దార లెక్కలకునై తరువులు వెట్టి
దారల నమ్మించి ధనములు గొనెడి

=మబ్బు, దోన=కొండమీఁది నీటిపల్లము, వేఁదుఱుఁడు = వెఱ్ఱివాఁడు-ఇఁక మీఁద మబ్బులు గురియఁగల వానననమ్మి యిప్పుడు సిద్ధముగా నున్నదోననీళ్లు వెచ్చించుకొను వెఱ్ఱివాఁడుగలఁడాయనుట- సందేహగ్రస్తమైన వానను నమ్మి నిశ్చితముగానున్న దోననీళ్లుఁ జల్లివైచునట్లు, సందేహాస్పదములైన స్వర్గభోగాదులను నమ్మి యిహసుఖభోగములను పోఁగొట్టుకొనుట వెఱ్ఱితనమేయని భావము; తగులు=తగులము, చాలించినట్టి నిస్సంగునిన్=సంగము వదలుకొన్నట్టి విరక్తుని, చేసిననేరమిన్ = నేరక చేసిన తప్పును, చేసేత=ఈచేతి కాచేయిగా-తోడ్తోడ నేయనుట, కుడువఁజేసి=అనుభవింపఁజేసి, ఈబూమెలు = ఈవంచనలు-ఆలు... దైవంబు=ఈహరిశ్చంద్రుఁడు రాజ్యముసేయుచున్న కాలముననే ఆలుబిడ్డలు బంధకము లని రోసి లోపల సంగమువదలికొనియున్న విరక్తచిత్తుఁడు. ఇట్టి నిస్సంగుఁడనిగూడ తలఁపక, దైవము ఇతఁడు తెలియక చేసిననేరమును తోడ్తో ననుభవింపఁజేసి యిట్లు వంచనలు చేసినదని యర్థము, అఱ్ఱు అదిమి= మెడఁద్రొక్కి-మిక్కిలినిర్బంధపెట్టి, దారలెక్కలకునై=దానముచేసినదాని లెక్కలు ఒప్పగించుకొనుటకై, తరువులు=తప్పీలు, దారలన్=భార్యలను, శఠము= ధూ

కఠినచిత్తులు లేరు గాక లోకముల
శఠ మేల నృపులతో సంయమీంద్రులకు
వెడమతు లైనయీవిప్రులజాడ
వడిముడిగాఁ జొచ్చి వాత వెళ్లుదురు
ఉపకార మోపిక నొనరించువారి
కపకార మొనరింతు రప్పుడే కడఁగి
యలగుజ్జువడుగు మూఁ డడుగుల నేలఁ
దొలితొలి బలి వేఁడి తుది నెట్లు సేసె
మరి కశ్యపాదిబ్రాహ్మణు లిల యెల్లఁ
బరశురామునిచేతఁ బడసి యా ఘనుని
నుదధిలోనైనఁ గా లూఁదంగ నీక
కదలి పోఁ ద్రోలరె గజిబిజి సేసి
యివి యన్ని యేటికి నీకౌశికుండు
తివిరి విప్రుఁడు గాక తిరిగెడునాఁడు
సొలపు దీరఁగ వసిష్ఠునియింటఁ గుడిచి
తొలఁగి పోవుచు నెన్నిదొసఁగులు సేసె
నిదె మహీతలమెల్ల నేలునీరాజు
చెదరక యిట్లేడుచేట్లను జెఱిచి
పోనీక బందెలఁ బొరలించి తపసి
దానవుం డై నల్ల ద్రావు చున్నాఁడు

ర్తత్వము, సంయమీంద్రులకున్ = మునిశ్రేష్ఠులకు, వడముడిగా- వెళ్లుదురు= భయంకరముగా నోటిలోఁజొచ్చి తిరుగనోటినుండియే వెడలుదురనుట, గుజ్జువడుగు=పొట్టిమాణవకుఁడగు వామనుఁడు, ఉదధి=సముద్రము, దొసఁగులు=కీళ్లు, ఏడుచేట్లనుచెఱిచి = సప్తవ్యసనములను భంగపెట్టి, బందెలన్ పొరలించి= నిర్బంధములఁజుట్టి, దానవుండై నల్లత్రావుచున్నాఁడు= రాక్షసుఁడై నెత్తురు

కడఁగి పీనుఁగుమీఁదఁ గంచంబు వెట్టి
కుడువగాఁ జూచుఁ గక్కూర్తిగాఁ డీతఁ
డేడ నెవ్వరు లేక యీరాజు తలనె
కూడెనే యీబలుగుత్తంపు టప్పు'
ననఁగ నందాక కొంద'అద్దిరా! చేటు
ధనికుల మని ప్రల్లదంపుఁబెంపునను
రాజులు వాటించురాణివాసముల
నోజతో నూడిగం బొనరింపఁ దమకు
వరవుడుగాఁ జేసి వరుస వర్తింపఁ
బురిలోనఁ బలుకాసిపురుషుల తరమె
కరి రొంపిఁ జిక్కినఁ గ్రమ్మఱ నెత్త

త్రాగుచున్నాఁడు-ఋషి రాక్షసునివలె పడరాని హింసలు పెట్టుచున్నాఁడనుట. పీనుఁగు...కక్కూర్తిగాఁడు=పీనుగుపయినికంచముపెట్టి తినుటకుఁగూడ ప్రాలుమాలునట్టివాఁడుగాఁడు-అట్టివాఁడు తనయాఁకటిని దీర్చుకొనుటయే ముఖ్యముగాఁ జూచునేకాని పీనుఁగుమీఁదిదని రోయనట్లు ఈఋషి తనయక్కఱ దీర్చుకొనుటేకాని యీరాజు నిట్టిపాట్లుపెట్టుటకు నసహ్యపడఁడనుట. బలుగుత్తంపుటప్పు=గొప్పదైనదట్టపుఋణము, అద్దిరా చేటు = ఔరా, చేటు =చేటు చెడుచున్నారౌరా యని యాక్రోశము. ప్రల్లదంపు పెంపునను = ధూర్తత్వముయొక్క అతిశయముచేత-అధికధూర్తత్వముతో, రాజులు...రాణివాసములన్=రాజులు అనుభవించు అంతఃపురకాంతలను, ఊడిగంబు ఒనరింపఁ దమకున్ = తమకు ఊడిగములుచేయుటకై, వరవుడుగాన్ = దాసిగా, పులుకాసిపురుషులతరమె = పచ్చతొక్క-పురుషులకు - అనఁగా అల్పులకు-వశమా, అల్పులైనవారు తమకు ధనమున్నదనిమిక్కిలిధూర్తులై, రాజులకే తగినయంతఃపురస్త్రీలను వెలకుఁగొని తమకూడిగములు చేయంబెట్టుకొన శక్యమగునాయ

కరి యోపుఁ గాక సూకర మెట్టు లోపు
ధర నింతవాని దుర్దశ నివారింప
నరు లోపుదు రె విశ్వనాథుండు దక్క'
నని యని వగచుచు నశ్రువు లొలుక
మును చిన్నఁబోయినమోములు వంచి
మరి నిల్వఁ జాలక మందిరంబులకు
నరిగి శోకాగ్నుల నలయుచున్నంత
నాపురిఁ గౌశికునాజ్ఞచే మున్నె
కాఁపురంబుగ నుండి కపటమార్గమునఁ
జెనఁటివిప్రునిరూపుఁ జేకొని మిగుల
ననువొందఁ జరియించు నాకలిరాజు
తలఁప నింతిం తనితనధనంబునకుఁ
గొలఁది గాదని సెట్టి గొడుకులు దన్ను
వారక నడుజాము వచ్చి వేఁడినను
కోరిన ధనములు 'గొండు కొం' డనుచు
నక్కఱదండఁ డై యప్ప టప్పటికి
వెక్కసంబున నూర్లు వేలు నప్పిచ్చి
ముట్టఁ జిక్కిన వేళ ముట్టి చేపట్టి
రట్ట డై తిరిగి పత్రంబులు గొనుచుఁ

నుటి. సూకరము=పంది, ఇంతవాని దుర్దశ =ఇట్టిసార్వభౌముడైనట్టివానిదురవస్థ, చెనఁటివిప్రునిరూపు = కుత్సితబ్రాహ్మణునిరూపము, సెట్టికొడుకులు=కోమటికుమారులు, నడుజాము=అర్ధరాత్రి, అక్కఱదండఁడు= అవసరముతీర్చునట్టిదిట్టఁడు, వెక్కసంబునన్=మీఁదుమిక్కిలిగా, ముట్టన్ చిక్కినవేళన్ = పూర్ణముగా తనకు చిక్కిన సమయమున-మిక్కిలియప్పులు తీయించి వారియ్యలేక తనకు దొరకినప్పుడు, రట్టడి=రాయిడికాఁడు, పత్రంబులు=దస్తవేజులు

బెట్టి వచ్చిన కల్లపెనుపులు పెనఁచి
తిట్టి వారును దానుఁ దిరిదీపు లాడు
మటుమాయలాఁడు కంబళపురీషంబు
పటికిరింతలపిల్లి పట్టినదొబ్బ
శుద్ధకష్టుం డని చూపఱ దెగడ
బద్ధకంబునఁ బెక్కు బాసలు సేసి
వృద్ధి మీఱఁగఁ జక్రవృద్ధిని మాస
వృద్ధిని లెక్కించి వెస నప్పు లెత్తి
కాలకౌశికుఁ డనఁగాఁ బేరు వడసి
కాలీచఁ జనుచు శీఘ్రముగ నింటింటఁ
బాయక పంచాంగపఠనంబు సేసి
యాయవారము లెత్తి యతిదైన్యవృత్తి
నడిగినధాన్యంబు లవి వేఱువేఱ
ముడిచినబట్టలు మూఁపుపై వ్రేలఁ
దోలు నస్థులుఁ జిక్కి తూఁగాడుమేనుఁ

కొనుచు=వ్రాయించి పుచ్చుకొనుచు, పెట్టవచ్చినక్=అప్పులు చెల్లింపరాఁగా, కల్లపెనుపులు పెనఁచి=దొంగవడ్డీలు వేసిచుట్టి, తిరితీపులాడు =కొట్లాడు,మటుమాయాలాఁడు=మిక్కిలిమాయలు పన్నువాఁడు, కంబళపురీషంబు = కంబళినంటినమలము-దానివలె అసహ్యమయ్యును తొలఁగింపరానివాఁడు, పటికిరింతల...దొబ్బ=చలము పట్టినపిల్లిపట్టుకొన్న మాంసఖండము- పిల్లిమాంసఖండము పట్టుకొనఁగాఁ దీయఁగూడనట్లు హఠము సాధించునీచుఁడు, బద్ధకమున=బలాత్కారముతో, బాసలు=ఒట్లు,వృద్ధి=వడ్డి, చక్రవృద్ధిని=వడ్డికివడ్డిని, వారవృద్ధిని=వారపువడ్డిని,అప్పులెత్తి= అప్పులుగావించి-అప్పులిచ్చి,కాలీచఁజనుచు=ఈఁకాళ్లతోనడచుచు,ఆయవారము=ధాన్యయాచన, తూఁగాడు=అల్లలాడు,పెడ

బేలు రాలెడుసిగ పెడతలఁ గణితి
పిల్లికన్నులుఁ గుఱుపీఁచుమీసములు
నుల్లిగడ్డంబు నత్యుగ్రదృష్టియును
దళ మైనపట్టెవర్ధనములు వ్రేళ్ల
నులిచినదర్భలు నుదుటిపై బొరుసు
నొరుగునొరును వెలి కుఱికినపండ్లు
యరవి దోవతియు పంచాంగంబు ముష్టిఁ
బరఁగినకరతిత్తి పత్రాల సంచి
యొరిగినగొడుగును నుసి రాలుకోల
విడువక గోహత్య వ్రేలుచు నలుక
ముడివడ రాఁజుమోమును గల తన్ను
'నదె వచ్చె నడ పీనుఁ'గనుచు నంతంతఁ
గదియుచు మై పొస్తుకంపున కెడసి
తొలఁగుచుఁ బురజనుల్ తుప్పున నుమియఁ
బలునూఱుఁ గెలఁకులు పరికించుకొనుచు
'నెవ్వఁడు మృత జాతుఁ డెవ్వఁడు రుగ్ణుఁ
డెవ్వఁడు దుర్మృతుం డీపురిలోనఁ
బ్రేతవాహకునిగాఁ బిలువ రెవ్వరును

తల=తలవెనుక, కుఱుపీఁచు మీసములు=పీఁచువంటినులిమీసములు, ఉల్లిగడ్డము=ఉల్లివంటిగడ్డము, నులిచిన=మెలిఁబెట్టిన, బొరుసు=బుడిపి, ఒరుగు=వంకర, అరవిదోవతి=కరలదోవతి, కరతిత్తి=గీతగీతలుగానుండు చిన్నసంచి, నుసి=పుప్పి, అలుకముడివడన్=కోపముసెలకొనఁగా, పొస్తుకంపునకున్=పొస్తుకాయదుర్గంధమునకు, మృతజాతుఁడు=చచ్చినవాఁడు, పుట్టినవాఁడు, రుగ్ణుఁడు=రోగి, దుర్మృతుఁడు=చెడుచావుఁ బొందినవాఁడు-పతనాదులచే అకాలమరణమునొందినవాఁడు, ప్రేతవాహకునిగా=పీనుఁగుమోయుటకై, బ్రాఁతిగాన్=మిక్కిలి

క్రొంతిగా వెడలింప బడుగులు లేవు
బ్రొహ్మరాకాసుల భోజనమ్ములకు
రమ్మని ప్రార్థింప రాఁడొక్క రుండు
పిండివంటలు నెయ్యి బెల్లంబు పప్పు
గండశాంతులఁ దృప్తిగాఁ దిన లేదు
సప్తకంబులఁబాయసము నెయ్యి పెరుఁగు
తృప్తాస్థ గా జుట్టి త్రేన్పంగ లేదు
కడికడి కొక మాడ గ్రహణకాలమున
వడి వీడ దోవతి వదలించుకొనుచు
బరు లుబ్బఁ బృష్ఠోష్ఠపర్యంతముగను
బెరుఁగువంటకము పేర్పేఁడు దిన లేదు
లేదో మృత్యువు చంప లేఁడో జముండు
కాదేని చావులు గలు వాయె జగతి
నీకొట్టికకు విప్పుఁ డెట్లు చేరెడిని
గైకొని బ్రతుక నే గతి గల దింక
మూఁకలై జనులు నిర్మూల మై చనిరొ
కాక నా వీనులఁ గవిసెనో చెవుడు

గా, వెడలింపగ = కాటికిఁ గొని పోవుటకు, బడుగులు = చిక్కిన దేహముగలవారు, బ్రొహ్మరాకాసుల భోజనమ్ములకు = బ్రహ్మరాక్షసులభోజనములకు, గండశాంతులగ = అపాయనివృత్త్యర్థమైన నివారణములందు, సప్తకంబులగ = సప్తకాశ్రాద్ధములందు – ఏడుగురినిబిలిచి పెట్టుశ్రాద్ధములందు 'తృప్తాస్థ' గాగ = 'తృప్తులమైతిమి' అనునట్లుగా, త్రేన్పంగ = త్రేఁపులువిడుచుటకు, కడికడికి = ముద్దముద్దకు బరులుబ్బ = ప్రక్కలుబలియునట్లు, పృష్ఠోష్ఠపర్యంతముగను = పెదవిమొదలుకొని వీఁపువఱకును, పేర్పేఁడు = ఒకటిమీఁదనొకటిగా, కొట్టిక = ఊరు, వీనుల ... చెవుడు = చావులు ఈయూరనందు చాలఁగలిగియు నాచెవుడుచే నాకువినరాకున్నదో య

శ్రుతిసుఖంబుగ మఱి శుష్కరోదనము
వితతంబుగా నేఁడు వినరా దదేల
నని తల పోయుచు నా హరిశ్చంద్ర
జననాథుమాటలచంద మాలించి
'చిక్కెఁబో నేఁడు నా చే మత్తికాఁడు
చిక్కులఁ బెట్టి కౌశికుని మెప్పింతు
వెదకఁ బోయినదీఁగ విస్మయం బొదవఁ
బదములఁ దగిలె నాభాగ్యంబుకతన
బెదరించి వీరల భేద మొందించి
యుదరి పోఁ దోలుదు నుర్వీశు నొండె
మనసులో దయ పుట్ట మాటలు వన్ని
పనివడ బోధించి భావంబు గలఁచి
యింతి నమ్మక యుండ నిపుడె మాన్పింతు
నంతట మిఱి దప్పు నడఁగు సత్యంబు'
వని మడిమెలు మోవ కతి సంభ్రమమునఁ
గునుకుచు సందడిఁ గోపంబు నిగుడ
మూఁగినప్రజఁ గోల మొత్తి దట్టించి
లోఁగక పాయఁ దోలుచుఁ జను దెంచి
తనమ్రోల నిల్వ నాతనిజన్నిదములు

నుట. శుష్కరోదనము = కన్నీళ్లులేనియేడ్పు, మత్తికాఁడు = వెఱ్ఱివాఁడు - వెదకఁబోయినమనుష్యుఁడు తానే యెదురుపడెననుట, మడిమలు మోవక=మడికాళ్లు ఊనక - అతిత్వరితముగాననుట, కునుకుచు=కునిసినడచుచు, సందడిఁగోపంబు=జనులకలకలమునకుకోపము, దట్టించి=అదల్చి, పాయఁదోలుచుక్ = త్రోవయిచ్చునట్లుతఱుముచు, గుఱుకొని=యత్నించి, తెలిసి మరికాని= తెలిసికొనియేకాక,

గనుఁగొని విప్రుఁడు గాఁబోలు ననుచుఁ
జెయ్యెత్తి మ్రొక్కినఁ జిఱునవ్వు నవ్వి
యయ్యవనీశుతో నవ్విప్రుఁ డనియె
'గుఱుకొని నిన్ను నీకులమును దెలిసి
మఱి కాని దీవింప మాకు దోషంబు
నీ వెవ్వఁడవు మరి నీకుఁ బేరేమి
యీవిధి సతి నమ్మ నే యక్కఱ యొదవె
నుడుగక వాతఁ గ్రొవ్వుఱుకంగఁ గుడిచి
గడిపోతువలె మేనికండలు పెంచి
కనవుఁ గట్టెలు మోయఁ గాయ పండ్లమ్మఁ
బసులజంగిలి గాయఁ బాలేరు దున్నఁ
గొఱమాలి మ్రుచ్చులఁ గూడి దూరమునఁ
జెఱవట్టి తెచ్చినచెలువ నా లనుచు
మొఱఁగి యీరీతి నమ్ముట మాకుఁ దోఁచె
నెఱిఁగి రేఁ దలవరు లిప్పుడే పట్టి
కొఱుతఁ బెట్టుదు రోరి కోమలి విడిచి
పఱచి నీ ప్రాణముల్ బ్రతికించు కొనుము

అక్కఱ=ఆవశ్యకత, వాతన్=నోటియందు, క్రొవ్వు ఉఱుకంగన్=క్రొవ్వు వెలికివచ్చునట్లు, కుడిచి = తిని - మిక్కిలి క్రొవ్వుపట్టునట్లుతిని, గడిపోతు=ఆఁబోతు, పసులజంగిలి=పశుసమూహము, పాలేరు=మేఁడిపాలికిదున్నెడు మడఁక, కొఱమాలి=ప్రయోజనములేకపోయి- మిక్కిలి బలసియున్నందులకు కసవుమొదలైనవానిని మోయుటకుఁగాని కాయలు పండ్లు అమ్ముటకుఁగాని పసులను గాచుటకుఁగాని పాలేరు దున్నుటకుఁగాని ప్రయోజనము లేనివాఁడవై యనుట, ఆలు=పెండ్లము, మొఱఁగి=ఏమఱించి, ఎఱిఁగి రేఁ దలవరులు=తలారులు తెలి

కాదేని వరువుఁడు గా దార వోసి
మోదంబుతోడ నీ ముదిత మా కొసఁగు
మెనయంగ నీతప్పు లేము వహించి
కొని కాచెదము బ్రహ్మకొడుకు వచ్చినను'
నని వెక్కుదుర్భాష లాడెడువిప్రుఁ
గనుఁగొని విభుఁ డాత్మఁ గలఁగ కి ట్లనియె
'నరసి చూడఁగ నేర వకట దురాత్మ
పరిణామములు బహుభాషలే కాని
జగతిపై సూర్య వంశమునఁ ద్రిశంకు
జగతీశునకుఁ బ్రశస్తంబుగాఁ బుట్టి
యేరాజ్య మొనరించునీకాలమునకుఁ
జోరశబ్దము సెవి సోఁకె నీ చేత
మఱి బ్రాహ్మణుఁడు వచ్చి మఱుగుఁ జొచ్చినను
దఱలక రక్షింపఁ దగుఁ గాక మాకుఁ

సికొనిరేని, వరవుడుక్ = దాసి, దారవోసి = దానముచేసి, ముదిత=స్త్రీ, ఆత్మక్=మనస్సునందు, పరిణామములు=బింకములు. ఏ...కాలమునకు=నేను రాజ్యము సేయుచుండిన యింతకాలమునకు, చోరశబ్దము...నీచేతక్=నీవుచెప్పఁగా చోరుఁడనుపలుకు నాచెవులఁబడెను. వట్టిశబ్దమే పడెననుటచే నిజముగా చోరుఁడు కలుగనే కలుగఁడయ్యెననియు, ఆశబ్దము ఇంతకాలమున కిప్పుడె వినఁబడెను. ఇంతకుఁ బూర్వము శబ్దమునుగూడ విన్నదిలేదనియు హరిశ్చంద్రుని ధర్మోత్తరపరిపాలన మహిమాతిశయము దెలియునది. నారాజ్యమందు చోరశబ్దమే వినఁబడకుండఁగా రాజగునేనా చోరుఁడనగుదునని కాలకౌశికుని నెత్తిపొడుచుట యూహ్యము. కాలకౌశికుఁడు చంద్రమతిని దొంగలించితెచ్చితివా యన్నందుల కిదియు త్తరము.ఇఁక కోమలిని మాకు దానముచేసితివేని నీతప్పులను మేమారోపించుకొని నీకపాయములేకుండఁ జేసెదమన్న కాలకౌశికుని వాక్యమున కు త్తరమిచ్చుచున్నాఁడు 'మఱి...చోరబాఱఁదగునె' బ్రాహ్మణుఁడు భ

బరభయంబునఁ జిక్కి పాఱి నీ మఱుఁగుఁ
జొరఁబాఱఁ దగునె యీచొప్పగు నేని
బాణాసనం బేల బాణంబు లేల
ప్రాణంబు లేల కృపాణంబు లేల
ప్రబలమత్తేభకుంభస్థలమాంస
కబళమహోల్లాసకంఠీరవంబు
ముదిసిన నాఁకొన్న ముట్టఁ జిక్కినను
బొదలుమాంసము డించి పులు మేయఁ జనునె
దారుణకరవాలధారాహతారి
వీరకోటీరనవీనమాణిక్య 590
రంగవల్లీ రణరంగవిఖ్యాత
మంగళవిజయరమాకరగ్రహణ

యపడి మమ్ము శరణుసొరఁగా మేము కాపాడువారమే కాని మేముభయపడి నీబోఁటివాని మఱుఁగుఁజొచ్చువారము గామనుట, ఈచొప్పుఅగు నేని=ఇట్లు నిన్ను శరణుఁజొచ్చుట మాకుఁగలిగె నేని, బాణాసనంబు=విల్లు, కృపాణము=కత్తి, ప్రబల...కంఠీరవంబు - ప్రబల=మిక్కిలి బలవంతమైన, మత్తేభ=మదపుటేనుఁగులయొక్క, కుంభస్థల=కుంభస్థలములందలి, మాంస=మాంసమును, కబళ=మ్రింగుటయందు, మహోల్లాస=మిక్కిలియుల్లాసముగల, కంఠీరవంబు=సింహము, ముట్టఁజిక్కినను=పూర్ణముగా పట్టువడినను, పులు=గడ్డి, దారుణ...ప్రశస్తము - దారుణ=భయంకరమైన, కరవాలధారా=కత్తివాదరచేత, హత=చెండఁబడిన, అరి=శత్రువులయొక్క, వీరకోటీర=వీరసూచకములైన బాహుపురులందలి, నవీనమాణిక్య=క్రొత్తమణులచేతనైన, రంగవల్లీ=ముగ్గులుగల - శత్రురాజుల భుజములను నఱుకఁగా వారిబాహుపురులనుండి రాలినరత్నములచే ముగ్గులు పెట్టఁబడినయనుట, రణరంగ=యుద్ధరంగమనెడి పెండ్లిరంగమందు, విఖ్యాత=ప్రసిద్ధకెక్కిన, మంగళ=శుభమైన, విజయరమా=జయలక్ష్మియొక్క, కర

శస్త్రమై నట్టియాక్షత్రియోత్తముని
హస్తమేరీతిని నలవడుఁ గృషికి
వడి నుక్కడాయంబు వచ్చిన ధైర్య
ముడిగిన దైన్యంబు నొందిన నగరె
మున్ను విశ్వామిత్రమునిమఖంబునకుఁ
బన్నుగా నే నొడఁబడుధనంబునకు
మితిఁ జేసి చెల్లింప మేకొని వచ్చి
సతి నమ్మెదను హరిశ్చంద్రుఁ డట వాఁడ
జులుము లేటికి నొందుసుద్దులు మాని
తొలఁగుము నాలోనితుందుడు కార్పఁ
గలవాఁడ వేని నిక్కములు వేవేలు
వెలఁదికి విలువగా వేవేగ నిమ్ము
నావుడు విప్రుఁ డానరనాథుఁ జూచి
'భావింప నీవాక్యపద్ధతిఁ గొంత
నిజము గానఁగ వచ్చె నీయెడ మాకు
విజయోఽస్తు భూపాల విను మొక్కబుద్ధి

గ్రహణశస్త్రము=పాణిగ్రహణము చేత పొగడ్త కెక్కినది. ఇది హస్తమునకు విశేషణము. ఇట యుద్ధరంగమును పెండ్లిగాను అందు రాలినరాజుల కోటీరమణులు ముగ్గులుగాను పెండ్లికూఁతురు జయలక్ష్మిగాను రూపితములని తెలియునది. ముగ్గులుగాఁదీరుటకు లెక్కలేనిరత్నములు రాలవలయునుగాన లెక్కలేని శత్రురాజులు హతులగుట సూచితము. శత్రురాజుల ననేకులవధించి జయముగొన్నవాఁడనని భావము. కృషికిఁ=దున్నుటకు-దున్నుకొని బ్రతుకరాదా యన్నందులకిదియుత్తరము. ఉక్కడాయంబు=మిక్కుటమైనయాపద, మితిఁజేసి=గడువుపెట్టి, మేకొని=ఒప్పుకొని, జులుములు=దుండగములు, నాలోనితుందుడు

నప్పులు గొని త్రోచుననువులు గొన్ని
చెప్పెద నా మాటఁ జేసెద వేని
తనడంబు దప్పక ధనికులయిండ్ల
కనువునఁ జని వారి కనురాగ మొదవ
రిత్త మ్రొక్కులు మ్రొక్కి ప్రియములు పలికి
నెత్తిఁ జేతులు వెట్టి నిక్కముల్ నొడివి
తెరలఁ దియ్యనిపండ్లతీపులు మరిపి
చరణసేవలు సేసి చనవులు మెఱసి
యిమ్ములఁ దనపేర్మి నెంతయుఁ జెప్పి
నమ్మికఁ బుట్టించి నయములు సేసి
గడుసరిమనసులు గరఁగించి పుచ్చి
జిడికిరింతలు గట్టి చెవి యూన కున్న
*(బోలుసొమ్ములు లక్కబొదవులు గాజు

కు=నామనస్సులోనికోంచలము- తాపమనుట. అప్పులుగొని త్రోచుననువులు=అప్పులుదీసికొని యియ్యక త్రింగి యుబుసుపుచ్చు నుపాయములు, డంబు=ఆటోపము, రిత్తమ్రొక్కులు=మనః పూర్వకముకాని నమస్కారములు, నెత్తిఁ జేతులు...పలికి=నెత్తిమీఁద చేయిపెట్టి తాముచెప్పినదెల్ల నిజములని శపథములు చేసి, తెరలఁ దియ్యనిపండ్ల తీపులుమరిపి=చక్కఁగా మాఁగినపండ్లతీపులయందు వారిని మరిగించి వశముచేసికొని, పేర్మి=పెద్దఱికము, గడుసరిమనసులు=కటువులైన మనములు, చిడికిరింతలు=మోసపుమాటలు, చెవియానకున్నన్=ఇట్లు యుక్తులచేసి మోసములుపన్నియు తమమాటలు వారిచెవిలో నెక్కకున్నయెడల ననుట, ఇఁకఁ జేయవలసిన మోసపుఁగార్యములను జెప్పుచున్నాఁడు:—లక్కబొదువు

* ఈమండలీకరణములోనిది పెక్కుప్రతులఁ గానరాదు. కనుకఁ బ్రక్షిప్తము గానోపు. ఇది లేకయేయున్నఁ గథాప్రణాళిక మిక్కిలి యొప్పిదముగానుండును.

జాల మాయ పసిఁడిజలపోసనములు
లోహచితంబులై లోలత మించు
నేహారంబులు గొన్ని నీలాల నమర
గుప్తంబుగా రాత్రి గొనిపోయి దీప
దీప్తిఁ గ్రొమ్మెఱుఁగుల దీపించు నట్టి
'రాజులచెవిఁ బడి రవ్వ గాకుండ
నోజతో నివి దాఁచు డొండెడ' ననుచు
మొఱుగు మొఱఁగిన ముద్రగా ముడిచి
తఱుచుగా లక్కముద్రలు మీఁద నొత్తి
యాహికంబులు వెట్టి యవి దక్కమితులు
సాహసంబునఁ బల్కి సాక్షులఁ బెట్టి
ప్రబలంబుగా వడ్డి పాఱక మున్న
కుబుసంబులోఁ జే మగుడ్చు చందమున

లు=లక్కబొందులు, మాయపసిఁడి జలపోసనములు=కాకిబంగారు మొలాములు, లోహచితంబులు-ఇనుముతోఁ జేయఁబడినవి, నేహారంబులు=తావళములు, దీప... దీపింపన్=దీపపు వెలుతురున! తళతళమని క్రొత్తకాంతులు ప్రకాశించునట్లు-బూటకపుసొమ్ములు గావున పగటఁగాక రాత్రులందు దీపము వెలుతురున దాని కల్లఁదనము వెలువడకుండునట్లు, రాజులు...గాకుండ-రాజులువినిరా యీసొమ్ము ఝగయికొందురుగావున వారిచెవిలోఁబడి యల్లరి కానట్లు. దాఁచుఁడు=దాచిపెట్టుఁడు, మొఱగు మొఱఁగి=మోసపుమాటపలికి, ముద్రగాముడిచి=కట్టగా కట్టి-విప్పియిచ్చినచో బూటకము బయలుపడునని భావము, తఱుచుగా...నొత్తి= మిక్కిలియు లక్కగాల్చి విప్పకుండునట్లు ముద్రలువేసి, యాహికములు=కుదు లు, మితులు సాహసంబునన్ పల్కి=గడువులుతప్పితే ఈయొట్టు ఆయొట్టు అ సాహసవాక్యములాడి, ప్రబలముగా ..మున్న=మిక్కిలిగా వడ్డి పెరుఁగకము న్నె, కుబుసంబులో...చందమున-చేయి చొక్కాలోఁదూర్చి మరలఁ దీయ

నచ్చుగాఁ దీర్తు మీ రాయప్పని కొన్ని
యచ్చికబుచ్చిక లాడి పత్రములు
గొంటక యిచ్చి యాక్రియ నూఱు వేలు
గంటఁబిడకలు గట్టి గైకొని పిదప
లందుబోతులఁ దనలాగు పెక్కు లజ్జ
బందలఁ గొందఱఁ బాటించి తెచ్చి
టక్కరి పూటతాటలు సేసి ధనము
చక్కనఁ గైకొని జరిగినపిదపఁ
దనజాడ దెలిసి క్రంతకుఁ దీసి రేని
మనమున బెదరక మానంబు విడిచి
కట్టుఁ గొట్టును బడి కరకరి కోర్చి
చట్టు వెట్టిన మోవి సరి యాక నుండు
ఘుటికసిద్ధుఁడు రాయిఁ గొట్టిన గొడ్డ
లటమటకాడు మహామాయలాఁడు

నట్లు - అతిరహస్యముగాననుట, అచ్చికబుచ్చికలు=కలుపుగోలుతనములు, కంట ... గట్టి=కంటిలో పిడకలుగట్టి-కన్నుఁబొ)మియనుట. లందుబోతులు=దుండగీండ్లు, దనలాగు పెక్కు లజ్జబండల = తనవంటిలజ్జమాలిన ధూర్తులను, టక్కరి పూఁటతాటలు=జిత్తులమారి పూఁటకాఁపుమోసములు - మోసపుపూఁటకాఁపుతనములనుట- మోసగాండ్రను పూఁటకాఁపులుగా పెట్టియనిభావము. జరిగినపిదప=తానుదీసికొన్న ధనమంతయు వ్యయమైనపిదప, తనజాడ = తానుధనమంతయు లేకుండుజాడ, క్రంతకుక్ = రచ్చకు, కరకరి=క్రూరత్వము, చట్టు=చట్రాయి-దండనార్థము పూర్వము చట్టురాతిని అపరాధులపై మోపించుట గలదు, ఆఁక=చెఱ, ఘుటికసిద్ధుఁడు=గుళికగలయోగసిద్ధుఁడు, రాయిఁగొట్టిన గొడ్డలి=రాతిని బగులఁగొట్టినగొడ్డలి,అటమటకాఁడు = మోసగాఁడు, గడుసు

గడుసు తుంటరి జోగి గ్రక్కిన ముడుసు
ముడి దిన్న నక్క ముమ్మోటు పిసాళి
బలు కత్తి రాతికిఁ బాసినగొంటు
ఇలలోన నిట్టి మహేంద్రజాలకుని
చేపడ్డధనములు సేరునే మగుడ
వాపోవునే పిల్లి వడిఁ దిన్నకోడి
విసికితిమని తారె వేసారి యప్పు
లొసఁగినవారెల్ల నొల్లక తొలఁగ
నెమ్మది దానుంట నేర్పది గాక
నిమ్మల నీరీతి నిల్లాలి నమ్మి
దీనతమైఁ దల దెగి పడి యప్పు
పూని దీర్చెదనంట బుద్ధిలోపంబె
పెట్ట లేనని తొట్టు పెట్టి బొంకినను

తుంటరి=మొఱకుఁడైన దుష్టుఁడు,జోగి గ్రక్కినముడుసు=భిక్షుకుఁడుమిసనయెముక, ముడి దిన్న నక్క = బుడిపినిదిన్నట్టినక్క, ముమ్మోటు = మూఢశిరోమణి, పిసాళి=జిత్తులమారి, బలుకత్తిరాతికిఁబాసినగొంటు=పెద్దనల్లరాతికినలఁగక తప్పించుకొన్న గొంటువక్క, మహేంద్రజాలకుని = ఇట్టిమహేంద్రజాలములుసేయువాని-మాయలాని, చేపడ్డ=చేతదొరికిన, చేరునేమగుడన్ = ఇచ్చినవానికి మరల లభించునా? లభింపవనుట. వాపోవునే...కోడి = పిల్లితిన్నట్టికోడి అఱచునా-మాయలానిచేతఁబడ్డ ధనము మరల దక్కునా అనుట. విసికి...నేర్పు-'అప్పులొసఁగినవారెల్ల విసికితిమని తారెవేసారి అడుగనొల్లక తొలఁగఁగాఁ దాను నెమ్మదినుంటయే నేర్పు' అని అన్వయము. అదిగాక = ఆరీతిని చేయక, తలదెగిపడియప్పుదీర్చెదనంట = తలద్రెంచుకొని యప్పుదీర్చుకొనెదనుట - తలపోయినవెనుక అప్పుతీర్చినను తీర్పకున్నను సమానమేయని భావము 'పెట్టలేనని...మునికి'-నీవు ధనము ఇయ్యఁజాలనని యొట్టుపెట్టి అబద్ధమాడి

గట్ట వచ్చు నె నిన్నుఁ గౌశిక మునికి'
నావుడుఁ జిఱునవ్వు నవ్వి యా రాజు
'వావిరి మీబోఁటి వదరుపెద్దలకు
నుపదేశ మొనరింప నోపుఁగా కిట్టి
విపరీతబుద్ధులు విన నింపు గావు
బుజ్జగింతలుఁ బొరి బొంకుమాటలును
మజ్జాతు లగువారిమాటలు గావు
జజ్జరికాఁడ నీచనుత్రోవఁ జనుము
నెరయ నీఁ గొనలేని నీవను వట్టి
పరవమాటలు సహింపవు దల' మనినఁ
గాలకౌశికుఁడు భూకాంతుని సత్య
శీలంబునకు మదిఁ జిత్రంబు నొంది
పలికె నిట్లని 'మహీపాలక నీకు
వల నొప్ప నీదురవస్థలు దొలఁగు
వెరవుఁ జెప్పిన నీకు విరసమై తోఁచెఁ
బరికించి చూడ నీ భాగ్య మెట్టిదియొ

నప్పటికిని విశ్వామిత్రునికి నిన్ను బంధింపశక్యమగునా? కావున బొంకి తప్పించుకొనుమనుట, ఓపుఁగాక = శక్యమగునుగాని, బుజ్జగింతలు = బతిమాలుకొనియాఁడించుటలు, బొంకుమాటలు=అసత్యవాక్యములు - అనఁగా, ఇయ్యవలసినధనమును ఇయ్యలేనని బతిమాలి బుజ్జగించుటగాని ఆధనమునుతీసికొన్నదేలేదని బొంకు లాడుటగాని యనుట, మజ్జాతులు=నాజాతిగలవారు = క్షత్రియులు, జజ్జరికాఁడ=వంచకుఁడా, నీచనుత్రోవఁజనుము = నీ దారిని నీవుపొమ్ము- లేనిజోలిపెట్టుకొనకుమనుట, ఈఁగొనలేనినీవు= నేను ఇయ్యఁగా వెలయిచ్చికొనలేనివాఁడవగునీవు, వట్టి పరవమాటలు = వ్యర్థములైనపలువమాటలు -

మాకుఁ దోఁచిన దొకమాటఁ జెప్పితిమి
కాక నీమతి కింతకంటకం బైన
హితవుఁ జెప్పంగ మాకేల నీకెట్టి
గతి పుట్టఁ గల దట్లు గానిమ్ము మీఁద
నాలి నంగడిఁ బెట్టి యమ్మెడు నీకు
జాలి లే దఁట మాకు సంతాప మేల
కోరినధన మెల్లఁ గొమ్మని యెల్ల
వారును జూడ సువర్ణనిష్కములు
రూపించి చొకంబు ద్రోఁచి చెల్లించి
భూపాలునకు నిచ్చె భూసురోత్తముఁడు
వలనొప్ప ముఖపద్మవాసన కెగరు
కలికితుమ్మెదలతెక్కలగాలిఁ గదలి
తిలకించుచంద్రమతీదేవికురులు
బలువిడిఁ గృపమాలి పట్టి రాఁ దిగిచి
పాపట నెఱి దప్పఁ బయ్యెద జాఱి
వీఁపున నెఱివేణి విరిసి తూఁగాడఁ
బదములు దొట్రిల్ల బాష్పముల్ రాల
వదనంబు సెమరింప వాతెఱ గంద

లేక ప్రవాహమువలె ఎడతెగకవదరునట్టిమాటలు, తలము=తొలఁగిపొమ్ము, కంటకంబు=అసహ్యము, నీకెట్టిగతి...మీఁద=నీకుమీఁద ఏగతిరానున్నదో యట్లె యదియగుఁగాక మాకేమి, చొకంబుద్రోఁచి = నాలుగేసిగా ఎంచి, ముఖపద్మవాసన=మోము దామరయొక్క తావి, కలికి=నీటు, తిలకించు = తళుకొత్తు, కురులు=తలవెండ్రుకలు, బలువిడి=బలవంతముగా, తిగిచి=ఈడ్చి, నెఱిదప్పన్=తీరుచెదరఁగా, తొట్రిల్లన్ = తడఁబడఁగా, వాతెఱ=పెదవి, రాయన్=

ఘనకుచంబులు రాయఁ గౌ నసియాడఁ
దను వెల్లఁ గంపింప ధైర్యంబు వదలఁ
దివుటమై బెబ్బులి ధేనువుఁ బట్టి
గవిఁ జేరఁ గొనిపోవుకై వడిఁ దోఁప
నాలు గేనడుగులు నడవ నీడ్చుటయు
బాలవత్సము వ్రాలెఁ బాయక వెనుకఁ
దగిలి వాపోవుచుఁ దల్లిఁ బో నీక
బిగియఁ బయ్యెదకొంగుఁ బెనఁచి చే పట్టి
యాకఁటఁ జంటి కఱ్ఱాడుచు ముద్దుఁ
గూఁకటి తూఁగాడఁ గునియుచు నున్న
సుతు లోహితాస్యునిఁ జూచి భూపాలుఁ
డతిదుఃఖితాత్ముఁడై యశ్రువు లొలుకఁ
దాలిమి వదలి గద్గదకంఠుఁ డగుచుఁ
గాలకౌశికునితోఁ గదిసి యిట్లనియె
'నెలమి ధేనువు విక్రయించుచోఁ గ్రేఁపుఁ
దొలఁగింతురే తల్లిఁ దొలఁగఁగాఁ జేసి
నాకులభూషణు నాకూర్మిపట్టి
నీకొమారునిఁ గొను మిచ్చెద నీకు
విలువ వీనికి వేయి వేలు నిష్కములు
వల నొప్ప నొసఁగుము వసుధామరేంద్ర

ఒకటితో నొకటి యొరసికొనఁగా, అసియాడన్ =అల్లలాడఁగా, తివుటమైన్ =కోరికతో, గవిన్ = గుహను, బాలవత్సము=పసిదూడ, వాపోవుచు = ఏడ్చుచు, అఱ్ఱాడుచు=ఆతురపడుచు, తూఁగాడన్=చలింపఁగా, కునియుచున్ = ఆఁకటిచే చక్కఁగా నడవలేక కునిసియడుగులు పెట్టుచు, క్రేఁపు=దూడ, తల్లిఁ దొలఁగఁగాఁజేసి క్రేఁపుఁదొలఁగింతురే, అని యన్వయము, విలువ=వెల, విల్వఁ

నావుడు విప్రుఁ డానరనాథుఁ జూచి
'నీవు సెప్పినమాట నిక్క మంతయును
గోవు విల్వఁగఁ జన్నుఁ గుడిచెడిక్రేఁపు
గోవుతోడనె జట్టిఁ గూడి రావలదె
యక్కఱ దీరెడునందాఁక ధనము
నెక్కడఁ గొని వత్తు రెవ్వరెందైన
నోడక నఘముల కోర్చి యీ కల్ల
లాడంగ మా జంఘ లదురు చున్నవియుఁ
జక్క నీ వచ్చినజాడఁ బొ మ్మింకఁ
జిక్కఁడు కాలకౌశికుఁడు నీ చేత
యిచ్చి నాచేఁ గొన నీకుండు నోపఁ
డచ్చి నా యెదుర బ్రహ్మకుఁ బోవ రాదు
పురిలోన బందెలపో తీతఁ డనఁగఁ
బరఁగ నాపేరిఁ జెప్పఁగ మున్ను వినవె

గన్ =అమ్మఁగా, జట్టిఁగూడిరావలదే = వెలలోఁ జేరిరావలదా - ఆవువెలలోనే దూడవెలయుఁ జేరిపోయినదనుట, అక్కఱ,... రెందైనన్ = ఎక్కడఁగాని ఒక్కరియప్పునిర్బంధము తీఱునంతవఱకును వారికిఁ గావలసినంతధనము ఎవ్వరుగాని ఎక్కడనుండి కొనివచ్చియియ్యఁజాలుదురు - నీకెంతయప్పో అంతధనము నా కియ్యఁ దరముగాదనుట, అఘములకున్ = పాపములకు - అబద్ధమాడుటవలనఁగలుగు పాపములకనుట, జంఘలు=పిక్కలు - నీయొద్దనుండఁగూడక వేగ పోవలయునని నాపిక్క లదురుచున్నవనుట, చక్కన్ =సరిగా, ఇచ్చి నాచేఁ గొనన్ = నాకు ఒకటియిచ్చివైచి మరలదానిని నాయొద్దనుండి తీసికొనుటకు - నీకొడుకును నాకిచ్చివైచి మరలవానిని దీసికొనిపోవుట కనిభావము, అచ్చి = అప్పుపడి, బందెలపోతు=చెఱపెట్టుస్వభావముగలవాఁడు, కాలదట్టింతు= కాలితోఁ

కాలరుద్రుని నైనఁ గాలుని నైనఁ
గాల మృత్యువు నైనఁ గాల దట్టింతుఁ
బురుషుఁ డెవ్వఁడు నీకుఁ బూని నన్నిచట
నరుడుగా నౌను గా దనువాఁడు గలఁడె
వీఁడు నాదాసుఁడు వెలఁది నాదాసి
యేడఁ బుత్రుని నమ్మ దిఁకఁ జెప్పు' మనిన
విని యప్పు డాధూర్తవిప్రునితోడ
మనుజేశుఁ డలుకతో మఱియు నిట్లనియెఁ
'గొనియాడఁ దగువిప్రకులమునఁ బుట్టి
చను నె నీకిట్టియసత్యవాక్యములు
ప్రొద్దున లేచి నీమొగముఁ గన్గొనిన
యద్దినంబున వచ్చు నాపద లెల్ల
ని న్నొకవిప్రుని నిందింప నేల
మిన్నక తలపోయ మేదినిలోనఁ
గూడు వడ్డికి నిచ్చి కూర్చెడివారి
జాడ లిట్టివియె యాశ్చర్య మేటికిని
గులము ప్రధానమే గుణము లేకున్నఁ
గలశాబ్ధిఁ బుట్టదె కాలకూటంబు
వెడమాట లన్నియు విడిచి వే యిప్పు
డడిగిన ధనము సయ్యనఁ జౌక మెన్ని

దన్నినైతును, నీకుఁబూని=నీకుఁగావచ్చి, ఔనుగాద నెడివాఁడు = లేదుకద్దని చెప్పఁగలవాఁడు, కూడువడ్డికిఁ = కూడెడునట్టివడ్డికి, కూర్చెడివారి= ధనము గూర్చెడివారి, కలశాబ్ధి = పాలసముద్రము, కాలకూటము = హాలాహలము, వెడమాటలు= వెఱ్ఱిపలుకులు, చౌకమెన్ని =నాలుగేసిగా లెక్కపెట్టి, కాఱులు=

కొడుకుఁ గోమలిఁ దోడుకొనుచు నీ యింటి
కడ కేఁగెదవొ లేక కాఱులు వల్కి
కినిసి బ్రాహ్మణుని శిక్షింప లేరనుచుఁ
జెనఁటికోడిగములు సేసి పోయెదవొ'
నావుడు విప్రుఁ డన్నరపతి కనియెఁ
'గావరంబున నోరు గడవ నాడెదవు
చెడి కల్ల లాడినఁ జేరునే ధనము
కడపట నీకు నక్కఱ దీరదేని
పన్నుగాఁ గత్తియు బలపంబుఁ బూని
కన్నపెట్టుము సిరి గలవారియిండ్లు
నీచాత్మ ప్రొద్దున నీవు నా మొగముఁ
జూచితి గాన నాసొమ్ము నీ కబ్బెఁ
దివిరి నాకులము నిందించి నాగుణము
వివరింప నీకేల వియ్య మందెదవొ
నను విప్రుఁ డని కాచినాఁడవు గాక
కినిసి కాకున్న శిక్షింతువే నీవు

=రజ్జులు, కినిసి...రనుచు=ఎవ్వరుగాని బ్రాహ్మణుని కోపించి దండింపఁజాలరని
చెనఁటికోడిగములు = వ్యర్థపుతుంటతనములు, కావరమునన్ = క్రొవ్వుచేత,
నోరుగడవనాడెదవు=నోరికి మించిమాటాడెదవు - నోటనెంత చెప్పవచ్చునో
యంతకు హెచ్చుగాపలికెదవనుట, 'చెడి... ధనము'=ఐశ్వర్యము చెడినవాఁడు
అబద్ధములాడి సంపాదింపవలయునన్న యెడల ధనమువచ్చి చేరునాయనుట,
అక్కఱ=అప్పునిర్బంధము - పెండ్లమును బిడ్డను అమ్మికూడ అప్పుదీఱదేని, కత్తి
= కన్నపుఁగత్తి, బలపము = కన్నపుఱాయి, నా మొగము......నీకబ్బె= ఇది
హరిశ్చంద్రుఁడు నీమొగముప్రొద్దునఁ జూడరాదన్నందులకు కాలకౌశికుఁడు చె
ప్పినబదులు, 'కినిసి...నీవు' కాకున్న నీవు కినిసిశిక్షింతువే = బ్రాహ్మణుఁడనికాక

కటకటా వెఱచునె కాలకౌశికుఁడు
కుటిలవిచార నీగూబజంకెనల'
నని యిట్లు బ్రాహ్మణుఁ డామహీవిభునిఁ
గనలి తర్కింప నక్షత్రకుఁ డనియె
'వసుధీశ యీవట్టివాగ్వాద మేల
మసలక మీలోనిమలఁకలు వాయఁ
దగవు గావింతుఁ బెద్దలు మెచ్చి పొగడఁ
దగిలి మీ కది సమ్మతం బగు నేని
లక్షమాడలు తెచ్చి లంచ మిచ్చినను
బక్షపాతము మాకుఁ బని లేదు గాన
మాట మాటకుఁ బుట్టు మదిని జలంబు
పాటించి చలమునఁ బ్రబలుఁ గోపంబు
ప్రాపించుఁ గోపంబు పాపంపుఁబొత్తుఁ
బాపంబు నరకకూపమునకుఁ దెరువు
గాన నీ మది దురాగ్రహమును గొంత
మాని నా చెప్పినమాట గ్రహింపు'
మని చెప్పి ముద మందు నాబ్రాహ్మణునకు
మనుజనాథుండు సమ్మతి నిట్టు లనియెఁ
'వటుశిరోమణి భవద్వాక్యంబు మాకుఁ

పోయినయెడల కోపించి నన్ను దండింతువా, గూబజంకెనల= గుడ్లగూబలవంటి కంటిబెదరింపులచేత, మలఁకలు=రచ్చలు-అసమాధానములు, తగవుగావింతున్= న్యాయముతీర్తును, మసలక ...బగునేని = 'తగవు మీకుసమ్మతంబగునేని తగిలి మీలోనిమలఁకలువాయ అది పెద్దలు మెచ్చిపొగడఁ గావింతు'నని యన్వయము, ప్రాపించు...బొత్తు=కోపము పాపముతోడిసహవాసమును బొందును-కోపము

బటుబుద్ధిఁ దలపోయ బ్రహ్మమంత్రంబు
పన్నినచీఁకటిఁ బాపి వెల్గింప
సన్నపుదీపంబు సాలదే తలఁపఁ
బిన్న వైనను బుద్ధిఁ బెద్దవు నీవు
మన్నించి మాన్పుము మావివాదంబు
నీవెట్లు చెప్పిన నీ చెప్పినట్ల
కావింతు' మనిన నక్షత్రకుం డనియె
నిఖిలభూజనులకు నిజము నిష్ఠురము
ముఖము స్రుక్కింతురు మోవ నాడినను
బాడి దీర్పుట దొడ్డపని యగు నైనఁ
గూడదు పోలించి గోళ్లు రాయఁగను
మాకుఁ దోఁచినజాడ మానవాధీశ
యీకాంత విప్రున కీ వమ్మునపుడు
బాలుఁ డీజట్టిలోఁపలివాఁడు గాఁడె
పోలఁ బుత్రున కింతఁ బొలఁతుక కింత
విలువధనం బని వేర్వేఱ చెప్పి
తెలియ నాడక జట్టి తీర్చితి గాన

వలన పాపము సిద్ధించుననుట, బ్రహ్మమంత్రంబు = బ్రహ్మమంత్రమువలె పవిత్రమై త్రోసిపుచ్చరానిదనుట, పన్నిన= అలముకొన్న, పెనుచీఁకటిని సన్ననిదీపము పోఁగొట్టునట్లు, మా పెద్దతగవును పిన్నవగు నీవే తీర్పనేర్తువనుట, ముఖము... నాడినను= తుదముట్ట న్యాయము తీర్చినయెడల మొగమును ముడుచుకొందురు. పాడి... నైన=అయినప్పటికిని-అనఁగా ఎవరికెట్లు పడినను, న్యాయమును తీర్చుట యే గొప్పకార్యమగును, కూడదు పోలించి గోళ్లురాయఁగను = నిజమును దెగునట్లు తీర్పుచేయక ఇట్లుఅట్లు పోలికలుచెప్పి మిణకరించుచు గోళ్లురాసికొనుట యొప్పదు, తెలియనాడక= విశదపడునట్లు చెప్పక, దక్కెక=కాలకొ:

సుతునితోఁ గూడ నీ సుందరి దక్కె
వితతంబు గాఁగ నీ విప్రముఖ్యునకు'
నని తనచక్కిగా నా ధూర్తవిప్రుఁ
డొనరఁ జెప్పినమాట కుత్సాహ మంది
కాలకౌశికుఁడు నక్షత్రకుఁ గ్రుచ్చి
యాలింగనముఁ జేసి యధిపుకట్టెదుర
వెక్కిరించుచుఁ గోల విసరుచు నోరు
వెక్క సంబుగ విచ్చి వెడనవ్వు నవ్వి
గంతులు వైచుచుఁ గరతాళగతుల
నంతంత నాడుచు నంతటఁ బోక
పడుచు లార్వఁగఁ జుట్టుఁ బరువులు వాఱి
కడఁగి చూచెడివారిఁ గదలఁ దోలుచును
బలువిస్వరంబులఁ బనసలు గొన్ని
చెలఁగి త్రప్పలు మీఁదఁ జిలుకఁ జెప్పుచును
జెనఁటిగోఁతికి వీర్లశివ మెత్తి నట్లు
కనుకనిఁ బెక్కు వికారముల్ సేయఁ
జూడ రోయుచు మహీశుఁడు మదిలోన
నేడ ధర్మం బింక నెక్కడితగవు

కుని అధీనమయ్యెను, తనచక్కిగాన్ = తనపక్షముగా, కరతాళగతులన్ = చప్పట్లుచఱచుచు, పడుచులు=పడుచువాండ్లు, ఆర్వఁగన్ =పరిహాసముగా కోయని యఱచునట్లు, కడఁగి చూచెడివారిన్ =తాను పరువులు వారుటను పూనిచూచు నట్టివారలను, కదలఁదోలుచును= పోవఁదఱుముచును, బలువిస్వరంబుల= పెక్కువికారస్వరములతో, పనసలు=బుక్కలు, త్రప్పలు=నోటితుంపరలు, చెనఁటి... వీర్లశివము=వెఱ్ఱికోఁతికి వీరులయావేశము, కనుకనిన్ - వేవేగ, వంశనా-

లెక్కడిదైవ మిం కెక్కడి సత్య
మెక్కడిభూసురుఁ డేమి చెప్పెడిది
యెలమిఁ జుట్టమువలె నీ ధూర్త వడుగు
పిలువనితగవుఁ జెప్పెద నని వచ్చి
కాలకౌశికునిపక్షము పల్కె వంశ
నాళపన్నగ మాననము ముట్టి నట్టు
లీద్విజాధమునకు నీ యనాచారి
కీ ద్వేషచిత్తున కీ పిశాచమున
కీ క్రూరకర్మున కీ యేభ్యరాసి
కీ కష్టచరితున కీ బహుభాషి
కీ పల్లవాధరి నీ కీరవాణి
నీ పుష్పకోమలి నీపద్మగంధి
నీ చంద్రబింబాస్య నీనీలవేణి
నీ చకోరాక్షి నీయిభరాజగమన
పులిమెడ గొఱియఁ దెంపునఁ గట్టి నట్టు
లలవున దాసిగా నమ్ముకో వలసె'
నని వెచ్చ నూర్చి హా యని తల వంచి
కనుఁగవ బాష్పంబుకణములు దొరుఁగ

ళపన్నగము=వెదురు గొట్టములోని పాము, ఆననము ముట్టినట్లు=మొగమునుదాఁకినట్లు–గారడీఁడు వట్టి వెదురుగొట్టమును మొదటఁజూపి పిదప హస్తలాఘవమునదానిని గదల్పఁగాఁ నందున్న కొయ్యపాము మొగమును దాఁకునట్లు. 'ఇట్లె నక్షత్రకుఁడును ఏమియుఁ గీడు సేయనట్లు తోఁపించి పిదపఁ గీడు చేసినాఁడనుట ఎభ్యరాసి = దుష్టపంక్తిలో చేరినవాఁడు, పల్లవాధరి = చిగుళ్లవంటి పెదవిగలది, కీరవాణి=చిలుకవంటి మాటలుగలది, ఇభరాజగమన = పేటియేనుఁగువంటినడగలది. గొఱియ=గొఱ్ఱె, కడగోరన్ = కొనగోటితో, కా

నెసఁగుశోకాగ్నుల నెరియుచు నున్న
వసుధీశుదీనభావంబు వీక్షించి
పురపురఁ జిత్తంబు పొక్క నందంద
కరుణతో నారాజకాంతాలలామ
సుతుఁడును దాను నేడ్చుచుఁ జనుదెంచి
పతిపాదముల మీఁద భక్తితో వ్రాలి
కొడుకు మ్రొక్కించి డగ్గుత్తికఁ బెట్టి
కడగోరఁ గాటుకకన్నీరు మీటి
పాణిపల్లవములు పఱఁగంగ మోడ్చి
'ప్రాణేశ నేఁటితోఁ బాసితే మమ్ముఁ
బాయఁ ద్రోవలు సేసెఁ బ్రతిబంధ మక్కట
మాయురే కౌశికమాయాపిశాచ
మిది మొద లెందున్న నేమి నీయొద్దఁ
గదలవు నామనోగతులుఁ బ్రాణములు
నానోముఫలమున నాథ నీవెలమి
నీనిఖిలోర్వియు నేలెదు మగుడ
నక్షత్రకుండు దుర్నయమున విప్ర
పక్ష మాడుట కాత్మఁ బరితాపపడకు

టుకకన్నీరు=కాటుకతోఁగూడినకన్నీరు, మీటి=పోఁజిమ్మి, పాణిపల్లవములు=చిగుళ్లవంటిచేతులు, 'పాయఁ...పిశాచము'= విశ్వామిత్రుఁడనెడి మాయపు పిశాచి మనలను ఎడఁబాయునట్లు మార్గములుపన్నెను, మాయురే = ఔరా! మనోగతులు=మానసవ్యాపారములు, నీయొద్దఁగదలవు=నీపొంతను విడిచిపోవు- నిన్నుఁదప్పమఱొక్కటిని నామనస్సు ఎప్పుడుగాని తలఁచుకొనదనుట, నిఖిల-ఉర్వి=సమస్తభూమి, విప్ర పక్షమాడుట=బ్రాహ్మణునిపక్షముగా తగవుచెప్పుట

సన్మార్గవర్తి వై జరుపు నీమీఁద
నున్మాదమున రేఁగి యోహరిశ్చంద్ర
వక్రించెఁ గుశికసంభవరాహు విపుడు
చక్రాయుధుఁడు నీకు శరణమై మనుచు
నక్రంబు పట్టిననాఁడు గజేంద్రు
విక్రమంబునఁ గాచి విడిపించినట్లు
తఱలకు ధైర్యంబు దలఁపకు మమ్ము
మఱవకు నీసత్యమహిమంబు' ననుచుఁ
బతిపాదములమీఁద భక్తితోఁ వ్రాలి
సుతుని మ్రొక్కింపఁగఁ జూచి యాసతిని
గాలకౌశికుఁ డౌడు గఱచి నిప్పుకలు
రాల వీక్షించి కరాళించి పలికె
'నోసి నాయెడ భయ మొక్కింత లేక
వాసి మాలినబీదవానిని మ్రుచ్చు
డాసినగతి నిల్చి డాసి నేఁ జూడఁ
బాసి రా నేరక భాషించు టెట్లు?
భాషించి మఱి చాఁగఁబడి మ్రొక్కు టెట్లు?
రోష మెట్లొదవ దీరోఁతఁ గన్గొనిన

కుశికసంభవరాహువు = విశ్వామిత్రుఁడనెడి రాహుగ్రహము, చక్రాయుధుఁడు = విష్ణుదేవుఁడు, ఈవిశేషణము సాభిప్రాయము - రాహువును విష్ణువు తనచక్రముతోఁ నడఁచినట్లు విశ్వామిత్రునిఁగూడ నడఁచుననిభావము, నక్రంబు = మొసలి, తఱలకు = చలింపకు, ఔడుగఱచి = క్రిందిపెదవికొఱికికొని, కరాళించి = భయంకరముగా, వాసిమాలినబీదవానిని=పరువులేనట్టి దరిద్రుని - హరిశ్చంద్రుననుట, మ్రుచ్చు... చూడన్=దొంగ సమీపించినట్లు నేను సమీపించి నిలిచి చూచుచుండఁగా, చాఁగఁబడి=చాఁగిలబడి, ఒదవదు=పుట్టదు,

బాపు పతివ్రత బాపురే గోల
బాపురే గుణవతి బాపురే ముగుద
విడువు మీ దేశాలివిద్య లొజ్జలకు
బడితపాఠము దొంగపదరు లన్నియును
నెఱిఁగితి నీ మర్మ మింక నేమఱించి
యుఱికి పోఁ జూచెద వూడ నీవెనుక
దక్కితి వని నమ్మఁ దగదు నిన్నెపుడుఁ
గుక్కతూఁతుర మెడఁ గోసి పోఁగలవు
రెండు పోనాడిన రేవనిరీతి
నుండ బాలకు నిన్ను నోరంత ప్రొద్దుఁ
గీలుసంకెలఁ గేలఁ గీలించి వీఁపు
ప్రీలంగఁ గొట్టుదు వెఱపు లేకున్న
గోఁచి గట్టిననాఁటఁగోలె పీనుఁగుల
నోఁచి గడించినమూలధనంబు

బాపు పతివ్రత = సెబాసు పతివ్రతయఁట, బాపురేగోల = సెబాసు ఏమి తెలియనిదఁట, బాపురే = సెబాసు గుణములుగలదఁట, బాపురేముగుద = సెబాసు ముద్దరాలఁట, ఈదేశాలివిద్యలు = నీదేశములో కఱచిన యీవిద్యలు, ఒజ్జలకు = నీకుఁ గఱపినవానికి, విడువు = వదలిపెట్టుము - నాయొద్దఁజూపకుమనుట, బడితపాఠము = చదివినపాఠము, 'దొంగపదరులు అన్నియును బడితపాఠము', అని యన్వయము, దొంగపదటుపుమాటలన్నియు నే నీవు నేర్చినచదువులుగాని మఱి మంచివి ఏవియుఁగావనుట, ఊడ నీవెనుక = నీవెనుకను విడిచిపోవును - నిన్ను వెంటనంటుచునే కాచియుందుననుట, రెండుపోనాడినరేవనిరీతి = రెంటికిఁజెడ్డ రేవనివలె - ఇదియొకసామెత, ఉండఁ = ఉండను, ఓరంతప్రొద్దు = రేయుంబగలు, కేలఁ కీలించి = చేతులకుఁదగిల్చి, గోఁచిగట్టిననాఁటఁగోలె = తెలివిపుట్టినది మొదలుగా - మొట్టమొదట పసితనమున తెలివిపుట్టినది మొదలుగాననుట, గడించి

కసి బెండపువ్వులగతి రాసి వ్రాసి
ఘొసంగునావాతన పొక్కు లెన్నితివి
చేతితడాఱ దుచ్ఛిష్టపు లేమ
బ్రాఁతియే నీవంటి బానిసె లెచటఁ
గండ్రకొవ్వున నన్నుఁ గైకొని రాక
మెం డొగ్గెదవు మందెమేలముల్ మాను'
మనుచుఁ బట్టుఁ దలంచి యాపువ్వుబోఁడి
తనకు మ్రొక్కుచుఁ బాణితలముల నొగ్గఁ
బెలుచ నెత్తురులు చిప్పిలఁ గోల మొత్తి
తలకొన్నకోప మంతట నిల్ప లేక
వెఱచి వాపోవుచు వెసఁ బాఱి తండ్రి
మఱుఁగుఁ జొచ్చినసుకుమారుఁ గుమారుఁ
గుదికిలఁ బడ రెట్టఁ గుదియించి తిగిచి
యదరంట మొత్తి నోరడఁగ జంకించి
పెడమాట లన్నియుఁ బెనుమోపు గాఁగ

=సంపాదించినట్టి, నావాతన పొక్కులెన్నితివి = నానోటనే మన్నుగొట్టఁ జూచితివి; చేతితడి ఆఱదు ఉచ్ఛిష్టపులేమ= ఎంగిలిదానా నిన్నుఁదీసి చేపట్టి న చేతి తడికూడ ఆఱిపోలేదు. ఒకరు పెట్టినభోజనముఁదిని కడిగినచేయి తడి యాఱకమునుపే వారియెడ ద్రోహము తలఁచునట్లు నిన్నుఁదీసినక్రొత్త తీయక మునుపే ద్రోహము తలఁచెదవాయనుట, బ్రాఁతియే= హెచ్చా, మెండు ఒగ్గెదవు= మిక్కిలియు ఊఁగెదవు, మందెమేలములు= చనవులు, ఒగ్గఁగ = చాఁచఁగా, చిప్పిలఁగ=కాఱునట్లు, తలకొన్న=రేఁగిన, అంతట నిల్పలేక = అచంద్రమతిని గొట్టినమాత్రముతో విడువఁజాలక, కుదికిలఁబడఁగ=మొగము పైనెత్తుకొని నేల మోప గొంతుకూర్చుండు, నట్లుఅదరంటఁగ=పూర్ణముగా, నోరు అడఁగఁగ జంకించి=నోరెత్తి ఏడువకుండునట్లు బెదరించి, పెడమాటలు = పెద్ద మాటలు

మడఁ బెట్టి యాచంద్రమతి నెత్తికెత్తి
'మురిపెంపుఁబని లేదు ముందఱ నింక
సరగున నింటికి జరుగు లె' మ్మనుచుఁ
దనవెంట విప్రుఁడు తఱుముచు నడవఁ
దనయుముద్దులకేలు దనకేలఁ బట్టి
చెక్కుల సన్నంపుఁజెమ రెక్క నడుము
నుక్కట నొక్కంత నూఁగారు దోఁప
నలరుపయ్యెద జాఱ నలకలు చెదర
నులివాల్గు వాఁడి తనూలత సోల
నలయుచుఁ జనుచున్నయా మచ్చెకంటిఁ
గలయ వాడలఁ బుణ్యకాంతలు సూచి
వగలఁ గుందుచు బాష్పవారిబిందువులు
దెగినముత్యంబుల తెఱఁగునఁ దొరుఁగఁ
'గటకటా! భార మెక్కడ నుండి వచ్చె
గిటుగిటునైనయీ కీరవాణికిని
గచభార మోర్వనికంత మీఁ ధాన్య
నిచయభారమునకు నిలువ నెట్లోర్చె
నేల దీనికిఁ గుంద నిటు చూడ రమ్మ
వ్రేలి నొయ్యనఁ బట్టి వెనుకొని వచ్చు

మడతఁబెట్టి=మడిచి, మురిపెంపుఁబని=సొగసులుకులుకుతోఁగూడిన-సుకుమారమైన-పని, నడుమునుక్కటన్ = నడుముయొక్క చలనముచేత, నులివాల్గువాఁడి = కొంచెమువాఁడి, తనూలత = తీఁగవంటి మేను, మచ్చెకంటి=చేఁపలవంటికన్నులుగలది, గిటుగిటునైన = మిక్కిలి కృశించిన, కీరవాణి = చిలుకపలుకులవంటి పలుకులుగలది, కచభారము = కురులబరువు, నిచయ=సమూహము, ఏల దీనికిఁ గుందన్ = ఈయాఁడుదానికి దుఃఖింపనేల - అనఁగా దీనికంటె నెక్కువ దుః

వెన్నముద్దకు రూపు వెట్టినమాడ్కి
నున్నమెత్తనిమేను నొప్పెడువాఁడు
యెన్నఁడు నెండఁ గన్నెఱుఁగనిశిశువు
గన్నుల ముత్యాలు గాఱ నేడ్చెడిని
నే చెల్ల నో యమ్మ యించక్కనన్న
రాచతేజము గలరత్నాలపెట్టె
నడవ నెట్లోర్చెనే నా ముద్దుఁజిలుక
కడుపుఁ జఱుక్కనుఁ గన్నవారికిని
వీఁ డొక్క తెరబొమ్మ విప్రవృశ్చికము
పీడించి వీరి నొప్పించుచున్నాఁడు
కాలఁగాఁ జిక్కినకాష్ఠంబువంటి
కా లీచఁ బోయిన కట్టెఁడి మాల
చందురంబులును బుస్తకమును గోపి
చందనంబును జూచి చనదుసూనమ్ము
నెందును బురిలోన నెప్పుడు మెలఁగు
బందికాండ్రకు నివి పరఁగుచిహ్నములు'

క్షింపవలసియున్న యీ బాలునిఁ జూడుఁడనుట, వెన్న... మేను=వెన్నముద్దను దెచ్చి బాలునిరూపముగాఁజేసినట్లు ఈబాలుని మేను మిక్కిలి మెత్తనై నిగనిగ లాడుచు చూచుటకు అతిభోగ్యముగానున్నదనుట, కన్నుల ముత్యాలుగాఱ =ముత్యములవలె కన్నీటిబొట్లు కాఱఁగా, నేచెల్ల = నేనుసహింపనే, రాచతేజము= రాజతేజస్సు, తెరబొమ్మ=వెఱబొమ్మ, విప్రవృశ్చికము=బ్రాహ్మణరూపమునను తేలు, కాలఁగాక... కాష్ఠంబు = కొంచెము కాలి కొంచెము కాలకయున్న కట్టె, కాలు ఈచఁబోయినకట్టెఁడి = ఈఁచబోయిన కాలుగలు కఠినుఁడు, మాల చందురములు=సిందూరములు, బందికాండ్రకు=బందిపోటుదొంగలకు, ముక్కు

యని విప్రుఁ దిట్టుచు నావధూజనము
దనమీఁద మెటికె లందఱుఁ బెళ్లు విఱువ
ముఖ మెఱ్ఱనై బొమముడిపాటు గదుర
శిఖ వీడ వెస ముక్కుఁజెమరులు నిక్క
నవఘళంబుగ దండ మల్లార్చి పేర్చి
కవిసి వ్రేసిన మహాకలకలం బెసఁగ
'నదె విప్రభల్లూక మరుదెంచెఁ దలఁకి
పద పద' మనుచు నప్పౌరకామినులు
వెల్లుగా నొండొరుఁ బిలుచుచుఁ గలఁగి
జల్లున గమి విచ్చి సందులు దూఱి
పోవంగఁ జూచి యాభూసురాధముని
వావిరి వెతఁ బెట్ట వడుగులు గదిసి
కుదిచి యొక్కఁడు చేతికోలఁ బోవైచె
బెదర నొక్కఁడు శిఖఁ బెఱికి రాఁ దిగిచెఁ
బొడిచె నొక్కఁడు తూటు వ్రేవఁగ నెత్తి
విడిచె దోవతికట్టు వెస నొక్కరుండు
నొక్కఁడు మీసంబు లూడి రాఁ బెఱికె
నొక్కఁడు జంధ్యంబు లాగిఁ ద్రెంచి వైచె
నొక్కఁడు గొడుగు డాయుచుఁ బట్టి విఱిచె
నొక్కఁడు పుస్తకం బొడిసి కైకొనియె
నొక్కఁడు గుదికిల నుర్విపైఁ ద్రోచె

జెమరలు=ముక్కురంధ్రములు, అవఘళంబుగన్ = హెచ్చుగా, అల్లార్చి=ఆడించి, విప్రభల్లూకము=బ్రాహ్మణుఁడనెడి యెలుఁగుబంటు, పౌరకామినులు =పురస్త్రీలు, కుదిచి=గట్టిగాఁబట్టి, కుదికిలన్=వెల్లకిలఁగా, చీబోతున్ = మన్నుఁ

నొక్కఁడు గన్నుల నొగి మన్నుఁ జల్లె
నొక్కఁడు మొగముపై నుమిసె నాలోన
నొక్కఁడు వెస నాఁకె నూర్ధ్వపుండ్రంబు
నొక్కఁడు రాళ్లపై నొనరంగ నీడ్చె
నొక్కఁడు పిడికిట హుమ్మని గ్రుద్దెఁ
బెక్కుగాఁ దోఁడేటిపిల్లలు గూడి
బక్కచీబోతు లంపటఁ బెట్టి నట్లు
కాలకౌశికు నిట్లు గారించువిప్ర
బాలుర కెల్లను బ్రణమిల్లి నిలిచి
సన్నుతప్రియవాక్యసరణిఁ బ్రార్థించి
'మన్నింపుఁ'డనుచంద్రమతిమాట కలరి
'నీకుఁ బ్రియంబుగా నీచు నీవిప్రుఁ
గైకొని చంపక కాచితి' మనుచు
వడుగు లందఱు వాడవాడకుఁ బోవ
వెడగొడ్డుఁ బులి నాకి విడిచిన ట్లైన
జడిసి తొల్లిటితనజజాట మెల్ల
నుడిగి కోఁఱలు లేనియురగంబుఁ బోలె
వడి చెడి తల యెత్తి వడుగు లచ్చోట
నుడియ కుండఁగ నోరచూపులు సూచి
దోవతి ధూళి విదుల్చుచు లేచి

బోతు, లంపటపెట్టు=శ్రమపెట్టు, కారించు=బాధపెట్టు, వెడగొడ్డుక్=అల్ప పశువును, జంజాటము=తొడుసు-అడిచిపాటు,ఉరగము=సర్పము,నుడియకుండఁ గన్=చుట్టుకొనకుండునట్లు, ఇంటివారి...పాపాత్మురాల=ఇంటివారిని దొంగవ

భూవల్లభుని దేవిముఖము వీక్షించి
'యోసి నన్నిబ్భంగి నోడక గ్రుద్ది
గాసి పెట్టెదుపలుగాకుల నెల్లఁ
దలవరు లరుదెంచి దండింప కుండఁ
దొలఁగి పొమ్మని పాఱఁ దోలంగఁ దగునె
యింటివారిని లేపి యీవల దొఁగ
బంటుకుఁ జెయ్యిచ్చుపాపాత్మురాల
వరువుగా నిన్నెట్లు వచ్చు నమ్మఁగను
బరుసనిమాటలపని యిప్పు జేల
నిల్లుఁ జేరినమీఁద నీపగ యెల్ల
వెళ్లింప కున్న నే విప్రుండ నఁటవె'
యని పగఁ జాటుచు నాధూర్తవటులఁ
గినిసి తిట్టుచుఁ దనగృహమున కేఁగి
తలసాల నిలుచున త్తఱి నెట్టయెదుటఁ
బెలుచఁ దుమ్మిన భీతిఁ బ్రిదులుచు నిలిచి
చింతించు చున్నంత శిష్యుఁడు వచ్చి
సంతసంబున నమస్కారంబుఁ జేసి
నడుఁకుచుఁ జేరి ముందఱ నున్న శిష్యు
వడుగు నల్లప్పటి వడిఁ దుమ్మినట్టి

చ్చెనని జాగ్రత్తపఱుప లేపి తుద కాదొంగచేతికే పట్టియిచ్చు పాపిష్ఠిదానా! పరుసనిమాటలపని=పరుసుగామాటాడవలసినయక్కఱ, వెళ్లింపకున్న=తీర్చుకొనకున్న, ధూర్తవటులు=దుర్మార్గులైనవడుగులు,తలసాల=తలవాకిలి,ఎట్టయెదుటన్=మిక్కిలియెదురుగా, పెలుచన్=గట్టిగా, ప్రిదులుచున్ = సడలుచు - బిగితప్పి విరవిరవోవుచు, నడుఁకుచున్=వడఁకుచు, అల్లప్ప......వానరునిన్= తలసాల

యెండి పోయినవాలహీనవానరునిఁ
గుండగోళకునిఁ గర్కోటకుఁ డనెడి
కుటిలజాతుని బందికుక్క నీక్షించి
'తటుకునఁ దుమ్ము పంతముఁ జెప్పు'మనిన
దినము వారముఁ బ్రొద్దు దిక్కును గ్రహము
నొనర నెన్నినరీతి నొకకొన్ని యెన్ని
'కలుగు నిప్పుడు గృహకలహంబు మీకుఁ
దలపోసి చూడఁ దథ్యం' బన్నఁ గలఁగి
'తప్పదు నీ మాట తార్కాణ మాకుఁ
జెప్పితి మును తుమ్ము చేకొన కేఁగి
నా కూర్మిపత్నిచే నడునెత్తి వగుల
రోకట నొకపెట్టు రూఢిగాఁ బడితి
ముండకూఁతురు కిన్క ముక్కునబంటి
గుండె జల్లను నది గోపించెనేని
పడఁతి గా దది నన్నుఁ బట్టి మర్దింపఁ

నిలుచున్నప్పుడు వేగతుమ్మినట్టివాఁడును, చిక్కిపోయినతోఁకలేనికోఁతివంటి వాఁడును - దీనిచే వానరమువలె వికారరూపును ధూర్తచేష్టలునుగలవాఁడని తెలియునది, కుండగోళకునిన్ . కుండుఁడనఁగా స్త్రీకి మగఁడుండఁగా అన్య మగనికిఁ బుట్టినకొడుకు, గోళకుఁడనఁగా విధవకు అన్యమగనివలనఁబుట్టినకొడు కు -ఇచట కుండగోళకుఁడనుట కేవలనిందామాత్రపరము,కుటిలజాతునిన్=పుట్టుక చేతనే కపటుఁడైనవానిననుట, బందికుక్క = బందిపోటువారలుపయోగించు కుక్కవంటివాఁడనుట - క్రూరత్వమును చౌర్యమునుగలవాఁడనిభావము. తుమ్ము పంతము=తుమ్మినందులకుఫలము, తార్కాణ=మూఁదల- సరిదాఁకునది. చెప్పితి ...కేఁగి=ముందుతుమ్ముఫలము నీవుచెప్పితివిగాని దానిని పాటింపక నేనులోపలికిఁ బోయి, కిన్కముక్కునబంటి=కోపము ముక్కువఱకుఁగలది, తలపుచ్చుక=త

బుడమిఁ బుట్టిన వెనుభూతంబు గాని
యీయింతిఁ గొని వచ్చి పెఱిఁగిన నన్నుఁ
బోయినప్పుడే తలపుచ్చుక మ్రింగుఁ
గావున నిప్పు డీకమలాక్షి వార్త
నీవు ముందఱ నేఁగి నేర్పు సంధిల్ల
జననాథుఁ డొక్కఁ డీసతి దాగ వ్రాసె
నొనర నొజ్జల కని యొడఁబడ మొఱఁగి
నావధూమణికి నంతసము పుట్టించి
వేవేగ నాలోని వెఱపెల్ల మాన్పు'
మని వేఁడుకొనుటయు నవ్వటుధూర్తు
మనసులో వేఱొక్కమతము చింతించి
'విరసంబు పుట్టించి వీనికి వీని
తరుణికి నొకమరి తలపట్లు చేసి
మొగములు వగులంగ మొత్తులాడించి
నగుచుఁ జూచెదఁగాక నాకేమి' యనుచుఁ
గపట మేర్పడఁగ 'నోఁ గా'కని పోయి
చపలాత్ముఁ డాయొజ్జసాని కిట్లనియెఁ
'జేరి నీ కొకమాటఁ జెప్ప వచ్చితిని

పుట్టి, సంధిల్లన్=కూడికొనఁగా, జననాథు...జ్జలకు = ఒకానొకరాజు ఈ స్త్రీని ఉపాధ్యాయులకు దానముసేసెను, ఒడఁబడన్=సమ్మతించునట్లు, మొఱఁగి = ఏమఱించి, వధూమణి=భార్యారత్నము, వెఱపు=భయము, వటుధూర్తు=ధూర్తుఁడైనవడుఁగు, వేఱొక్కమతము=మఱియొకయభిప్రాయము - తనగురువుచెప్పినదిగానట్టివేఱుభావమును, విరసంబు...తరుణికిన్='వీనికి వీనితరుణికిని విరసంబు పుట్టించి' అనియన్వయము. మొత్తులాడించి = ఒకరినొకరు మొత్తు

నోరు గాచెద నన్న నుడువుదు నీకుఁ
జెప్పిన నొజ్జలచేఁ జావు నిజము
చెప్పకుండిన మాకుఁ జేటు నీచేత
వెడల నాడిన దుర్వివేక మీమాట
కడగి చెప్పినఁ గాని కడుపుబ్బు దిగదు
నాలుక నువ్వుగింజ నానదు నాకు
జాలి నాతోడ నొజ్జలు సెప్పి యున్న
మాట నీ కెఱిఁగించి మదురుగోడైన
దాఁటి పోయెద నింక దాఁపుర మేల
రూపింప వికృతంపురూపు నీ రూపు 1040
నా పత్ని కటుగాన నా కిటమీఁదఁ
గమనీయరూపరేఖలు గలకాంత
నమర నొక్కతె వివాహంబు గా వలయు
నని యొజ్జ లిట క్రింద నాడువాక్యములు
వినిపింప నవి నీకు విరస మా నంచు

నట్లుచేయించి, ఒజ్జసాని=భార్య, నోరుగాచెదనన్నన్ = నీనోరు నేనుజెప్పిన మాటను జెప్పకుండునట్లుపదిలముగాఁ జూచుకొందునని చెప్పితివేని, వెడలనాడినన్ = వెలిపడునట్లుచెప్పినచో, దుర్వివేకము= వివేకములేమి, కడుపుబ్బుదిగదు=చెప్పకుండినయెడల కడుపు ఉబ్బుట తీసిపోవదు-ఆఱట అడఁగదనుట, నాలుక...నాకు=నాకు నాలుకలో నువ్వుగింజకూడ నిలువదు - ఒక్కమాటయైనను వెలువడకుండ నేరదనుట, జాలిన్=పరితాపముతో - నిన్నుఁబోలిన పెండ్లముకలిగెనని పరితాపముతోననుట, మదురుగోడ = చుట్టుపారిగోడ, దాఁపురము = దాఁచిపెట్టుట, వికృతంపు...నాపత్నికిన్ = నా పెండ్లమునకు నీరూపమువలె వికారమైనరూపము, కమనీయరూపరేఖలు = మనోజ్ఞమైన యాకారలక్షణములు, వినిపింప...నంచు= 'నీకువిరసమానంచు నవి వినిపింపను' అని యన్వయము.

నిదె నేఁడు సౌందర్య మెల్లను బ్రహ్మ
చిదిమి చక్కనిరూపు సేసిన యట్టి
రాచకూఁతురు గాని రవ్వగా కుండ
దాఁచినమీామూలధన మెల్లఁ బెట్టి
గోఁచికాఁడై దానిఁ గొనుచు నేతెంచి
లాఁచి యున్నాఁడు నీలా గొత్తి చూడ
వాఁడె పో మనతలవాకిట నున్న
వాఁ'డన్న నది మోము వడిఁ జేవురింపఁ
గోపించి పెటపెటఁ గొఱికి దంతములు
వాపోవుచంకటివానిఁ బోవైచి
'కటకటా! కాటికిఁ గాళ్లు సాఁచియును
విటతనంబులజాడ విడువఁ డీబడుగు
కొండంగి వీని వెక్కురుతల దఱుగ
ముండగోష్ఠికి ముక్కు మొగమేడ తనకు

ఇంతవఱకు వినిపింపకుంటివనుట, సౌందర్య......రాచకూఁతురు=బ్రహ్మలోకమునం గలచక్కఁదనమునంతయుఁ దీసికొని చక్కనిరూపుగా సేయఁగానైనట్లున్న యొకరాజకుమారి, గోఁచికాఁడై =ధనమెల్ల రాచకూఁతునకు వెలగానిచ్చివేయుటచేత కాసుమిగులక కౌపీనమాత్రము మిగిలినట్టి దరిద్రుఁడై, లాఁచియున్నాఁడు నీలాగు ఒత్తిచూడక్=నీవిధము ఏమో, చక్కఁగా పరిశీలించుటకై పొంచియున్నాఁడు, జేవురింపక్=ఎఱ్ఱఁబాఱఁగా, దంతములు = పండ్లు, వాపోవుచంకటివానిక్ = ఏడ్చుచున్నచంకలోఁబిడ్డను, కాటికిఁగాళ్లుసాఁచియును = చావఁబోవ సిద్ధుఁడుగానుండియును-మరణముదాపించినంత ముదుకఁడయ్యునను టు, విటతనంబులజాడ = జారత్వపుచిన్నెలు, బడుఁగు= బక్కవాఁడు, కొండంగి=కుటిలుఁడు, వెక్కురుతలదఱుగక్ = వికారపు తలకాయ కోయను, ముండ ... తనకు = ముండలతోడఁగూడుటకు తగినంత ముక్కుమొగముతీరు

బిడ్డల కోసఁగక పెండ్లాము కిడక
వడ్డి కిచ్చుచుఁ జీమ వలెఁ గూడఁ బెట్టి
ధన మంతయును మిండతల కిచ్చి వీనిఁ
గొని పోయి యెన్నఁడు కూలఁ గ్రుమ్మెదరొ
బాపురే యనుకొనఁ బని లేదు గాక
రూపింప నాకంటె రూపసి కలదె
యీ ప్రొద్దు వానిఁ గుయ్యాడ శిఖఁ బట్టి
వీఁపుతీటంతయు విడిపించి యెదుట
దక్కించి పోయినధనమెల్ల మగుడఁ
గ్రక్కింప కున్న నేకలహాకంఠికనె'
యనుచు రోఁకలిఁ గేల నమరించుచున్నఁ
గని రయంబున వెళ్లి కర్కోటకుండు
కడుసంభ్రమంబునఁ గాలకౌశికుని
యడుగులఁ బడి లేచి హస్తముల్ మొగిచి
'విచ్చేయుఁ డింక మీ వెఱపెల్లఁ బాపి
వచ్చితి' ననుడు నవ్వటుధూర్తుఁ బొగడి
లోని కేఁగెడునంతలోఁ దల్పు మూసి
పూని గొండ్లెముఁ బెట్టి పోయె నా శిష్యుఁ
డత్తఱిఁ జని కాంచె నా రాజు దేవి
చిత్తంబు జల్లనఁ జిడిముడిఁ బడుచు

తన కెక్కడిది, మిండతలకున్ = జారిణులకు, కూలఁగుమ్మెదరో = కూలునట్లు గ్రుద్దుదురో, అనుకొనఁబని లేదు గాక = నాకు నేనే నాయందమును చెప్పుకొనవల సిన యక్కఱలేదుగాని, రూపసి=అందకత్తె, కుయ్యాడన్ =అఱవఁగా, దక్కించిపోయిన ధనము=తనకువశము చేసికొని కొనిపోయి దారపోసికొన్న విత్తము,

మెదుక పట్టినతల మెడ గండమాల
నుదుటిమీఁదటసుడి నులిగొన్న బొమలు
బుఱ్ఱ ముక్కును లొట్ట పోయినగన్ను
వెఱ్ఱిచూపును దెగి వ్రేలాడుచెవులు
మిడిపండ్లు చెక్కిలి మీఁదిపుల్పిరియుఁ
బడి వ్రేలుచన్నులు బడబాకినోరు
రోటు పోయినచెయ్యి బొమ్ముకంపరము
వాటుఁగాలును బోలువలె నున్న నడుము
బద్దుపిక్కలు నంట బలసినతొడలు
మొద్దుపాదంబులు ముడిఁగినవ్రేళ్లుఁ
గఱుకునల్లనిమేను గలిగి దయ్యంబు
మఱపింపఁ దగు నుచ్చమల్లి చందమునఁ
గనుఁగొన రోఁతైనకాలకౌశికుని
వనిత హుమ్మను బందివాటులమాతఁ
గని దానిఁ గదియ బెగ్గల మంది వెఱచి
వెనుకకు జరుగు నుర్వీవిభుదేవి

మొగిచి = మోడ్చి, మెదుకపట్టిన = పిసకగానున్న, నులిగొన్న=చిక్కుపడిన, బడబాకినోరు = పెద్దవెడఁదనోరు, రోటుపోయిన = ఈఁచఁబోయిన, కంపరము=పాడె, వాటుఁగాలు = నడుచునప్పుడు ప్రక్కవాటుగాఁబోవునట్టికాలు, బద్దుపిక్కలు=పలుచనిపిక్కలు, అంటబలసిన=నిలువెల్లబలుపునొందిన - చక్కఁదనమునకు అనుగుణముగా అయ్యైభాగములందు ఎక్కువతక్కువలుగా బలుపు నొందక ఒక్కటే మొద్దుగాబలసియున్నట్టి యనుట, కఱుకు = బిఱుసైన, ఉచ్చమల్లి=దిస్సమొలయాఁడుది,హుమ్మను బందివాటులమాత = బందివాటుదొంగల తల్లివలె హుమ్మనుచు బెడిదముగానుండునది, బెగ్గలమంది = భయపడి, ఉర్వీవిభుదేవి = రాజుభార్య, చివ్వంగి=సివంగి, బలిభిక్షములవారికి = బలి

సివ్వంగి లేడి వీక్షించుచందమునఁ
గ్రొవ్వునఁ జూచి కర్కోటకు మాట
లన్నియు నిజముగా నాత్మ భావించి
పన్నినకోపంబు బలసి రెట్టింప
బలి భిక్షములవారి బలువిడి మొత్తఁ
దలసాలఁ గట్టినతన వ్రేలుదుడ్డు
వడిఁ గేలఁ గైకొని వచ్చునజ్జఱభిఁ
గడఁగి వీక్షించి యక్కాలకౌశికుఁడు
గుండె భగాలనఁ గొలఁదియై తనకుఁ
'బండె నెక్కడఁ జొరఁబాఱ నె' ట్లనుచు
వెడవెడఁ దన కచ్చ వీడంగఁ బాఱి
వడి మోము వగులఁ గవాటంబు దాఁక
గడియతోఁ బెనఁగి దిగ్భ్రమఁ దత్తఱింపఁ
'బొడువ నీ కెక్కడఁ బోవచ్చు' ననుచుఁ
బెక్కుభంగుల మొఱ్ఱఁ బెట్టంగ వెఱ్ఱి
కుక్క లోఁబడఁ బట్టి కొట్టిన రీతిఁ
'జేతు లొగ్గుచు మ్రొక్కుఁ జేకొను' మనుచు
నాతురంబున వేఁడ నందంద మొత్తి
వడి చెడి దగ దొట్టి పఱదలై చెమట

గానిబిచ్చముగాని అడుగవచ్చువారిని, బలువిడిన్ = బలముగా, మొత్తన్=కొట్టుటకు, వ్రేలుదుడ్డు=వ్రేలాడుచున్న దుడ్డుకఱ్ఱ, జఱభి=దుష్టస్త్రీ, 'గుండె... బండె' గుండెభగాలని యదురునంతమాత్రమై కార్యము ముగిసినది, ఎక్కడఁ జొరఁబాఱనెట్లు = ఎక్కడప్రవేశింపవచ్చును ఎట్లుపాఱిపోవచ్చును అని, వడి చెడి=అలసటచే కొట్టెడియురవడి తీసిపోయి, దగదొట్టి=దప్పినొంది, పఱదలై

గడవ వగర్చు నక్క లహాకంఠికను
గనుఁగొని తలపోసి కాలకౌశికుఁడు
'దినదినంబును మొత్త దీనిచేఁ జత్తు
హర హరా యిటువలె నడలుట కన్న
మరణ మైనను నొక్క మారైన లెస్స
పంచ నందఱు బాధపఱుతురు గాని
యెందు సాహసునిది క్కెవ్వరుఁ బోరు
పులి నడుగరు మేఁకపోతులఁ గాని
బలహీనుఁగాని చంపవు దయ్యములును
దెంపు మీఱఁగ నాశ దెగఁ గోసి దీనిఁ
గొంప లోపల వెళ్లఁ గొట్టుదు' ననుచుఁ
గుదియక కరతిత్తి గొని దాని వ్రేయ
నది చెడిపోవను నందంద మోఁదె
వడి దానితలఁ బట్టి వంచిన విప్రు
నొడిచి గడ్డము పట్టి యూఁచె న వ్వేలఁది
నఖముల వ్రచ్చె నన్నాతి నాద్విజుఁడు
ముఖము ద్రిప్పఁగ నది ముక్కు వ్రేఁగఱచె
విసువక నీ రీతి విప్రదంపతులు
మసలి పోరఁగఁ జంద్రమతి సేరి యనియెఁ
'దగువారు నిందింపఁ దమవారు రోయ
నగువారి నెఱుఁగక నయ మేది యిట్లు

=వెల్లువలై, కడవవగర్చు=మీఁదుమిక్కిలి అలయుచున్న, అడలుట = దుఃఖించుట, ఒక్కమారైనన్=ఒక్కసారి గామరణమేకలిగినను, షండను=పిఱికివానిని, కుదియక=వెనుదీయక, కరతిత్తి=వస్త్రపుసంచి, నయము=నీతి, అభిమానము=మా

మగఁడు నాలును నభిమానంబు విడిచి
మొగములు వగులంగ మొత్తు లాడుదురె
పతితోడ సతి మాఱుపడెనేని పుణ్య
గతి కేఁగ నరకంబునఁ గూలు
*ప్రతిభక్తిమహిమంబుఁ బ్రకటించు నట్టి
యితిహాస మొక్కటి యెఱిఁగింతు వినుమ
యనువొంద శరిష్ఠ యనుపుణ్యవతికి
ననుఁగు సుహృత్తైనఁ డనుపుణ్యపురుషుఁ
డతనికుష్ఠవ్యాధి నరయంగ నలసి
యతని వీఁపున నిడి యర్ధరాత్రంబు
ఘనభూతబేతాళకలకలం బెసఁగఁ
జను త్రోవఁ గొఱ్ఱుపై శవము దాఁకఁగను
నొడలుఁ వదలు నొప్పి నుగ్రుఁడై మండి
కడఁగి కోపంబునఁ గాంత కిట్లనియె
'నినుఁ డుదయాద్రికి నేతెంచువఱకు
వనితనీపతి తల వ్రయ్యలై పడును'
నని శాప మిచ్చిన నా పూవుబోఁడి
దనపతిచావుకుఁ దలపోసి పోసి
'యిఁక జీవు లకు నెల్ల నిదె వేగఁ బ్రొద్దు
పొలుపేది నాపాలిప్రొద్దు' క్షమించె
భానుండు వొడమ నాపతి ప్రాణ హాని

నము, మాఱుపడెనేని=ఎదిరించెనేని, అనుఁగు=గారామైన, శవము=పీనుఁగు, ఒడలు వదలునొప్పి=దేహమువిడిచినబాధచే - శవము కర్త, ఇనుఁడు=సూర్యుఁడు, పొలుపేది... క్షమించె=నాపాలిటికి ప్రొద్దుఅయినట్టి నా మగఁడు తీఱిపో

* ఈకుండలీకరణములోనిది పెక్కుప్రతులం గనుపట్టదుగాన ప్రక్షిప్తము.

యేను బతివ్రత నిల నైతినేని
భానుండు మింటను భాసిల్లకుండు
నన విని బ్రహ్మాదు లద్భుతం బంద
నొనరంగ దిననాథుఁ డుదయింప నోడె
నిది దివ మిది రాత్రి యిది సంధ్య యనుటఁ
ద్రిదశుల కైనను దెలియ రాకుండఁ
దరుణిపతివ్రతాధర్మంబునకును
హరుఁడు ప్రసన్నుఁడై యతికృపామూర్తి
'వరము వేఁడుము నీవు వనజాక్షి' యన్నఁ
గరములు మొగిచి యక్కళ్యాణి వలికె
'సర్వేశ వరము నీ శవమున కిమ్ము
పార్వతీనాథ నాపతిఁ గావు' మనిన
వామదేవుం డిచ్చె వరము లిర్వురకు
భామ ప్రార్థింపంగ భానుండు వొడమె
గరకంఠు డరిగె నాకైలాసమునకుఁ
దరుణి పతివ్రతాధర్మ మీఁదేఱెఁ)*
ఛాయని భక్తిమైఁ బతిపాదసేవ
సేయుటఁ గాదె ప్రసిద్ధికి నెక్కె
రాయరుంధతియును నా యహల్యయును
నా యనసూయయు నఖిలలోకముల

యేను. భానుఁడు=సూర్యుఁడు, మింటను భాసిల్లకుండు=ఆకాశమున వెలుఁగకుండుఁగాక-ఉదయింపకుండుఁగాక యనుఁట, దిననాథుఁడు=సూర్యుఁడు, త్రిదశులు=దేవతలు, వామదేవుఁడు=శివుఁడు, గరకంఠుఁడు=శివుఁడు, ఏపరించుచు=

---

* ఈకుండలీకరణములోనిది పెక్కుప్రతుల లేదు

నేపరించుచుఁ బతి కెదురు భాషించు
పాపాత్మురా లూరఁబందియై పుట్టు"
నని పెక్కు భంగుల నా రాజుదేవి
దను మోవ నాడినధర్మ వాక్యములు
గనలెడుసూదులు గర్ణరంధ్రములఁ
జొనిపినయ ట్లైన సురసుర స్రుక్కి
కండక్రొవ్వునఁ గాలకౌశికుమీఁద
మండు కోపము చంద్రమతిమీఁద విరిసి
'పాడిఁ జెప్పఁగ నిన్నుఁ బనివడి యిచటి
కేడ ముక్కిఁడి పిల్చె నిఁక నింత నుండి
బాడుగ నీకిచ్చి పతిభక్తి సేయు
జాడ లన్నియు నీదుసంగడి నేర్చి
నీవు వంకలు దీర్ప నీ పంపుపనులు
గావించు చుండెదఁ గాక వేగిరమె
న న్నెఱింగెదు గాక నా పేరు తెలియ
విన్న మృత్యువు కైన వెరవేఁకి వచ్చుఁ
గదలి నే రోఁకలి గైకొన్నవలనఁ
గదలుదు రీవాడగరిత లందఱును
నాపాడ గాంచిన నగరంబు వడఁకు

దుఃఖపఱుచుచు, తనుమోవక్ = తన్నుఁదాఁకునట్లు, కనలెడు = మండుచున్న, పాడి=నీతి, ఏడ ముక్కిఁడిఁబిల్చె=ఈముక్కిఁడి నిన్ను నీతిచెప్పుటకై యెక్కడఁ బిలిచినాఁడు, ఇంతనుండి=ఇదిమొదలుగా, బాడుగ=అద్దె, నీదుసంగడిక్ = నీసాంగత్యమున, వంకలు=తప్పులు, వెరవేఁకి = మిక్కుటపుజ్వరము, రోఁకలిఁ గైకొన్నవలన=రోఁకలి యెత్తికొని కొట్టఁబోయిన దిక్కున, గరితలు=స్త్రీలు

నీపోటువాటున నిపు డిట్లు మమ్ముఁ
బోరించితివి జంత్రిబొమ్మ నా యక్క
నీరఁ జిచ్చెగయింప నేర్చినతల్లి
యెచ్చట నుండి నీ విటు దాపురముగ
వచ్చితి చొచ్చితి వాస మీ'వనుచు
నోడక కురులు బిట్టూడిసి రాఁ దిగిచి
మూడిప్రోఁ దాఁకించి మూతులు నులిమి
యెగ్గులుఁ దప్పులు నెన్ని యీ రీతి
పగ్గెల నిచ్చలు బాములఁ బెట్టి
యిడుమలఁ గుదియించి యించుక సేపు
నెడపక పనులు సేయించుచు నుండె
నట హరిశ్చంద్రుండు నప్పు డారీతిఁ
గుటిలకుంతలి నమ్మి కొన్న ధనంబు
వ్రయము గాకుండ సర్వంబును ముడిచి
నయ మొప్ప నిచ్చిన నక్షత్రకుండు
వేడుకఁ గైకొని విభుని వేవేల

పొడ=ఆకారము, పోటువాటు=పొడుచుట కొట్టుట, జంత్రిబొమ్మ=యంత్రపు బొమ్మ, నాయక్క-ఇది నీచపరముగా చెప్పినమాట, నీరఁ జిచ్చు ఎగయింప నేర్చిన తల్లి=నీళ్లుపోసి అగ్గిని రగులునట్లు చేయనేర్చినది- చల్లగానే మాకిట్టిజగడము పెట్టించినదాన వనుట. లేక నీటియందు నిప్పుఁ బుట్టింపనేర్చినదనియు నర్థాంతరము దోఁచుచున్నదికాని యిదిసరికాదు. దాపురముగ-ప్రాప్తముగా, చొచ్చితివాసము=నాయిల్లు చొచ్చితివి, బిట్టు=గట్టిగా, మూడిప్రోఁదాఁకించి=పృష్ఠము అడుగువఱకును తలను వెంట్రుకలుపట్టి యీడ్చివంచి, పగ్గెలఁ=సామర్థ్యపు మాటలచేత, నిచ్చలు=తనయిచ్చవచ్చినట్లు, బాములు=బాధలు, ఇడుమలు=ఆపదలు, కుదియించి=క్రుక్కించి, ఇంచుకసేపు నెడపక=కొంతసేపయి

జాడల దీపించి సమ్మతిఁ బలికె
'గురుఁడు పుత్తేరంగఁ గోరి నీవెంటఁ
దిరుగుచుఁ దరు వున్న దినముల కెల్లఁ
జెల్లింపఁ గలబత్తె సెలవుగా నీవు
చెల్లించితివి నాకుఁ జెల్లె ధనంబు
మితితోడ నొసఁగుము మేకొన్న గాధి
సుతునిఋణం బెల్లఁ జొప్పడఁ దీర్చి
ఘా మ్మన్న దీపించి పోదు నీతోడ
దొమ్ములు రేఁపక దొసఁ గెల్ల నుడిగి'
యనుటయుఁ దల యూఁచి యమ్మహీవిభుఁడు
తనలోన నవ్వి యాతని కిట్టు లనియెఁ
'బగ గొని కృప మాలి బందెలు వెనఁచి
తగునె నాచేతి విత్తము రిత్త గొనఁగఁ
దఱలక నా మీఁదఁ దరువుండ నిన్నుఁ
దఱిమి పుత్తెంచున త్తఱి భవద్గురుఁడు
సత్తుగా నీకు నిచ్చలును రొక్కించి

నను అవకాశములేకుండునట్లు, పుత్తేరంగన్ =పంపఁగా, తరువున్న దినములకెల్లన్ =తప్పీలుగానుండిన నాళ్లకన్నిటికిని-ఇట భార్యను బిడ్డను అమ్మినధనము నక్షత్రకుఁడు విశ్వామిత్రునిఋణమునకు చెల్లుగా పెట్టుకొనక తనతప్పీలుండినదినములకు బత్తెసెలవుగా పెట్టుకొన్నాఁడని తెలియునది, మితితోడన్=గడువునకుసరిగా, మేకొన్న=ఒప్పుకొన్న, గాధిసుతుని=విశ్వామిత్రుని, దొమ్ములు=కొమ్మిజగడములు, రేఁపక=ఎత్తిపెట్టుకొనక, దొసఁగు=దోషము, బందెలుపెనఁచి=నిర్బంధములతోఁ జుట్టి, రిత్తగొనఁగన్ =వ్యర్థముగా నీబత్తెసెలవునకని పుచ్చుకొనుటకు, తఱమి=బలాత్కరించి, పుత్తెంచు నత్తఱి=పంపునపుడు, సత్తు

బత్తె మి మ్మని నన్నుఁ బలుకఁ డొండేని
నీకు నే నోడఁబడ నేఁ డీధనంబు
చేకూఱఁ గైకొని చిక్కులు వెట్టి
తప్ప నాడెద వసత్యంబున కోర్చి
చెప్ప నే మున్నది శివుఁ డొక్కఁ డెఱుఁగు'
నావుఁ డి ట్లని పల్కె నక్షత్రకుండు
'భూవర నీ వెంటఁ బు త్తెంచు నపుడు
నీచేత బత్తెంబు నిచ్చలు గొనఁగ
నాచెవిలోఁ జెప్పినాఁడు మన్గురుఁడు
నీ వెుఁడఁబడ నేల విను వేఁడ నేల
నీవు లే దన నేల నినుఁ బ్రభాతమున
దీవింప వచ్చిన దీనవిప్రుఁడనె
చావ నొవ్వఁగఁ బూని సాహసం బొదవ
నెడపక గిరు లెక్కి యేళులు దాఁటి
కడు భయంకరమహాగహనముల్ గడచి
కాలు గాలినపిల్లికరణి నీవెంట
నేల నీబంటనై యెల్లందుఁ దిరిగి
వారక హిమవర్ష వాతాతపముల

గాక్ =రూఢిగాననుట,రొక్కించి=రొక్కము రూపముగా, ఒండేని=ఒక్కటి యు, చేకూఱక్ =దొరకఁగానే, తప్పనాడెదవు=తప్పి పలికెదవు, ప్రభాతమున్ =వేకువను, దీనవిప్రుఁడనే=దరిద్ర బ్రాహ్మణుఁడనా - కాదనుట. గహనముల్ =చొరరాని యడవులు, కాలుగాలిన పిల్లికరణి = కాలికి చిచ్చుదగిలిన పిల్లి విధమున, నీవెంటనేలక్ = నీవెంబడిచోట, ఎల్లందుక్ = ఎల్లయెడలను, హిమ...తపములు = మంచువానగాలి యెండలు, తిరిసినపలుగూడు = బిచ్చ

నూరారిగుడిపంచ నొదిఁగి నిద్రించి
తిరిసినపలుగూడు దెచ్చి నిచ్చలును
వరుస నొక్కొక్కకడి వనరుచుఁ గుడిచి
చదువును సంధ్యయు జపమును వేల్మి
మొదలు ముట్టఁగఁ బోయి మోటనై బడలి
చిడుము గోఁకుచు జరఁ జిక్కి నట్లుండి
కడపట బత్తెంబు గాన కే తేర
నడుమఁ జావఁగ నీవు నా తలపుండ్లు
గడిగి రక్షించెదో కఱవుకాలమున
నురిసినపుండ్లపై నువ్వును జల్లి
కెరలఁ జేసెదవు నేఁ గినిసితి నేని
చక్కఁ బెట్టఁగ లేరు సాధువు రేఁగఁ
బొక్కి నిల్వదు తలపోలమునఁ గాని
మే లెఱింగెద వని మితి వచ్చు దాఁక
నాలిని నిన్నుఁ గాపాడితిఁ గాక

మెత్తితెచ్చిన పలువిధములైన యన్నము, కడి=ముద్ద, వనరుచున్=కుందుచు' వేల్మి=హోమము, మొదలుముట్టఁగన్ = పూర్ణముగా, మోటనై =మొద్దనై, చిడుము = తీటపురుపు, జరఁజిక్కినట్లు=ముసలితనమువచ్చినట్లు, ఏ తేరన్ =రాఁగా, నడుమన్ చావఁగా = దారినడుమఁ జచ్చితి నేని, నాతలపుండ్లు గడిగి - ఇదిజాతీయము=నాకడగండ్లుతీర్చి, ఉరిసినపుండ్లు = పగిలినపుంటికలు· కెరలన్ = మండునట్లు, చక్కఁబెట్టఁగలేరు= నన్నుసమాధానపెట్టి శాంతునిఁ జేయలేరు, సాధువు... గాని = సాదువైనవాఁడు కోపమున విజృంభించెనేని తలపోలమున నేకాని తక్కినచో నిలువఁడు, మేలు ఎఱుంగుదువని = నాకుఁజేయ వలసిన ఉపకారము నీకునీవే తెలిసికొందువుగాని నేనడుగవలసినదిలేదని, మితి=

తఱలి పోవఁగ నీక ధర గిఱి గీఁచి
మొఱలు వెట్టఁగ గట్టి మువ్వేతఁ బెట్టి
గుదిగుది గావించి కూరాకు సేసి
యదలించి నిను మేఁకయఱపుఁ గూయింపఁ
జనుఁ దప్పె నది నేఁడు సర్వథా నిన్ను
వెనకముందటిపగ వెడల మరల్తు
మఱవకు మిప్పటిమాటల నెల్ల
నెఱిఁగెడు శివుఁడు నాకేటికి బాస'
యనిన హరిశ్చంద్రుఁ డావటు ధూర్తుఁ
గనుఁగొని కోపంబు గదుర నిట్లనియె
'గురుకార్య మొనరింపఁ గోరి నావెంట
నరుదెంచి తిరిగితి వది నాకు సెలవె
పరదేశులకు గుళ్లపంచలు గాక
యిర వైననున్నపుటిం డ్లేడఁ గలుగుఁ
బలుగూడు గాక యేపట్టున నైనఁ
గలదె పాయసము భిక్షాం దేహి యనిన
నెవ్వగఁ గుందుచు నీరసాన్నములఁ

గడువు, ధరగిఱి గీఁచి=నేల గీర గీఁచి, మొఱలువెట్టఁగఁ గట్టి=నీవు కుయ్యోమొఱ్ఱోయని కూయిడునట్లు ఆగిఱిలో నిలువఁబెట్టి, మువ్వేత=తాపత్రయము, గుదిగుది = గుత్తిగుత్తి, మేఁకయఱపుఁగూయింపన్ చనున్ = మేఁకవలె నఱచునట్లు చేయఁదగును, వెనుక...మరల్తు = ముందు వెనుక నాకు నీయందుఁగలపగ యంతయుఁ దీఱునట్లు సుళ్లఁబెట్టుదును, ఎఱిఁగెడు...బాస=నేను పగదీర్చుకొందునని యొట్టుపెట్టనేల - నీవు చేసినదానికి శివుఁడే యెఱిఁగి ప్రతిఫలమియ్యఁగలఁడు. నాకు సెలవె=నాకువ్యయమా-గురుకార్యమునకు వచ్చినందులకు నీకుఁ జేయవలసినవ్యయము గురునిదే కాని నాది కాదనుట. నీరసాన్నమలన్ నెవ్వగఁ

క్రొవ్వి బల్తురె గువ్వగుత్తుక పడక
నివి యెల్లఁ దప్పులు నెగ్గులుఁ జేసి
తివిరి రేఁగెద నన్నఁ దెలుప నా వశమె
తీఁపారుచక్కెర దిన్న యా నోర
నేపాకు మేసినవిధమున నీవు
చేసి నంతయు మేలు సేసి మఱేల
చేసితి విట్టికుచ్ఛిత మింకనైనఁ
గుదుకనగోలు గైకొనక నా ధనము
వదలుము మున్ను విశ్వామిత్రుఋణము
మితితోడఁ జెల్లించి మీఁద నెట్లయిన
ధృతిఁ దీర్తు నీ బత్తె దినముల లెక్క'
నావుడు విని నవ్వి నక్షత్రకుండు
'భూవర నీకంటె బుద్ధిమంతుఁడను
దాడిఁబడఁ జేతికి దొరికినధనము
విడిచి మీఁదటఁ గొనువెంగలి గలఁడె
చదువు మీఁదిది దెబ్బ సంగతి గాక
పిదప నొప్పునె మఱి పెక్కు లేమిటికి
విడువు మింతట నుండి విత్తంబుమీఁది
యడియాస పైఁడికిఁ బ్రాణముల్ లంకె

గుండక క్రొవ్వి బల్తురేయనియన్వయము. గువ్వగుత్తుకపడు=ఆఁకటిచే హీనస్వరమగు, రేఁగెదనన్నన్=విజృంభించెదను అనిచెప్పఁగా, తెలుపనావశమె=తేర్చుట, నాతరమా చేసినంతయు మేలుచేసి = ఇంతవఱకుఁజేసినదంతయు మేలుగా నేచేసి, కుదుకనగోలు = వంచన,చదువు .. సంగతిగాక = పిమ్మటిచదువు దెబ్బకొట్టినపుడేగాని పిదప కలుగునా, అడియాస = వ్యర్థమైనయాస, ఈచేతి

విడుతుఁ బ్రాణములైన విడువ ధనంబు
మెడ నెండుకొని త్రెంపుమీ చేతిహేతిఁ
దల ద్రెవ్వ మొత్తి యీధనముఁ గైకొనుము
వెలయంగ నాచావు వెదకుఁ గౌశికుఁడు’
ననిన వీనులు మూసి హరహరా యనుచు
జననాథుఁ డాత్మలో సంతాప మంది
కడుఁబడ్డధూర్త నక్షత్రకు నోరు
దోడుకుట పాపంబు దుర్మార్గుఁ డితఁడు
బల్లిదుచేతిలోఁ బడినధనంబు
పిల్లివట్టిన దొబ్బ బ్రిదులక పోయె
బొంకు గాకుండ నా పూనినమితికి
నింకఁ గౌశికుబుణ మేమిటఁ దీర్తు’
నని మదిఁ దలపోయ నా మహారాజు
గనుఁగొని కినిసి నక్షత్రకుం డనియె
‘నూరక నివ్వేళఁ గొండి యిట్లున్న
నేరీతి మాధనం బిటమీఁద వచ్చుఁ
జెచ్చెర నొకత్రోవఁ జేసి మమ్మనిపి
పుచ్చినఁ బోదు మీపోరాట ముడిగి
వడి నారఁ గైకొన వచ్చు చట్రాతఁ

హేతిన్ = ఈనీచేతిలోనుండు ఖడ్గముచేత, మెడ మెండుకొని త్రెంపుము=నా మెడ విజృంభించి తెగనఱుకుము, నోరుదోడుకుట=నోరుమెదల్పఁజేయుట-మాట లాడించుట యనుట. బల్లిదు...బొబ్బ-బలవంతునిచేతిలోఁజిక్కినధనము పిల్లి పట్టుకొన్న మాంసఖండమువలె మరలఁదీసికొన శక్యముగాదు - ప్రిదులక పోయె = సడలి మరలిరాదయ్యె, వడి...చట్రాత = చట్టురాతినుండి నార

బడయంగ వచ్చును భస్మతైలంబు
నిసుక వంటకముగా నివిరింప వచ్చు
రసము సేయఁగ వచ్చు రాలు గరంగి
రాదు నీ మనసు మార్దవము నొందింప
మేదినీనాథ యీమేలంబు లేల
లే లెమ్ము ధనము చెల్లింపు నీ వనిన
భూలోకనాథుఁ డప్పుడు విచారించి
నక్షత్రకునిఁ జూచి 'నాదుర్గుణములు
లక్షలు వానిఁ బల్మఱు నెన్న నేల
నాలిని బుత్రుని నంగడిఁ బెట్టి
కాలకౌశికుఁ డనుకష్టున కమ్మి
కూర్చిన ధన మెల్లఁ గుదుకన గోలు
నేర్పనఁ గైకొంటి నీకు సిద్ధించె
మునిశిఖామణితోడ మొఱఁగినమితికి
ధనముఁ జెల్లించుచందము డెందమునకుఁ
దలపోసి చూచితిఁ దక్కొండు గాన
నలవడ దటుగాన నాలస్య ముడిగి
నామీఁద వచ్చుధనం బెల్ల నీకు
నే మానవుం డిచ్చు నీమితిలోన
నతనికి బంటుగా నమ్ముకో నన్ను

దీయవచ్చును, పడయంగ... తైలము= బూడిదలోనుండి నూనె సంపాదింపవచ్చును, ఇసుక ...నివిరింపవచ్చు=ఇసుకను వంటకముగా కరఁగింపవచ్చును, రసము...గరంగి=రాలుగరంగి రసముఁ జేయఁగవచ్చు'నని యన్వయము. కరంగి=కరఁగించి, మార్దవము=మృదుత్వము, కుదుకగోలునేర్పన=వంచనయొక్క నైపుణ్యముచేత, అలవడదు=అనువుపడదు, నామీఁదవచ్చుధనము=నన్ను అమ్మగా

మతిలోన వల దనుమానింప' ననిన
నావటుధూర్తుండు నట్ల కా కనుచు
వావిరి నారాజువలపలికేలు
తనపుస్తకపుఁ ద్రాటఁ దగ ముడి వేసి
చనుమంచు నట కొని చని పురిలోనఁ
బొడగన్న వారెల్లఁ బురపురఁ బొక్క
నడరి పేరెత్తి యిట్లని యమ్మ దొడఁగె
'జనులార వసుధలో సన్నుతి కెక్కు
వనజాతబాంధవవంశవర్ధనుని
సారవర్తను హరిశ్చంద్రనరేంద్రుఁ
గోరినధన మిచ్చి కొనరయ్య మీర
లరుదుగా బొందితో నమరేంద్రపురికి
జరిగిన యట్టి త్రిశంకుభూపాలు
కూరిమిపుత్త్రు సద్గుణవిభూషణునిఁ
గోరినధన మిచ్చి కొనరయ్య మీరు
త్రిజగంబులను మేటిదీవు లనెల్ల
నిజజయస్తంభముల్ నిలిపి యవక్ర
భూరిపరాక్రమంబున నొప్పు రాజుఁ
గోరినధన మిచ్చి కొనరయ్య మీరు
కలరాజ్య మెల్ల నాకౌశికమునికి
నిల యెల్ల నెఱుఁగంగ నిచ్చితి ననుచు
ధార వ్రాసినమహాదానవినోదిఁ

వచ్చునట్టిరొక్కము, అమ్మకో=అమ్మకొనుము, వసుధ=భూమి, వనజాతబాంధ
వవంశవర్ధనుఁడు=సూర్యవంశము వర్ధిల్లఁజేయువాఁడు, అవక్రభూరిపరాక్రమము
=వంకరలేని విస్తారమైనవిక్రమము, పొదలు=పెరుఁగుచున్నట్టి, కదియించు=చే

గోరినధన మిచ్చి కొనరయ్య మీరు
బేతాళుతలఁ ద్రెవ్వ వేసి సన్మునుల
భీతి నివారించి పేర్చినయట్టి
వీరశేఖరు జగద్విఖ్యాతచరితుఁ
గోరిన ధన మిచ్చి కొనరయ్య మీర'
లని వాడవాడల నమ్మున త్తఱిని
బెను పొందు పేరును బెంపును జెప్పి
యవనీశు మునిపుత్రుఁ డమ్ము వాక్యములు
సెవుల సోఁకుటయు నచ్చెరువంది చెలఁగి
పొదలు పాపంబులు ప్రూఁ దోలి ముక్తిఁ
గదియించు మణికర్ణికాసమీపమున
మతమారఁ దనతపోమహిమఁ గౌశికుఁడు
పితృవనం బొకటి గల్పించి యా మున్నె
యురుశక్తి వీరబాహుని పేర జమునిఁ
బరఁగిన చండాలపతిగా సృజించె
కుఱువెండ్రుకల కొరకొప్పిడి కావి
యఱవుడు తలనిట్టు నట్టును జుట్టి
జేగురుబొట్టిడి చెవి సంకుఁగొడుపు
లాగుగా వ్రేలఁ దెల్లని ముడ్సు నిల్పి

ర్చు, మతమారన్ = మతము చక్కఁగా ఆలోచించి, పితృవనము=రుద్రభూమి, ఉరుశక్తిన్ = గొప్పసామర్థ్యముచేత, వీరబా... సృజించె=యముని వీరబాహుఁడనుపేరుగల చండాలపతిగా సృజించెను, కుఱు...ప్పిడి=కుఱుచనైన వెండ్రుకలను ముడిచియోరగా కొప్పువెట్టి, కావియఱవుడు=చింపులుగానుండు కావిగుడ్డ, సంకుగొడుపులాగుగాన్ = శంఖము కోపువలె, ముడ్సు=ఎముక, తోలువో

తోలులు వ్రూయినప్రాఁతతోలును గప్పి
బలుగత్తి మొల నచ్చుపడ నమరించి
కడుమైలపేలికఁ గాసించి నడుము
బడికి వేసిన యరపట్టె బిగించి
యెడమచేఁ బశుమాంస మేర్చినగుదియఁ
గడమచే నినుపయుంగరములగుదియ
గడజాతిగాఁ బూని క్రందుసందడిని
జడియుచు శంబళి శంబళి యనుచు
దళముగా మెఱసెడితనమేనికప్పు
పొలసుకు జుమ్మని పొలయుమక్షికలఁ
గుంచియతోఁ జోఁపు కొనుచుఁ బెన్నలుపు
మించి కందెన నూనె మేఁగినట్లున్న
మొగమునఁ జీఁకట్లు ముడివడఁ గల్లు
సగము ద్రావినకుండఁ జంకట నిఱికి
మీఱినమదమున మెయి దేల గిలఁగఁ
బాఱంగ వెడపాటఁబాడుచు బయలు
జాఱుచు నల్లపచ్చనిపొడి మ్రింగి

యిన=తూట్లుపడిన, కడుమైలపేలిక=మిక్కిలిమాసిన చింపిగుడ్డ, కాసించి=కాసెగాఁగట్టుకొని, అరపట్టె=ఒడ్డాణము, ఏర్చిన=గ్రుచ్చిన, కడమచేన్ = డాచేత, కడజాతిగాన్=చండాలజాతికి సూచకముగా, క్రందుసందడిని=అలముకొనుగలబకను, జడియించు=జళిపించు, మక్షికలు=తేనీఁగలు, కుంచియ=కుచ్చు, పెన్నలుపు-కటికినలుపు, కందెన నూనె = బండికీలునూనె, మేఁగిన=పూసిన, మిక్కుటమైన, చీఁకట్లు = చీఁకట్లవంటి నల్లఁదనపు కాంతులు. మీఱినమదమునన్ =అతిశయించిన కావరముచేత, తేలగిలఁగన్ పాఱఁగన్ = తేలికగానుండఁగా, మేనును ఇచ్చవచ్చినట్లు మత్తుచేవిదుల్పఁగాననుట, వెడపాట = సన్నపాట, బయలుజాఱుచు = ఇటునటుతొలఁగుచు, నల్లపచ్చనిపొడి =

కోఱమీసము నుల్చి గుడ్లెఱ్ఱఁ జేసి
కెలనివారల బూతు గెరలఁ దిట్టుచును
దొలఁగు రాజెవ్వఁడు దొర యెవ్వఁ డనుచుఁ
ద్రాగిన రోజు మత్తా గొని యిన్ని
లాగుల నల్లనల్లన నృపుఁ గదిసి
యోరువ రాక బిట్టోకిలిం తొదువ
నోరు మద్యముకంపు నూల్కొనఁ బలికె 1400
'నోరి నాపంచినయుడిగ మేమైనఁ
గోరి సేయుచు నొఱగొడ్డెంబు లేక
కొలిచెదవేని యీ గోఁచిబాపనికి
వలచినధన మంతవట్టును నిచ్చి
బంటుగా నేలుదుఁ' బరఁగ నిన్ననినఁ
గంటకం బొదువ భూకాంతుఁ డిట్లనియె
'నోరి చండాలుఁడ యూరకుండెదవొ
నోరు వ్రేయఁగ వలెనో పండ్లు డుల్ల
నుడుగక కల్లు గ్రుడ్లుఱుకంగఁ ద్రావి

బుక్కాపొడి, నుల్చి = మెలిఁబెట్టి, బూతు = బండమాట, కెరలన్ = మిక్కుటమగునట్లుగా, తొలఁగు...డనుచు = తొలఁగిపో నాకెవ్వఁడురాజు నేనుగాక మఱియెవ్వఁడుదొర, యనుచు-ఇది దారినెదురుపడినవారిననుమాట, త్రాగినరోఁజు మత్తా = కల్లుత్రాగుటచే నిట్టూర్పులు పుచ్చునట్టి మత్తు, బిట్టు=మిక్కిలి, ఒదువన్=కలుగునట్లుగా, నూల్కొనన్ = నెలకొనఁగా, ఊడిగము=పని, ఒఱగొడ్డెము=మనసునొప్పించు వంకరమాట, అంతవట్టును = పూర్ణముగా, కంటకము=అసహ్యత, డుల్లన్=రాలునట్లు, గ్రుడ్లుఉఱుకంగన్ = గ్రుడ్లు వెలికి ఉబ్బునట్లుగా, కల్లుద్రావియనుట, బట్టి=అఱవుడు, చంపి =చిని

యొడ లెఱుంగక ప్రేలెదు దూరక నీవు
కులహీనుఁడవు భానుకులజుని నన్నుఁ
బిలిచి యేమెద నంటి వెఱపింత లేక
కట్టిన దోకబట్టి కప్పింది తోలు
చుట్టిన దోకచింపి సొమ్మెల్ల నినుము
కక్కువచ్చేడి నిన్నుఁ గనుఁగొన నకట
వక్క సేయనిలేకి వాఁడవు నీవు
నే నేడ నీ వేడ నెమ్మిఁగాశికుని
కే నిచ్చుధన మేడ నీలాగు మెట్టు
మెట్టుకుఁ దఱమిన మెఱమెడుకోప
మెట్టు పుట్టదు విన్న నెవ్వరికైన'
నావుడు వాఁడును 'నామీఁద నలుగ
దేవతులకు నైనఁ దీర దెల్లందుఁ
దప్పు లెల్లను దండధరుఁడనై వెదకి
చప్పుడు గాకుండ జనుల దండింతు.
మాటలఁ బని యేల మాకును నీకు
మాటి మాటికి నన్ను మాలవాఁ డంచు

గినగుడ్డ, సొమ్మెల్లనినుము = సొమ్ములెల్లఇనుపసొమ్ములు, కక్కు= వాంతి, వక్క సేయని...వాఁడవు=వక్కకుఁగూడకొఱగానట్టి అప్రయోజకుఁడవు. లేకి అనఁ గారాలినగింజలు = లేకివాఁడనఁగారాలినగింజ లేర్పఱుచుకొని బ్రతుకువాఁడు, మెట్టు మెట్టుకు=అంచెకంచెకు-పయిపయిని, తఱమినక = ఒత్తిమాట్లాడఁగా, మెఱమెడుకోపము = మనస్సునఁగ్రుచ్చుకొన్నట్లు బాధించెడుకోపము; 'నా మీఁద ...తీఱదు' నాపైకోపముచేసికొనుటకు దేవతలకుఁగూడ శక్యముగాదు, 'మాకునునీకును మాటలఁబనియేల' ననియన్వయము. ఒక్కనాకౌమై=ఒక్కమేఁకి

నీకు రోయఁగ నేల నీతండ్రి కులము
నాకులంబును నొక్క నాఁడైన యుండు
నిప్పుడే నెట్లుంటి నేమి కౌశికుని
య ప్పెట్లు దీర్చెద వవుఁ గాదొ చూడు
తులువ నీమది నింత దురభిమానంబు
గలవాఁడ వీముంజిగానిచే నిట్లు
దొసఁగులఁ బడి చిక్కి దొంగ చందమున
నేస కట్టు వడి నీచవృత్తి రానేల?
కినిసి నీతోడఁ దర్కింప నేమిటికి
ధనముఁ బెట్టిన నెందు దాసులు లేరె'
యనిన హరిశ్చంద్రుఁ డాయంత్యజుండుఁ
గనలి తర్కింప నక్షత్రకుం డనియె
'నలినాప్త కులనాథ నాతోడ నీవు
పలికినమాటలపద్ధతి దప్పె
మునినాథుతో మున్ను మునిపినమితికి
ధన మిచ్చువానికి దాసునిఁ గాఁగఁ

మై-ఒకేయంతస్తుగాననుట - హరిశ్చంద్రుని తండ్రి త్రిశంకునికి వసిష్ఠశాపమున చండాలత్వముగలుగుట యిట యూహించుకొనునది, ఇప్పుడే నెట్లుంటి నేమి = నేనిప్పుడు ఎట్లుండినను నీకేమి. అవుఁగాదొచూడు = నీచేతనప్పుదీర్చుటకవునోకాదోచూచుకొనుము - ఇదిచూచుకొనక నన్ను నిందింపనేలయనుట, దురభిమానము=దురహంకారము. ముంజిగాఁడు=వడుగు, దొసఁగులన్ =తప్పులను, తర్కింపన్ = వాదులాడఁగా, మునిపిన=చెప్పినట్టి, వినుతసత్కులజునిన్ = పొగడ్తకెక్కినమంచికులమునఁ బుట్టినవానికి, అంజక = వెనుదీయక, పల్లె... శాస్త్రిమె = మంటిపిల్లియైనను పల్లెత్తిఎలుకలఁబట్టినచో అంతే క్లిశాస్త్రిను కోరిన... నాపాలు=అడిగిన ద్రవ్యమిచ్చి నిన్నుఁగొనిపొండసవ్యర్థముగా మొంజ

గానిపోయి నన్నమ్ముకొమ్మంటి గాని
వినుతసత్కులజుని వెదకి యిమ్మనవు
వీనికులం బేల వీనిరూ పేల
వీనిగుణం బేల వీనిపెం పేల
మాలైన నేమి బ్రాహ్మణుం డైన నేమి
తోలు గప్పిన నేమి తులువైన నేమి
గంజాయి దినె నేమి కలు ద్రావె నేమి
నంజక ధన మిచ్చునతఁడె నా మెచ్చు
పల్లెత్తి యెలుకలఁ బట్ట నోపినను
పిల్లిశాస్త్రమె మంటిపిల్లి యే చాలుఁ
గోరినధన మిచ్చి కొన రం డటంచు
నూరక మొఱ వెట్టు చుండ నాపాలు
వారక నినుఁ గొన వచ్చిన వారి
తో రాయిడించి పోఁ దోల నీ పాలె
మలకలు మాని యీమాలని నేల
కలధన మిప్పింపఁ గలవొ కాదేని
పెక్కు మాటలు గట్టి పెట్టి సత్యంబు
దక్కు బొంకితి నని తలఁగి పోయెదవొ
బలువున నినుఁ ద్రాటఁ బట్టి పట్టణము
కలయఁ ద్రిమ్మర నాకుఁ గారణం బేమి
విను నాప్రతిజ్ఞ నీ విత్త మింతటికి

బెట్టుచుండుట నాభాగపుపని, రాయిడించి పోఁదోలనీపాలె=కలహించి వచ్చినవారిని పోఁదఱుముట నీభాగపుపనియూ, మలకలు =వంకరనడతలు, త్రాటఁ బట్టి=పుస్తకపుత్రాటికిఁగట్టి, కలయక్ = అంతటను, ఇంతటికి నినుమడి పెట్టి

నినుమడిఁ బెట్టిన నింక నొండొకని
కేగతి నిను నమ్మ నితనికే కాని
శ్రీగురునాన కాశీనాథునాన'
యని రాజు మునిపుత్రుఁ డాడువాక్యముల
విని యంత్యజుఁడు మోము వికసింపఁ బలికెఁ
'బరిణమించితి నిన్ను బాఁపనవడుగ
తిరుగక యీమాట తిరముగా నిలుపు
వక్క సేయనిలేకివాఁడని నన్ను
లెక్క సేయక కరాళించె నీ రాజు
వాటమై యీమాట వడి నమ్ము ప్రోలె
నాటి యున్నది నేఁడు నా మనంబునను
గెంటక యీయప్పు గెంటి యీ తులువ
బంటు గా నేలక పాయదు కోప
మప్పు ధనం బింత యని గుఱి నాకుఁ
జెప్పుము చెల్లింతుఁ జేకొను' మనిన
నలరి నక్షత్రకుఁ డతనితోఁ దెలియఁ
బలికె 'నీ భూపాలుపై తరు వనెడి
చేతిసంకెల వీడఁ జేసెద వే ని
దాతవు నాపాలిధర్మదేవతవు

న...నమ్మను = నీవియ్యవలసిన ధనమునకు రెండింత లిచ్చెదనన్నను వీనికిఁదప్ప వేఱొక్కనికి ఏవిధమునను అమ్మను, అంత్యజుఁడు = మాలవాఁడు, పరిణమించితి=మ్రొక్కితి, తిరముగాక్ = స్థిరముగా, కరాళించెక్ = భీష్మముగాపలికెను, అప్పు=బాణము, గెంటక=వెనుదీయక, గెంటి=తొలఁగించి, గుఱి= కొలఁది - మేర, తరువనెడి చేతిసంకెల = చేతిసంకెలవలెనుండెడినాతప్పీలు,

వేడుక జట్టి గావించి నా పూన్కి
వీడ నాడకు మాకు వి త్త మింత నిన
లోఁగి యీఁతకుఁ గానిలోఁ తని జట్టి
వీఁగక సర్వథా వినియెద వేని
పురుషు డేనుఁగు నెక్కి పొడవుగా నిక్కి
వరరత్న మెగిరిపో వైచినపొడవు
ధనరాశి మా కిమ్ము తడయక లెమ్ము
విను నిక్క మిది సుమ్ము వీఁడు నీ సొమ్ము
గాను' మన్న వాఁడు నిక్కుచుఁ బల్కె నీకు
ధనరాశి యిచ్చోటఁ దరలక నిత్తు
నొకవిచారము మాకు నొదవె నీ రాజు
సుకవాసి పనిపంద చూపుగుఱ్ఱంబు
మామిడి క్రిందిపోమరి మేదకుండు
భూమి తుంటరి యెనుపోతుపై వాన

వేడుకజట్టిగావించి = ఎగతాళికి బేరముమాట్లాడి, నాపూన్కి వీడనాడకు= నీకమ్మవలయుననెడి నాప్రయత్నమును నేనువిడిచిపెట్టినట్లు బేరము మాట్లాడకుము, వి త్త మింత నినన్ =మాకు వెలగా నియ్యవలసిన ద్రవ్యము ఇంతయనిచెప్పఁగా, ఈఁతకుఁగానిలోఁతుఅని= ఈఁతకొట్టుటకుఁ దగినలోఁతులేదని- ఇచ్చిన వెలకు తగినంతలాభములేదని యనుట, వీఁగక = వెనుదీయక, నిక్కుచున్ = మీఁటబిగిసికొనుచు, తరలక =తప్పక, సుకవాసి=సుఖముగాబ్రతికినవాఁడు, పనిపంద=పనులయందు మందుఁడు, చూపుగుఱ్ఱంబు = పైచూపునకుఁదోఁచు బచ్చెనగుఱ్ఱము, మామిడిక్రిందిపోమరి = మామిడిచెట్టుక్రిందనుండు సోమరిపోతు, మేదకుఁడు=గోలయైనవాఁడు, భూమితుంటరి = భూమినిదున్నువాఁడు, ఎనుపోతుపైవాన=ఎనుపగొడ్డుపైవానవంటివాఁడు - ఎనుముమీఁదవానయెంత గురిసినను దానికి చలిపుట్టనట్లు ఎంత తర్జనభర్జనములుచేసినను వీనియెడ ప్రయోజన

మొండరి చల్లచప్పుడు గోడచేర్పు
చండిపో తనునట్టిజాడ నున్నాఁడు
చెప్పినపని జాగు సేసిన వేళ
ముప్పిరి గొనుకోపమున మొఱ వెట్ట
దుడ్డున వీఁపు కంతులు గట్ట మోఁది
జడ్డు వాపినఁ గొల్వ చాలు నా కనుచుఁ
దక్కిపోయిన వెంటఁ దగుల నా వశమె
యుక్కునఁ బెనఁచిన ట్లున్నాఁడు వీఁడు
గొలుసు దప్పినయట్టికోఁతిచందమునఁ
గలధన మీవు రొక్కము గాని పోదు
విల్లాలు పుత్రులు హితులు బంధువులుఁ
దల్లిదండ్రులు నన్నదమ్ములుఁ గలుగు
వాని నెమ్మది నమ్మ వచ్చుఁ గా కిట్టి
వాని నేగతి నమ్మ వచ్చు నా'కనిన
నక్షత్రకుండు భూనాయకుఁ జూచి
'దక్షతఁ జండాలుఁ దగ నొడంబఱిచి
పూఁట పూఁటకు జరుపుడు పుచ్చి చనక

మూలేదనుట. మొండరి=మొండివాఁడు, చల్లచప్పుడు=చల్లచిలుకునప్పటి సద్దు వలె గొణఁగువాఁడు కాని చుఱుకుఁదనములేనివాఁడు. గోడచేర్పు=గోడమూలలందుఁ జేరిపడియుండు మూఢుఁడు, చండిపోతు = దుండగీఁడు, ముప్పిరిగొను కోపమునన్ = మిక్కిలియతిశయించినక్రోధముచేత, దుడ్డునన్ = దుడ్డుకఱ్ఱచేత, కంతులు = కణుతులు, జడ్డు = మొద్దుతనము, ఉక్కునఁ బెనఁచినట్లున్నాఁడు = ఉక్కుతెచ్చి మనుష్యరూపముగా చేసినట్లు వీని యవయవములు మిక్కిలిదృఢములుగాను బలవంతములుగానునున్నవి. గొలుసు...కోఁతి= కట్టినగొలుసునుండి తప్పించుకొన్నకోఁతి, జరుపుడు పుచ్చిచనక = ఎట్లోజరిపి

పూఁటకాఁపవె నీవు పొ మ్మని యనక
మితి వ్రేక మున్నె నీ మీఁదిధనంబు
మతమునఁ జెల్లింపు మా కిప్పు' డనుచు
బోధించి పక్కలు వొడుచునవ్వడుగు
బాధకు నలసి భూపతి మది లోన
నెడపక ధనముఁ బ్రోవిడి 'నేఁటితోడఁ
గడతుఁ గౌశికు మాయఘట్ట మే' ననుచు
వీరబాహును జూచి విను మని పలికె
'నీరీతి నపనమ్మి కేల నా మీఁదఁ
జాల నీతని కులికి సత్యంబు కొఱకు
నూలిపోఁగునఁ జిక్కి నుసల కున్నాఁడఁ
దల్లి సత్యము నాకుఁ దండ్రి సుజ్ఞాన
మెల్లెడ సోదరుఁ డెసఁగు ధర్మంబు
చెలువార ధైర్యంబు చెలికాఁడు శాంతి
కులసతి వినయంబు కొడుకు చర్చింప
నే సత్యమునకుఁగా నిప్పుడు నీకు
దాసుఁడ నై జట్టి దక్కుచున్నాఁడ

పోక, పూఁటకాఁపవే=నీవు నాకుమధ్యస్థుఁడవాయని చెప్పక, పక్కలువొడుచు=కడుపుప్రక్కలందు పొడిచి నిర్బంధపెట్టి, ప్రోవిడి = రాసిగాఁబెట్టి, కౌశికుమాయ ఘట్టము=విశ్వామిత్రుఁడు సేయు మాయలమేర, కడతుఁ = దాఁటుదును-అతని మాయలనుండి విడివడుదు ననుట, అపనమ్మిక = నమ్మికలేమి, ఉలికి=భయపడి, నూలిపోఁగున...కున్నాఁడు=నూలిపోఁగంత యీవడుగునకుఁ జిక్కి-సత్యమునుబట్టి చలింపకున్నాఁడను - నూలిపోఁగువలె నాకు విడిపించుకొనుట అతిసులభముగా నుండినను సత్యమునకుఁగట్టువడి యందుఁజిక్కియేయున్నాను; ఇట్లుండఁగా నన్నుఁగూడ నతిక్రమింతువా యని భావము. జట్టిదక్కుచున్నాఁడ = బేరమునకు లోనగుచున్నాఁడను, అట్టిసత్యము...

వట్టి సత్యంబు నేఁ డగు నాకుఁ బూఁట
గట్టిగాఁ జేపట్టి కలఁక పో విడువు
నీయాజ్ఞఁ దల మోచి నీ కనుసన్నఁ
బాయక నీపంపుపను లొడఁ గూర్తు
నలఁగక నా చేయునంతకాలంబు
నలసిన సొలసిన నటు నిటుఁ జనిన
మఱచిన వెఱచిన మఱి నీ ధనంబుఁ
జెఱచినఁ బఱచినఁ జేయఁ లే ననిన
విసికిన గసికిన వెడనిద్ర నొంది
నుసలిన మసలిన నొప్పిఁ జెప్పినను
మెఱుఁగులు గ్రమ్ము నామేటిఖడ్గమునఁ
దఱిఁగి రక్తము గాఱఁ దనతలఁ ద్రెంచి
నీపాదములమీఁద నిలుపుదు నిదియె
నాప్రూని' కనిన నంతట సమ్మతించి
వీరబాహుఁడు తనవెంట నేతెంచు
ఘోరమూర్తుల నతిక్రూరవర్తనులఁ
దనకింకరులఁ బంపి ధనముఁ దెప్పించి
ఘనతరపర్వతాకారంబు గాను
బెనురాసి ప్రోయించి ప్రియము రెట్టింప
మునికుమారున కిచ్చి మ్రొక్కి 'పో'మ్మనిన
నక్షత్రకుండు నానందంబు నొంది

పూఁట=సత్యమే నాకు పూఁటకాఁపు - నిన్ను తిరస్కరింపననుట, కసికినన్ = కనుక్కుమన్నను, వెడనిద్ర=కొంచెమునిద్ర, నుసలినన్ =తొలఁగినను, తఱిఁగి= కోసి, ఘోరమూర్తులన్ = భయంకరాకారులను, ఒడఁబడ్డ= ఒడంబడిక చేసి

లక్షభంగుల నృపాలకుని దీవించి
'యుర్వీశ మాకు నీ వొడఁబడ్డధనము
సర్వంబుఁ జెల్లె నీశ్వరసాక్షిగాను
విచ్చేయు మిఁక' నని వీరబాహునకుఁ
జెచ్చెర నప్పన సేసెఁ జేసేఁత
దివినుండి కనుఁగొని దివిజులు మెచ్చి
యవనీతలేశున కాఁకలి దప్పి
లొదవ కుండఁగ వరం బొసఁగి రావేళ
సదయుఁడై యంతటఁ జని యంత్యజుండు
ముద మారఁ దనగృహంబునకుఁ బో నచటు
గదలి సగర్వంబుగాఁ దనచేతఁ
బట్టినపశుమాంసభారంబు చంకఁ
బెట్టినమద్యంపుబిందియ నిచ్చి
'కొని రమ్ము నీ'వన్నఁ గువలయేశ్వరుఁడు
వినయసంభ్రమములు వెలయ వహించి
యే సిడిముడిపాటు నే వికారంబు
నేసిగ్గు రోఁతయు నెసఁగక వానిఁ
గొలిచి సంగడిఁ జనుగోసంగిబంట్లఁ
గలసి తా నటు చని కలయ నెల్లెడలఁ
బడి యున్న ముడుసులు పసరంపుఁ దలలు
బడికి వ్రేయఁగ నెండఁ బఱచినతోళ్లఁ

కొన్న, అప్పన సేసెన్ = అప్పగించెను, చేసేఁతన్ = చేతిలోఁ చేయివైచి, దివి
జాలు= దేవతలు, అంత్యజుఁడు = మాలవాఁడు, మద్యంపుబిందియ= కల్లుకుండ,
చిడిముడిపాటు = తొట్రుపాటు, సంగడిన్=తనతో జతగా, కోసంగిబంట్లు =

గఱచి కుక్కలు పీఁకఁ గాఁ బెను కొమ్ము
లొఱగఁ దీసినరీతి నున్న డొక్కలును
వఱదలై నెత్తురు వడియుకుత్తుకలు
తఱిఁగిన గోవులు తఱు చైనవచ్చి
మురియలు సెదరినముఱికి నంజుళ్లు
నఱచుకాకులుఁ గలయూమాలవాడ
వడిఁ జొచ్చి ప్రేవులు వాతి కేతేర
నడరుదుర్గంధంబు కను మాత్ర మైనఁ
గింకరిపడక శంకింపక ధైర్య
మింకక చండాలునింటికి నేఁగి
యడరంగ భూపాలుఁ డామాల దన్నుఁ
గడఁగి పంపుచు నున్నకష్టంపుఁబనులు
నెలకొని నిమిషంబు నిలిపినకాలు
నిలుపక సొలవక నిద్దుర వ్రాక
కలఁగక నన్నోదకములపై నాస
గొలుపక వ్యపగతక్షుత్తృష్ణుఁ డగుచు
మొగము ప్రుక్కింపక ముడుఁగక రేయుఁ
బగ లన కమ్మహీపాలుఁ డొనర్ప

వికారపురూపుగల పనివాండ్రు, పసరంపు=పశువులయొక్క, బడికిఁ బ్రేయఁగన్=పదనుపెట్టుటకు, ఒఱఁగ దీసినరీతిన్ = వాలునట్లు విలవిలరాచుకొన్నవిధముగా - కుక్కలుఁ పీఁకఁగానొప్పికి కొమ్ములు ఒఱగునట్లు నేలరాచినరీతిగానే యున్నమృగముల బొంకులనుట, మురియలు=ఖండములు నంజుళ్లు=మాంసములు, ప్రేవులు వాతి కే తేరన్=అసహ్యమైన దుర్గంధమునకు ఓకిలింతపుట్టి కడుపులోని ప్రేఁగులు నోటికిరాఁగా, కింకిరిపడక=రోఁతపడక, వ్యపగతక్షుత్తృష్ణుఁడు=పోయినట్టి ఆఁకలిదప్పులుగలవాఁడు, ప్రుక్కిఁపక=ముడుఁగక, నెరసులు=

నెరసులుఁ దప్పులు నెమకుచు నొక్క
వెరవు చిత్తంబున వెదకి 'సత్యంబు
తెరలంగ వీని బ్రతిజ్ఞఁ దప్పించి
కరమిష్ట మొనరింతుఁ గౌశికమునికి'
నని నిశ్చయము సేసి యావీరబాహుఁ
డొనరంగ నొకరాత్రి యుర్వీతలేంద్రు
తొడలపైఁ బదములతుదఁ జాఁపి భక్తి
నడుగు లొత్తుచు నున్న నతనిమనంబు
నొరయ మాయానిద్ర నొంది రే యెల్లఁ
జరణసేవ యొనర్చుజననాథుఁ జూచి
'యోరి నీదెస నాకు నుల్లంబునందు
వారక కొంతవిశ్వాసంబు వొడమెఁ
బన్నుగా నాసేయుపనులపై నిన్ను
మన్నించి నిలిపెద మది నఱ లేక
వినుమది చెప్పెద వివరంబు గాఁగఁ
బెనుపొంద నీ పురిప్రేతవనంబు
నా గుత్తగాఁ జేసినాఁడ నీ వచటి
కేఁగి పీనుఁగుఁ గాటి కెవ్వరేఁ దెచ్చి
కైకొని తమయిచ్చ గాఁ గాల్చి మరలి
పోకుండ నాయానఁ బొడిచి యాశవము

దోషములు, తెరలంగన్=తప్పిపోవునట్లు, అతనిమనంబునొరయన్ = అతని మనస్సునొత్తిమాచుటకు, అఱ=సంకోచము, కాటికిన్=వల్లెకాటికి, ఎవ్వరేన్ =ఎవ్వరైనను, తమయిచ్చగాన్ = తమయిష్టప్రకారముగా - మనయుత్తరువులేక తమయిష్టము చొప్పుననుట, మరలిపోకుండన్= తిరిగిపోకుండునట్లుగా,

మొల నున్నవస్త్రంబు మొగము కోకయును
వలనొప్ప నొకమూడ వాతిపాతికయుఁ
జెనుపొంద నాకిచ్చి పిండాశనంబుఁ
దిని నీవు బ్రతుకు మీ దినముననుండి
వీరదా సనుపేర వెలయు మీ విపుడు
కోరి పట్టెడుముద్ర గుదియ గొ'మ్మనుచుఁ
దనచేతి కిచ్చినఁ దగఁ బసి పూని
వినయంబుతో మ్రొక్కి వీడ్కొని పోయి
యుత్తరిఁ గమురుకం పడరి దిక్కులను
మొత్తమై నిగుడుమ్రొంబొగలు నంతంత
మండు నొల్కులుఁ జేరి మానవమాంస
ఖండంబు లొండొండఁ గసికిలఁ గ్రుచ్చి
కమ్మగాఁ గాల్చి చంకటఁ బెట్టి మెసఁగి
నెమ్మది నృత్యంబు నెఱపుభూతములు
సగము గాలుచు నున్నశవములఁ బట్టి
తిగిచి గుంపులు గూడి తినుపిశాచములు
నెడనెడ బొక్కల నిడినబాలకుల
వెడలించి భక్షించుబేతాళతతులుఁ
దలకాయలకు మూఁగి తమతమ వనుచుఁ
గలహించుడాకినీగణములు మఱియు

పొడిచి=అగపడ - వారికనుట, వాతిపాతిక=వాతికాసును, పిండాశనంబు=తర్పణములప్పుడు పెట్టుపిండము లాహారము, కమురుకంపు= కాలినదుర్గంధము, అడరి=వ్యాపించి, ఒల్కులు=పీనుఁగులు, కసికలు=సలాకలు - శూలములు, ఎడనెడన్=నడుమనడుమ, బొక్కలన్=గుంతలందు - బిడ్డలను సొదపెట్టికాల్చ

వడి వధ్యశిలలపై వడిసి యందంద
మడువులై పేరినమనుజరక్తములఁ
బుఱియల నట మ్రింగి పులి త్రేఁపు లడర
నఱుగక పొరలాడి యఱచు రక్కసులు
మునుముగాఁ గొట్టుల మోఁకాళ్ల నూఁది
కొని నిక్కి యా మీఁదఁ గుణపశల్యములఁ
దొడికి దంష్ట్రల నొక్కి త్రుస్సి రాఁ దిగిచి
కడఁగి క్రక్కెడు జంబుకములఁ దోఁడేళ్లఁ
బిండాన్నశేషముల్ ప్రిదులక మెసఁగి
యొండొండ వ్రాలుచు నున్నఘూకములఁ 1640
గరములఁ గొఱవులు గైకొని పేర్చి
గురులు వాఱెడు పెద్దకొఱవి దయ్యములు
వ్రొకుండ మాయపుఁబూసరల్ దెచ్చి
చేకొని యామంత్రసిద్ధుల కిచ్చి
తొత్తులగతి నుండి తొడరిననరులఁ
బొత్తులఁ దినెడు పెంపుడుదయ్యములును
సరిఁ గూడి ఋగ్యజుస్సామవేదములు

కగుంతలు త్రవ్విపూడ్చుటగలదుగనుక నిట్లుచెప్పఁబడినది, వధ్యశిలలు=చంపఁదగినవారినినిలిపి చంపునట్టిఱాళ్లు, మునుముగాన్ = ముందుగా, కుణపశల్యములన్=పీనుఁగుఎెమ్ములు, తొడికి=పట్టికొని, త్రుస్సిరాన్=తెగివచ్చునట్లు, జంబుకములు =నక్కలు, గురులువాఱెడు=పరువులెత్తెడు, మాయపు పూసరల్=కపటపు పూదండలను, మంత్రసిద్ధులు = మంత్రసిద్ధికైవల్లెకాటిలో జపాదులుచేయువారు, తొత్తులు=పరవుళ్లు, తొడరిననరులన్=వారినిమారొక్కన్నజనులను, పొత్తులన్=ఒకరిపొత్తునొకరు - సంగడిగా, పెంపుడుదయ్యములు=పెంచినట్టి

పరఁగ గుణించెడు బ్రహ్మరాక్షసులుఁ
గ్రందుగాఁ గలిగి వెక్కసమును వెఱపు
నందంద యొదవించునా రుద్రభూమి
నారాజశేఖరుం డటఁ బ్రవేశించి
ధీరుఁ డై నిజఖడ్గదీప్తులు నిగుడఁ
జుట్టి పేరముఁ బెట్టి నుడివడ నొడిసి
పట్టి కూఁతలుఁ బెట్టి బలువిడి మోఁది
యెల్ల భూతంబుల నెల్ల డాకినుల
నెల్ల శాకినుల మోహిని పిశాచములఁ
గనుఁగొని 'నేఁ డావిగా మీరు గూడి
చని వీరబాహునిసదనంబునందు
వెట్టి గొట్టము నీళ్లు వెలయంగఁ గసవు
కట్టెలు నివి యాదిగాఁ గలపనులు
పగ లెల్లఁ జేసి మాపటి కిట వచ్చి
తెగువ మై నీకాడు తిరుగ రా నుండి
యెచ్చట నెవ్వరు నెఱుఁగక యుండ
వచ్చి పీనుఁగుఁ గాల వైచి పోకుండ
నా లీల కొఱవిదయ్యంబుల దివ్వె
కోలల వారిగాఁ గొని గస్తు దిరిగి

దయ్యములు, సరిఁగూడి=సరిగా జతలుగూడి; వెక్కసము=వేండ్రము, పేరము=పరుగు - చుట్టు, నుడివడన్=తడబడఁగా, వెట్టి=కూలిపని, గొట్టము=పసుల కొట్టము, కాడు=శ్మశానము, తిరుగరానుండి= చుట్టితిరిగి, ఎచ్చట...పోకుండన్=ఎచ్చటఁగాని ఎవరైనను తెలియకుండునట్లు పీనుఁగును కాలఁబెట్టి పోకుండునట్లుగా, దివ్వెకోలలవారు=దివ్వటీవారు, పొడచూపక = తప్పుఅగ

'ప్రొద్దునఁ జనుదెంచి పొడచూప కున్న
గ్రుద్ది యీ దుడ్డునఁ గొట్టుఁడు' ననుచు
విపులసంపద గలవీరబాహునకు
'జపము సేయుఁడు మంత్రసాధకు' లనియుఁ
జండాలుఁ డనక మాస్వామి దీవించి
రండు నిచ్చలు బ్రహ్మరాక్షసు' లనుచు
గట్టిగా నియమ పూర్వక్రమమునఁ జేసి
నిట్టరాడునుఁబోలె నిలుచున్న వాని
బేతాళు నొక్కనిఁ బిలిచి నీ వింక
ఘూతగా నా కొల్వుకాఁడవై వీరిఁ
గొట్టి యుండఱఁ బనిగొనుచు నిచ్చోటఁ
బెట్టింపు తగు మంచఁ బెంపార' ననిన
వసుధఁ జాఁగిలి మ్రొక్కి వాఁడును నేఁగి
మసలక దిబ్బగా మన్ను వ్రేయించి
సమముగా ఘనశిలాస్తంభముల్ నిలిపి
యమరంగ నొకమంచ మామీఁద వైచి
'విచ్చేయు' మని విన్నవించిన విభుఁడు
వచ్చి యా మంచపై వలనొప్ప నుండి
యడిదంబు తోడుగా నా రుద్రభూమి
కడు నప్రమత్తుఁడై కాఁ పుండె నంత
నట కాలకౌశికునాలయంబునను

పఱుపక, నిట్టరాడుఁ=ఇంటినడుమపొడవుగానాటినకంబము, ఘూతగా = గట్టిగా, కొల్వుకాఁడు= భృత్యుఁడు, అడిదము = కత్తి, మటుమాయలు = మిక్కుటపుమాయలు, మలకలు=వంకరలు, ఉదుకులు= కొందలములు - తపిం

మటుమాయలను జిక్కి మలకలఁ జొక్కి
యుపవాసములఁ గుంది యుడుకులఁ గంది
యెపుడు చింతల వ్రేఁగి హృదయంబు గ్రాఁగి
కంటకంబుల నొచ్చి కన్నీరు దెచ్చి
కంటసంబులఁ జిక్కి కఱుకులఁ బొక్కి
మురిపెంబు వీడి మోము గరంబువాఁడి
గరువంబు దూలి శృంగారంబు మాలి
విభ్రాంతి మది మీఱి వెలువెలఁ బాఱి
విభ్రమంబులు జాఱి విశ్వేశు దూఱి
బలురాహుముఖమునఁ బడి కాంతి దప్పి
జలదరించెడుబాలశశిరేఖఁ బోలె
నలిగి యందఱు 'హంసనారి'నాఁ బరఁగి
బలుబాములకు నోర్చి పట్టియుఁ దాను
దినమును జంద్రమతీదేవి పనుపు
పనులు సేయుచు నిట్లు పండ్రెండు నెలలు
మునుకొని వర్తింప భూపాలసుతునిఁ
గనుఁగొని యొకనాఁడు కాలకౌశికుఁడు
చేరి 'యో లోహిత చెలఁగి యే ప్రొద్దు
నీరీతిఁ జంటిక్రిం దిటికి యీ తొత్తు

చుటలు, క్రాఁగి=క్రాఁగినదై, కంటకములు = విరోధోక్తులు, కంటసంబులు= విప్రలాపములు, కఱుకులు = కాఠిన్యములు, మురిపెంబు=మురువు - నడల యొయ్యారము, గరువము=గొప్పఁదనము, జలదరించెడు ... రేఖ=కంపించుచున్న శీతచంద్రకళ, హంసనారి=ఇదిచంద్రమతికి కాలకౌశికునింటఁగలిగిన పేరు, బలుబాములు= పెనుఇడుములు, చంటిక్రిం దిటికి = స్తనములక్రింద నేహత్తుకొని - తల్లి

కఱపుల గుడిచాటుకాఁడ వై యిట్లు
తఱలవు వీఁవెల్ల దద్దులు గట్ట
నడుపక కా దింక' నని జడ వట్టి
తొడలును జెవులు నెత్తురు లుబ్బ నులిమి
'యిది యాదిగా నింక నీ వాడలోనఁ
జదివెడియాబ్రహ్మచారులఁ గూడి
బుద్ధి దప్పక వనంబునకు నిచ్చలును
బ్రొద్దునఁ జని పదివుల్లె లాకులును
వేలిమి సమిధలు వెలయ దర్భలును
బాలురపో రుడ్పఁ బండ్లు దోసెఁడును
దులసి పత్రియుఁ బెయ్యి దూడకుఁ గసవు
నలవడఁ గొంచు ర'మ్మని నియమించి
పనిచిన వెలువెలఁ బాఱుచు వచ్చి
తన తల్లి పాదపద్మములపై వ్రాలి
యనయంబు వగచుచు నశ్రువు లొలుకఁ
దన తెఱం గవ్వ డంతయుఁ జెప్పటయును
గడుపులోఁ జెయి వెట్టి కలఁచి నట్లైనఁ
గడు భయంబునఁ బొంది కన్నీరు దొరుఁగ
గురుకుచంబులతోడఁ గొడుకుమో మొత్తి
తరలాక్షి పెదవులు దడపుచుఁ బలికెఁ
'గటకటా! కృప మాలి కాలకౌశికున

...న్నలమాటువిడువకయనుట, కఱపుల... కాఁటడై=చెప్పడం బోధనము లభ్య
...ంచుచున్నవాడవై, తరలవు=కదలవు, అడువక కాదింకక్=కొట్టకనిఁక తీఱదు,
...లిమి=హోమము, ఉడ్పక్=మాన్పించుటకు, పత్రి=బిల్వపత్రి, తఱమేరు=

కిటు నిన్నుఁ బని కంప నెట్లు నోరాడె
నడవికి నీ విప్పు డరిగినఁ గాని
తడయక విప్రునితలయేరు దిగదు
పట్టభద్రునికూర్మి పట్టికి వేల్మి
కట్టెలు మోవంగఁ గట్టడే నీకు
గట్టిగా భాగ్యంబు గలవధూ మణికిఁ
బుట్టక నాకేల పుట్టితి కూన
యడవికి నిన్నుఁ బొ మ్మనఁ జూచి చూచి
నుడువంగ నే గతి నోరాడు నాకు
నినుఁ బాసి నిమిషంబు నే నిల్వఁ జాల
ననుఁ బాసి పోయెదే నా ముద్దులయ్య
చేకొని యిఁక నేమి సేయ నున్నవియొ
కాక విశ్వామిత్రు కపటవర్తనము'
లని వెచ్చ నూర్చుచు నా పుణ్యసాధ్వి
వినయంబుతో నెల్లవేల్పుల వేఁడి
దనుజదర్వీకరతస్కరభూత
ఘనతరమృగ పక్షి గణములవలన
నవిరళంబుగఁ బ్రాణహాని లేకుండ
వివిధభంగులను దీవించి నందనుని
వలచేత నొకరక్ష వలనొప్పఁ గట్టి

తలనొప్పి, పట్టభద్రుని...పట్టికి = పట్టాభిషిక్తుఁడైనరాజుకడుపునఁబుట్టినగారాబుకొడుకునకు, వేల్మికట్టెలు=హోమముకొఱకైనసమిధలు, కట్టడే=నిర్ణయమా, విశ్వామిత్రుకపటవర్తనములు చేకొని యిఁక నేమిసేయ నున్నవియొ కాక అనియన్వయము, దనుజ=రాక్షసులు, దర్వీకర= సర్పములు,తస్కర=దొంగలు, అవిరళంబుగన్=దట్టముగా, వలను ఒప్పన్ = పొందుమీఱఁగా, మోరత్రోపు

యలుగక 'హా'మ్మని యనుపంగ నడవి
కెలమితో నృపసూనుఁ డేఁగుచు నుండఁ
జలము మీఱఁగ విశ్వామిత్రుఁ డంతఁ
దనమంత్రశక్తిచేఁ దక్షుఁ డనెడి
ఘనపన్నగంబు నాకర్షించి పలికె
'నోయి తక్షక మాకు నుపకార మొకటి
సేయుము నీ కిది చెప్పెదఁ దెలియ
వినుము హరిశ్చంద్రవిభుఁడు వసిష్ఠ
మునిమాట చెల్లింప మోరత్రోపునను
నెట్టన సత్యంబు నెఱపెద ననుచు
నుట్టి గట్టుక వ్రేలు చున్నాఁడు వానిఁ
గలఁచి బొంకింప నెక్కడ సందు లేక
తలపోసి యీరీతిఁ దపము చాలించి
తిట్టున కొడిగట్టి తిరుగు చున్నాఁడ
రట్టు దప్పక పొందు రా నున్న వేళఁ
గలయఁ బర్వెడుభవద్గరళకాలాగ్నిఁ
గులగిరులైన నుగ్గులు వాఱఁ గాలు
వసుధలోఁ దక్కినవా రన నెంత
మసలక నీవు నా మతమున నేఁగి

నను— మోరత్రోయుట చేత-పందులు మొదలైనవి మోరత్రోసే యవలీలగా చెట్లను పెల్లగింపఁజూచునట్లు – కష్టమయ్యును అవలీలగాననుట, ఉట్టి గట్టుక...చున్నాఁడు=ఒక్కటె దీక్షగానున్నాఁడు, తిట్టునకు ఒడిగట్టి=దూఱునకును లోనయి, రట్టు...నున్న వేళ=నింద రానున్న వేళ తప్పకవచ్చును, భవత్ గరళ కాలాగ్ని = నీయొక్క విషమనెడి కాలవహ్ని, కులగిరులు = కులప

యహికులోత్తమ లోహితాస్యకుమారు
గహనంబులోఁ బడఁ గఱచి ర'మ్మనినఁ
దడయక పనిఁ బూని తక్షకుం డపుడు
వడి నేఁగి యల పితృవనసమీపమునఁ
దళ్లు కొట్టెడిగుంటదరిఁ జాలఁ బ్రబలి
చల్లగా నీడయై చలివెంద్రవోలె
మట్టంపుఁబొడవున మాన్నైనమఱ్ఱి
చెట్టుక్రిందటిపుట్ట చేకొని యుండె
నా తక్షకునిచేఁత కనుకూల మొదవఁ
బ్రీతితో శిష్యులఁ బిలిచి కౌశికుఁడు
'మునికుమారకులార ముదమున మీరు
చని లోహితాస్యుని సంగడిఁ గూడి
వనములోఁ జరియించువానిఁ బ్రేరేచి
కొని పోయి తక్షకుఘోరవిషాగ్నిఁ
బడఁ ద్రోచి రం'డని పనిచినవారు
తడయక చని రాచతనయునిఁ గాంచి
'యో లోహితాస్య మాయొజ్జలు వనుప
నీ లీల వచ్చి మే న్నెప్పుడు నిచటఁ
గడునొప్పుఫలములుఁ గంద మూలములు
నుడుగక కొనిపోవు చుందుము గాన

ర్వతములు, నుగ్గులువాఱన్ = చూర్ణమగునట్లుగా, గహనంబులోన్ = చొరరానియడవియందు, పడన్ = నేలఁగూలునట్లు, పితృవనసమీపమునన్ = వల్లెకాటిదాపున, తళ్లుకొట్టెడుగుంటదరి = చినచిన్న యలలుకొట్టుచుండెడికొలనిగట్టున, చలివెంద్ర = చలిపందిరి, మట్టంపుపొడవునన్ = దిట్టమైనపొడవుచేత, మాన్నైన =

గుఱుతులు మే మెఱుంగుదు మంత్రటికిని
దెఱంగొప్ప నీవు నేతెమ్ము మా వెనుక'
ననుచు బోధించి వా రటు గొనిపోయి
మను జేశసుతుండు నెమ్మనమున నలర
ఫలములు దర్భలు పసిమూఁడ కసవు
కలయంగఁ దోడ్పడి కట్టగాఁ గట్టి
సమిధలు దల కెత్తి 'చను'మన్న మొగము
చెమరింపఁ గూఁకటి చీకాకు పడఁగ
దడవడంకులు గొంచుఁ దను వెల్లఁ గంద
నడుగులు దొట్రిల్ల నల్లన నడచి
వచ్చి యల్లప్పటివటమూలమునను
జెచ్చెరఁ దలమోపుఁ జేర్చి రామసుతుండు
చల్లని జలము లచ్చటికుంటఁ ద్రావి
యొల్లన మరలి యూయుర్వీరుహంబు
నీడఁ గొండొకసేపు నిద్రించి తన్నుఁ
గూడి వచ్చినవడుగులు దలఁపింపఁ
'మనములో నిందాక మఱచి యున్నాఁడ'
ననుచుఁ బర్ణములు రయంబునఁ గోయ
నొకకాలు పుట్టపై నూఁది యాపాద
మొక కొంత నిక్కి ద్రాఁ నూఁతగాఁ ద్రొక్కి

గాగైన, ప్రేరేచి= పురికొల్పి, గుఱుతులు ... మంత్రటికిని=కందమూలఫలాదు ...ండుచోట్ల గుఱుతులనెల్ల తెలియుదుము, దడవడంకులు = మిక్కిలి ...పమును, అల్లప్పటి=ఆ, తలమోపు=తలమీఁది బరువు, ఒల్లనక్ = మెల్లఁగా, ...ర్వీరుహము=చెట్టు, తలఁపింపక్ = ఆకులు గొనిపోవలయునని తలఁపింపఁగా,

వాలుగొమ్మొక కేల వడి వంచి యున్న
కేలు సాచఁగ గమకించునాలోనఁ
గాలకంఠ కఠోర కర కంపితోగ్ర
శూలాగ్ర నిర్గత స్థూల కీలాభ
లోలజిహ్వారుణలోచనం బగుచుఁ
గ్రాలెడు ఫణము భీకరముగా ముడిఁచి
యాలోన నడఁగినయమ్మహాభుజగ
మాలోహితాస్యుని నదరంటఁ గఱచె
నా విషవహ్ని భగ్గునఁ బేర్చి మేన
నావహింపక మున్నె 'హా మాత!'యనుచుఁ
జావుతో సరిపోల్పఁ జనుమూర్ఛ నొంది
భూవరపుత్రుండు భూమిపై వ్రాలె
నంత భస్మీభూత మయ్యె నా వటము
నంతియ కాని యాయాదిసర్పంబు

వాలుగొమ్మ= వ్రాలియున్నశాఖ, ఉన్నకేలు=తక్కిన చేయి, కాలకంఠ... లోచనంబు - కాలకంఠ=శివునియొక్క, కఠోర=కఠినమైన, కర=చేతి చేత, కంపిత = ఆడింపఁబడిన, ఉగ్ర=భయంకరమైన, శూలాగ్ర = శూలము మొననుండి, నిర్గత = వెడలిన, స్థూల= పెద్దదైన, కీలా =జ్వాలతో, ఆభ =సాటియైన, లోల = చలించుచున్న, జిహ్వా = నాలుకయును, అరుణలోచనము = ఎఱ్ఱనికన్నునుగలది, ఇచట శివుని చేతికిని, పాముపడఁగకును, శూలమునకును పాము నాలుకకును, శూలాగ్రమందలి స్థూలకీలకును పాము అరుణలోచనమునకును సామ్యము దెలియునది, ఫణము=పడగ, అదరంటఁ=బిట్టుగా, పేర్చి=విజృంభించి, ఆవహింపక = ప్రవేశింపక, చావుతో... మూర్ఛ= మరణముతో సమానముచేయఁదగినసొమ్మ, ఆదిసర్పంబు=తక్షకుఁడు, జనని=తల్లి

పనివడి చంప నోపదు బాలు నతని
జనని పాతివ్రత్యశక్తి పెంపునను
నది చూచి ముని పుత్రు లాశ్చర్య మంది
'మదిలోనఁ దలఁప నీ మనుజేంద్రసుతుఁడు
నిగిడినవిషవహ్ని నిలువునఁ గాలి
పొగిలి భస్మము గాక పోలించి చూడ
నలకాలకూటమహాగరళంబు
చెలఁగుచు మ్రింగి మూర్ఛితుఁడైనశివుని
వడువున నున్నాఁడు వాడదు మోము
విడువదు తనుకాంతి వీస మంతయును
బదతలంబులు గాజు పాఱవు నిప్పఁ
జెద లంటునే వలచేతి యీరక్ష
వెలయ నే మంచు దీవించి కట్టినదొ
తలపోయ మును వీనితల్లి దా' ననుచు
నఱిముఱిఁ బురమున కరిగి యావార్త
తెఱఁగొప్పఁ జంద్రమతీదేవితోడ
గుఱుతులు సెప్పి నద్ధులు చని రంతఁ
గొఱగానిపలు కనుక్రొవ్వాఁడివేఁడి
మెఱుఁగుఁగైదువు నాటి మెఱమిన గుండె
పఱియలుగా వ్రీలి ప్రాణంబు వెడలి

కాలకూట...గరళంబు = హాలాహలమహావిషము, గాజు పాఱవు = గట్టి గావు, కొఱగాని=పసమాలిన, క్రొవ్వాఁడి వేఁడి= మిక్కిలి వాఁడియై వేఁడిగానున్న, మెఱుఁగు కైదువు=పదును బెట్టఁగా తళతళ మెఱయుచున్న వాఁడి యాయుధము, మెఱమినక్=నాటి యిటునటు మెదల్చినచో, పఱియలు=తునుకలు

యదరి భూవరుదేవి 'హా పుత్ర' యనుచు
నొదవినపెనుమూర్ఛ నొక్కింతదడవు
తఱెఁగినకదళిచందంబున నేల
నొఱగి చేష్టలు దక్కి యొయ్యన దెలసి
నేలలు పుడుకుచు నిగిడినవగల
వాలుఁగన్నుల నీరు వఱద లై పాఱ
'నక్కటా యో లోహితాస్య నా కింక
దిక్కెవ్వ రిటమీఁదఁ దెరు వేది బ్రతుకు
కీదుఃఖవార్ధి నే నేతెప్పఁ గడవ
నీఁదుదు నీవిధి కే మని వగతుఁ
బతిఁ బాసియును నిన్నుఁ బట్టి నాపట్టి
మతిని నే దిగులును మఱచి వర్తింప
నెక్కడ నుండి నేఁ డిటు వెంటనంటి
తెక్కలి దైవంబు ద్రెక్కొనె నిన్నుఁ
బుట్టక పుట్టినపుట్టుభోగికిని
బుట్టుభోగికిఁ బగఁ బుట్ట నేమిటికి

భూవరుదేవి=రాజుభార్య, ఒదవిన=కలిగిన, తఱెఁగినకదళి=నఱకఁబడినయరఁటిచెట్టు, పుడుకుచు=తడవుచు, నిగిడిన=సాఁగిన- అతిశయించిన, వాలుఁగన్నులు=విశాలములైన నేత్రములు, వఱదలు=ప్రవాహములు, తెరువేదిబ్రతుకుకు=బ్రతుకుటకు దారియేది? దుఃఖవార్ధి=దుఃఖసముద్రము, ఏతెప్పన్=ఏదితెప్పగాఁగొని, -ఎవ్వరిని ప్రాపుగా నాశ్రయించి, ఈమహాదుఃఖమును, కడవనీఁదుదును=దాఁటునట్లు ఈఁదఁగలదానను, ఈవిధికి=ఈదైవవ్యాపారమునకు, నిన్నుఁబట్టి=నీవుండుటంజేసి, తెక్కలిన్=వంచనచే, ద్రెక్కొనెన్=చంపెను, పుట్టకపుట్టినపుట్టుభోగికిని=లేకలేకపుట్టి పుట్టుకమొదలుగా భోగములనుభవించుచుండువానికి.

నప్పాపజాతిపు ర్వదరంటఁ గఱచు
నప్పుడు నన్ను నే మని తలంచితివొ
వేఁడిమి హృదయ మీవిప్రున కెపుడు
వీఁడు కొండొకవాఁడు విపినభూములకుఁ
గనికరింపక పంపఁగా నెట్లు వచ్చు
ననక కృపాహీనుఁడై నన్నుఁ బంపెఁ
బంపెఁ బో నీకుఁగాఁ బనిఁ బూని యడవి
కింపెసలార నే నేల పో నైతిఁ
బోవుట గలిగినఁ బుత్ర నిన్ గోలు
పోవుదునే బుద్ధిఁ బురు వెట్టు మేసె
నీపుట్టినప్పుడు నెమ్మి దైవజ్ఞు
లేపార నిల యెల్ల నేలెద వనుచుఁ
గడఁగి పల్కిరి గాని కాలాహిచేత
నడవిలోపలఁ జత్తు వనరైరి తనయ
యడవికి నీ వేఁగునపుడు గన్నీరు
వెడలెడునీవాలు వెడఁదగన్నులును

ఆగర్భ శ్రీమంతుఁడగు నీకును, పుట్టభోగికిని=పుట్టయందుండు పామునకును, ఆప్పాపజాతిపుర్వు= ఆపాపిష్ఠమైనపురుగు-పాము, అదరంటన్=మిక్కిలిగా, వేఁడిమి హృదయము=మనస్సు క్రూరమైనది, 'వీఁడు...ననక'=వీఁడు పసివాఁడే అరణ్యభూములకు దయలేక యెట్లుపంపవచ్చునను అని యెంచక, పంపెఁబో=పంపి నను పంపనీ, నీకుఁగాఁబనిపూని=నీకొఱకుపని చేకొని-నీవు పెట్టినపని నేనువహించి యేలపోకపోతిని, పోవుట... పోవుదునే= నేనుపోయియుందునేని, కొడుకా నిన్ను దారపోసికొందునా-దారపోసికొనననుట, బుద్ధిపురువెట్లు మేసె=నాబుద్ధి పురుగేవిధమునఁ దినివైచినది, నాబుద్ధియు నెట్లుముసించినదో యనుట, దైవజ్ఞులు=జ్యోతిషికులు, కాలాహి=క్రూరసర్పము, వాలు వెడఁదగన్నులు=నిడు

విన్ననై పెదవులు విఱిచి దైన్యమున
నన్ను రమ్మని పిల్చు నలికొట్టుపలుకుఁ
బలుచని చెమటతో ఫాలభాగమునఁ
గలగొన నంటిన కాకపక్షములుఁ
దలసాల వెడలెడుదాఁక నా దెసకు
మలయుచూడ్కులు గలుగుచినీ మోముఁ
గన్నులఁ గట్టినకైవడిఁ దోఁచు
చున్నది యిప్పు డెట్లోపుదు మఱవఁ
బ్రొద్దు నేఁ డిదె క్రుంకెఁ బొలమున నుండి
ముద్దులేఁగలు వచ్చి మొదవులఁ గలసె
మనమున మోహంబు మల్లడి గొనఁగఁ
జనుదేవు నీవేల చన్నులు సేఁపె
నేపరింపుదు రె న న్నిట్లు మా యయ్య
నా పుత్రరత్నంబ నా నిధానంబ'
యని పెక్కు భంగుల నడలుభూపాలు
వనితపై నా విప్రవనిత గోపించి
'యోసి యమాంగల్య మొదవ నేడ్చెదవు

దలై విఱిచి గానుండుకన్నులు, నలికొట్టుపలుకు=నసకొట్టుమాటపోలేక నడిగొట్టుచుండుపలుకనుట, కలగొనన్ = చెదరఁగా, కాకపక్షములు=కూఁకట్లు, తలసాల=తలవాకిలి, మలయుచూడ్కులు=తిరిగితిరిగి చూచుచూపులు, కన్నులఁగట్టినకైవడి=కన్నులలోనే యుండునట్లు, ఎట్లోపుదుమఱవ=మఱవనెట్లు నేర్తును, ముద్దులేఁగలు=ముద్దుగులుకు దూడలు, మొదవులన్ =ఆవులను, చన్నులు సేఁపె=చన్నులందు పాలుచేఁపుచున్నది, ఏపరింపుదురె=దుఃఖపెట్టుదురా, భూపాలువనిత=రాజకాంత, కలగొని= ఇటునటువ్యాపించి, చీమలగామలవలెను-ఇది జాతీ

యీసంధ్యప్రొద్దు మాయింటిముందటను
గలగొని చీమల గామల వలెను
జెలఁగుచు ముందర శిశువు లాడఁగను
నీకేల పలవింప నీకుమారునకు
నీకునుగాఁ జెడె నేఁ డిల్లుఁ బెళ్లుఁ
బోకార్చి నట్టి యీ ప్రోడకు నేడ్వ
నాకుఁ బోవదు గాక నా సూత్రధారి
కొడుకు నెక్కడ దాఁగ గుఱుతుగా నంపి
కడునుగ్ర భుజగంబు గఱచిన దనుచు
వెడయేడ్పు లేడ్చుచు వెదకుచు సందు
వెడలి పోఁ జూచెవో వేసాలు వన్ని
లోకంబులో లేని లొటతాటకత్తె
నీ కువాడమ్ము లన్నియుఁ దెల్పు మాకుఁ
గైకొని మేఁకలఁ గాచి రా పొమ్ము
నీకంటె మిక్కిలి నెఱజాణ నేను
గొడుకుకు విలపించు కొనుచు నీవున్న
నెడప కెవ్వరు సేతు రీపను లెల్లఁ

యము - గుంపులుగా క్రిక్కిఱిసియనుట, నీకుమారునకు... పెళ్లు=నేఁడునాయి ల్లును పెళ్లును నిన్నుండియు నీకొడుకునుండియుఁ జెడినది, పోకార్చి...పోవదు గాక - పోఁగొట్టుకొన్న యీప్రోడబిడ్డకు నేడ్చుట నాకునొప్పదుగాని - ఇట లోహితాస్యుని ప్రోడయనుట పరిహాసపరము - ప్రోడబిడ్డనాయనుట, సూత్ర ధారికొడుకను=సూత్రధారివలె పలువేషములు నేర్చిన యీకొడుకును, దాఁగఁగు ఱుతుగా నంపి=దాఁగికొనుటకు అడియాలము చెప్పిపంపి, కడునుగ్రభుజగంబు= మిక్కిలిభయంకరమైన సర్పము, లొటతాటకత్తె=జిత్తులమారిదానవు, కువాడ మ్ములు=కపటవర్తనములు, నెఱజాణ=మంచినేర్పుకత్తె, పిసాళింపక=టక్కులు

జాలు లే లెమ్ము పిసాళింప' కనుచు
నాలీల దుర్భాష లాడుచు నున్న
కాలకౌశికుభార్యఁ గనుఁగొని వగపు
లోలోన నడఁచి యాలోలాక్షి పలికెఁ
'తల్లి నామీఁద నిత్తఱి దయ నుంపు
ముల్లంబులో నిది యొండుగాఁ గొనకు
విస మెక్కి చచ్చెనో విపినంబు లోనఁ
బొనఁగంగఁ గొఱప్రాణముల నున్నవాఁడొ
చొప్పడ నా పుత్త్రుఁ జూచి రా నొకని
నిప్పుడే పంపు వాఁ డీల్గక మున్నె
మసలక తెప్పించి మందుఁ బోయించి
పసనుగా నొనరింపు ప్రాణదానంబు'
ననుచు దైన్యము దోఁప నా రాజుదేవి
తను వేఁడుకొనుచుఁ బాదముల పైఁబడినఁ
గలహకంఠిక కనికర మింత లేక
తలమని ముంగలఁ దలఁ బాయఁ ద్రోచి
'తొలుతటిసొమ్ముకుఁ డొడింకఁ గొంత
గెలువఁ జూచెదవు మిక్కిలి జాణ వౌదు
కట్టెలు దెమ్మన్న ఘనభుజంగముల
పుట్ట లెక్కఁగ నేల పోయె నీకొడుకు
చేకొని యిది మేము చేసినతప్పె

సేయక, కొఱప్రాణములు=కుట్టుసురు, పసనుగాక్ = పొందికగా, తలము=లొలఁగుము, తొలుతటి... జూచెదవు=ముందు మిచ్చుకొన్నందులకు దారపోసినరొక్కమే కాక మఱికొంతరొక్కము నీకొడుకు మందుమాకులకు వెచ్చపెట్టింపఁ

వాకట్టు మైతిమి వసుధఁ బాములకు
మందుల విలువలు మాకేడఁ గలవు
మందు వెట్టఁగ లేము మనఁజేయ లేము
వెదక నంపఁగ లేము వెజ్జుఁ దేలేము
మదిమదితో నుండి మాకేమి శ్రద్ధ
పీడ వాయదు మాకు బిడ్డఁడు నీవుఁ
గూడు గూరకు సడి గొట్టక యడిగి
యున్న మాటలు మాని యూరక వచ్చి
పన్నుగా నీచేయుపను లెల్లఁ దీర్చి
ప్రొద్దు వ్రాయినమీఁదఁ బోయి నీ పుత్రు
సుద్ది నిక్కంబుగాఁ జూచి ర'మ్మనిన
నుత్తర మొండాడ నులికి యా సాధ్వి
చిత్తంబులో శోకశిఖి మండుచుండ
జాము పోయినదాఁకఁ జాఁగలి గొట్టి
బాములఁ బొందుచుఁ బను లెల్లఁ దీర్చి
బడలియు మఱి వచ్చి భక్తి దీపింప
నడుగు లొత్తుచు నున్న నా విప్రవనిత
వడి జొల్లు సెలవుల వడియ నూరుపులు
నిడుదలై గొటగొట నిగుడ వెంౘ్రుకలు

జూ చెదవు, వాకట్టుమైతిమి=నోరుకట్టుమైతిమి, విలువలు=వెలలు, మనఁజేయన్ = బ్రతికింపఁగా, వెజ్జున్ =వైద్యుని, మదిమది...శ్రద్ధ=మడిచి నెమ్మదిగానుండి మాకీ లేనిపోని యక్కఱయేమివచ్చె, పీడ...మాకు=నీబిడ్డఁడు ఏమైతేనేమి మాపీడవ దలదు, సడిగొట్టక=నసపెట్టక, సుద్ది=సంగతి, ఉలికి=భయపడి, శోక శిఖి= దుఃఖాగ్ని, చాఁగలిగొట్టన్ = బాధింపఁగా,. సెలవులన్ = పెదవిమూలలం.

విరిసి జుంజుఱుదల ద్రేలాడఁ జెమట
దొరుఁగుకక్షంబుల దుర్గంధ మెసఁగఁ
బిసరు గాచినకుండ పేర్పు చందమున
నెసఁగినబాకి నో రెంతయుఁ దెఱచి
కలవరింతల వాడగరితలు బెదరఁ
బెలుచఁ బండ్లను బెటపెటఁ గొఱుక్కొనుచు
నొడలిచీర నెఱంగ కుదరంబు పెద్ద
తడగంబుగతిఁ దోఁపఁ దనప్రక్కలందుఁ
జడుగును బేకయుఁ బలెఁ బడి మునిఁగి
పడుచులు గూర్కంగఁ బందిచందమునఁ
దెప్పున నిద్రఁ జెందిన యటమీఁద
నప్పద్మలోచన యల్లన లేచి
యంధకారమును శోకాంధకారమును
బంధురం బగుచు లోపల వెలుపలను
గిజిగొని కవయంగఁ గెం గేల నొక్క
కొఱవిఁ గైకొని వడుగులు సెప్పి చనిన
కడకుఁ బోయినత్రోవగా నొక్కతెయును

డు, జుంజుఱుతల=పల్లతలయందు, కక్షము=చంక, పిసరు=కడిగినధాన్యములో త్రోపుడుపడినది, కుండపేర్పు=కుండపెంకు, బాకి=పెద్ద, తడగము=ఎద్దుమీఁద నీళ్లుతెచ్చెడి తోలుసంచి, పడుగు=వస్త్రపునేఁతయందలి నిడుపునూలు, పేక=వస్త్రపునేఁతయందలి అడ్డనూలు, పడుచులు=పిల్లవాండ్రు, బంధురము=అధికము, లోపల శోకాంధకారమును, వెలుపలఅంధకారమును, గిజిగొని=నెలకొని, కవయంగన్=క్రమ్ముకొనఁగా, పోయినత్రోవఁగా=పోయినదే దారిగా-తాను తెలియకపోయినదారియె దారిగాననుట, వటభస్మ...నుండన్=కాళ్లకడ

దోడరినపతిభక్తి తోడుగా నరిగి
పొడవైన వటభస్మపుంజంబు గాళ్ల
కడను బుట్ట తలాపికడ నుండ నిట్లు
పడి కన్ను లరమోడ్చి పాదముల్ వీడు
పడఁ జూచి మృదుపాణిపల్లవయుగము
వెడఁదయురంబుపై వ్రేసి గళంబు
కుడి దిక్కు భుజముపైఁ గొండొక వంచి
మొగ మోరగాఁ బెట్టి ముందటిచుంచు
జిగి దప్పి కెంధూళిచే బీదువాఱి
యొక వికారము లేక యూరక తొల్లి
ప్రకటనిద్రావస్థఁ బరఁగుచందమున
నున్న యాలోహితాస్యునిఁ జూచి ప్రాణ
మున్నదో లే దని యువిద మూర్ఛిల్లి
ధర మీఁదఁ బడి పెద్దదడవుకుఁ దెలసి
పురపురఁ జిత్తంబు పొక్క నందంద
చెందమ్మిరేకులఁ జెనకుహస్తముల
ముందలయును మొగంబును మోఁదుకొనుచుఁ
జాలఁ గీ లెడలినజంత్రంపుబొమ్మ
పోలిక మూర్ఛిల్లి పుత్రుపై వ్రాలి

మట్టిపొడిరాసియు, తలాపికడపుట్టయునుగానుండునట్లు, వీడుపడక్=వేఱువేఱ ఎడగలుగఁగా, మృదుపాణి పల్లవయుగము=చిగుళ్లవంటి మెత్తనిచేతులదోయి, వెడఁదయురము=విశాలవక్షము, గళంబు=మెడ, చుంచు=కూఁకటి, జిగిదప్పి=కాంతిమాసి, కెందూళిచే బీదువాఱి-ఎఱ్ఱదుమ్ముచేత వన్నెమాఱి, చెనకు=మాఱాడు=పోలునట్టి, కీలు ఎడలిన=మఱవీడిన, కల్యాణవిహార=శుభమైన నడవడిగవాఁ •

క్రమ్మఱఁ దెలివొంది కన్నీరు దొరుఁగ
నమ్మదిరాక్షి యిట్లని యేడ్వఁ దొడఁగె
'హా లోహితాస్య వంశైక విస్తార
లాలితసౌభాగ్యలక్షణాకార
హా నిర్వికార మహాగుణాధార
భూనుతఘనమణిభూషణోదార
హా సుకుమార కల్యాణవిహార
వాసి కెక్కినచక్రవర్తికుమార
తిన్ననినగ వామతించునీమోము
కన్నులపండువుగాఁ జూడకున్నఁ
బులకండ మొలుకునీ ముద్దులమాట
లలవడ వీనుల నాలింప కున్న
మెఱుఁ గారునీబోదు మేను చిత్తంబు
కఱవు వో నక్కునఁ గదియింప కున్న
నోడలఁ బ్రాణము లుండ వొకనిమిషంబు
నెడముగా నినుఁ బాసి యే నెట్లు లోర్తు
నే తెరువునఁ బోయి యే నెట్లు వత్తు
నాతోడఁ జెప్ప వే నాతోడునీడ
యెచ్చట నుండి నిన్నెలమి నేఁ బిలువ
వచ్చి నన్ బొడగాంచి వదనాబ్జ మలర
నెదురుగా వత్తు నేఁ డేటికి రావు

టీ. తిన్ననినగవు=చక్కనినవ్వు, ఆమతించు=పుట్టు, పులకండము=కండచక్కెర, బోదు మేను-గోముగాఁ బెరిఁగిన మేను, అక్కునన్=రొమ్మున, ఎడముగా = తెఱపిగా-నీకు నాకు చేరిక లేనట్లుగా, ఎచ్చటనుండిన్=ఎక్కడనుండిగాని, మరలు=త్రి

మది నీకు నా మీఁద మరలెందుఁ బోయె
వడుగులచేత నీ వార్త విన్నపుడె
తడయక నే రానితప్పు పైఁ బెట్టి
యలుకమై ముఖ పద్మ మవ్వలఁ జేసి
పలుకవు నే నిట్లు పలుమాఱుఁ బిలువ
నో యన్న నే మని యొకమరి కింక
నో యన్న నీ కింక నుడిగి నాలోని
కుం దార్పవే పైఁడికుండలమేడ
లందు రత్నావళి నలరుమయ్యెలల
సుదతులు జోకొట్టి జోలలు వాడ
నిదుర వోయెడునీవు నేఁడు రానేలఁ
బడి నక్క లఱవ నిర్భయమున నడవి
నుడుగక నిద్దుర నొంది యున్నాఁడ
వే మందు నింక నె ట్లేమందు విధిని
నేమందు వెట్టిన నెనగుఁ బ్రాణమ్ము'
లని యని పలవించి యవనిపైఁ బొరలి
తనయుని ముక్కునఁ దన వ్రేలు మోపి
యుడుగక మెల్లనె యూరుపు లరసి
'యొడలఁ బ్రాణము డాఁగి యున్నది గాని

మ, పైఁ బెట్టి=మీఁద మోపి, ముఖపద్మ మవ్వలఁ జేసి = ముఖారవిందము పెడమఱ గాఁ ద్రిప్పుకొని 'ఓయన్న ఏమి' అని ఒకమరికి ఇంక ఓయన్న నీకింక ఉడిగి' అనిచ్ఛేదము. ఓయన్నా! నేనుఓయని పిలువఁగా ఇంకవొకసారి ఏమియనిచెప్పి, నీ కోపమునువిడిచి యనియర్థము, కుందు=దుఃఖము, పైఁడికుండల మేడలు=బంగారు కుంభములుంపఁబడిన సౌధములు, రానేల=రాతి నేల యందు, ఏమందు... నెట్లు=

చావఁడు వీఁడని చర్చించి మఱియు
భావించి యిది యేల వలవని యాస
వత్తురే చచ్చినవారును మరల
నిత్తఱి నిటు చావ నిది కట్ట డయ్యె
నిన్నియుఁ గల్ల లూహింపఁ గౌశికుఁడు
నన్ను వేదనఁ బెట్ట నలిఁ బన్ని నట్టి
మాయ గా కని దైవమా' యని కొడుకుఁ
బాయనియక్కునఁ బట్టి పాలిండ్ల
నొత్తి 'యో యమ్మ చనొల్లఁ' డన్ శోక
మొత్తి యా కఱచినయురగంబు దలఁచి
శ్రుతిబాహ్యుఁ డిలఁ బుట్టుగ్రుడ్డు తామసుఁడు
గతిచెడ్డ చెడుగు తెక్కలి బొక్కలాఁడుఁ
బదవిహీనుఁడు జగత్ప్రాణభక్షకుఁడు

ఇఁక నేనెట్లు బ్రదుకుదును, వలవనియాస=కూడనియాస, కట్టడి=ఏర్పాటు, పాయనియక్కునన్=కొడుకు నెన్నఁడును ఎడఁబాసియుండని తనఱొమ్మునందు, ఓయమ్మ చనొల్లఁడు అన్ శోకము=ఓయమ్మా చన్నునొల్లఁడేయనెడి శోకము, ఉరగము=పాము, శ్రుతిబాహ్యుఁడు=చెవులులేనివాఁడని సర్పపరము-వేదబాహ్యుఁడని అర్థాంతరము, పుట్టుగ్రుడ్డు=గ్రుడ్డునఁబుట్టినది, అని సర్పపరము-పుట్టినది మొదలుగా గ్రుడ్డియైనవాఁడని యర్థాంతరము, తామసుఁడు=నీచుఁడు, తామసనర్పజాతి, గతిచెడ్డచెడుగు=దారి సరిగాలేక వంకరగానుండుదుష్టజంతువు-దారితప్పినదుష్టుఁడని యర్థాంతరము, తెక్కలి=దొంగ, బొక్కలాఁడు=బొక్కలందుండువాఁడు - దాఁగుపోతని యర్థాంతరము, పదవిహీనుఁడు = కాళ్లులేనివాఁడు - అంతస్తులేనివాఁడని యర్థాంతరము, జగత్ప్రాణభక్షకుఁడు = వాయువునుభక్షించువాఁడు, జగత్తులోనివారి ప్రాణములనుభక్షించువాఁడు.

వెదకి యీావనపాల విత్తు నేమందు'
నని పాము నిందించి యంతరంగమునఁ
దను దానె యూరార్చి ధైర్యంబు దెచ్చి
'వెల్లువ వారలినవిధిని నీయడవి
మల్లడి గొనువగ మాన కేర్చినను
సుతునిప్రాణములు వచ్చునె వీనిఁ బుణ్య
గతికిఁ బోవ దహించి కాలకౌశికుని
ముదిత మేల్కొనకయ మున్నె నేఁ బోయి
వదలక పని దీర్ప వలయు నిచ్చోటఁ
దడయుట గా' దని తనచీర బిగిచి
కొడుకు వీఁపునఁ గట్టుకొని కొంత దవ్వు
చని చితికేశాస్థిశకల కపాల
ఘనచర్మ సంకీర్ణ ఘట జీర్ణ శూర్ప
భసిత సముద్భటపటునటద్భూత
విసర బేతాళసంవృత్తమై చూడ
నతిభీకరం బైనయా రుద్రభూమి
ధృతిఁ జొచ్చి యం దొక్కెదెసఁ బుత్రు డించి

వెల్లువ పారలినవిధిని=ప్రవాహము ప్రవహించినతీరుగా, మల్లడిగొనువగ= పెనఁగొనుదుఃఖమున - ఒకదుఃఖముతో మఱియొకదుఃఖము పెనఁగొను నట్లుగా, బిగిచి=బిగించి, చితి...సంవృత్తమై - చితి=సొదలు, కేశ=వెండ్రుకలు, అస్థి=ఎముకల, శకల=తునుకలు, కపాల=పుఱ్ఱెలు,ఘనచర్మ=పెద్దతోళ్లు, సంకీర్ణఘట=చెల్లచెదరైనకుండలు, జీర్ణశూర్ప=చిరిఁగినచేఁటలు, భసిత=బూడిద, సముద్భట=మిక్కిలి ఉద్ధతమైనదియు, పటు=బిట్టుగా, నటత్=ఆడుచున్న, భూతవిసర=భూతసమూహములు, బేతాళ=బేతాళుఁడును, సంవృత్తమై

పొంత యొల్కులలోనఁ బొడవడి కాలి
కొంత చిక్కినకడకొఱవులు దెచ్చి
కుఱుప్రోఁగుగా నిడి కొడుకు నం దునిచి
కొఱవి నొక్కటఁ దలకొఱవిడఁ బూని
చేతు లాడక మోము చీరతో నొత్తి
యాతురంబున నేడ్వ నా యార్తరవము
విని హరిశ్చంద్రుండు విస్మయం బంది
'ననుఁ గన్మొఱంగి యీనడురేయి నకట
యీ వల్లకాటిలో నీ యార్తరావ
మీవిధి విన వచ్చె నెలుఁగుచందమును
బోలింప సతి గాని పురుషుండు గాఁడు
చాలు నీతలపోఁత సయ్యన నేఁగి
కదిసి చూడక పొందు గా'దని ముద్ర
గుదియ మూఁపున నిడి క్రూరఖడ్గంబు
మొల ద్రిండుతో నంట ముడి వేసి బిగిచి
కులగిరిపై నుండి కుంభినిమీఁది
కసమున నుఱుకుసింహంబుచందమున

వర్తించునట్టిది, పొంతయొల్కులు=దాపటిశీనుఁగులు, పొడవడి=కనఁబడి, కడకొఱవులు=కాలఁగా మిగిలినకట్టెలు, కుఱుప్రోగు=చిన్నరాసి, కొఱవి...విడన్=ఒక్కకొఱవిచే తలయందు పెట్టుకొఱవిని బెట్టుటకు, మోముచీరతో నొత్తి=మొగమును చీరతోఁగప్పుకొని, కన్మొఱంగి=ఏమఱించి, ఎలుఁగుచందమును పోలింపఁగాన్=కంఠధ్వనితీరును తారకాణచేసిచూడఁగా, సతి=స్త్రీ, చాలు నీతలపోఁత=స్త్రీయోపురుషుఁడోయని యిచటనేయుండి తర్కించుకొనుచుండుట చాలును, పొందుగాదు=తారకాణ యేర్పడదు, మొలద్రిండు=మొలయందలిదట్టి, కుంభిని = భూమి, అసమునన్ = దర్పమున, ఆదట = ప్రేమము,

మసలక యారాజు మంచపై నుండి
మేదినిఁ బడ దాఁటి మెల్లన వచ్చి
యాదటఁ గనుఁగొనునప్పు డయ్యింతి
నెరసినకురులును నెఱి ధూళిఁ దూలి
విరిసినసీమంతవీథియు వదలి
జాఱినపయ్యెదఁ జన్నులమీఁదఁ
గాఱెడుకన్నీరుఁ గరపల్లవమునఁ
గదిసినచెక్కును గలికిలే నవ్వు
గుదిసినచూపును గొండొక వదలి
మూఁపుపై వ్రేలుక్రొమ్ముడియును వగల
వాపోవఁ గెంపారువాలుఁగన్నులును
వెడలునిట్టూర్పులు వెగచు కుత్తికయు
బడలినమేనును బగిలినమోము
మగిడినచనుకప్పు మాసినచీర
పగిలినయధరబింబమునై తలంపఁ
బలుచని మొగిలులోపలఁ దోఁచుచంద్ర
కళభంగి మాఁగుడు గవిసి మానికపు

నెరసినకురులును=చెల్లచెదరైన తలవెండ్రుకలును, నెఱి=ఒప్పు, ధూళిః=దుమ్ము చే, తూలి=పసచెడి, విరిసిన సీమంతవీధి=విచ్చియిన పాపటరేక, లేనవ్వుగుదిసినచూపు=లేఁతనవ్వు తీసిపోయినదృష్టి, కొండొక=కొంచెము, వగల...వాలుఁగన్నులు=దుఃఖములచే రోదనము సేయఁగా సెజ్జఁబాఱిన విశాలములైన నేత్రములును, వెగచుకుత్తికయు=వెక్కివెక్కి యేడ్చుచున్నగొంతును, మగిడినచనుకప్పు=తొలంగిపోయిన చన్నులమీఁదిపయ్యెద, పగిలినయధరబింబము=పీఁటలువాఱిన దొండపండువంటిమోవి, పలుచని మొగిలు=పలుచగానున్నమబ్బు, మాఁ

బొమ్మను మసిపాఁతఁ బొదిఁగినమాడ్కి
నెమ్మేనిక్రొమ్మించు నిగుడక మాసి
నాకేశుఁ బాసిననాఁటిపౌలోమి
చేకొన్నదుర్దశఁ జెందిన ట్లున్న
భావించి యాత్మలోఁ బలుమాఱు వగచి
భూవల్లభుఁడు దానిముందఱ నిలిచె
నిలిచినఁ గనుఁగొని నివ్వెఱపాటుఁ
గళవళంబును మదిఁ గడలు కొనంగఁ
దొలఁగినపయ్యెద తుంగస్తనముల
నలవడఁ గప్పు నయ్యబ్జాక్షిఁ జూచి
'వెఱవకు మీవయో వెలఁది యిచ్చోట
నెఱసినచీఁకటి నిట్లొంటి నున్న
నెఱసాహసివి మఱి నీకేటి వెఱపు
మఱుఁగు పెట్టక చెప్పుమా నీకు నిట్టి
నెగు లింతయును నేమినెపమున వచ్చె
మగువ నీ పేరేమి మగనిపే రేమి
యెచ్చట నుండుదు వీ బాలుఁ డెట్లు
చచ్చె' నావుడు ముఖాబ్జము వ్రేల వైచి

గుడు=నలుపు - మాలిన్యము, మసిపాఁతక్=మాసినగుడ్డను, నెమ్మేనిక్రొమ్మించు=దేహముయొక్క క్రొత్తకాంతి, నిగుడక=ప్రసరింపక, నాకేశు...దుర్దశక్=దేవేంద్రుని ఎడఁబాసినప్పటి శచీదేవిపొందిన దురవస్థ, నివ్వెఱపాటు=ఆశ్చర్యము, కళవళము=కలఁత, నెఱసినచీఁకటి=నిండుకొన్న చీఁకటి, నెఱసాహసివి=పూర్ణసాహసము గలదానవు, నీకేటివెఱపు=ఇంతటిసాహసముగల నీకుభయమేల, నెగులు=బాధ, విప్రవరునింట=బ్రాహ్మణోత్తముని గృహమునందు, తప్పనా

కన్నుల బాష్పంపుఁగణము లందంద
చన్నుగుబ్బల మీఁద జలజల దొరుఁగఁ
బొరిఁబొరి వగచుచు భూవల్లభునకుఁ
గరుణ రా గద్గదకంఠి యై పలికెఁ
‘బురుషవరేణ్య యీపురి నొక్క విప్ర
వరునింట దాసి నై వర్తించు చుందు
నప్పు దీర్పఁగ నుపాయము మఱి లేక
తప్ప నాడక పతి దన్నమ్ము కొనియె
నాసుతుఁ డితఁ డంసనారి నా పేరు
భూసురుం డడవికిఁ బుత్తేర వేల్మి
కట్టెలకై వచ్చి కడు నుగ్రమైన
కట్టిడిభుజగంబు కాటునఁ జచ్చె
ననఘు మీ రెవ్వ రి ట్లనుకంప మీఱ
దనశోక ముడుపఁ జిత్తమునఁ దలంచి
విచ్చేసి నట్టియావిశ్వనాథుఁడవొ
నిచ్చలు బహుభూతనివహంబు గొలువ
నిచ్చలుఁ బ్రియ మార నీ రుద్రభూమి
నచ్చుగా విహరించునాభూతపతివొ
యెఱిఁగి యుండితి రేని యేమైన మందుఁ
గరుణ నిచ్చి సజీవిగా వీనిఁ జేసి

డక=లేదుపొమ్మని అబద్ధముచెప్పలేక, తన్నమ్ముకొనియెన్=నన్నమ్ముకొనెను, భూసురుఁడు=బ్రాహ్మణుఁడు, పుత్తేరన్=పంపఁగా, వేల్మికట్టెలు=హోమమునకై వనమిధలు, కట్టిఁడిభుజగము=క్రూరమైనసర్పము, అనుకంప=దయ, తనశోకము=నాశోకము, విశ్వనాథుఁడవో=కాశీ విశ్వనాథుఁడవో, భూతపతివో=శివుఁ

నన్ను రక్షింపుము’ నాపుడు దాని
సన్నుతప్రియవాక్యసరణిచేఁ దనదు
కులసతి యవుట నిక్కువముగా నాత్మఁ
దెలియక చంద్రమతీ దేవి కనియె
‘భూతనాథుఁడఁగాను భువి నెల్ల జనుల
చేత మ్రొక్కులు గొనుసిద్ధుండఁ గాను
వెడఁగుమందులచేత విష మెట్లడంగుఁ
జెడునోకో చీర రాచినఁ బాముకాటు
మందుఁ బెట్టఁగ నేర మనఁ జేయ నేర
నెందు నిప్పురమున నీ రుద్రభూమి
గుత్తగాఁ గైకొని గురుభుజశక్తి
నొత్తి యెవ్వరినైన ను క్కడఁగించు
బలియుండు చండాలపతి వీరబాహుఁ
డెలమిమై మన్నించి యీ ముద్రగుదియఁ
దగ నిచ్చి యీకాడు తఱలక రేయుఁ
బగలును గావంగఁ బనిచె న న్నిందు
వీరదా సను పేర వెలయుచుండుదును
వారక నడురేయి వచ్చి నీ విట్లు
నన్నుఁ గానక యుండ నందనుఁ దెచ్చి
పిన్ననిఁ జితిమీఁదఁ బెట్టంగఁ దగునె
నెలఁతవు గాన మన్నించితి నిన్నుఁ

డవో*, చెడునోకో చీరరాచినఁబాముకాటు=పాముకఱచిన విషమును గుడ్డతో రాచి తుడువఁగా తీసిపోవునా, మనఁజేయఁ=బ్రతికించుటకు, గురుభుజ

దల ద్రెవ్వ వేయుదుఁ దక్కొరుఁడైన
సాద వేర్పఁ దగునంత చోటుకు మాడ
మొదటనే తెచ్చి మాముందటఁ బెట్టి
పిదప దహింతురు పీనుఁగుఁ దెచ్చి
ముదిత యీతగినచొప్పున నీవు దెచ్చి
యీకుమారున కగ్గి నిమ్మిటు పొసఁగ
లేకున్నఁ గాల్చి పోలేవు నన్నేలు
నొడయుఁడు వీరబాహునియద్గులాన
వెడలి పొ మ్మనిన నవ్వోలఁది యిట్లనియెఁ
'బరహితచరిత నాపై నొకకొంత
కరుణ సేయక సిరి గలదానివలెనె
యడిగెదవేల నన్నదలించి యిపుడు
యెడపక నీన నీకేమి గూడెడిని
సకలదీవుల నేలుజనపతిపుత్రుఁ
డకట చేరెఁడునేల కర్హుండు గాఁడె
నీ వేమి సేతు పన్నినమునిమాయ
నా వెంటఁ దతిగొని నలఁచి పో నీక
పట్టి యీగతి నేలపై నిడి కాలఁ
బెట్టి ప్రాముచు బుసవెట్టుచుండంగ'

శక్తిన్ = గొప్ప బాహుబలము చేత, కాఁడు = శ్మశానము, తక్కొరుఁడు = మఱియొక్కఁడు, సిరి గలదానివలెనే = సంపదలగల స్త్రీవలెనే, నీకేమిగూడెడిని = నీకేమిలాభము ఒనఁగూడఁగలదు, జనపతి పుత్రుఁడు = రాజకుమారుఁడు, తతిగొని = విడువక, నేలపైనిడి కాలఁబెట్టి ప్రాముచున్ = నెలపైఁ బెట్టి కాలితోఁ రాచుచు, చాయగాన్ = చూచాయగా - జాడగా తనసంగతి సూచిత

నని యిట్లు చాయగా నాడిన మాట
విని హరిశ్చంద్రభూవిభుఁ డాత్మఁ గలఁగి
తగ విచారించి 'యీ తరుణి నా పత్ని
యగు' నని మనసు సయ్యన మగిడించి
'గట్టిగా నెఱుఁగ కీగతిఁ దలంపే ల
పుట్టె విశ్వేశ నా బుద్ధిలో' ననుచుఁ
బరితాప మంది యప్పుడఁతి నీక్షించి
మరి పల్కెఁ 'జోద్యంపుమాట లాడెదవు
నట్టేడుదీవులనడు మెల్ల నేలు
పట్టభద్రునికూర్మిప ట్టఁట బాలుఁ
డామహీశునిదేవి వఁట నీకు విత్త
మేమియు లే దన్న నెటు నమ్మ వచ్చు
నీకెంత గలిగిన నిన్న దలించి
మాకుఁ గైకొన రాదు మాడకు మిగులఁ
జేకొని యేలిక చెప్పినచొప్ప
గాక నీ పేదఱికము నాకుఁ బోత్తె
పాటలగంధి నీపలు కియ్యకొనఁగఁ

మగునట్లు - 'ఏడుదీవుల నేలు రాజకుమారుఁ'డనుమాట జాడఁగాచం ద్రమతీవృత్తాంతమును సూచించినవని భావము. మనసు సయ్యనమగిడించి=మొదటభార్య గాఁదలఁచి పిదప నట్లు తలఁపఁ గాదని మనస్సును త్రిప్పుకొని, గట్టిగానెఱుఁగక =రూఢిగా నన్నియుఁ దెలిసికొనక, పట్టఁట=పట్టియఁట - ఇటనిత్త్వనకు సంధివిచార్యము, నీకెంతగలిగినను=నీకు ఎంతసంపద యుండినను, మాకు ... మిగులన్ - మాడకంటె నెక్కువగా మాకుఁ బుచ్చుకొనరాదు, నీ పేదఱికము నాకుఁ బోత్తె=నీలేమిడితో నాకేమైన సంబంధమా? నీలేమిడిని పాటింపవలసిన యక్కఱ

గాటిపాపని కేల కరుణ నీమీఁద
లే కున్న నాకిచ్చు లెక్కఁ జెల్లు
గైకొందు నిమ్ము నీ కట్టినమినుకు'
నావుడు నుల్కి యానాతి చిత్తమున
భావింపఁ దనపతిభక్తి పెంపునను
బోడగాన రా దన్యపురుషుల కేరి
కోడికమై నామెడ నున్నయీమినుకు
యితఁడె హరిశ్చంద్రుఁ డిఁక నేమి శంక
మతిలోన ననుచు నమ్మానవాధీశుఁ
డున్నదుర్దశకు బిట్టుల్లంబు గలఁగి
తన్నుఁ దా నెఱుఁగక ధరమీఁద వ్రాలి
ధృతి నెట్టకేలకుఁ దెలసి 'హా నాథ
సతతదయాలోల సత్యసంశీల
హా హరిశ్చంద్ర రావయ్య నీ పుత్రు
లోహితాస్యునిఁ బద్మలోచనుఁ జూడు
ముందు నీతొడలపై ముదమున నిద్రఁ
జెందినగతి నేఁడు చిత్తంబు పొక్కఁ
బన్నినచితిమీఁదఁ బడి దీర్ఘనిద్ర
నున్నాఁడు మేల్కొనఁ డొకమరి యైన
నా పుత్రరత్నంబు నా పాటుఁ జూడ

నాకు లేదనుట, కాటిపాపనికి=వల్లెకాటిలోని వానికి, నీపలుకియ్యఁ గొనఁగఁ గాటిపాపనికి నీమీఁదఁ గరుణయేల అనియన్వయము. చెల్లు–చెల్లుగా, మినుకు=తాళి,బొట్టు, నావుడున్=అనఁగా, ఉల్కి=అదిరి, నాతి=స్త్రీ), పొడగాన రాదు=కనుట కలవిగాదు, ఒడికమై=మనోహరమై, బిట్టు=మిక్కిలి, ఉల్లంబు=

నోపక వచ్చి తా నున్నవాఁ డిచటఁ
గాటిలోఁ గానని కన్నుల నున్న
చోట ని న్నిబ్భంగి శోకాబ్ధి ముంపఁ
దలఁచి మ మ్మిటుఁ దెచ్చి దైవంబు నీకుఁ
దెలిపెనే' యనుచు నద్దినకరకులుని
యడుగుల పై వ్రాలి యశ్రువు లురిలి
మడుఁగు గట్టఁగఁ జంద్రమతి విలపించు
'నో సార్వభౌమ నీ వున్నయీమంచ
భాసురరత్నసభామంటపంబె
పటుభూతబేతాళపంక్తులు వీర
భటపరివారకప్రకరంబె నీకుఁ
బెనుపొందుచితివహ్నిభీకరశిఖలు
ఘనతరకరదీపికాసహస్రములె
చదలఁ గ్రిక్కిఱిసినశవధూమపుంజ
మది భవత్కేళినీలాతపత్రములె

మనస్సు, నాపాటు...నున్న వాఁడిచట=నేను పడుపాట్లను జూడఁజాలక యిచ్చటికి వచ్చియున్నవాఁడు అని యుత్ప్రేక్ష. కాననిగన్నుల నున్నచోట=వెలుపలిసంగతు లొక్కటిని దెలిసికొన కుండునట్టి కన్నులతో నున్న యిచ్చోట- వెలుపలజరుగు సుఖదుఃఖములు పాటింప వీలులేక నీవిచ్చటనుండఁగా ననుట. శోకాబ్ధిన్=దుఃఖసముద్రమునందు, మడుఁగుగట్టగన్=మడుఁగులుగా ఏర్పడఁగా- వెల్లువలుగా కాఱఁగా ననుట, ప్రకరంబె=సమూహమా, పెనుపు...శిఖలు=వర్ధిల్లుచున్న సొదనిప్పుల భయంకర జ్వాలలు,ఘనతర...సహస్రములె=మిక్కిలి గొప్పవైన వేనవేలు చేదివ్వెలా, చదలన్=ఆకాశమున, క్రిక్కిఱిసిన...పుంజము= దట్టముగా పర్వినపీసుఁగు పొగలసమూహము, భవత్ కేళినీలాతపత్రములే=నీయొక్క విలాసార్థమైన నల్లని గొడుగులా, ఘూల...జాలం

శూలకీలితనరస్థూలశిరోజ
జాలంబు లాఖేటసమయచామరలై
కరమర్థి నరశిరఃకఠినపాత్రములు
సరసతమంగళాచారకుంభములై 2220
జ్వలనప్రదేశనిజవ్యజనములు
ధళధళ మనుచిత్రతాళవృంతములై
ప్రజతండములు బరాబరి సేయ మత్త
గజములు నీవెంటఁ గదిలి రావేల
నోజతోఁ బడివాగె నొప్పుసాంబ్రాణి
తేజీలు నీవెంటఁ దిగిచి రావేల
వలనొప్ప దండెల వజ్రాలమించు
దొలఁకాడు చున్నయాందోళిక లేవి
పసిఁడితీఁగల కీలుపంజుల డాలు

బులు=శూలమందుఁ గ్రుచ్చఁబడిన మనుష్యుని పెద్దతలవెండ్రుకల సమూహము లు, ఆఖేటసమయ చామరలై=వేటకుఁ బోవునప్పటి చామరములా, నరశిరఃకఠినపాత్రములు=మనుష్యుల తలలనెడి-అనఁగా పుఱ్ఱెలనెడి-కటువైన పాత్రము లు, జ్వలన ప్రదేశ నిజవ్యజనములు=అగ్గినిమంట పెట్టుచోటనున్న యీవిసన కఱ్ఱలు, చిత్రతాళ వృంతములై=వింతలైన విసనకఱ్ఱలా, ప్రజతండములు=జనస మూహములు, బరాబరిసేయన్=హెచ్చరిక సేయఁగా, పడివాగె=ఎక్కుట కాయిత్తపఱుచునపుడు సవరించెడు గుఱ్ఱపుసవరణ, సాంబ్రాణితేజీలు=మేలైన గుఱ్ఱములు, ఇచట 'రావేల మదనిర్ఘరావేల పరిమళలోభలుబ్ధాళి భద్రేభఘటలు। తగవేల చూడఁ గ్రొత్తగ వేలసంఖ్యలై పడివాగెఁ బఱతెంచుప్రౌఢహరులు' అని హరిశ్చంద్ర నలోపాఖ్యానమునందలి రచనతోడి సామ్యమూహించునది. దండెలన్=అడ్డకొయ్యలందు, వజ్రాలమించు దొలకాఁడు=మగరాలకాంతి ప్రసరించు, అందోళికలు=అందలములు, పసిడితీఁగల = బంగారుజరీతీఁగలయొ,

పసనైనముత్యాలపల్లకీ లేవి
యాతేజ మారూప మాభుజాగర్వ
మాతెల్వి యాభాగ్య మారాజసంబు
నెక్కడ నుడివోయె నెక్కడ నడఁగె
నెక్కడఁ దుదమొద లీదురవస్థ
కక్కటా' యని యేడ్చు నతివచిత్తంబు
వ్రక్కఁ గౌఁగిటఁ జేర్చి భూవల్లభుండు
ముప్పిరి గొనుమూర్ఛ మునిఁగి యొక్కింత
తెప్పిఱి ధైర్యంబు దిగజాఱఁ దన్నుఁ
గప్పినపుత్రశోకంబున మునిఁగి
విప్పారుకన్నుల వెస నశ్రు లొలుకఁ
గొడుకురూపంబును గుణవిశేషంబు
నడుపును ముద్దును నగవుఁ దేజంబుఁ
బలుమాఱు నంకించి పలవించువిభునిఁ
దెలుపుచుఁ జంద్రమతీదేవి పలికె
'భానుకులేశ యీ పగిది నిద్దఱముఁ
బూని యేడ్చుచు నున్నఁ బొసఁగ దీమీఁద
వివరింపు మిదె ప్రొద్దు వేగుజా మయ్యెఁ
గదిసినచిమ్మచీఁకటి వెల్లఁబాఱె

కీలుపంజుల=కీలుగల దివటీలయు, డాలు పసనైన=కాంతి నీటుగలుగునట్టి, ఉడివోయెన్=తీసిపోయెను, 'ఈదురవస్థకు తుద మొదలెక్కడ?' అని యన్వయము, విప్పు ఆరుకన్నులన్=విశాలత నిండిన కన్నులందున్=పూర్ణవైశాల్యముగల కన్నులందనుట, అంకించి=పొగడి, వివరింపుము=వివేచింపుము, ప్రొద్దు వేగు జాము=సూర్యుఁ డుదయించు సమయము, ఏతేక=రాక, ఏలికసాని=

నినుఁ డుదయాద్రికి నేఁ దేక మున్న
చన కున్న నేలికసానిచేఁ జావు
చెప్ప మేతెఱఁ' గన్నఁ జింతించి తగవు
దప్పక నధిపుఁ డత్తన్వి కి ట్లనియెఁ
'జెలువ యీబాలునిఁ జిచ్చునఁ ద్రోయ
వలసిన నేలినవానిలాభంబుఁ
దప్పించి సత్యంబు దప్పి మోమోట
నిప్పని కియ్యకో నేరీతిఁ బోసఁగుఁ
బోసఁగ వీపలుకులు వ్రోయి ని న్నేలు
వసుధామరునిఁ గాంచి వదలక వేఁడి
వలయుమాడయు మఱి వాతిపాతికయు
వలనొప్పఁ గొని రమ్ము వడి నిట' కనినఁ
దనప్రాణనాథుసత్యవ్రతంబునకు
మనమున నలరి యమ్మహిపతికాంత
తనయు నక్కడఁ బెట్టి తగ నప్పగించి
మనుజేశునకు మ్రొక్కి మసలక మరలి
పురవీథి నేఁగునప్పుడు కౌశికుండు
తరలాక్షిఁ జంపింపఁ దలఁచి యాతఁడమె
మొఱకు వెంద్రుకలును ముదురు మీసములుఁ
గఱకునల్లనిమేనుఁ గలచోరు నొకనిఁ

దొరసానియైన కలహాకంఠిక, చిచ్చునఁ ద్రోయవలసినన్ =నిప్పునందు వేయవలసి యుండినయెడల, ఏలినవాని లాభంబు దప్పించి=నాఏలికయైన వీరబాహునికి వచ్చు వాతిపాతిక మొదలైన యాదాయమును బోఁగొట్టి, ఇయ్యకోన్ =సమ్మతించుటకు, వసుధామరునిన్ =బ్రాహ్మణుని, ధాత్రీతలేశు పడఁతిన్ =రాజు భార్య

దడయక పుట్టించి ధాత్రీతలేశు
పడఁతిఁ జంపింప నుపాయంబుఁ గఱపి
పారిఁబోరిఁ 'బొమ్మన్నఁ' బోయి తలాకావి
చిర ముండ్ల బంతియు సెలకట్టె కత్తి
బలపంబు భ్రమరాలఁ బట్టినక్రోవి
యొలికిలోపలిభూతి యొఱగి మైలమందు
కుఱునీలికాసెయుఁ గొంకి నారసము
నొఱపుగాఁ బూని వాఁ డుక్కున నేఁగి
యావారణాసిపురాధీశు నగరు
వావిరిఁ గన్నంబు వడి వేసి చొచ్చి
మిసమిస మనుచుఁ గ్రొమ్మెఱుఁగులు వాఱు
పసిఁడికుండలమేడపై నంద మైన
తూఁగుటుయ్యాలలోనఁ దొలుకారుమెఱుఁగుఁ
దీఁగబాగున నొప్పి దీపించు దాని
చెలువమై మించిన సిబ్బెంపుగబ్బి
వలుఁదపాలిండ్లలో వదనాంబుజంబు
గదియ నిద్రించుచక్కనిరాచపట్టి
కదలక మెదలక కాలున నూఁది

ర్యను, తలాకావిచిర=తలయందుకావి చీర, ముండ్లబంతి=ముండ్లువఱుసగాఁగ
లచెండు, సెలకట్టె మొదలైనవి దొంగసాధనములు, భ్రమరాల క్రోవి= దీప
మార్పెడిపురుగులుగల గొట్టము, ఒలికిలోపలి భూతి=కాలిన పీనుఁగుసాదలో
నిబూది, మైలమందు = స్త్రీరజఃకృతమై వశీకరణసాధనమగు నౌషధము,
తొలుకారు = తొలుకరి కాలము, సిబ్బెంపు గబ్బివలుఁదపాలిండ్లు=సిబ్బెములు
గలిగి బటువులై విఱివిగల చన్నులు, కదలక మెదలక కాలుననూఁది=కాలుచే

కుదియంగ వెసఁ బట్టి కుత్తుకఁ బిసికి
తోరంపుదివియలతో మాఱు మండు
హారమణీశోభితాభరణములఁ
గళవళం బందక కైకొని పోయి
మలఁగుచు నాచంద్రమతి సనుదెంచు
తెరువున కడ్డంబు దిగ్గన వచ్చి
గరువంబు మీఱఁ దస్కరుఁ డిట్టు లనియె
'నీవేళ నీవెంట నెవ్వరు లేక
నీవేల నీరీతి నేఁగెద వొంటి
నలుగక చెప్పు మ' టన్నఁ జిత్తమునఁ
గలఁగుచు నిలిచి యక్కమలదళాక్షి
వెగచి యేడ్చుచుఁ దన వృత్తాంతమెల్లఁ
దగఁజెప్పుటయు లేనిదయఁ దాల్చి వాఁడు
'నా చెల్లెలవు నీవు నలినదళాక్షి
యీచందమునఁ గుంద నేల కొ'మ్మనుచుఁ
బన్నుగాఁ దనచేతిపసిబిడ్డతొడవు
లన్నియు ముడిగట్టి యం దిచ్చునంత
దాది మేల్కని రాచతనయునిఁ గాంచి
మదిలోన శోకంబు మానక యపుడు
చనుదెంచి యంతయు జననాథునకును

త్రొక్కి పట్టి కదలక మెదలకుండునట్లు చేసి, తోరంపు...భరణములన్ = పెద్ద దీపములతో పాటిగా వెలుఁగుచున్న హారరత్నములను శోభితములైన తక్కిన యాభరణములను, కళవళము=కలవరపాటు, గరువంబు = పెద్దఱికము, వెగచి=వెక్కి, తొడవులు=భూషణములు, కుదియంగన్ =కీడ్పడునట్లుగా, శు

వినిపించినను గడు విస్మయంబంది
కడువేగమునఁ బుత్రుకడకు నేతెంచి
కడకతోఁ దనదు దుఃఖము లెల్ల విరియఁ
'గొనకొన వీనిని గుదియంగఁ బట్టి
వనరంగఁ జంపినవాఁ' డెవ్వఁ డనుచు
వల నొప్పఁగాఁ దలవరులఁ బిల్పించి
వెలయ వారలకు నవ్విధ మెఱిఁగింప
మెఱుఁగుఁగైదువుల క్రొమ్మెఱుఁగులు దిశల
నెఱసినచీఁకట్లు నెడలంగ జడియు
కాలకింకరులు బింకపుఁదలవరులు
కోలదివ్వెలవారిఁ గొంచు నవ్వీథిఁ
'బదపదఁ డిదె దొంగపదపంక్తి చొప్పు
వదలకుం' డని వచ్చువారికి మున్నె
'దొంగ నాచేతికి దొరికె మీ రేల
వెంగళులై జాడ వెదకెద' రనుచు
వడిఁ జోరకుఁడు తలవరులలోఁ గలసి
తొడిఁబడఁ గృప మాలి తోయజనేత్రి
పెడకేలు బిగఁ బట్టి పెలుచ నందంద
పిడికిళ్లఁ బొడుచుచు బిట్టు తిట్టుచును
బ్రిదులక గొనిపోయి భీషణుం డనెడి
మొదలితలారిసమ్ముఖమునఁ బెట్టి

ఱుఁగు గైదువుల=తళతళలాడు ఆయుధముల, నెఱసిన=నిండిన, ఎడలంగన్= తొలఁగిపోవునట్లు, కోలదివ్వెలు=దివ్వటీలు, వెంగళులై = వెఱ్ఱివారై, బ్రిదులక=

సూడిద పెట్టి దా సురిఁగె నా చోరుఁ
డప్పుడు భీషణుం డాచంద్రమతిని
నిప్పులు గన్నుల నిగుడ నీక్షించి
కోఱమీసము నుల్చి కొని 'తన బారిఁ
బాఱి పొ'మ్మ నుచు నుద్భటవృత్తి లేచి
జంకించి చేవాలు జళిపించి వ్రేయ
నుంకించి శంకించి 'యువిద వధించు
రట్టు నాకేటికి రాజు ముందరనె
పెట్టెదఁ గా'కని పేరోలగమునఁ
గొడుకుకుఁ బలవించు కొనుమహీపాలు
కడ నిల్పి నవరత్నకాంతుల మించు
తొంగలించెడుబాలుతోడవులమూట
ముంగల నిడిన 'హా ముద్దులపట్టి
హా కుమారక' యంచు నట వక్షమందు
దాకొన నొత్తి నేత్రముల నం దం ద
తొరుఁగునశ్రులఁ దొప్పదోఁగి శోకాగ్ని
నెరియుచు విలపించు చెట్టకేలకును
గొంత ధైర్యము దెచ్చుకొని హరిశ్చంద్రు
కాంతాశిరోమణిఁ గనుఁగొని పలికెఁ

తప్పించుకొననట్లు, మచ్చంబుగా=గుఱుతుగా, సూడిద=కానుక, సురిఁగె=మఱఁగయ్యెను. నుల్చికొని=మెలిఁబెట్టికొని, తనబారిఁబాఱి పొమ్ము=నాదానుండి పరుగెత్తిపొమ్ము, నవరత్నకాంతులమించు = నవరత్నములకాంతులయొక్క ప్రకాశము, తొంగలించెడు = ప్రకాశించెడు, తోడవులమూట = సొమ్ములమూటె, దాకొనక = కదియునట్లు, దొడికి = తెగించి, అతివలు = స్త్రీలు,

గటకటా నిన్ను నెక్కడి దురాత్మకుఁడు
'కుటిలుఁడై యిటు సేయఁ గోరి పుత్తెంచెఁ
దొడవులకై తెంపుతోఁ బ్రాణములకు
దొడికి ముద్దులపట్టిఁ దునుమ నేమిటికి
నను వేఁడుకొనిన నింతకు మేలిమైన
వినుతభూషణములు వెలఁది నీ కిడనె
సుకుమారు నత్యంతసుందరాకారు
నకట చంపఁగఁ జేతు లాడెనే నీకుఁ
బురుషులకంటె నెప్పుడు నాఱుగుణము
లరయ సాహస మెక్కు డతివల కనిన
యమరిననీతివాక్యము నిజ మయ్యె
రమణిరో దానవురాలవు గాక'
యని చాలఁ గోపించి యప్పు డారాజు
'ననుమానమే ల సయ్యన ధర్మమెన్న
దీనితో భాషింప దీనిఁ గన్గొనిన
నూనుఁ బాతక'మ ని యుర్వీశుఁ డాత్మ
నంతంత నడరుశోకావేశమునను
వింతగా 'భీషణ విను' మని పలికెఁ
బడఁతుక నా కన్నపట్టిపాదముల
కడ నిల్పి యీబాలఘాతుకిశిరము
వెసఁ ద్రుంపు మని చెప్ప వీరబాహునకు

దానవురాలవు = రాక్షసివి, ధర్మమెన్న... పాతకము = ధర్మము నాలోచింపఁగా నిట్టిఘాతుకితో మాటాడుటయు దీనిని గన్నెత్తిచూచుటయు నే పాతకమే కావచ్చును, నాకన్నపట్టి = నేనుగన్నట్టి బిడ్డని యొక్క, 'ముమ్మరంబుగ వగ

మసలకు మిదియె ముమ్మాటికి సెలవు
పొ'మ్మన్న నప్పు డాభూపాలుదేవి
'ముమ్మరంబుగ మది ముప్పిరి గొనఁగ
వగపు లన్నియుఁ బాయ వరమి చ్చె దైవ
మగలనేటికిఁ జావు' కని తలపోసి
తల వాంచి తనకల్లఁదనము దీపింప
నిలిచి యూరక యుండె నేల వ్రాయుచును
పోఁడిగా నత్తఱి భువనముల్ పొగడ
నేఁడు హరిశ్చంద్రనృపశేఖరుండు
శ్రీకరనిజరాజ్యసింహాసనంబు
నీక్రియ విలసిల్ల నెక్కి న న్నట్లు
లాలితనిజమండలస్ఫూర్తి మెఱయ
బాలభానుఁడు తూర్పుపర్వతం బెక్కె
నంత నాభీషణుఁ డనుతలారియును
బంత మేర్పడఁగ నాభానుకులేశు
కాంతఁ దోడ్కొని పోవఁగా రాజవీథి
నంతంత డగ్గఱి యాపౌరసతులు
గమి గూడి చూచి యక్కటా దాది చన్ను
నిముక నేరనిచిన్ని నెత్తురుఁగందు
బంగారువంటిపాపని మెడఁ బిసికి

ఱన్నియు మది ముప్పిరిగొనఁగఁ బాయ దైవమువరమిచ్చె' నని యన్వయము. గలనేటికి = చింతింపనేల, దీపింపన్ = ప్రకాశించునట్లుగా ఈక్రియ = విధము, లాలిత ... స్ఫూర్తి = మనోజ్ఞమైన తనబింబముయొక్క తో(?)పిక... ది... నెత్తురుఁగందు = దాదిచంటిలో నిముడ నేరనంత చిన్ని జొత్తుపాప, బిడ్డ..

మ్రింగ నెచ్చటనుండి మృత్యువై వచ్చె
నాఁడుదొంగలు దఱుచైరి యో భువిని
జోఁడిగా బిడ్డలఁ బొరుగిండ్ల నుంచి
నిదుర వోవఁగఁ బాసె నేఁటితో మనకు
నిది మహాపద పుట్టె నీపట్టణమున
వదలక నిటువంటివారికి నెల్ల
బెదరుగా దీనిఁ జంపినఁగాని పిదప
ఘాక గా'దనువారు 'తగ దాఁటదాని
నేకల్ల నేసిన నిటు పట్టి చంప
నొలికి ద్రిప్పుడు మేను నొకచోటు గోసి
తలఁగి పొమ్మందురు తనభూమి వెడలి
యీలోకకల్యాణి కీమానవతికి
నేలీల నీనింద యొసఁగెనో కాని
పరికించి చూడ నేపట్టున నైనఁ
బరమాణువంత పాపము గాన మెన్నఁ
డులుకుచు దొంగ దా నొకచోట నుండు
నొలయ నవిశ్వాస మొకచోట నుండు
నాఁటదానికి వశమమ్మ యీమేటి

నేఁటితో మనకు = బిడ్డలను పొరుగిండ్లకేని పంపినను వారచట నెమ్మదిగాను దురనునమ్మికతో నిదురపోవుటమనకు నేఁటితో తీఱెననిభావము-పొరుగిండ్లకును గూడఁబంపరావయ్యె ననిభావము. ఘాక = భయము-హద్దు, ఆఁటదానిన్ = ఆఁడుదానిని, ఒలికిత్రిప్పుడున్ = పీనుఁగునుజంపి త్రిప్పఁగా, మేనునొకచోటఁగోసి = దేహములో ఏదేనొక భాగమునుగోసి, ఉలుకుచు ... నుండు = దొంగయులుకుచు తానగపడక యొకచోటనుండును. అపనమ్మకము దొంగకానట్టి మఱొక్క

కోటలు దాఁటి యాగోడలు దాఁటి
తాళంబు లెడలించి తలుపులు దెఱచి
కేళిమై రొప్పుజాగిలముల మొఱఁగి
దాది వాకట్టి భూతలనాథుపట్టి
నాదట నీరీతి నట్టొత్తి చంప
నూహింప నెవ్వఁడో యొకకన్నగాఁడు
సాహసంబునఁ బోయి చంపి యాతొడవు
లను వ్రెండఁ గొనిపోవ నంత నారెకులు
తను గూడ ముట్టినఁ దరలాక్షిమీఁదఁ
జొప్పు పుట్టంగ నాసొమ్ములు వైచి
తప్పించుకొని పోయెఁ దనప్రాణభీతి
నేరము దనమీఁద నెరసిన లజ్జఁ
గూరి భూపాలునికొలువులోపలను
నిలిచి భాషింపఁగ నేరక చావు
కలుగక చనుచున్న' దనువారు గొంద
'ఱిది బాలఘాతుకి యెద నెన్ని చూడ
నిది వధూవధ దీన నెట్లాడ నెట్లొ

యందుండును, ఎడలించి = ఊడునట్లుచేసి, జాగిలములు = వేఁటకుక్కలు, మొఱఁగి = ఏమఱించి, ఆదటన్ = ఆసక్తితో, అట్టొత్తి = మెడఁబట్టి, ఆరెకులు = తలారులు, కూడముట్టినన్ =కూడునట్లువచ్చిపైకొనఁగా, చొప్పుపుట్టంగన్ = దొంగజాడకలుగునట్లు, నెరసినన్ = వ్యాపింపఁగా - మోపంబడఁగాననుట, లజ్జఁగూరి = సిగ్గునొంది,ఇది... నెట్లొ = ఒకప్రక్కచూడఁగా, నిదిబాలఘాతుకిగాన వధింపఁదగును. మఱియొకదృష్టినిజూడఁగా ఇది స్త్రీగాన స్త్రీవధముదగదు.కనుక తగును తగదు అని ఎట్లుచెప్పితే నేమివచ్చునో ష్మనకీ

దోష మేవెంటను దొడరునో చనదు
దూషింప భూషింపఁ దుది నెంతవట్టు
తప్పును నొప్పును దైవ మెఱుంగు
నొప్పు నూరక చూచుచుం'టనువారు
పలువు రీరీతిని బలుచందములను
బలుకంగ నావీరబాహునికడకు
వదలక కొనిపోయి వసుధీశుఁ డాత్మఁ
జెదరక మును మూడు సెలవులు నొసఁగి
యాన తిచ్చినచందమంతయుఁ దెలియ
వానికిఁ జెప్పి యవ్వనజాక్షి నపుడు
బెడిదంపు బొవురుఁబిల్లివాతికిని
దొడిఁబడ రాచిల్కఁ ద్రోయుచందమునఁ
దగ నప్పనము సేసి తలవరుల్ దాను
మగిడి భీషణుఁ డేఁగె మనుజేశుఁ గొలువ
వీరబాహుండును విభునాజ్ఞ సేయఁ
గోరి చయ్యన నతిక్రూరవర్తనులఁ
గ్రొవ్వాఁడిమృత్యువుకోఱలువ్రాలె

జోలియేల, దోష మే...దొడరునో= ఎట్లుచెప్పి తేదోషము గూడవచ్చునో, చనదు దూషింపభూషింపన్ =దూషించుటయు భూషించుటయు రెండును ఒప్పదు. తుది... మెఱుఁగు=కడపటనీవిషయమున తప్పెంతమాత్రమో ఒప్పెంతమాత్రమోదైవమే యెఱుఁగును. ఒప్పనూరక చూచుచుంట=ఊరక చూచుచు మాత్రముండుటయేతగును. మూఁడు సెలవులునొసఁగి=ముమ్మాటికిఆజ్ఞ చేసి, అప్పనముచేసి =అప్పగించి, అతిక్రూరవర్తనులన్ =మిక్కిలిక్రూరమైన నడవడిగలవారిని, క్రొవ్వాఁడిమృత్యువుకోఱలు=మిక్కిలివాఁడియైనమృత్యువుయొక్క కోఱపండ్లు, మ

మవ్వంపుమెఱుఁగులమాడ్కి మేలైన
బిత్తరంబులు సిమ్ముబెడిదంపువాలుఁ
గత్తులు గలభయంకరులఁ గింకరుల
వీక్షించి 'మీరెల్ల వెసఁ బ్రేతభూమి
కక్షీణగతి నేఁగి యచ్చోట నున్న
వీరదా సను నెఱవీరుని చేతి
కీరమణీమణి నిచ్చి చంపింపుఁ'
డనుటయు వార లయ్యతివఁ దోడ్కొనుచుఁ
జని వీరదాసునిసన్నిధి నిలిపి
పతియానతియు వీరబాహునిపంపు
నతిచిత్రముగఁ జెప్ప నది విని యలికి
వెఱఁగంది 'బాపురే విధిచేతఁ గడువ
నెఱవాదు లెవ్వరు నిఖిలలోకముల
నేటితోఁ గడముట్టెనే కౌశికుండు
గాటంబుగా సల్పుకపటనాటకము
వెఱచినవానిని వెన్నిచ్చి యోడి

వ్వంపుమెఱుఁగులు=లేఁత మెఱపుఁదీఁగలు. ఈరెండును బెడిదంపువాలుఁగత్తులకు విశేషణములు, వాలుగత్తులుబెడిదములగుటకు క్రొవ్వాడిమృత్యువుకోఱలునుబిత్తరములుచిమ్ముటకు మవ్వంపుమెఱుఁగులును ఉపమానములు, బిత్తరములు=బెళబెళకాంతులు, బెడిదంపు=భయంకరమైన, అక్షీణగతిన్ = కొఱవడనినడతో - వేగముగా నడచి, విధిచేతన్ = దైవకృత్యమును, కడవన్ = అతిక్రమించుటకు, నెఱవాదులు= నేర్పరులు, కడముట్టెనే=ముగింపునొందినదా. గాటముగాన్ =కఠినముగా, కపటనాటకము=బూటకములుపన్ని యాడించునాట- నేఁటితో ముగింపు నొందెనాయనుట, చంద్రమతి వధింపఁబడనున్నది గనుక వధించుట్లతో

పఱచినవానిని భయమునఁ బూరి
గఱచినవానినిఁ గైదువుఁ బూన
మఱచినవానిని మఱేదిక్కు లేక
మఱుఁగుఁ జొచ్చినవాని మదిలోనఁ గరుణ
నెఱయఁ బ్రోచుట నాకు నియమవ్రతంబు
పరికింప నిట్టిచో బడలినయబలఁ
దెరలక ఘోరాసిఁ దెగ వ్రేయు మనుచు
నాకడ కంపించినాఁడు నా స్వామి
నా కేల వగ పన్న నాకేలు సాఁగ
దీకీడుఁ గావింప నిది తప్పుత్రోవ
యే క్రియ గల దింక నేమి సేయుదును
సుతుని దుర్మృతికి నేడ్చుచు మఱి కూర్మి
సతిఁ గృపాణాహతిఁ జంపఁ బాలయ్యె'
నని యశ్రు లొలుక మోమ మర వాంచి యున్న
మను జేశునకుఁ జంద్రమతి యిట్టు లనియె
'నినకులాధీశ నీవెఱుఁగనియట్టి

విశ్వామిత్రునిబూటకములన్నియుఁ దీఱిపోవుననిభావము. పూరిగఱచినవానిని= కసవునోటఁబెట్టుకొన్నవానిని, కైదువుఁ బూనన్ = ఆయుధమునుదాల్చుట కు,పరికింపన్ = విచారింపఁగా, బడలినయబలన్ = అలసియున్న స్త్రీని, అలయకయున్న పురుషునే శరణుఁజొచ్చినచోఁ బ్రోవవలసియుండఁగా అలసిన స్త్రీని కత్తితోనఱకుట యెట్లుఅనిభావము, నాకడకు అన్నన్ =నాయేలిక నాచెంతకుఁ జంపుమనిపంపినాఁడుగాని నేనె చంపఁవీసికొనిరాలేదు కాఁబట్టినాకుదీనినిగుఱించి విచార మెందుకు అన్నచో, నాకేలు సాఁగ దీకీడుగావింపన్= ఈచెఱుపుసుజేయుటకు నాచేయి నిగుడఁజాలదు.ఇది తప్పుఁద్రోవ=నాచేయి సాఁగకుండుటయు తప్పుమార్గము, కృపాణాహతిన్ = కత్తివాటున, పా

వినుతధర్మంబులు వేయొండు గలవె
మున్ను స్వామిద్రోహి మోవ లే ననుచుఁ
బన్నగతల్పుతోఁ బలికె భూదేవి
తన్ను మోచినచోటఁ దగ వట్టె పెట్టి
మిన్నక సురిఁగిన మెత్తురే జనులు
నీపురీశ్వరుఁడు ని న్నేలినసామి
యీపని విధియించె నిది గాక నాకు
రూఢిగా రాకుమారునిఁ జంపె ననెడి
యాడిక తలగూడె యభిమాన మెడలె
నటు గాన ననుఁ జంప నర్హ మీవేళ
కటకటా నీవేల కరుణఁ దాల్చెదవు
తక్కనినీచవర్తనులచేఁ జావ
కిక్కడ నాజీవితేశుఁడ వైన
నీచరణంబులు నెమ్మితోఁ గొల్చి
నీచేత మృతిఁ బొంది నీపొందు మీఁద
నే పొందఁగాఁ గంటి నెట్టిసౌఖ్యంబు
లీపొందు రా వింక నెడ సేయనేల

లయ్యెన్ = పాలుపడవలసి వచ్చెను, పన్నగతల్పుతోన్ = శేషుఁడు సెజ్జగాఁగల విష్ణునితో, తన్ను మోచినచోట = తన్ను పోషించి భరించునట్టిస్వామియెడలఁ తగవు అట్టెపెట్టి మిన్నకసురిఁగినన్ = ధర్మమును జేయక యట్లె దిగవిడిచి యూరక మఱుఁగుపడినయెడల, రూఢిగాన్ = గట్టిగా, ఆడిక = నింద, తలగూడెన్ = సంభవించెను, అభిమానమెడలె = గౌరవము తీసిపోయెను, నిందపాత్రై గౌరవము గోలుపోయియున్న నేను బ్రతుకుట యుక్తముగాదు గాన నన్నుఁజంపుట యర్హము, మీఁదన్ = ఉత్తరకాలమందు-లేక పరలోకమందు-లేక జన్మాంతరంమ

నరులును మునులుఁ గిన్నరులును సురలు
నరుదంది యిందును నందును బొగడఁ
దలఁ 'దెంపు'మని తెంపు దలకొనఁ బలికి
జలజాక్షి తనచీర చక్కఁ గ నమర్చి
ప్రాణేశు వలగొని పదముల కెరగి
పాణిపల్లవములు భక్తితో మొగిచి
యనుదినరక్తపంకారుణం బగుచుఁ
గనుపట్టి జేవురుగట్టుచందమున
నున్న యా వధ్యశిలోపరిస్థలిని
జెన్నారి చిఱునవ్వు సెలవిఁ దళ్కొత్తఁ
బద్మాసనంబునఁ బడఁతి గూర్చుండి
పద్మినీవల్లభుపైఁ జూడ్కి నిలిపి
'లోకలోచన సర్వలోకైకవంద్య
నాకు వేవేల జన్మంబులయందు
సతతపుణ్యుని హరిశ్చంద్రభూవిభునిఁ
బతిగా నొనర్పు మీపార్థివేశ్వరుని
యాపద లన్నియు నడఁచి సత్యంబు
దీపింపఁ జేయు మీతెఱఁగున'ననుచు
వినయంబు నెక్కొన వేఁడి చిత్తంబు
తనపతిపైఁ జేర్చి తలఁ పొందు లేక

దు, తెంపుదలకొనన్=సాహసము పుట్టఁగా, అనుదిన రక్తపంకారుణము=ప్రతిదినమును నెత్తురు రొంపిచేత నెఱ్ఱనైనది, జేవురుగట్టు=ఎఱ్ఱనికొండ, సెలవి=పెదవిమూల, పద్మినీవల్లభుపైన్=సూర్యునిపై, నెక్కొనన్=మీఱఁగా, బంధ

నన్నంత బంధంబు లూడ్చిపో వైచి
యన్నరేంద్రుఁడు జగదాశ్చర్య మెసఁగ
బహుసరిత్సాగరపర్వతద్వీప
మహితమహామహీమండలభార
మురుతరలీలఁ గేయూర విభాతి
భరియించునపసవ్యబాహుదండమున
సకలవిరోధిరాజన్యకోటీర
నికరకీలితమణినికషణదీప్త
శాతధారాభీలచటులఖడ్గంబు
భూతముల్ భీతిల్ల ముష్టి నమర్చి
చండమార్తాండదుస్సహదుర్నిరీక్ష
మండలప్రభలతో మార్కొని మండు
మెఱుఁగు లుగ్రంబుగా మిన్నులఁ బర్వ
నోర వాయఁ బెఱికి మహోగ్రతఁ బూని

ములు=క్షేమాద్యనుబంధములు, ఊడ్చిపోవైచి=బొత్తిగాఁ దొలఁగించుకొని, బహు...భారము-బహు = అనేకములైన, సరిత్=నదులచేతను, సాగర=సముద్రములచేతను, పర్వత=కొండలచేతను, ద్వీప=ద్వీపములచేతను, మహిత=పెద్దదైన, మహామహీ మండలభారము=గొప్ప భూమండలముయొక్క బరువు, కేయూరవిభాతి=బాహుపురి లీలగా, భరియించు=తాల్చునట్టి, అపసవ్య బాహుదండమునన్=దక్షిణ భుజాదండమునందు, సకల...ఖడ్గంబు=సమస్త శత్రురాజుల బాహుపురుల సమూహములందు పొదుఁగంబడిన రత్నములతో నొఱపెట్టుటవలన మెఱుఁగెక్కిన వాఁడివాదరచే భయంకరమైన పెనుగత్తి, చండ...ప్రభలతో=ప్రచండమైన సూర్యునియొక్క సహింపశక్యము కానట్టియుఁ దేఱిచూడరానట్టియు బింబముయొక్క కాంతులతో, మార్కొని=ఎదిరించి, మండు

జళిపించి జీవితేశ్వరిమెడ మోపి
కలఁగక తెగ వ్రేయ గమకించునంతఁ
గ్రమ్మఱ నెడసొచ్చి ఖడ్గంబుఁ బట్టి
యమ్మనుజేశుతో ననియెఁ గౌశికుఁడు
'చాలు నోహో యిట్టి సాహసకృత్య
మేల కైకొంటి నరేశ్వర నిన్ను
వీక్షింప దోషంబు వివరింప మనుజ
రాక్షసుండవు గాక రాజవా నీవు
వ్రాలువైరులమీఁద వాలునీవాలు
వాలుఁ గంటులఁ ద్రుంప వాడె యీ వాలు
భామలఁ జంపఁ బాపము లే దటంచు
నేమించెనే మున్ను నిను వసిష్ఠుండు
క్రమమున ధర్మార్థకామమోక్షములు
నమర నీ కీఁ దగునట్టియీసాధ్వి
జననుతసౌందర్యసంశోభితాంగి
నినుపముల్కికి నేల యీఁ దలంచెదవు
భువనవిఖ్యాత మై పొలుపొందునట్టి
రవివంశమునఁ బుట్టి రాజసం బుడిగి
బతిమాలి వెనుమాలబంట వై నీచు

మెఱుఁగులు=జ్వలించుచున్న కాంతులు, నిన్ను వీక్షింప దోషంబు=నిన్నుఁ జూచుటయే పాపము, మనుజరాక్షసుఁడవు=మనుష్యరూపమున నున్నట్టి రాక్షసివి, వ్రాలువైరుల మీఁదన్=అతిశయించుచున్న శత్రువులపై, వాలునీవాలు=వ్రాలునట్టి నీకత్తి, వాలుఁగంటులన్=స్త్రీలను, ఇనుపముల్కికి=కత్తి యినుపసలాకునకు, రవివంశము=సూర్యవంశము, నందనున్=కొడుకును, నాతిన్ =

గతిఁ గాదు గాచునీకష్టంబు దగునె
కులసతితలఁ దెగఁగొట్టి యేలోక
ముల కేఁగి సౌఖ్యంబుఁ బొందఁ జూచెదవు
యాలికై దక్షుని నడఁపఁడే శివుఁడు
పాలింప నీకంటె బుద్ధిహీనుండె
సతి లేనిగృహ మేల సౌఖ్యంబులేల
సతి లేనిసుతు లేల సంపద లేల
సతియుఁ గల్గినఁ గల్గు సకలధర్మములు
సతియుఁ గల్గినఁ గల్గు సకలపుణ్యములు
సతి గల్గినను గల్గు సత్పుత్రచయము
సతి గల్గినను గల్గు సద్గతిత్రోవ
యటు గాన విడువు మీ యాగ్రహబుద్ధిఁ
గటకటా నీ వివేకం బెందుఁ బోయె
నాబుద్ధి వినక నందనుఁ జంపుకొంటి
నాబుద్ధి వినక నీ నాతి నమ్మితివి
మాను మీగుణ మన్న మానక దురభి
మానంబె పెంచెదు మానవాధీశ
నామాటఁ గైకొని నాకొమారితల
నామాలమగువల నర్థి వరింపు
నీ సుతుప్రాణంబు నీరాజ్యసుఖము
నీ సతితోఁ బొందు నీ తొంటిపెంపుఁ
బడయు మీ వింక నీపదును దప్పినను
గడపట నీవు తెక్కలిఁ జత్తు' వనుచుఁ

స్త్రీని, పదును=సమయము, తెక్కలిన్=వంచనచే, భవసాగరంబున్=సంసార

బెక్కుచందమ్ములఁ బ్రియమును భయము
నెక్క బోధించుమునీంద్రునిఁ జూచి
పకపక నవ్వి 'యీభవసాగరంబు
నొకదరిఁ జేర్చుచు నున్నాఁడు శివుఁడె
యితరునివలె నది యిది యని కాని
గతులు నీచేతఁ దార్కాణింపఁబడెడు
రాసి నీకెదు రుత్తరంబులు వల్క
నాసరోజాక్షుండు నలుకు నేనెంత
మును నీవు చెప్పినబుద్ధులె కాక
వినఁ గ్రొత్త లేడివి వివరించి చూడ
వీరబాహునిమది విశ్వాస మొదవఁ
గోరి నేఁ జేసినఘోరప్రతిజ్ఞ
మఱచి సత్యము మట్టుపఱిచి లోలోన
జరిగి పోనిత్తునె స్వామికార్యంబు
సుతు నొల్ల సతి నొల్ల సురలోక మొల్ల
బతిమాలి నీ విచ్చుపడఁతుల నొల్ల
సత్యంబు గలిగినఁ జాలు వేయేల
సత్యమే జయ మని చాటు వేదములు
విడువు ఖడ్గం బింక వేంచేయు మిట్టి
యెడ నుండఁ జనదు మునీశ నీ వింక'

సముద్రముయొక్క, ఒకదరిన్=ఒకగట్టును, ఇతరునివలె=సామాన్యుఁడైన యొక నివలె, ఇదియదియని కానిగతులు నీచేతఁ దార్కాణింపఁబడెడు =ఇదిమంచిది అది చెడ్డది యని సరికానట్టి పద్ధతులు నీవు సూచించుచున్నావు, రాసిన్ = తెగువతో, సరోజాక్షుఁడు=విష్ణువు, పొంకంబు చెడి=పసగుంది, ఉవిదలు= స్త్రీలు,

నాపుడు వెఱఁగంది నరలోకనాథు
పావనసత్యసంపద కాత్త నలరి
బొంకించునాసలఁ బో వీడి మాని
పొంకంబు చెడి తలపోయుచు నుండె
నప్పుడు దేవత లంబరవీథి
నుప్పొంగు వేడ్కల నువిదలుఁ దారు
బహురత్నదీప్తుల భాసిలుచున్న
మహనీయదివ్యవిమానంబు లెక్కి
వెఱఁగంది క్రందుగా వీక్షించుచుండ
నెఱదెంపుమై ధారుణీతలేశ్వరుఁడు
భిదురంబుకంటెను బెడిదమై చదల
నదరులు సెదర భయంకరలీల
వాలువా లెత్తి యా వామాక్షికంఠ
నాళంబు తెగ వేయ నది కఱుక్కనఁగఁ
దాఁకినవ్రేటు పూదండయై చెన్నుఁ
గైకొని పూబోఁడిగళమున నున్నఁ
దల యూచి సతిఁ జూచి తనకేలునెత్తి
ధళధళ మనుఖడ్గధార వీక్షించి
'దాటె దప్పెనో కాక ధవళాక్షి కిప్పు

క్రందుగాన్=గుంపులుగొని, భిదురంబు కంటెను=వజ్రాయుధముకంటెను, బెడిదమై=భయంకరమై, చదలన్=ఆకాశమునందు, అదరులు= మిడుంగుఱులు, వాలువాలు=అతిశయించుచున్న కత్తి, కంఠనాళంబు=గొంతుక్రోవి, కఱుక్కనఁగ...దండయై=కఱుక్కని తగిలినదెబ్బ పూదండగా మాఱినదై, చెన్నుగైకొని=అందమునొంది, గళమునన్ = మెడయందు, ఈతోయము= ఈసారి, అసిధా

డీరీతి కౌశికునింద్రజాలంబొ
వా తప్పితినొ చేతివడి దప్పి చనెనొ
చూత మీతోయ మీచోద్య మీలీల
నసి పోవ వచ్చునాయసి పోక' యనుచు
వెసఁ బూన్చి మఱియును వ్రేయఁ జూచుటయు
శ్రీవిశ్వనాథుఁ డాశ్రితపారిజాతుఁ
డావేళఁ గరుణ నిండారుచి త్తమున
వడి గొని మూఁడుత్రోవలఁ బాఱునేఱు
తొడరి కెంజెడలలోఁ దుంపురుల్ గురియఁ
జెన్నుగా నొదలఁ జేరినమించు
క్రొన్నెలతఱ్కు చకోరాళిఁ బిలువ
నుఱక పువ్వులవిల్తు నొకజుట్టఁ గొన్న
చుఱుకుచూపులకన్ను చోద్యమై మెఱయఁ
దనర నేనుఁగుమోముతనయునిఁ గన్న
వనజాక్షి దాపలివంక శోభిల్ల
మేలి మువ్వన్నెలమెకము మైతోలు
చేల గట్టినకాసెచెఱఁగు దూలాడఁ
బోఁడిగా మెఱుఁగులపోల్కి దీపించు
మూఁడుముల్కులవాలు ముష్టిచే నమర

వవచ్చు నాయసిపోక = నాకత్తిపాటు వ్యర్థము కావచ్చునా, మూఁడుత్రోవలఁ బాఱు నేఱు = త్రిపథగ-గంగ, మించుక్రొన్నెలతఱ్కు = ప్రకాశము గల్క్రొత్త చందురునిరేక, ఒకజుట్టన్ = ఒక్కపీల్కగా, చుఱుకుచూపుల కన్ను = అగ్నినేత్రము, ఏనుఁగుమోము తనయుని గన్నవనజాక్షి = విఘ్నేశ్వరునిఁ గన్నట్టి పార్వతి, దాపలివంకన్ = ఎడమప్రక్క, మేలి మువ్వన్నెల మెకముమైతోలుచేల = మేలైన జింకమేనితోలనెడి వస్త్రము, మూఁడు ముల్కులవా

వెస ఖణిల్లున ఱంకె వేసి కుప్పించు
బసవరాయని నెక్కి పార్శ్వభాగమునఁ
బాలును నీరు నేర్పఱచువాహనపు
వేలుపు డగ్గఱి వింజామ రిడఁగఁ
దివిరి నెమ్మిఁ దూర్పుదెస నేలురాజు
ధవళాతపత్రంబు ధరియించి నడువ
ముట్టి వేల్పులఁ గొట్టి మొనసినబిరుదు
పట్టంబువీరుండు పడవాలు గాఁగఁ
గిన్నరగంధర్వగీర్వాణయక్ష
పన్నగవరులును బ్రమథులుఁ గొలువ
శుక కుంభసంభవ సుబల కణ్వాది
సకలసన్మునిగణసంస్తుతు లెసఁగ
ననుపమభూతిలిప్తావదాతాంగ
జనిత నిర్మలకాంతిచంద్రికవలన
నయ మార నఖిలవిజ్ఞానివిశాల
నయనోత్పలముల కానంద మొసంగఁ
బరమయోగీంద్రులు భావంబునందుఁ
బరికించి కాననిపరమాత్మమూర్తి
యావేళఁ దనకుఁ బ్రత్యక్షమై 'సైఁచు

ఱ = త్రిశూలము, బసవరాయనిన్ = వృషభరాజును - నందిని, పాలు...సు వేలుపు = హంసవాహనుఁడైన బ్రహ్మ, తూర్పుదెస నేలురాజు = ఇంద్రుడు. బిరుదు పట్టంబు వీరుఁడు = గొప్ప కత్తినిదాల్చిన వీరుఁడైన కుమారుఁడు, పడవాలు= సేనాపతి, అనుపమ...చంద్రిక వలనన్ =సాటిలేని బూదిచే పూయఁబడిన తెల్లని యవయవములవలనఁ బుట్టిన యచ్ఛమైన కాంతియనెడు వెన్నెలవలన, అఖిల...త్పలములకున్ =సమస్తజ్ఞానుల విశాలములైన నేత్రముల

భూవర' యనిన నద్భుతముఁ దత్తఱము
భయము సంభ్రమమును భక్తియు నయముఁ
బ్రియమును బెనఁగొనఁ బెల్లుగా మేనఁ
బులకలు గొబ్బునఁ బొడమ నానంద
కలితాశ్రుకణములు గన్నులఁ దొరుఁగ
నవనిఁ జాఁగిలి మ్రొక్కి యడుగుల కెరఁగి
సవినయంబునఁ గరజలజముల్ మొగిచి
'కాలకంధర లయకాలాగ్నిరుద్ర 2650
కాలసంహార మహాకాళీనివాస
వాసుదేవప్రియ వాసుకివలయ
వాసవార్చిత కృత్తివాస మహేశ
నాగశోభితహస్త నాగాసురారి
నాగనాగాంతక నాగేంద్రవంద్య
కమలాసనస్తుత్య కమలాప్తనేత్ర
కమలారి సురసరిత్కమలకపర్ది

నెడి కలువలకు, సైఁచుభూవర=తాళురాజా, కాలకంధర=నల్లని కంఠముగలవాఁడా, లయ...రుద్ర=ప్రళయకాలాగ్నివలెరౌద్రుఁడైనవాఁడా, కాలసంహార=యముని నిగ్రహించినవాఁడా, మహాకాళీనివాస=పార్వతికాటపట్టయినవాఁడా, వాసుదేవప్రియ=విష్ణువునకుప్రియుఁడైనవాఁడా, వాసుకివలయ = వాసుకి కడియముగాఁగలవాఁడా, వాసవార్చిత = ఇంద్రునిచేతఁ బూజింపబడినవాఁడా, నాగశోభితహస్త= జింకతోలుచేనొప్పుచున్న చేయిగలవాఁడా, నాగాసురారి = గజాసురునకు శత్రువైనవాఁడా, నాగనాగాంతక= గజాసురాంతక, నాగేంద్రవంద్య= ఆదిశేషునికి వందింపఁదగినవాఁడా, కమలాసనస్తుత్య = బ్రహ్మకుస్తోత్రము సేయఁదగినవాఁడా, కమలాప్తనేత్ర=సూర్యుఁడు కన్నుగాఁగలవాఁడా, కమలా...కపర్ది = చంద్రుఁడు గంగానదితామరలునుగల జ

గిరిశరాసన రౌప్యగిరిశృంగనిలయ
గిరికన్యకాప్రియ గిరిభేది జనక
వేదమస్తకముల వెలయునీదివ్య
పాదపద్మములు నాఫాలంబు సోఁక
నరయఁ గృతార్థుండ నైతి లోకముల
దురితంబు లన్నియుఁ దొలఁగింపఁగంటి'
నని పెక్కుభంగుల నభినుతి సేయ
జననాథువలనఁ బ్రసన్నుఁడై శివుఁడు
'రాజేంద్ర నీవంటిరాజు నాయెలు
నీజగంబులలోన నెవ్వఁడు లేఁడు
మేలు నీసత్యంబు మేలు నీ తెంపు
మేలు నీ ధైర్యంబు మెచ్చితి నడుగు
వరములే మిటి వేఁడు వలసిన'వ నుచుఁ
గరమున మే నంటి గారవం బమరఁ
గలకంఠములచాయ గల దనగూర్మి
కలకంఠివంకకై కడకంటిచూపు
నిగిడించుటయు సిగ్గు నెక్కొని విభుఁడు

జూటము గలవాఁడా, గిరిశరాసన = కొండయే విల్లుగాఁగలవాఁడా, రౌ గిరిశృంగనిలయ=కైలాసశిఖరము వాసస్థానముగాఁగలవాఁడా, గిరికన్యకా యా=పార్వతికివల్లభుఁడైనవాఁడా, గిరిభేదిజనక = క్రౌంచపర్వతమును భే ంచిన కుమారునికి తండ్రియైనవాఁడా, వేదమస్తకములన్ = వేదశిరస్సులగు పనిషత్తులందు, దురితములు= = పాపములు, కలకంఠ...వంకకై = కోకిలము న్నొగల తన గారాబుపడఁతి దెసకై -నల్లనిచాయగల గౌరిదిక్కు అనుట, సిగ్గు క్కొని విభుఁడు=రాజు సిగ్గునొంది, మునుకుచు=మిణకరించుచు, సాదలనీతు

మొగము వ్రాలఁగ వైచి మునుకుచు నున్న
వానితలంపు భావంబున నెఱిఁగి
యానీలకంధరుం డనియె నవ్వుచును
'పొదలనీ ఱలఁది యచ్చుగఁ దోలు గప్పి
పొదివి నిచ్చలు బహుభూతముల్ గొలువ
నీవల్లకాటిలో నిటు విహరింప
నావంటివాఁడవై నాఁడవు నీవు
నిది గాధిపుత్రుమహేంద్రజాలంబు
విదితంబుగా నీకు వివరింతు వినుము
మసనంబు గాదిది మఖశాల గాని
యెసఁగు శల్యములు గా విధ్మముల్ గాని
పడినపుర్రెలు గావు పాత్రలు గాని
యడరునెత్తురులు గా వాజ్యంబు గాని
యొలయుకొర్వులు గావు యూపముల్ గాని
తలవెండ్రుకలు గావు దర్భలు గాని
వెఱవక ని న్నేలువీరబాహుండు
మఱియుఁ గాలుఁడు గాని మాలఁడు గాఁడు
వినుము నీకూర్మి దేవిని నేలుచున్న
యనఘుండు కౌశికుననుమతి నిలిచి

=చితియందలిబూడిద, పొదివి=చుట్టుకొని, 'బహుభూతమునిచ్చలుపొదివి గొలువఁగ' అని యన్వయము, నావంటివాఁడవు= నేనెట్లు వల్లకాటిలో పూర్వోక్తవిధములనుందునో యట్లే నీవున్నాఁడవనుట, మసనంబు = వల్లకాఁడు, మఖశాల=యజ్ఞశాల, ఇధ్మముల్=కట్టెలు, ఆజ్యము=నెయ్యి, యూపముల్=యూపస్తంభములు, కాలుఁడు=యముఁడు, దుర్గోహ... కారంబు = చెడ్డయ

కలఁగక కపటమార్గమునఁ జరించు
కలిరాజు గాని తాఁ గాఁడు బ్రాహ్మణుఁడు
మతి నింక నీ కనుమాన మేమిటికి
ధృతిఁ జూడు' మని దివ్యదృష్టి నిచ్చుటయు
నంతయు విస్మయం బడర వీక్షించి
సంతోషమునఁ బొంది సతియును దాను
నొక్కట సాష్టాంగ మొనరించి భక్తి
నెక్కొన 'పరమేశ నీప్రసాదమున
నరిగె దుర్మోహముదాంధకారంబు
పరఁగె సమ్యగ్జ్ఞానభాస్కరోదయము
నీభవబంధంబు లిన్నియుఁ బాపి
నీభక్తుగా నేలి నీసేవ మరిపి
నన్ను మన్నింపవే నమ్రవిధేయ
నన్ను రక్షింపవే నాగకేయూర
నీకు మ్రొక్కఁగఁ గంటి నినుఁ జూడఁ గంటిఁ
బ్రాకటంబుగ జన్మఫల మబ్బె నాకు
నిండునెమ్మది నిన్ను నిలుపుట దక్క
నొండువరంబు నే నొల్ల నీయాన'
యనునప్పు డారాజునర్ధాంగలక్ష్మిఁ

జ్ఞానమనెఁడు గొప్పచీఁకటి, సమ...దయము=మంచిజ్ఞానమనెడి సూర్యోదయము, నమ్రవిధేయ = అడఁకువతో భజించువారికి పరతంత్రుఁడైనవాఁడా, నాగకేయూర = సర్పములు బాహుపురులుగాఁగలవాఁడా, 'నిండునెమ్మది నిన్ను నిలుపటదక్క' = నాపూర్ణహృదయములో నిన్ను నెలకొలుపుటతప్ప, అర్ధాంగలక్ష్మిఁ =భార్యను-చంద్రమతిని, కాత్యాయని=పార్వతి, బాముల

దనకృపాదృష్టిఁ గాత్యాయని చూచి
'ఈ చంద్రమతి పతివ్రత వౌదు వీవు
నీచరిత్రంబు వర్ణింప నచ్చెరువు
సుదతి నీమంగళసూత్రంబు గాదె
పదివేలబాములఁ బాపె నీపతికి
సౌభాగ్యవతివి గా సకలసామ్రాజ్య
వైభవంబుల మించి వసుధ నేలుచును
బెద్దగాలమునకుఁ బ్రియుఁడును నీవు
నొద్దిక వచ్చి మాయొద్దనే యుండుఁ'
డని కుస్తరించి 'నీ వడిగినవరము
కొను మిత్తు' మనిన నక్కొండరాచూలి
పదముల వ్రాలి 'భూపాలబాలకుని
బ్రదికించి నానిందఁ బాపి రక్షింపు
సకలజగన్మాత శాంభవి' యనుఁడు
వికసితవదనారవింద యై గిరిజ
'నీచిత్తశుద్ధికి నెఱయ మెచ్చితిని
రాచపాపఁడు మున్ను బ్రతుకు లోహితుని
బ్రాణ మిచ్చితి హరు పంపున' ననిన
మాణిక్యకీలితమంజుమంజీర
కంకణకింకిణీకాంచనవలయ
ఝుంకృతు లొలయ వజ్రపుటంటుజోడు

=ఆపదలను, కుస్తరించి=బుజ్జగించి, కొండరాచూలి=పర్వతరాజైనహిమవంతుని కూఁతురగు పార్వతి, భూపాలబాలుకుని=కాశిరాజుబిడ్డను, హరుపంపునన్=శివుని యాజ్ఞ చేత, మాణిక్య...ఝుంకృతులు=రత్నములు పొదుఁగఁబడిన సొగసైన యందెలు కడియములు, చిఱుగజ్జెలు మొలనూలు, వీనిఝుంకారధ్వనులు, నేవ

తళుకులు మెఱయునద్దంపుఁజెక్కిళ్లఁ
దళుకు దళుక్కని తఱుచుగా మెఱయఁ
గదలుబంగారుచిల్కలరావిరేక
పొదలి నెన్నుదుట సొంపుగ నటియింప
గోమేధికపుఁబులిగోరు సేవళము
ప్రేమమై యురమునఁ బెనఁచి తూఁగాడఁ
బరఁగ నుంగరములపచ్చనిడాలు
బెరసి ముద్దులవ్రేళ్లఁ బెనఁగ నేతెంచు
సుతు లోహితాస్యునిఁ జూడ నాచంద్ర
మతికిఁ జన్నులు సేఁపె మమత నాయింతి
యానందబాష్పంబు లందంద రాల
గా నక్కతో నొత్తి కౌఁగిటఁజేర్చి
ముద్దాడుచుండ నప్పుడు కౌశికుండు
తద్దయు లజ్జించి తలవంచుకొనుచుఁ
గడుఁ జిన్నఁబోయి యాగ్రహ మెల్లఁ బోవ
విడిచి శంకించుచు వెఱఁగున మునిఁగి
'తపమనుదనమూలధనము ప్రతిజ్ఞ
నెపమునఁ జెడిపోయె నేఁడు నాకకట
పాకశాసనుఁ డేల ప్రశ్న గావించె
నాక్రియ మును లెల్ల నట్లూరకుండఁ
బాఱెడిబండ్లకుఁ బదములు సాఁచు

ళము=హారము, ఉరమునన్ పెనఁచి=ఱొమ్మునందుగీలుకొని, తపమను తనమూలధనము=మూలధనమువలె సంతరించిన తనతపస్సు,పాఱెడి... వీఁడిసగిది=పరుగెత్తుచున్న బండ్లను పోనీయకుండ నిలుపనెంచి తనకాళ్లడ్డముగాఁజాఁపి తు

వీటిఁడిపగిది వివేకంబు మాలి
పని లేనిజగడంబు పైకి రాఁ దిగిచి
యనఘు వసిష్ఠమహామునిసింహుఁ
గలఁచి నా దెస కేల గవియించుకొంటి
వల దని సుర లైన వారింపరై రి
జగతిలోపల హరిశ్చంద్రభూవిభుఁడు
పొగ డొందె నేమి తాఁ బొగడొందఁ డేమి
బొంకకుండిన నేమి బొంకిన నేమి
కింకరిపడి పరికింప నా కేల
నేలకు నింగికి నెఱి సూత్ర పెట్టఁ
జాలెడునాబుద్ధి సమసె నేఁ డనుచు
నొగి వ్రేటు దప్పుటయును జోహా రనెడు
పగిది సన్నిధి యైనభర్గాదిసురులఁ
గని మ్రొక్కి పార్థివుఁ గౌఁగిటఁ జేర్చి
మనమున హర్షించుమాటలు వలికి
'బడలితి వెంతయు భానుకులేశ
జడమతిఁ బూని నీసత్యంబు పెంపు
సొలవక నొరసి నేఁ జూచుట కిట్లు

దకునానిని నిలుపలేక తానే బాధనొందునట్టి వెఱ్ఱివానివలె, కవియించుకొంటి =ఎదిరించునట్లు చేసికొంటి, కింకిరిపడి = కోపపడి, పరికింపన్ =పరీక్షింప, నేలకునింగి... నాబుద్ధి=భూమికి ఆకాశమునకు సరిగా సూత్రము పెట్టి సమర్థమైన నాబుద్ధి-భూమ్యాకాశముల కవలీలగావ్యాపించునట్లు అతివిస్తీర్ణమైన నాబుద్ధి యనుట, సమసె=నశించెను, వ్రేటు...పగిదిన్ =వ్రేటు తప్పిపోఁగా జోహారని మ్రొక్కినట్లు-అందినచోతలయును, అందనిచోకాళ్లును పట్టుకొనునట్లు, లేక వ్రేటు తప్పఁగానే జోహారన్నట్లు తటాలున, పార్థివున్ =రాజును,ఒరసి=ఒత్తి,

నలఁకువఁ బొందించి నాతిని నిన్ను
వేవేల విధముల వెతలఁ గుందించి
కావరంబునఁ జాలఁ గల్ల చేసితిని
లోలత నా తప్పు లోఁగొని మనసు
జాలిఁ బో విడిచి యీసామ్రాజ్యలక్ష్మి
నెమ్మదిఁ గైకొని నెఱి మహీప్రజల
నిమ్ముల రక్షింపు మిఁక' నన్న నవ్వి
'యకట మునీంద్ర యి ట్లానతీఁ దగునె
సకలజగన్నుతచరితుండ వీవు
నీ కేటి తప్పులు నిఖిలలోకముల
నీకతంబున మించె నేఁడు నా కీర్తి
ఘన మైననీయనుగ్రహమునఁ గాదె
చనుదెంచె ననుఁ బ్రోవఁ జంద్రావతంసుఁ
డీదేవతలు మును లీయోగివరులు
నీదయఁ గాదె మన్నించిరి నన్నుఁ
జల్లనినీకటాక్షంబు నామీఁద
నుల్లంబులో మోద ముప్పొంగఁ జేసెఁ
బరితాపముల నెల్లఁ బాపె సౌఖ్యములఁ
బురికొల్పె నింక నోమునిచంద్ర నిన్ను
వెఱచుచు నొకమాట వేఁడెద నేను
మఱచియు రాజ్యంబు మళ్లి కొమ్మనకు
మెలమితో మున్నొకఁ డిచ్చినదైనఁ

నలఁకువ=ఒరిపిడి, నాతిని=స్త్రీని - నీభార్యయైన చంద్రమతిని, చంద్రావతంసుఁడు=శివుఁడు, మున్నొకఁడు...కడపినన్=ఒకఁడు ముందు దానిచ్చినట్టిగాని

బోలుపొందఁ దా దార పోసినదైన
సూది మోపెడునంత చోటు నాభూమి
లే దని కడపిన లెక్కింప వాఁడు
ఘనతర మగునరకమున వేయేండ్లు
మునుఁగుచుఁ గ్రిమిరూపమున వసియించు,
ననుధర్మశాస్త్రవాక్యార్థంబు గొంత
మనమునఁ దలపోయుమా మునినాథ
యేకాతపత్రమై యొసఁగునీవసుధ
నీ కిష్ట మగువారి నిలిపి యేలింపు'
మనుటయు 'మే లయ్యె నట్ల చేసెదను
జననాథ నాకు నీసకలరాజ్యంబు
నీచేత నేలింప నిక్కంబు వేడ్క
నా చిత్తమునఁ జాల ననిచిన దిపుడు
బొంకితి నని పొమ్ము పో కున్న వట్టి
శంకలు మాని నాజాడనే రమ్ము
దేవేంద్రుఁ డాదిగా దేవసంఘములు
నావామదేవా దులైనసన్మునులు
సెవులార విన మున్ను సేసినప్రతిన
శివశివ తప్పనే చెచ్చెర నన్ను
నిల నెంతగాలంబు నేలింతు ననుచుఁ
బలికితి నందాఁకఁ బాలింపు వసుధ

ధారపోసినట్టిగాని భూమిలో సూదిమోపెడునంతమాత్రముభాగము ఇయ్య లేదనిచెప్పి జరపిపుచ్చినయెడల, ఏకాతపత్రము=ఏకచ్ఛత్రము, ననిచినది=పుట్టినది, బొంకితిననిపొమ్ము=అబద్ధము చెప్పితిననిచెప్పి తప్పించుకొనిపొమ్ము, పోకున్న...రమ్ము = అట్లుచెప్పిపోనియెడల నావెంటనే వచ్చి నాపంపుసేయుము,

మఱి మీఁద దేవేంద్రుమాఱటగద్దె
నెఱి నెంతగాలంబు నిలుపుదు నంటి
నంతగాలము నుండు మమరలోకమున
వింతగా దీమాట విశ్వేశునాన'
నావుడు నొం డాడ నలికి భూనాథుఁ
‘డే వెంట నేదోష మెసఁగునో’ యనుచుఁ
జింతింపు చున్నంత శిష్యులు గొలువ
సంతోషచిత్తుఁ డై చయ్యన వచ్చి
తన తేజ మెల్లెడఁ దనర వసిష్ఠుఁ
డనుపమభక్తి భర్గాదిదేవతలఁ
గని మ్రొక్కి ప్రస్తుతిఁ గావించి యప్పు
డినకులాధీశుని నీక్షింప నృపుఁడు
మ్రొక్కి చేతులు మోడ్చి మునినాథ నీవు
మిక్కిలికరుణ నామీఁదఁ గావించి
తొడిఁబడఁ బరుసంబుతో నిమ్మ సోఁకి
కడువడి మేల్మిబంగార మైనట్టు
లీతని నన్నుఁ బరీక్షింపఁ జేసి
ఖ్యాతి నొందించితి గాదె నీ విపుడు
ఘనతపోధనుఁ డైనగాధేయుతలఁపు
మనమున నెఱిఁగి సమ్మతిఁ బ్రోవ నిందు
వచ్చితి గాన జీవము వచ్చె నాకు

మాఱటగద్దె=ప్రతియైన సింహాసనమందు, పరుసంబు నిమ్మసోఁకి... బంగారమైన ట్లు=స్పర్శవేదితో నినుముతగిలి మంచి బంగారయినవిధమున, ఇచట స్పర్శవేదికి విశ్వామిత్రుఁడును, ఇనుమునకు హరిశ్చంద్రుఁడును ఉపమేయములు,

నచ్చుగా మాతలం పానతీ వలయు'
ననిన హరిశ్చంద్రుడు నావసిష్ఠుండు
గనుఁగొని తనపెంపు గాన రాఁ బలికె
'జగతి నిక్ష్వాకువంశజులసత్కీర్తి
మిగులంగ నీచేత మెఱుఁగు వాటిల్లె
నాపురోహితుఁ డని ననుఁ బెద్దఁ జేసి
నాపూన్కి చెల్లించినాఁడ వీ వనఘ
యిట్టిసత్యవ్రత మిట్టియౌదార్య
మిట్టితెంపును గాన మెవ్వరియందు
నెలమితోఁ గౌశికుం డేపని వనిచె
నలవడఁ గావింపు మదియె నాతలఁపు'
నావుడుఁ దనగురునాథువాక్యములఁ
ద్రోవక గాధిపుత్రునిమాట సేయ
ననుమతించె నరేంద్రుఁ డట శివ శక్ర
వనజాసనుల మునివరుల పంపునను
దివ్యగంధంబుల దివ్యమాల్యముల
దివ్యభూషణముల దివ్యాంబరములఁ
గులపతితోఁ గూడఁ గువలయేశ్వరుని
నెలమి నచ్చర లెల్ల నెమ్మిఁ గైసేయ
నాసమయమునఁ బూర్వాద్రిశృంగాభ
భాసురం బగు చున్నభద్రపీఠమున
రమణీయ మగుహేమరత్నకుంభముల

పూర్వాద్రి...భాసురము=తూర్పుకొండశిఖరముతో సాటిగా ప్రకాశించుచున్నది, హేమము=బంగారు, అమరనదీజలంబు=గంగాజలము, బకము=కొంగ,

నమరనదీజలం బమరఁ దెప్పించి
శ్రీకరంబుగ నభిషేకంబు చేసి
'శ్రీకంఠుకరుణావిశేషంబు వలన
ధరణీతలం బెల్లఁ దగ నేలు' మనుచుఁ
గరమొప్పఁ బట్టంబు గట్టి రావేళఁ
గమలాసనుం డాదిగా మునివరులు
నమర దీవించి మంత్రాక్షత లిడిరి
తిరముగా ఘోషించె దేవదుందుభులు
షోరిఁ బోరి వర్షించెఁ బుష్పవర్షములు
పాడిరి గంధర్వభామిను లెలమి
నాడిరి వేడుక నప్సరఃస్త్రీలు
చల్లనై విభుమీఁదఁ జందనానిలము
నుల్లంబు వికసింప నొయ్యన నొలసెఁ
బరమేశుఁ డప్పు డాపార్థివేశ్వరునిఁ
బరఁగ దీవించి 'నీపట్టణంబునకు
భూనుత వైభవంబున నేఁగు' మనుచుఁ
దానును సురలు నంతర్ధాన మొందె
(*రంత వసిష్ఠసంయమి గాధిసుతుని
పంతంబుమాటలు పచరించి 'మిగుల
నొంచి నాతనయుల నూర్వుర నీవు
ద్రుంచునప్పుడు నింత దుఃఖంబు లేదు
యకట హరిశ్చంద్రు నతికష్టవృత్తి

---

* ఈకుండలీకరణములోనిది పెక్కుప్రతులం గానరాదు. మఱియు నిందు లక్షణ దోషములును దక్కిన భాగమున లేనివి గనుపట్టుచున్నవిగాన యిది ప్రక్షిప్తమే.

సకలరాజ్యముఁ గొని చండాలుఁ జేసి
వికృతరూపంబు గావించిననీవు
బకమవై యుండుము పాపాత్మ' యనుచు
శాప మిచ్చుటయు విశ్వామిత్రుఁ డలిగి
యేపున 'నాఁడేలవే యగు'మనుచుఁ
బ్రతిశాప మిచ్చినఁ బరఁగ నక్షణమె
యతులు కొక్కెరయును నాఁడేలు నైరి
వెలయు దీర్ఘము మూడువేలయోజనము
లలరఁ బదాఱువేల నిడివి గలుగు
కొక్కెరయును నతిఘోరరూపమున
నొక్కట ద్వ్యధిక మాయోజనోన్నతిని
నతిభీకరం బైనయాఁడేలు నగుచు
ధృతి యొప్ప భాగీరథీసమీపమున
బలమునఁ బోరెను బక్షిద్వయంబు
చలమును బలమును శౌర్యంబు మెఱయఁ
జరణతాడనతీవ్రచంచుప్రహతుల
నురుపక్షవిక్షేపణోగ్రతాపముల
శిరముల నరములఁ జిక్కని తొడలఁ
దొరఁగురక్తంబులతో శరీరములు
నరుణవర్ణంబులై యతిభీకరముగఁ

ద్వ్యధికమాయోజనోన్నతిని=మూఁడుయోజనముల పొడవుచేత, భాగీరథి=గంగ, చరణ...ప్రహతులన్ = కాళ్లచేఁదన్నుటలచేతను వాఁడిముక్కులతోఁ బొడుచుటలచేతను, ఉరుపక్ష...తాపములన్ = పెనుఱెక్కలను విదుర్చుటచేతఁ గలిగినగొప్పసంతాపములచేతను, పక్షపదాహతిన్ = ఱెక్కలయుకాళ్లయు కొట్టు

బోరిఁబోరి నుడుగక పోరంగ వారి
పక్షపదాహతిఁ బరఁగంగ జలధు
లక్షీణగతుల నేకార్ణవంబైన
చందంబుఁ గైకొని జనపాలవరుఁడుఁ
జంద్రమతియుఁ దనుజన్ముని భయము
లందంద తేర్చుచు నాసమయమున
నెడఁ జొచ్చి వారింప నింతలోఁ గదియఁ
దడయక నాఁడే లుదగ్రతఁ గదిసి
బకముకంఠముఁ బట్టి బలువుగఁ ద్రెంప
బకము పక్షములచే బలువిడి మోఁద
గిరులు వ్రేళ్లతో తలక్రిందు మీఁదయ్యెఁ
దరులతో మృగపక్షితతులు బిట్టెగసెఁ
దెఱలి యా భూదేవి ధృతి దప్పి దివికి
మొఱఁ బెట్టఁ బోయెనో మురవైరి కనఁగ
సురలును నజుఁడు నచ్చోటికేతెంచి
యిరువుర యెడఁ జొచ్చి 'యిఁకఁ జాలు' ననుచుఁ
గృపతోడ వారిపక్షిత్వము మాన్పి
'యపగతకల్మషు లగుమీర లిట్టి
ఘోరసంగ్రామంబు క్రూరతఁ జేయఁ
గారణమేమి యాకౌశికు వలన
నాహరిశ్చంద్రున కైనకీడేమి

టు చేత, జలధులు=సముద్రములు, ఏకార్ణవంబైన=ఒక్కటే సముద్రమైనట్టి, తనుజన్ముని=కుమారుని, అపగతకల్మషులు=పోయిన పాపముగలవారు - పాపము లేనట్టివారు, సంగ్రామంబు=యుద్ధము, పురికొన్న సంభ్రమంబున=అతిశయించి

యూహించి కనుఁగొని యుడుగు కోపంబు'
ననుచు వసిష్ఠుని నజుఁడు ప్రార్థించి
మునుకొని వారి నిమ్ములఁ గౌఁగిలించి
కొనఁజేసి శాంతిఁ గైకొలిపి వీడ్కొల్పి
చనియె వేల్పులుఁ దాను జలజసంభవుఁడు)
యంత నా వృత్తాంత మానారదుండు
వింతగాఁ జెప్పిన విని సత్యకీర్తి
యానందరసభరితాత్ముఁడై యపుడు
భూనాయకుని రాక పురిఁ జాటఁ బనిచె
నావార్త వీనుల కమృత మై సోఁక
వావిరిఁ దమతమవాడవాడలను
బురిగొన్న సంభ్రమంబునఁ బౌరసతులు
పసువడి బహువిధభవనమాలికలఁ
దనరుముంగిళుల ముందరిహజారములఁ
గనుపట్టునగరుపంకంబునఁ బూసి
సిరిగందమున నోలిఁజిగురొప్పఁ జల్లి
సురుచిరకర్పూరసూత్రముల్ నిగుడఁ
బలుచనిచాఁదునఁ బట్టెలు దీర్చి
ధళధళ మెఱయుచిత్తరువు వ్రాయించి
కరమొప్పఁ గమ్మనికస్తూరి నలికి
సరస మాపన్నీట జలకముల్ సల్లి
యాలయంబుల నెల్లనాణిముత్తెముల

వసంబరముతో, పౌరసతులు=పురస్త్రీలు, భవనమాలికలు=ఇండ్లవరుసలు, సిరిగంధము=శ్రీగంధము, రంగవల్లికలు=ముగ్గులు, తావుమంజిష్ఠపుట్టములు=చిక్క-

లీలమై రంగవల్లిక లొప్పఁ దీర్చి
ప్రమద మారంగ నెఱపట్టుపుట్టములఁ
గమనీయ మగుమేలుకట్లుఁ గట్టించి
తావుమంజిమపుట్టములు తేరులను
కీవి మీఱఁగ సంఘటించి కుంభములఁ
జెలువారఁగా వన్నెచీరలు గట్టి
కలువడంబులు గట్టి కాంచనదండ
కలితపతాకలు గ్రందుగా నెత్తి
విలసిల్లఁగాఁ బురవీథి మార్గముల
స్ఫురదురుకాంచనపూర్ణకుంభములఁ
బరువడి నెత్తి పుష్పంబులు నెరపి
ప్రవిమలరత్నదర్పణతోరణములు
రవిదీప్తులకును మార్పడ నమరించి
కర మిట్లు పురము శృంగారించి రంత
నరయంగ వివిధవాద్యంబులు మ్రోయఁ
దేరులఁ గరులను దేశాలిభటుల
శూరుల వీరులఁ జుట్టాల హితుల
దొరల సామంతుల దుర్గాధిపతుల
నరసుల సత్కవీశ్వరులఁ బాఠకుల
నంపఁ బోఁడొక్కని యానత్యకీర్తి

నాటించి రెమెఱుపువన్నె వలువలు, కాంచనదండకలితపతాకలు = బంగారుదం ములతోనొప్పుధ్వజములు, గ్రందుగాన్ = దట్టముగా, ప్రవిమలరత్న దర్పణతోరణములు = స్వచ్ఛమైన రత్నముల చేత రచింపఁబడిన యద్దములుగల వెలుద్వారములు, రవిదీప్తులకును మార్పడన్ = సూర్యకిరణములకు ఎదురుపడునగా - తోరణములందలి రత్నదర్పణములు సూర్యకిరణముఁ, లెదురుపడునట్లు

వందిమాగధజయధ్వను లుల్లసిల్ల
నెదురుగా నేఁగి యయ్యినకులేశ్వరుని
పదపంకజములకు భక్తితో మ్రొక్కి
యొనరఁ జేతులు మోడ్చి 'యో హరిశ్చంద్ర
దినకరవంశప్రదీపక నీకుఁ
బ్రతిసేసి కొనియాడ రాజులు గలరె
సతతసత్యవ్రతాచారసంపదలఁ
దొడరి వసిష్ఠునితో రాయిడించి
తడయక తనఘోరతపము పెంపునను
బడయ దుర్లభ మైనబ్రహ్మఋషిత్వ
మడరంగఁ గైకొని యఖిలలోకములఁ
బొగ డొందుకౌశికముని వెఱఁగంద
నెగడించి మించితి నీ సత్యమహిమ
వసుమతీవల్లభ వన్నె రెట్టించె
నెగడె నీకతమున నీవంశ మెల్ల
సన్నుతం బైననీసామ్రాజ్య లక్ష్మిఁ
బన్నుగాఁ గైకొని ప్రజలఁ బాలింప
విచ్చేయుఁ డిఁక' నని విన్నవించుటయు
నచ్చుగా దరహాస మల్లన యొలయ
సమయోచితప్రియసంభాషణములఁ
గొమరార మంత్రిముఖ్యుని నాదరించి
సన్నుతకాంచనాచలమును బోలె

విలిపి మిక్కిలి ధగధగప్రకాశించునట్లుగా నసుట, తేజీలు=గుఱ్ఱములు, ప్రతిసేసి=సాటిచెప్పి, రాయిడించి=మార్కొని-కలహించి, కాంచనాచలము=బంగా

నున్నతం బై మించునొకరథం బెక్కి
చతురంగబలము లసంఖ్యలు గొలువ
మితి లేనివాద్యముల్ మిన్నంది మ్రోయ
మానితమాగధమధురగానములు
వీనుల కింపుగా విలసిల్లి పొలయఁ
దలకొని వందిబృందములు నుతింపఁ
జెలఁగి పుణ్యాంగనల్ సేసలు చల్ల
వెన్నెల వెదచల్లువింజామరములఁ
బన్నుగా డగ్గఱి భామలు వీవ
వాలారుఁగన్నులవారకామినులు
లీలమైఁ బసిఁడిపళ్లెరములలోనఁ
గమనీయమణిదీపకళికలు మెఱయ
నమరించి మెయిదీఁగె లల్లన పొలయ
ఘనకుచంబులు నిక్కఁ గరములరుచులు
గనుపట్ట దరహాసకాంతులు నిగుడఁ
గలికిచూపుల మించుగములు రాణింప
నిలిచి నివాళింప నిండారువేడ్కఁ
బురముఁ బ్రవేశించి భూప్రజ లెల్లఁ
బరువడి జయ పెట్టఁ బార్థివేశ్వరుఁడు
ఘనుమతి నిజరాజ్యవైభవలీల
యొసగంగఁ జిరకాల మేలుచు నుండె
ననుచు మార్కండేయుఁ డాధర్మజునకుఁ

...కొండ, మణిదీపకళికలు=మొగ్గలవంటి రత్నదీపములు, దరహాసకాంతులు=
...చిఱునవ్వు మెఱుఁగులు, మించుగములు=మెఱపుల సమూహములు, భ్రమరీ...

చెనుపొంద మున్ను సెప్పిన మార్గమునను
సత్యసంధుఁడు హరిశ్చంద్రునిచరిత
నిత్యసత్కీర్తులు నెగడ రచించె 3010
భ్రమరాంబప్రసాదసంప్రాప్తకవిత్వ
సుమహితసామ్రాజ్యసుఖపరాయణుఁడు
చతురసామాన్యలక్షణచక్రవర్తి
ప్రతివాదిమదగజపంచాననుండు
మతిమంతుఁ డయ్యలమంత్రిపుంగవుని
సుతుఁడు గౌరనమంత్రి సుకవిశేఖరుఁడు
కవు లెన్న నుత్తరకథ రచియించె
నెవరు పఠించిన నెవ్వరు వినిన
జనులకుఁ బుణ్యముల్ సమకూడు సిరులు
మునుముగా నాయుష్యములు గొన సాంద్రుఁ
దాముఁ బుత్రులు నన్నదమ్ములు సఖులుఁ
దామరతంపరై ధరణిఁ బెక్కేండ్లు
వేమాఱు నోములు నెలయఁ బెండ్లిండ్లు
సేమ మేర్పడ నెందుఁ జేయుచుండుదురు.

హరిశ్చంద్రోపాఖ్యానము.

సమాప్తము.

...పరాయణుఁడు=భ్రమరాంబిక యొక్క యనుగ్రహములచేఁ గలిగిన కవిత్వమనెడి మిక్కిలి గొప్పసామ్రాజ్యమునం గలిగిన సుఖమునందు నిష్ఠుఁడైనవాఁడు, ప్రతివాది మదగజపంచాననుండు = ప్రతివాదులనెడి మదపుటేనుఁగులకు సింగమైనవాఁడు.